
# టార్గెట్ షైవ్



## మధుబాబు

# టార్గెట్ ఫైవ్

*"హెచ్చరిక! సాబూ సిటీ పౌరులందరికీ పోలీసు వారి హెచ్చరిక!" అంటూ రాత్రి పది గంటల సమయంలో చెవులు చిల్లులు పడేటట్లు ఎనౌన్స్ చేస్తూ త్రీటవున్ మెయిన్ రోడ్డు మీదికి సర్రుమంటూ దూసుకుని వచ్చిందొక పోలీస్ వ్యాన్.*

*రాత్రి తెల్లవార్లు తెరిచి వుండే కాకాహోటల్ వంటి రెస్టారెంట్ ముందు నిలబడి సిగరెట్ వెలిగించుకోబోతున్నాడు షాడో.*

*అర్జంటుగా ఆ ప్రయత్నాన్ని విరమించుకొని, ప్రక్కనే వున్న బల్లమీద కూర్చున్నాడు.*

*"ఏంసార్? ఏం కావాలి? ఇంకో రెండు కప్పుల టీ తీసుకువచ్చి ఇవ్వనా?" ఆశ్చర్యంగా చూస్తూ వెంటనే అడిగాడు హోటల్ యజమాని.*

*ఎనిమిది గంటల దగ్గర్నించి అక్కడే కాలక్షేపం చేస్తున్నాడు షాడో. అప్పటివరకూ ఆరు కప్పుల టీని నిర్మొహమాటంగా పుచ్చుకుని వున్నాడు. మళ్ళీ ఇంకో కప్పును తీసుకుంటే తనను పిచ్చివాడి క్రింద జమకట్టి, చుట్టు ప్రక్కల వున్న పౌరులందర్నీ పిలుస్తాడేమో!*

షాడో ఆలోచనలతో సంబంధం లేనట్లు తనమానాన తను ఎనౌన్స్‌మెంట్‌ని వినిపిస్తూనే ఉన్నాడు వ్యాన్‌లో వున్న లావుపాటి ఇన్స్‌పెక్టర్ ఒకతను.

"కొండల్లో, మన సిటీ చుట్టూవున్న అడవుల్లో తలలు దాచుకున్న గెరిల్లాలు కొందరు చీకటి పడే సమయంలో సిటీలోకి అడుగు పెట్టినట్లు వార్తలు అందాయి. పౌరులెవ్వరూ వీధుల్లో తిరగకండి... అనుమానంగా అగుపించినవారిని గురించి వెంటనే పోలీసులకు తెలియజేయండి..." అని ఖంగు మంటున్న కంఠంతో రోడ్డుమీది పౌరులందరికీ తెలియచేసి, వ్యాన్ డ్రయివర్‌కి సైగ చేశాడతను.

మ్రోతలు చేస్తూ ముందుకు దూకింది ఆ వెహికిల్... పొగలు విడుస్తూ మరో వీధి వైపు వెళ్ళిపోయింది.

"ఏం సార్? ఇంకో టీ కావాలా అని అడిగితే మాట్లాడరేమిటి? తీసుకురమ్మంటారా?" హోటల్ ఓనర్ మళ్ళీ రెట్టించి అడిగేసరికి, అదిరిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో.

మలేసియా దేశంలో వున్న ముఖ్యమైన పట్టణాలన్నింటి లోనూ అతి ముఖ్యమైనది ఆ సాబూ సిటీ.

అత్యంత ఆధునికమైన హార్బర్ నిర్మించబడింది అక్కడ. చేపలు పట్టటానికి ఉపయోగపడే పెద్ద పెద్ద పడవలతో పాటు, భారీగా వుండే

నౌకలు కూడా వస్తూ వుంటాయి అక్కడికి. నౌకలతో పాటు టూరిస్టులు, వ్యాపారస్తులు, ఎందుకు పనికి రాని ఆవారాలు ఎంతోమంది ఆ పట్టణంలో మకాం వేస్తుంటారు...

ఏదో ఒక విధంగా సిటీని ఆక్రమించుకుని, ఆ తరువాత దేశం మొత్తాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూ వుంటారు కొందరు గెరిల్లాలు. వారికి, పోలీసులకు తరచుగా జరుగుతూ వుండే పోరాటాల్లో అమాయకులైన ప్రజలు బలైపోతూ వుంటారు.

"వారంలో రెండు రోజులు ఇటువంటి వార్తలు వినిపిస్తూనే వుంటాయి సాబ్. ఎక్కడో ఒక చోట యుద్ధం జరుగుతూనే వుంటుంది. మొదట్లో కొద్దిగా భయపడే వాళ్ళం. ఇప్పుడు మాకు అలవాటు అయిపోయింది..." షాడో అడగకపోయినా తెల్లటి పింగాణీ కప్పు నిండా టీని నింపి అతని ముందు పెడుతూ అన్నాడు హోటల్ ఓనర్.

తన మనసులోని ఆలోచనలు పూర్తిగా కాకపోయినా, కొంత వరకూ అతను అర్థం చేసుకోగాలిగాడని గ్రహించి, ఆ కప్పును ఖాళీ చేశాడు షాడో. ప్యాంటు వెనక జేబులో నుంచి రెండు కాయిన్స్‌ని తీసి అతని చేతికి అందిస్తూ, చెక్కబల్లమీది నుంచి లేచాడు.

''గెరిల్లాలు వచ్చారనే వార్తను అడ్డుపెట్టుకుని రకరకాల దుర్మార్గపు పనులు చేస్తూవుంటారు మా పౌరులు కొంతమంది... కాలినడకన వీధుల్లో తిరగకండి.. ఏదయినా వాహనం దొరికే దాకా ఇక్కడే కూర్చోండి.'' సలహా ఇచ్చాడు ఆ పెద్దమనిషి.

వాహనం ఏదైనా దొరికేవరకూ ఆ హోటల్ దగ్గిర వెయిట్ చేస్తే, తను వచ్చిన పని మట్టికొట్టుకు పోతుందని అతనికి చెప్పలేదు షాడో.

పదకొండు గంటలు కొట్టటానికి పదినిముషాలు ముందే త్రీటవున్ చివరి భాగంలో వుండే బరీయల్ గ్రౌండ్ దగ్గిరికి పోవాలి తను...

నాలుగే నాలుగు నిముషాలు వెయిట్ చేస్తాడట అక్కడ తనకోసం ఎదురు చూసే ఇంటర్‌పోల్ ఇన్‌ఫార్మర్... నాలుగు నిముషాల తరువాత ఒక్క సెకను కూడా ఆగడట...

గెరిల్లాలను గురించిన హెచ్చరికల్ని పౌరులకు వినిపిస్తూ వీధుల్లో చక్కర్లు కొట్టే పోలీసులు ఎవరైనా ఆ సమయంలో అక్కడికి వస్తే?

అలా ఆలోచించి వెలిగించుకోబోతున్న సిగరెట్‌ని విసురుగా రోడ్డు ప్రక్కకు విసిరిపారేసి, ముందుకు అడుగు వేశాడు షాడో...

సాబూ పట్టణాన్ని ఆక్రమించుకోవాలని అప్పటికి రెండు మూడు సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే వున్నారు గెరిల్లాలు.. చావు దెబ్బలు తిని కొండల్లోకి పారిపోతూనే ఉన్నారు... సరిగ్గా తను సిటీలోకి అడుగు

పెట్టినరోజునే వాళ్ళు ఇంకో ప్రయత్నం చేయాలని అనుకోవటం తన దురదృష్టం.

బరీయల్ గ్రౌండ్ దగ్గిర వెయిట్ చేస్తూ వుండే ఇంటర్‌పోల్ ఇన్‌ఫార్మర్‌ని ఇంకో రోజు కలుసుకుంటే బాగుంటుందని అనిపించింది షాడోకి...

ఎప్పుడో నాలుగు రోజుల క్రితం అరేంజ్ చేయబడిన ఆ ప్రోగ్రామ్‌ని పోస్ట్‌పోన్ చేసే అధికారం లేకపోవటం వల్ల తలవంచుకుని ముందుకు పోయాడు.

చీకటిగా వున్న ఒక సందును దాటి నాలుగు అడుగుల కూడా వేయకముందే నిశ్శబ్దంగా వచ్చి అతన్ని అటకాయించారు ఇద్దరు ముద్దుగుమ్మలు.

గెరిల్లాల రాకను అడ్డుపెట్టుకుని అఘాయిత్యపు పనులు చేసే తమ పౌరులని గురించి హోటల్ ఓనర్ చేసిన హెచ్చరిక చెవుల్లో మార్మోగుతూ వుండగా, ఒక అడుగు వెనక్కి వేయబోయాడు షాడో.

వెంటనే అతని వెన్నుకు ఆనుకున్నది జానెడు పొడుగుండే పదునైన బాకు ఒకటి. "ఈ రోజునే మీ సిటీని చూడటానికి వచ్చిన టూరిస్ట్‌ని నేను... ఎంతో దూరం నుంచి రావటం వల్ల బాగా అలసిపోయి వున్నాను. ముద్దుముచ్చట్లతో టైమ్‌పాస్ చేసేందుకు ఓపికలేదు... ఇంకో

రోజు కలుసుకుందాం వదిలేయండి'' కనులు చెదిరేటట్లు కనిపిస్తున్న వారి ఒంపు సొంపుల్ని గమనిస్తూ మర్యాద నిండిన కంఠంతో అన్నాడతను.

ఫక్కున నవ్వి అతని చెంప పగిలిపోయేటట్లు కొట్టింది ఒక ముద్దుగుమ్మ. ''నీడల్లో నిలబడివున్న ప్రమాదాన్ని ముందుగా గమనించుకోలేని నీ ముఖానికి ముద్దు ముచ్చట్లు ఎందుకు? మర్యాదగా జేబులు ఖాళీ చేయి... నీ దగ్గరవున్న సొత్తునంతా బయటపెట్టు...'' కాకలు తీరిన కరోడా మాదిరి అతని షర్టును పిడికిట్లో బిగిస్తూ రఫ్‌గా అడిగింది రెండో యువతి.

వెన్నుకు ఆనుకుని వున్న పిడిబాకు కాస్తంత దూరంగా జరిగినట్లు వెంటనే అర్థం అయింది షాడోకి. మరుక్షణం గిర్రున ఒక రౌండ్ కొట్టాడతను ఎడమ చేత్తో తన చెంపను పగలకొట్టిన యువతి జుట్టును పట్టుకున్నాడు. కుడిచేత్తో రెండో యువతి ముఖం పగిలిపోయేటట్లు ఒక పంచ్ ఇచ్చాడు. చేతిలో వున్న బాకును వదిలేసిందా యువతి. బాధాసూచకమైన శబ్దాలు చేస్తూ వెనుక వున్న గోడ మీద పడింది.

మొదటి యువతి ముఖాన్ని బలవంతంగా ముందుకు వంచి కుడిమోకాలిని విసురుగా పైకి ఎత్తాడు షాడో. టప్ మని వినవచ్చింది ఒక శబ్దం.

సంపెంగ పూవు మాదిరి చూడముచ్చటగా వున్న ఆ యువతి నాసిక తీవ్రంగా గాయపడింది.

"చచ్చిపోయాను బాబోయ్... నేను నాశనమైపోయాను. రక్షించండి నాయనోయ్... నన్ను కాపాడండి" ఉన్నట్లుండి బిగ్గిరిగా అరుస్తూ ముందుకు వాలిపోయిందామె.

తన లాంటి అమాయక టూరిస్ట్‌ల జోలికి ఇంకోసారి వస్తే నిజంగానే నాశనం అయిపోవటం జరుగుతుందని హెచ్చరించబోయాడు షాడో... పిడికిళ్ళతో వారిద్దరిని ఇంకో రెండు సార్లు మర్దించి తన దారిన తను వెళ్ళిపోవాలని అనుకున్నాడు.

అతని ఆలోచనలు అతని మనస్సులోనే ఉండిపోయాయి. మాటలు పెదవుల వెనుకే ఆగిపోయాయి.

మొదటి యువతి గొంతు విప్పిన మరుక్షణం, చీకటి సందులో నుంచి రోడ్డుమీదికి పరిగెత్తుకువచ్చాయి మరికొన్ని ఆకారాలు.

"మంచి మర్యాదలతో గుట్టుగా జీవితాలను గడుపుకునే మన ఆడపడుచుల్ని అవమానించిన ఆ రాస్కెల్ అంతు చూడండి... పట్టుకోండి..." ఖంగుమంటున్న కంఠంతో బిగ్గిరిగా అరిచింది ఒక ఆకారం.

చూస్తూ చూస్తూ వుండగానే పరిస్థితి తన చేతులు దాటి వెళ్ళిపోతున్నట్లు గ్రహించి, పేవ్‌మెంట్ మీదినుంచి రోడ్డు మీదికి జంప్‌చేశాడు షాడో.

దగ్గర్లోకి వచ్చిన రెండు ఆకారాల గుండెల మీద బలంగా కొట్టాడు. తన షర్టును బిగించి పట్టుకోబోయిన ఇంకో రెండింటి నడుములు జారిపోయేటట్లు ఎడమ పాదంతో తన్నాడు.

అక్కడితో అదిరిపోయి, దూరంగా తప్పుకున్నది ఆ వీధిని ఆవరించుకుని వున్న ప్రశాంత వాతావరణం. అంతకు ముందు వరకూ చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండివున్నది కాస్తా, దారుణమైన అరుపులతో, కేకలతో గందరగోళంగా మారిపోయింది ఆ ప్రదేశం.

"పట్టుకోండి... వాడిని వెంటనే పట్టుకోండి..." కరకర లాడుతున్న కంఠంతో ఆజ్ఞలు ఇస్తూ, తను కూడా ముందుకు దూకింది సందు మొగదల నిలబడి అందరినీ హెచ్చరిస్తున్న ఆకారం.

ఆ ఆజ్ఞలు చెవుల పడగానే చీకటి సందులోంచి రోడ్డుమీదికి వచ్చేస్తున్న మరికొన్ని ఆకారాలను కనుచివరల నుండి గమనించుకుంటూ, పిడికిళ్ళు బిగించి బొంగరం మాదిరి రివ్వుమని రెండు రౌండ్స్‌ని కొట్టాడు షాడో.

తొడలు విరిగిపోయినంత పనికాగా రోడ్డు మధ్యలో చతికిల పడింది ఆజ్ఞలు జారీచేసిన ఆకారం.

అక్కడే నిలబడి తన వీరత్వాన్ని ప్రదర్శించే ఆలోచన లేకపోవడం వల్ల, వెంటనే వెనుతిరిగి వీధి చివరికి పరుగుతీశాడు షాడో.

పది నిముషాల తరువాత బరీయాల్ గ్రౌండ్‌ని సమీపించి, ఎత్తుగా ఎదిగివున్న ఒక బిజ్జూ వృక్షం చాటున నిలుచున్నాడు.

"ఎవరూ చూడకుండా, ఎవరికంటా పడకుండా నా దగ్గిరికి రమ్మనమని కబురుచేశాను... గెరిల్లాల మాదిరి గావుకేకలు పెట్టే పెద్ద గుంపును వెంటబెట్టుకుని వస్తావని నేను అనుకోలేదు..." రెండు క్షణాల తరువాత అతని చెవులకు చేరింది ఒక కీచు కంఠం.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తూ, అటు చూశాడు షాడో.

బిజ్జూ వృక్షానికి పది అడుగుల దూరంలో నిర్మించబడి వున్నది ఎప్పుడో ఎన్నో సంవత్సరాల క్రితం మరణించి మట్టిలో కలిసిపోయిన ఒక ధనవంతుడి సమాధి. చిన్న సైజు కాంక్రీట్ భవంతిలా అగుపిస్తున్న ఆ కట్టడం చాటున నిలబడి, మెయిన్ రోడ్డువైపే చూస్తున్నాడు సన్నగా, పొడుగ్గా వున్న సాబూ సిటీ పౌరుడు ఒకతను. వీధిలోనుంచి వినిపిస్తున్న గందరగోళాన్ని దీక్షగా గమనిస్తున్నాడు.

తను కలుసుకోవాల్సిన ఇంటర్‌పోల్ ఇన్‌ఫార్మర్ అతడేనని అర్థం అయిన మరుక్షణం మాయమైపోయింది షాడో మనసును కలత పెడుతున్న అనీజీనెస్.

"ఆలస్యం చేస్తే ఆ గుంపు ఇక్కడికి వచ్చేస్తుంది. నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటో త్వరగా చెప్పు బ్రదర్..." అంటూ బిజ్జూ వృక్షాన్ని వదిలి అతని వైపు అడుగులు వేశాడు.

అదే సమయంలో గాలివాలున సోకింది అతని నాసికా రంధ్రాలకు, సాబూ సిటీలో చాలామంది కాలుస్తూ వుండే పొగచుట్టవంటి సిగార్ వాసన.

దయ్యాలు భూతాలు తిరుగుతాయనే భయంతో చీకటి పడిన తరువాత జనం ఎవరూ అడుగుపెట్టని ప్రదేశం ఆ బరీయల్ గ్రౌండ్... చీకటి పడిన చాలాసేపటి తర్వాత అక్కడ సిగార్ వాసన వచ్చిందంటే అందుకు కారణం - ఆ పైన ఆలోచించలేదు షాడో...

"గెట్ బేక్ బ్రదర్... గెట్ బేక్..." అని సన్నపాటి మనిషిని హెచ్చరిస్తూ, ముందుకు డైవ్ చేశాడు.

పలుకురాళ్ళ వంటి చిన్న చిన్న గులకరాళ్ళతో నిండివున్న నేలమీద అతని మోచేతులు ఆనుకుంటున్న సమయంలోనే వినవచ్చింది టప్‌మని ఒక శబ్దం. క్రిందపడిన షాడో తలమీది నుంచి దూసుకుపోయింది

ఒక బుల్లెట్. సమాధి మధ్య భాగంలో వున్న ఇటుకరాయి ఒకటి ఎగిరి అవతల పడింది.

వీధిలోనుంచి వినవస్తున్న కేకల మీదనే దృష్టిని కేంద్రీకరించి వున్న సన్నపాటి మనిషి చాలా ఆలస్యంగా గమనించాడు ముంచుకొస్తున్న ప్రమాదాన్ని.

"గెట్ బేక్ యూ ఇడియట్.. గెట్ బేక్..." క్షణ క్షణానికి అధికం అవుతున్న ఆందోళనను అదిమి పట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ, ఇంకోసారి అతన్ని హెచ్చరించాడు షాడో. కందిరీగల మాదిరి దూసుకురానే వచ్చాయి సైలెన్సర్ అమర్చబడిన రివాల్వర్ నుంచి మరో రెండు బుల్లెట్లు.

ఖంగారు ఖంగారుగా వెనక్కి జంప్‌చేసి, సమాధి రెండో ప్రక్కకు పరిగెత్తబోతున్న సన్నపాటి మనిషి మెడమీద తగిలింది వాటిలో ఒకటి, వెన్నులో దిగబడింది రెండవది. గావురుమని అరిచే వ్యవధి కూడా లేకపోయింది అతనికి... నిలుచున్నవాడు నిలుచున్నట్లుగానే ప్రాణాలు వదిలేశాడు.

తనంతట తనుగా మరో నాలుగు అడుగుల దూరం పోయి, మొదలు నరికిన చెట్టు మాదిరి విరుచుకుపడి పోయింది అతని శరీరం. సైలెన్సర్ అమర్చిన రివాల్వర్ తనకేసి గురి పెట్టబడితే, తనకు కూడా ఆ గతే

పడుతుందని తెలుస్తూనే ఉన్నా, పడినచోటి నుంచి ఛెంగున పైకి లేచాడు షాడో.

"పట్టుకోండి... పట్టుకోండి... మన ఆడపడుచుల్ని అవమానించి పారిపోతున్న రాస్కెల్‌ని పట్టుకోండి" అని గొంతు చించుకుని అరుస్తూ సన్నపాటి మనిషి దగ్గిరికి డైవ్ చేశాడు. రివాల్వర్‌ని ఉపయోగించింది ఎవరో అతనికి తెలియదు... ఎక్కడ నిలబడి ఆ పని చేశాడో అంతకన్నా తెలియదు.

అతను మరో అడుగు ముందుకు వేసి ఖచ్చితంగా గురి చూసుకునే లోపుగా తను వచ్చిన పనిని పూర్తి చేసుకోవటానికి, అలా అరవటం కంటే మరో మార్గంలేదు. అప్పుడే బరీయల్ గ్రౌండ్ సమీపంలోకి వచ్చేస్తున్నది షాడోని అటకాయించటానికి ప్రయత్నించిన గుంపు. అతను అరిచిన అరుపు చెవులపడేసరికి, మరింత అధికమై పోయింది ఆ గుంపులోనివారికి ఆగ్రహం.

"పట్టుకోండి... పట్టుకోండి..." అని గొంతులు చినిగి పోయేటట్లు బిగ్గిరిగా అరుస్తూ బరీయల్ గ్రౌండ్‌ని చేరుకున్నారు వారందరూ...

ఊపిరి బిగపట్టి సన్నపాటి మనిషి శరీరం దగ్గిర మోకరించి కూర్చున్నాడు షాడో.

తను ఆశించినంత ఫలితం కనపడకపోతే, ఇంకోసారి పిక్కబలం చూపించటానికి రెడీగా వున్నాడు.

పిక్కబలం చూపించవలసిన అవసరం లేదని వెంటనే అర్థం అయింది అతనికి. బరీయల్ గ్రౌండ్ ముందుకు రాగానే, మరింత బిగ్గరిగా అరిచి, అతను మోకరించి వున్న ప్రదేశానికి యాభై అడుగుల దూరంలో వున్న బిజ్జూ వృక్షం వైపు పరిగెత్తారు గుంపులో వున్న వ్యక్తులు అందరూ.

నల్లగా నిగనిగలాడుతున్న రివాల్వర్‌ని పట్టుకుని, అక్కడ మాటువేసి వున్నాడో దృఢకాయుడు.

అనుకోని విధంగా తనకేసి వచ్చిన గుంపును గమనించగానే, రెండో ఆలోచన లేకుండా పాదాలకు బుద్ధి చెప్పాడు. బరీయల్ గ్రౌండ్ మధ్యగా వున్న ఒక చిన్న కాలి బాటను అనుసరించి చీకట్లోకి పారిపోయాడు. పట్టిన పట్టు వదలని బ్లడ్ హౌండ్స్ మాదిరి అతని వెనుకే పరుగులు తీస్తున్న పౌరుల్ని గురించి మరిచిపోయాడు షాడో. నిట్టనిలువుగా పడివున్న ఇన్‌ఫార్మర్ ప్యాంటు జేబుల్ని తడిమాడు.

కాటన్ క్లాత్‌గా తయారుచేయబడిన మనీ పర్సు ఒక్కటే తగిలింది అతని చేతులకు. నలిగి చినిగిపోటానికి సిద్ధంగా వున్న రెండు కరెన్సీ నోట్లు, మూడు చిల్లర నాణేలు తప్ప మరేమీ అగుపించటంలేదా పర్సులో.

పర్సును ప్రక్కన పడవేసి ఆ వ్యక్తి షర్టు మీద తన దృష్టిని కేంద్రీకరించాడు షాడో.

అంతలోనే చెదిరిపోయింది అతని కాన్సన్‌ట్రేషన్.

మెయిన్ రోడ్డుమీది సందడి పోలీసుల చెవికి కూడా చేరినట్లుంది. మ్రోతలు చేస్తూ అటుగా వచ్చేసింది పోలీస్ వ్యాన్. "ఎవరక్కడ? ఎవరా శ్మశానంలో? ఎవరు?" ఉరుములాంటి కంఠంతో ప్రశ్నిస్తూ ముందు సీటులో నుంచి దూకాడు లావుపాటి పోలీస్ ఇన్‌స్పెక్టర్. తన రివాల్వర్‌ని బిగించి పట్టుకుని సమాధి దగ్గరికి వచ్చేశాడు. అతనితో పాటు వ్యాన్‌లోనుంచి దూకిన మరో పదిమంది పోలీస్ కానిస్టేబిల్స్‌ని చూసి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

అష్టకష్టాలు పడి, రెండో కంటివాడికి తెలియకుండా అతి రహస్యంగా సాబూ పట్టణంలోకి అడుగుపెట్టాడు తను... సరిచేసుకోవటానికి వీలులేనంతగా సర్వనాశనం అయిపోయింది తను వచ్చిన పని.

గెరిల్లాతో పోరాటాలు సలిపి సలిపి రాటుదేలి వున్నారు ఆ పోలీసులు. అనుమానం అంటూ వస్తే అనవసరమైన ప్రశ్నలతో కాలక్షేపం చేయరు. ఎడా పెడా కాల్పులు జరిపి, ఆ తరువాత తీరికగా మొదలు పెడతారు ఇన్వెస్టిగేషన్.

వేగంగా ఆలోచించి వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాడు షాడో. బలమైన దెబ్బ మూలకంగా ప్రాణాలు పోగొట్టుకున్నవాడి మాదిరి, ఇంటర్‌పోల్ ఇన్‌ఫార్మర్ ప్రక్కన వెల్లికిలా పడిపోయాడు.

అసత్యం అంటూ ఏమీ లేదు షాడో అబ్జర్వేషన్‌లో. సాబూ సిటీని స్వాధీనపరుచుకోవటానికి ప్రయత్నించే గెరిల్లా దండు ఏదో ఆ బరీయల్ గ్రౌండ్‌లో మాటువేసి ఉన్నదనే భావించాడు ఆ లావుపాటి పోలీస్ ఇన్స్‌పెక్టర్.

అవసరం అయిన మరుక్షణం ఫైరింగ్ ఓపెన్ చేయమని తన వెనకనే వున్న కానిస్టేబిల్స్‌కి సైగ చేయనే చేశాడు.

రెండువందల గజాల దూరంలో వున్న అతి చిన్న టార్గెట్‌ని సైతం చిటికెలో ఛిన్నాభిన్నం చేయగల తమ రైఫిల్స్‌ని రెడీగా పట్టుకుని పొజిషన్స్ తీసుకున్నారు కానిస్టేబిల్స్.

చెమటలు పట్టినంత పని అయింది కనురెప్పల చాటు నుంచి ఆ దృశ్యాన్ని చూసిన షాడోకి.

ప్రాణాల మీద ఆశ వదిలేసుకుని, చేజేతులారా ఆ సిచ్యుయేషన్‌ని నెత్తిమీదికి తెచ్చుకున్నందుకు తనను తనే నిందించుకుంటూ ఊపిరి బిగపట్టాడు.

"ఎవరు మీరు? ఏం చేస్తున్నారు ఈ ప్రదేశంలో?" ఖంగు ఖంగుమంటున్న కంఠంతో ప్రశ్నిస్తూ సమాధి ప్రక్కకు వచ్చేశాడు ఆ ఇన్స్పెక్టర్. అడ్డదిడ్డంగా పడివున్న ఆకారాలను చూసీ చూడగానే, ఎడమచేతిని గాలిలోకి ఎత్తి ఏదో సైగ చేశాడు.

రెడీగా పట్టుకుని వున్న రైఫిల్ని కిందికి దించి, తన బెల్టుకు వ్రేలాడుతున్న టార్చిలైటు నొకదాన్ని అందుకున్నాడు ఆ సైగను గమనించిన కానిస్టేబిల్ ఒకతను. వెయ్యి క్యాండిల్స్ పవర్ గల కరెంట్ బల్బు మాదిరి కనులు మిరిమిట్లు గొలిపే కాంతుల్ని వెలువరించిందా టార్చిలైటు. సమాధి పరిసర ప్రాంతాల్ని పట్టపగలు మాదిరి మార్చివేసింది.

తను అనుమానించినట్లు అక్కడ గెరిల్లా దండు మాటువేసి లేదని వెంటనే అర్థమై, కుడిచేతిలోని రివాల్వర్ని ప్యాంటు జేబులో పెట్టేసుకున్నాడు ఇన్స్పెక్టర్. కాస్త ముందుకు వంగి ఇంటర్పోల్ ఇన్ఫార్మర్ ముఖాన్ని తడిమాడు.

"ఈ పెద్దమనిషి ప్రాణాలు అనంత విశ్వంలో కలిసి చాలా సేపు అయింది. ఇతనికి మనం చేయగల సహాయం ఏదీ లేదు..." ఒకరి తరువాత ఒకరుగా ముందుకు వస్తున్న తన కానిస్టేబిల్స్తో అంటూ, షాడో గుండెల మీద చేయి వేసి, ఆనందంగా తల వూపాడు.

''ఇతను... ఇతను ఇంకా ప్రాణాలతోనే వున్నాడు... స్టేషన్‌కి తీసుకుపోయి ముఖం మీద నీళ్ళు జల్లితే కళ్ళు తెరవటానికి అవకాశాలు చాలా వున్నాయి...'' అంటూ చేయి వూపాడు.

తమ ఆయుధాల్ని అవతల పెట్టి షాడోని చేతుల్లోకి ఎత్తుకున్నారు ఇద్దరు కానిస్టేబిల్స్.

అతి జాగ్రత్తగా బరీయల్ గ్రౌండ్‌ని దాటించి పోలీస్ వ్యాన్ వెనక భాగంలో పడుకోబెట్టారు.

ప్రాణాలు పోగొట్టుకున్న మనిషిని కూడా వ్యాన్‌లోకి చేర్చమని ఆర్డర్ ఇచ్చాడు ఇన్స్‌పెక్టర్.

తనను మోసుకువచ్చిన కానిస్టేబిల్స్ వ్యాన్‌ని వదిలి దూరంగా వెళ్ళే దాకా స్పృహలో లేనట్లే నటించాడు షాడో. వాళ్ళు అవతలికి పోయిన మరుక్షణం, చటుక్కున లేచి కిందికి దుమికాడు.

ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి కనిపించకుండా వ్యాన్‌కి రెండో పక్కన నిలుచుని, సిగరెట్ వెలిగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు వ్యాన్ డ్రయివర్.

''అదేమిటి? అలా పరిగెత్తుతున్నావేమిటి? ఆగు...'' ఆశ్చర్యం నిండిన కంఠంతో అంటూ, ముందుకు దూకి అతన్ని అడ్డుకోవటానికి ప్రయత్నించాడు.

అతని అరుపులకు మిగిలిన వారందరూ ఎలర్ట్ అయితే తన కొంప నిలువునా తగలబడిపోవటం తప్పని సరి అని తెలిసి వుండటంవల్ల, అతని చేతులకు అందలేదు షాడో, శరీరంలో శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకుంటూ పరుగు ప్రారంభించాడు.

"పట్టుకోండి... ప్రాణాలు పోయినట్లు నటించిన ఆ రాస్కెల్‌ని వెంటనే పట్టుకోండి..." అని కేకలు పెడుతూ క్లోజ్‌గా ఫాలో అవడానికి ప్రయత్నించాడు వ్యాన్ డ్రయివర్.

పళ్ళు బిగించి రెట్టింపు చేశాడు షాడో తన వేగాన్ని. బరీయల్ గ్రౌండ్‌కి వంద గజాల్లో వున్న ఒక చీకటి సందులోకి దూరి మాయం అయిపోయాడు.

ప్రాణం పోయిన ఇంటర్‌పోల్ ఇన్‌ఫార్మర్ శరీరాన్ని వ్యాన్‌లోకి ఎక్కించిన మరుక్షణం, వైర్‌లెస్ సెట్‌ని యాక్టివేట్ చేశాడు పోలీస్ ఇన్స్‌పెక్టర్.

సిటీలో చక్కర్లు కొట్టే ఇతర పోలీస్ అధికారులకు అక్కడ జరిగింది ఏమిటో వివరించి చెప్పాడు. "వెంటనే బంధించాలి ఆ బద్మాష్‌ని... ముక్కలు విరగదీసి మా స్టేషన్‌కి పంపాలి..." అని రిక్వెస్ట్ చేశాడు.

అరగంట తరువాత ఫోర్త్ టౌన్‌లోని ఒక మెయిన్ రోడ్డు మీద నిలబడి అతని ఎనౌన్స్‌మెంట్ యొక్క ఫలితాన్ని పూర్తిగా అనుభవించాడు షాడో.

గెరిల్లాలను గురించి పూర్తిగా మరిచిపోయారు సాబూ సిటీ పోలీస్ అధికారులు.

బలమైన దెబ్బలు తగిలినట్లు నటించి తమ ఇన్స్‌పెక్టర్‌ని ఏమార్చిన వ్యక్తిని పట్టుకోవటం ఒక్కటే తమ జీవిత ధ్యేయం అన్నట్లు గాలింపు చర్యల్ని చేపట్టటం మొదలు పెట్టారు.

నాలుగు నిముషాలకు ఒకసారి మెయిన్‌రోడ్డును సర్వే చేస్తున్నాయి రెండు పోలీస్ వ్యాన్లు.

రోడ్డుమీద కనిపించిన ప్రతి పౌరుడిని పట్టి పట్టి చూస్తున్నారు వాటిలోని పోలీసులు.

“ఇంటికి వెళ్ళిపోవటం ఒంటికి చాలా మంచిది భాయీ... వీళ్ళ వరస చూస్తుంటే నాకు భయం వేస్తోంది. తమకు కావాల్సిన మనిషి కనిపించకపోతే, కనిపించిన ప్రతి మనిషినీ స్టేషన్‌కి తీసుకుపోతారని అనిపిస్తోంది” ఓరగా తెరిచిన బడ్డీ తలుపు చాటునుండి ఆ పోలీసుల్ని చూస్తూ కామెంట్ చేశాడు బడ్డీ కొట్టు యజమాని ఒకతను. షాడో అడిగిన

సిగరెట్ ప్యాకెట్‌ని అతని చేతిలో పెట్టి అర్జంటుగా బడ్డీ తలుపుల్ని మూసేసుకున్నాడు.

నీడల్లో నిలబడి సిగరెట్ వెలిగించుకుంటూ తన పొజిషన్‌ని అంచనా వేసుకున్నాడు షాడో.

మెయిన్ రోడ్డు మధ్య భాగంలో వున్న మీడియమ్ సైజ్ హోటల్ దగ్గరికి పోవాలి తను... ఇంటర్‌పోల్‌కి సంబంధించిన ఏజెంట్ ఒకతను ఆ హోటల్‌ని నడుపుతూ వుంటాడు.

బరీయల్ గ్రౌండ్‌లో ఎదురైన అనుభవాన్ని అతనికి వివరించాలి... తను వచ్చిన పని ఏ విధంగా నాశనమైపోయిందో తెలియచెప్పాలి...

ఆ మాటలు మనసులో మెదిలేసరికి, అప్రయత్నంగా నాలుగు రోజులు వెనక్కి పరిగెత్తాయి షాడో ఆలోచనలు. పారిస్‌లో వున్న ఇంటర్‌పోల్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఒక అత్యవసర సమావేశం అతని కనుల ముందు మెదలటం మొదలుపెట్టింది.

* * * * *

ఆరిపోటానికి సిద్ధంగా వున్న సిగార్ వంక అసహ్యంగా చూస్తూ, అవతలకి విసిరేసి, కోటు జేబులోంచి ఇంకో ఫ్రెష్ సిగార్‌ని బయటికి తీశారు సి.ఐ.బి. డైరెక్టర్ కులకర్ణి.

"మమ్మల్ని పిలిపించిన కారణం ఏమిటో వివరిస్తే చాలా సంతోషిస్తాం మై ఫ్రెండ్... అర్జంటుగా బయలుదేరమని మెసేజి యిచ్చి, వచ్చిన తర్వాత మౌనంగా కూర్చోబెట్టటం బాగోలేదు" ఇంటర్‌పోల్ డైరెక్టర్స్ వంక చూస్తూ నిర్మొహమాటంగా అడిగేశారు.

అతి పెద్ద సినిమాహాలు మాదిరి వున్న మీటింగ్ రూమ్‌లో కూర్చుని, లోగొంతుకలతో ఏదో విషయాన్ని గురించి మాట్లాడుకుంటున్న ఆ డైరెక్టర్స్ అందరూ, తలలెత్తి ఆయనవంక చూశారు.

"ఒక్క నిముషం ఓపిక పట్టు కులకర్ణీ... ఒక ముఖ్యమైన మనిషి కోసం వెయిట్ చేస్తున్నాం... జస్ట్ వన్ మినిట్..." అంటూ ఆయన్ను శాంతింప చేయటానికి ట్రై చేశాడు ఒక డైరెక్టర్.

చేతిలో వున్న ఫ్రెష్ సిగార్‌ని కూడా విసిరేయబోయి, ముసి ముసిగా నవ్వుకుంటున్న షాడోని గమనించారు కులకర్ణి.

"నీలో నువ్వు నవ్వుకోవాల్సినంత వినోదాన్ని కలిగించే అంశం ఇక్కడ ఏముంది?" కనుబొమలలో నుంచి గుర్రుగా చూస్తూ వెంటనే అడిగారు.

"వీళ్ళు మీతో మాట్లాడబోయే విషయం ఏమిటో మీకు తెలుసు... మిమ్మల్ని ఇక్కడికి ఎందుకు పిలిపించారో తెలుసు... అన్నీ తెలిసిన మీరు ఏమీ తెలియని మనిషి మాదిరి అసహనంగా మాట్లాడటం విచిత్రంగా

వున్నది'' తన నవ్వుకు కారణాన్ని ధైర్యంగా ఆయనకు తెలియచేశాడు అతను.

నమిలి మింగేయాలన్నంత కోపంగా చూడబోయి, ఆఖరి క్షణంలో తనుకూడా నవ్వేశారు కులకర్ణి.

''ప్రపంచంలో జరిగే వింతలు, విడ్డూరాలు ఒక్క ఇంటర్‌పోల్‌కి మాత్రమే తెలుస్తాయని, ఇంటర్‌పోల్ తప్ప మరెవ్వరికి తెలియవనీ ఈ పెద్దమనుషుల అభిప్రాయం... కాస్సేపు వాళ్ళని ఆటపట్టించాలని వున్నది..." మెల్లగా అంటూ, పది అడుగుల దూరంలో కూర్చున్న ఒక డైరెక్టర్ వైపు చూశారాయన.

''మీరు ఎదురు చూస్తున్న ఆ ముఖ్యమైన మనిషి ఎవరో, ఎక్కడినుండి వస్తున్నాడో, ఎందుకు వస్తున్నాడో మాకు తెలియదు గానీ, అతను వచ్చేదాకా చేతులు కట్టుకు కూర్చోవడం కాస్తంత బాధాకరంగానే వున్నది. కొద్దిసేపు అలా బయటికి పోయి రిలాక్స్ అయి వస్తాం... జస్ట్ పది నిముషాలు చాలు, జంటిల్మన్... అంతకంటే ఒక్క నిముషం కూడా ఎక్కువ అవసరం లేదు.'' అంటూ కుషన్ చైర్లో నుంచి లేచి నిలబడ్డారు కులకర్ణి.

అనకూడని మాట ఏదో ఆయన అన్నట్లు హడావుడిగా తమతమ సీట్లలో నుంచి లేచారు ఇద్దరు ఇంటర్‌పోల్ డైరెక్టర్స్.

‘‘ఇలా ఆఖరి క్షణంలో మీరు వెళ్ళిపోతే ఇంతవరకూ మేము చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయిపోతాయి... ప్లీజ్ కులకర్ణీ... ప్లీజ్ వెయిట్ ఫర్ సమ్ టైమ్...’’ అంటూ ఆయన్ను బలవంతంగా కూర్చోబెట్టి తమ స్థానాల్లోకి వెళ్ళిపోయారు వారు.

‘‘ఇంటర్‌పోల్‌లో సభ్యత్వం కలిగివున్న దేశాలలో మనదేశం కూడా వున్నది. ఇంటర్‌పోల్ నిర్ణయాలను అంగీకరించటానికి, తిరస్కరించటానికి మనకు పూర్తి హక్కు, అధికారం వున్నాయి... ఇప్పుడు ఇక్కడ సమావేశమైవున్న ఈ పెద్ద మనుషులలో ఏ ఒక్కరికీ మనము తీసిపోము... ఈ విషయం తెలిసికూడా వీళ్ళు మనల్ని దూరంగా కూర్చోబెట్టటం విచిత్రంగా కనిపిస్తోంది...’’ కోటు జేబులో వున్న లైటర్‌తో సిగార్‌ని వెలిగించుకుంటూ షాడో చెవిలో గుసగుసలాడారు కులకర్ణి.

మీటింగ్ హాలులో ఎంటర్ అయిన వెంటనే ఆ విషయాన్ని గమనించాడు షాడో. అనవసరంగా నోరు తెరిస్తే ఆయన కోపానికి గురికావల్సి వస్తుందన్న భయంతో కామ్‌గా వుండి పోయాడు.

అతి విశాలంగా వున్న పొడుగాటి టేబిల్‌కి ఒక ప్రక్కగా కూర్చోబెట్టబడి వున్నారు కులకర్ణిగారు... టేబిల్‌కి రెండో ప్రక్కన ఆశీనులై వున్నారు మిగిలిన డైరెక్టర్లు... వారికి వీరికి మధ్య పది అడుగులకు కాస్తంత ఎక్కువగానే వున్నది డిస్టెన్స్.

షాడో ఆలోచనలు పూర్తి కానేలేదు.... ఉన్నట్లుండి గొంతు సవరించుకున్నాడు ఒక డైరెక్టర్.

"వెల్ మిస్టర్ కులకర్ణీ... ఇక మీరు వెయిట్ చేయవలసిన అవసరం లేదు. ఉయ్ విల్ స్టార్ట్ దిస్ మీటింగ్..." అంటూ తన ఎదుట వున్న పేపర్స్‌ని ప్రక్కకు నెట్టి, షాడో వంక చూశాడు.

"మలేసియా దేశాన్ని గురించి, ఆ దేశంలోని సాబూ సిటీని గురించి, అక్కడి రాజకీయ పరిస్థితిని గురించి మీకు పూర్తిగా తెలుసునని మా అభిప్రాయం. యామై కరెక్ట్" అన్నాడు.

ఎత్తయిన కొండలతో, దట్టమయిన అడవులతో నిండి వుండే ఆ ఏరియాను గుర్తుకు తెచ్చుకుంటూ, కనుచివరల నుంచి కులకర్ణి గారి వైపు చూశాడు షాడో.

"సాబూ సిటీని గురించి మాట్లాడుకునే ముందు మీరు మాకు వచ్చిన ఒక డౌట్‌ని క్లియర్ చేయాలి జంటిల్మెన్... చేస్తారా?" అంటూ వెంటనే కల్పించుకున్నారు కులకర్ణి.

ఆయన అలా ఇంటర్‌ఫీయర్ అవుతారని ఊహించలేదు కాబోలు, ఇరకాటంలో పడినట్లు తలలు విదిలించారు ఇంటర్‌పోల్ డైరెక్టర్లు.

"ఎదురు ప్రశ్నలు వేయటం ఈ సమయంలో మంచిది కాదు కులకర్ణి... మేము చెప్పదలుచుకున్నదేమిటో చెప్పిన తర్వాత మీ

అనుమానాల్ని క్లియర్ చేయటం జరుగుతుంది. అంతవరకూ వెయిట్ చేయటం మంచిది.'' అని సీరియస్‌గా అనబోతున్న ఒక డైరెక్టర్ వంక చురుకుగా చూసి, చేతిలోని రెండో సిగార్‌ని కూడా ఎదుట వున్న యాష్‌ట్రేలో పడేశారు కులకర్ణి.

''రాజకీయ అశాంతితో అట్టుడుకి పోతున్న ఆ దేశంలోకి ఎంటర్ కావటం, అక్కడి పరిస్థితుల మధ్యలో చిక్కుపడటం మా విదేశాంగ విధానానికి విరుద్ధం.

మీరు మాకు అప్పగించబోయే ఎస్సైన్‌మెంట్ ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక మాకు లేదు జంటిల్మన్... మమ్మల్ని వదిలేస్తే చాలా సంతోషిస్తాం...'' అంటూ ఇంకోసారి కుషన్ చైర్లో నుంచి పైకి లేవబోతున్న ఆయన్ను బలవంతంగా కూర్చోబెట్టాడు ఒక డైరెక్టర్.

''ఎప్పుడూ లేనిది ఈ రోజు మీ ప్రవర్తన చాలా విచిత్రంగా వున్నది కులకర్ణీ. మీరు మనస్సులో ఏదో ఉద్దేశ్యాన్ని పెట్టుకుని ఇలా మాట్లాడుతున్నారని మాకు అనిపిస్తోంది.'' సూటిగా తన అభిప్రాయాన్ని తెలియచేశాడు ఇంకో డైరెక్టర్.

ఎటువంటి ఓపెనింగ్ కోసం కులకర్ణి గారు ఎదురు చూస్తున్నారో, అది దొరకనే దొరికింది ఆయనకు.

“మనస్సులో ఒకటి పెట్టుకుని, బయటికి ఇంకో విధంగా మాట్లాడాల్సిన అవసరం మాకు లేదు జంటిల్మెన్... ఇంటర్‌పోల్ దగ్గిర్నించి కబురు వస్తే చాలని సంతోషించి, మీరు కూర్చోమన్న ప్రదేశంలో చేతులు కట్టుకు కూర్చునేవాళ్ళం కాదు మేము...” తమకు మిగిలిన వారికి వున్న మధ్య దూరాన్ని పర్టిక్యులర్‌గా కనులతో చూపిస్తూ ఎనౌన్స్ చేశారాయన.

అంతవరకూ ఆ అరేంజ్‌మెంట్‌ని ఆయన గమనించలేదని అనుకుంటున్నారు ఇంటర్‌పోల్ డైరెక్టర్లు. ఏమని సమర్థించుకోవాలో అర్థం కానట్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

“మీరు అధికమైన శ్రమ తీసుకోవాల్సిన అవసరం లేదు జంటిల్మెన్. ఈ సీటింగ్ అరేంజ్‌మెంట్ ఎందుకు ఏర్పాటు చేయబడిందో నేను చెపుతాను.” అంటూ కోటు జేబులోనుంచి ఇంకో సిగార్‌ని తీసి వెలిగించుకున్నారు కులకర్ణి.

ఆ కాస్త వ్యవధిలోనే తడబాటునుంచి బయట పడగలిగారు ఇంటర్‌పోల్ డైరెక్టర్లు.

“మా, మాటల్ని కాస్త ప్రశాంతంగా ఆలకించాలి కులకర్ణీ... మేము చెప్పబోతున్న విషయాన్ని వింటే మీకు పూర్తిగా అర్థం అవుతుంది” అంటూ తమ చర్యను సమర్థించుకోబోయిన డైరెక్టర్‌ని చూపులతోనే ఆపేసి, అందరి వంకా చేయి ఊపారాయన.

“సృష్టి ప్రారంభం అయిన నాటినుంచీ తమ చుట్టూ వున్న జీవజాలాన్ని ఏదో ఒక విధంగా తన అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తూనే వున్నాడు మానవుడు... జంతు చర్మాలు కట్టుకుని, అడవుల్లో దొరికినవి తింటూ, చెట్టు తొర్రలలోను, కొండ గుహల్లోనూ నివసించిన రోజునుంచీ ఇప్పటివరకూ తన మాటే నెగ్గాలని, తనకు తారసపడిన ప్రతి జీవీ తన మాటనే వినాలని వాంఛించాడు.

నాగరికత పెరిగి, శాస్త్ర పరిజ్ఞానం అధికమై, ఇతర గ్రహాలకు అతి తేలికగా ప్రయాణం చేయగల శక్తి సామర్థ్యాలను సంపాదించుకున్న ఈ రోజుల్లో కూడా మానవుడి ఆలోచనా పద్ధతుల్లో మార్పు రాలేదు. తోటి మానవుల్ని తన అదుపులోకి తెచ్చుకోవాలన్న కోరిక సమసిపోలేదు.”

సిగార్ పొగని గుప్పు గుప్పున వదులుతూ ఖంగు ఖంగు మంటున్న కంఠంతో చిన్నసైజు ఆధ్యాత్మికోపన్యాసాన్ని స్టార్ట్ చేసిన కులకర్ణి గారి వంక చిత్రాతి చిత్రంగా చూశారు అక్కడి వారందరూ.

భారతీయులకు బాగా అలవాటైన మెట్ట వేదాంతపు పలుకుల్ని వర్ణిస్తున్నారని అనుకున్నారు వారిలో కొందరు. ఉన్న పళాన బయలుదేరి రావటంవల్ల, ఆరోగ్యం కొంచెంగా దెబ్బ తిన్నదేమోనని అనుకున్నవారు కూడా లేకపోలేదు.

వారి మనస్సులో మెదులుతున్న ఆలోచనలు అర్థం కాక పోలేదు కులకర్ణి గారికి. అయినాసరే తన పద్ధతిని మార్చుకోలేదాయన.

"సృష్టిలోని జీవజాలాన్ని తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలన్న తపనతో పాటు, తన తోటి మానవుల్ని కూడా లొంగదీసుకోవాలనే ఆలోచనకు శాస్త్ర పరిజ్ఞానాన్ని జోడించి అద్భుతమైన, అనితర సాధ్యమైన ఒక మెషిన్‌ని తయారుచేశాడు ఇటలీకి చెందిన సైంటిస్ట్ ఒకతను... మీట నొక్కిన మరుక్షణం కంటికి కనిపించని శక్తి తరంగాల్ని క్రియేట్ చేసి, ఆ తరంగాలు సోకిన మనుషులు వెంటనే తన కంట్రోల్లోకి వచ్చే విధానాన్ని కనిపెట్టాడు!"

ఎవరూ ఎదురు చూడని విధంగా ఉన్నట్టుండి అసలు విషయంలోకి సూటిగా వచ్చేసిన కులకర్ణి గారి వంక ఆశ్చర్యం నిండిన చూపులతో చూశారు ఇంటర్‌పోల్ డైరెక్టర్లు అందరూ.

"తను తయారు చేసిన ఆ యంత్రాన్ని ప్రపంచ రాజ్యాలన్నిటికీ చూపించి మెప్పు పొందాలని ఆశించాడు ఆ ఇటాలియన్ సైంటిస్ట్...

అగ్రరాజ్యాల అండదండలతో ఆ మెషిన్‌ని మరింతగా అభివృద్ధి పరిచి, సాటిలేని మేటి మొనగాడుగా పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించాడు!"

ఊపిర్లు బిగపట్టేశారు డైరెక్టర్లు. కనురెప్పల్ని కదిలించడం కూడా మరిచిపోయినట్లు ఆయన వంక చూడటం మొదలు పెట్టారు.

"ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ తయారు చేయలేని అపూర్వమైన యంత్రాన్ని తను తయారుచేయ గలిగినందుకు ఉప్పొంగిపోతూ అమెరికాకు ప్రయాణమైన ఆ ఇటాలియన్ సైంటిస్ట్ మార్గమధ్యంలోనే మాయం చేయబడ్డాడు. మలేషియాలోని సాబూ సిటీ వరకూ ట్రేస్ చేయటం జరిగింది అతని జాడల్ని."

చివరికంటా కాలిన సిగార్‌ని యాష్‌ట్రేలో పడేస్తూ అర్థాంతరంగా ముగించారు కులకర్ణి తన ఉపన్యాసాన్ని.

"మాయమైన ఆ సైంటిస్ట్‌ని వెతికి తమకు అప్పగించవలసిందిగా ఇంటర్‌పోల్‌ని అభ్యర్థించింది ఇటాలియన్ ప్రభుత్వం. ఆ పని మీదే మీరు మమ్మల్ని ఇక్కడికి రప్పించారు. యామై కరెక్ట్?" తనకేసి తదేకంగా చూస్తున్న డైరెక్టర్‌ని ప్రశ్నించారాయన.

తాము చెప్పదలుచుకున్న విషయాలన్నీ ఆయన నోటి వెంట తామే వినవలసి రావటం - ఇబ్బందికరంగా కనిపించి వుండాలి వారికి షాడో అంచనాల ప్రకారం.

అటువంటి ఫీలింగ్స్‌ని ప్రదర్శించకపోగా, ముసి ముసి నవ్వులు నవ్వారు వారందరూ.

“యువ్వార్ కరెక్ట్ కులకర్ణి... ఇప్పుడు నువ్వు చెప్పిన మాటలన్నీ నిజంగా అక్షరసత్యాలు...” అని అంగీకార సూచకంగా తలలు వూపుతూనే, ఆ ప్రదేశంలో ఒక మూలగా నిలబెట్టి వున్న సినిమా ప్రొజెక్టర్ లాంటి సాధనం కేసి చేతులు చూపించారు.

“తన పరిశోధనల గురించి అమెరికన్స్‌కి వివరించాలని బయలుదేరిన ఇటాలియన్ సైంటిస్ట్, తనతో పాటు ఆ మెషీన్ తయారీకి సంబంధించిన పేపర్స్‌ని తీసుకువెళ్ళాడేగానీ... తను తయారుచేసిన ప్రోటోటైప్‌ని తీసుకుపోలేదు. ప్రొజెక్టర్ మాదిరిగా కనిపించే ఈ మెషీన్ అతను తయారుచేసినదే...” అంటూ, ఆ మెషీన్ వెనుక భాగంలో నిలుచుని వున్న ఒక వ్యక్తికి సైగ చేశాడు వారిలో ఒకతను. వెంటనే ఆ మెషీన్ మీద వున్న ఒక బటన్‌ని ప్రెస్ చేశాడు ఆ వ్యక్తి.

అక్కడ వున్న వారందరితో పాటు తనుకూడా ఊపిరి బిగపట్టి అటుకేసి చూశాడు షాడో.

మెషీన్ ఆన్ అయిన శబ్దం వినిపించింది అతనికి.... అందులోనుంచి వెలువడతాయని అందరూ అనుకునే శక్తి తరంగాలు మాత్రం కనిపించలేదు.

ఉన్నట్టుండి కనులు గిర్రున తిరుగుతున్న అనుభూతి ఆవరించుకున్నది అతన్ని... తన ఎదుట ఎవరో హిప్నొటిస్ట్ నించున్నట్లు, తనను హాయిగా నిద్రపొమ్మని చెబుతున్నట్లు అనిపించసాగింది.

"కమాన్ మిస్టర్ షాడో... నీ చైర్లో నుంచి లేచి ఈ టేబిల్‌కి దూరంగా వెళ్ళు. నీ చేతుల్ని గాలిలోకి ఎత్తి మా అందరివంకా చూడు..." మెషీన్‌కి ఎటాచ్ చేసివున్న మైక్రోఫోన్ వంటి ఒక సాధనాన్ని చేతుల్లోకి తీసుకుంటూ సడన్‌గా ఒక కమాండ్‌ని వినిపించాడు ఇంటర్‌పోల్ డైరెక్టర్స్‌లో ఒకతను.

ఆ కమాండ్‌ని అక్షరాల అమలులో పెట్టడం తన జీవిత లక్ష్యం అనిపించింది షాడోకి. తనకు తెలియకుండానే కుర్చీలో నుంచి లేవబోతుండగా, చిరునవ్వులు చిందిస్తున్న అక్కడి పెద్దమనుషులకు కనిపించకుండా బూటుకాలితో అతని చీల మండమీద బలంగా ప్రెస్ చేశారు కులకర్ణి. బిగ్గరగా అరవాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదిమి పెడుతూ ఆశ్చర్యంగా చూశాడు షాడో ఆయన వంక.

"ఈ మెషిన్ శక్తిని మనకు ప్రత్యక్షంగా చూపించి, మనం చేయవలసిన పని ఎంత ముఖ్యమైనదో తెలియచేయడం కోసమే. మనల్ని దూరంగా కూర్చోబెట్టారు. నీ మెదడును ఆవరించుకోబోతున్న అనీజీనెస్‌ని రెజిస్ట్ చేయ్... ఆ దరిద్రపు గొట్టు యంత్రంలో నుంచి వినవచ్చే ఆజ్ఞల్ని ధిక్కరించు..." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ ఇచ్చాడు కులకర్ణి.

''కమాన్ మిస్టర్ షాడో... కమాన్... కుర్చీలో నుంచి వెంటనే లేచి నిలబడు...'' మరోసారి ఆ గదిగోడలు ప్రతిధ్వనించేటట్లు పెద్దగా వినవచ్చింది ఇంటర్‌పోల్ డైరెక్టర్ వాయిస్.

తన అనుమతితో నిమిత్తం లేకుండా కుర్చీలో నుంచి లేవటానికి సిద్ధం అయిన తన శరీరాన్ని విల్‌పవర్‌నంతా కూడగట్టుకుని, కుర్చీలోనే ఆపేశాడు షాడో.

దృష్టిని నాసికాగ్రం మీద నిలిపి, ఎర్రటి రంగులో మిలమిల మెరిసిపోతున్న ఒక తామరపూవును మనసులో తలుచుకున్నాడు.

'కాన్‌సన్‌ట్రేషన్ ఛిన్నాభిన్నమై నీ ఆలోచనలు నీ చెప్పుచేతల్లో వుండకుండా చెల్లాచెదురైపోతున్న ఈ సమయంలో ఈ తామరపూవును కనులముందు రప్పించుకో... నీ ఇబ్బంది వెంటనే తొలగిపోతుంది... ఏకాగ్రత లభిస్తుంది' కుంగ్ ఫూ పోరాటవిద్యను అభ్యసించే సమయంలో అతని గురువు బాజూ అకరక్ చింగ్‌లీ ఉపదేశించిన వాక్యాలవి.

మనస్సును అధీనంలో వుంచుకోవటం కోసం కుంగ్ ఫూ గురువులు అనుసరించే మార్గాన్నే తనూ ఫాలో అయ్యాడు షాడో ఇప్పుడు.

గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు... నెమ్మదిగా, అతి నెమ్మదిగా బయటికి వదులుతూ, కనులముందు ప్రత్యక్షం అయిన తామరపూవు మీదనే దృష్టినంతా కేంద్రీకరించాడు.

''కమాన్ మిస్టర్ షాడో... కమాన్...'' ఖంగు ఖంగు మంటున్న కంఠంతో అతన్ని అదరగొట్టడానికి తీవ్రప్రయత్నం చేసున్న ఇంటర్‌పోల్ డైరెక్టర్ వంక చిరునవ్వుతో చూశారు కులకర్ణి.

''గొంతు వినటమే కాదు జంటిల్మన్... దగ్గిరికి వచ్చి చెవులు చిల్లులు పడిపోయేటట్లు కేకలు పెట్టినా షాడోని మీ కంట్రోల్‌లోకి తెచ్చుకోవటం ఇంపాజిబుల్...'' అంటూ కోటుజేబులో నుంచి మరో సిగార్‌ని బయటికి తీశారు.

అప్పటివరకూ చేతిలో పట్టుకుని వున్న మైక్రోఫోన్ వంటి సాధనాన్ని ఆ మెషిన్ మీద పెడుతూ గాఢంగా నిట్టూర్చాడు ఇంటర్‌పోల్ డైరెక్టర్.

''ఈ మెషీన్‌ని ఆఫ్ చేసి, సాధనం ద్వారా ఒకే ఒక కమాండ్‌ని వినిపించిన మరుక్షణం ఎదుట వున్న మనిషి ఏ అభ్యంతరమూ తెలియచేయక లొంగిపోతాడని మాకు వివరించబడింది... ఇప్పుడు మేము చూసిన దృశ్యాన్ని బట్టి ఆలోచిస్తే, ఈ మెషీన్ ఎందుకూ పనికిరానిదిగా తోస్తోంది.

మాయమైన ఇటాలియన్ సైంటిస్ట్‌ని పట్టుకోవటానికి మనం కాళ్ళు విరగదొక్కుకోవాల్సిన అవసరం లేదనిపిస్తోంది'' తన చైర్ దగ్గరికి వస్తూ సాలోచనగా అన్నాడు.

ఆ మాటతో ఏకీభవిస్తున్నట్లు తలలు ఊపుతూ డైరెక్టర్స్ అందరివంకా చూస్తూ గాఢంగా నిట్టూర్చారు కులకర్ణి.

కుంగ్ ఫూ పోరాట విద్యలో ఆరితేరిన అపరిమిత మేధాశక్తి సంపన్నులని పేరు పొందిన మాస్టర్స్ దగ్గిర ఆ విద్యను అభ్యసించి వుండటం వల్ల ఆ మెషీన్‌లో నుంచి వెలువడే శక్తి తరంగాల్ని రెజిస్ట్ చేయగలిగాడు షాడో... అందుకు ఎంతో శ్రమ పడవలసి వచ్చినట్లు అతని నుదుట పట్టిన స్వేద బిందువులు చెపుతున్నాయి.

అందరికీ అటువంటి కెపాసిటీ వుంటుందా?

ఇటాలియన్ సైంటిస్ట్ తయారుచేసిన ఆ మెషీన్ సామాన్యమైనది కాదని తాము అంగీకరిస్తున్నట్లు బయటికి చెప్పలేదాయన.

"వెల్... జంటిల్మన్... ఇప్పుడు మేము చేయవలసిన పని ఏమిటి?" సిగార్ పొగను సీలింగ్ మీదికి వదులుతూ అడిగారు అక్కడివారిని.

"కంటికి కనిపించని శక్తి తరంగాలతో ఎటువంటివారినైనా సరే అతి తేలికగా లొంగతీసుకునే ఈ మెషీన్ ఇదొక్కటే అయితే చాలా బాగుంటుందని ఇటాలియన్ ప్రభుత్వం భావిస్తోంది.

మాయమైపోయిన సైంటిస్ట్‌ని భయపెట్టో, ప్రలోభపెట్టో ఇంకో మెషీన్‌ని తయారుచేయించి, దాని ద్వారా ప్రపంచ రాజ్యాలను ఎవరైనా

బ్లాక్‌మెయిల్ చేయకుండా ముందుగానే జాగ్రత్త పడాలని అనుకుంటోంది... ఉయ్ హావ్ టు హెల్ప్ దెమ్... ఆ సైంటిస్ట్ ద్వారా అనవసరమైన ఇబ్బందులు ఎదురు కాకముందే అతన్ని వెతికి పట్టుకోవాలి...'' ఇంటర్‌పోల్ డెసిషన్‌ని ఆయనకు వినిపించి సమాధానం కోసం ఎదురు చూశాడు ఒక డైరెక్టర్.

అతను ఊహించినట్లు ఆ మెషీన్ చేతకానితనాన్ని వెక్కిరించలేదు కులకర్ణి. ఇటాలియన్ సైంటిస్ట్ గొప్పతనాన్ని కించపరచలేదు.

''ఉయ్ యాక్సెప్ట్ దిస్ ఎస్సైన్‌మెంట్ సర్... ఉయ్ విల్ డూ అవర్ బెస్ట్...'' అంటూ కుషన్ చైర్లో నుంచి లేచి షాడోకేసి చూశారు.

అంతవరకే కనిపించాయి ఆ దృశ్యాలు షాడోకి... మెయిన్ రోడ్డు చివరిభాగంలోకి పోయిన పోలీస్ వ్యాన్, ఉన్నట్టుండి వేగంగా వెనక్కి వచ్చేస్తూ వుండటాన్ని కనుచివరల నుంచి గమనించి అర్జంటుగా తన ఆలోచనల్లో నుంచి బయట పడ్డాడతను.

సాబూ సిటీ ఫోర్త్‌టౌన్ మెయిన్ రోడ్డు మీద వుండే హోటల్ ఇంటర్‌పోల్‌కి చెందిన ఏజెంటుగా పనిచేస్తున్న మనిషిదని తెలిసింది.

ఎవరికీ తెలియకుండా ఆ సిటీలోకి ఎంటర్ అయిన ఇటాలియన్ సైంటిస్ట్‌ని తను చూసినట్లు ఆ ఏజెంట్‌కి తెలియ చేశాడట ఒక ఇన్‌ఫార్మర్... తను అడిగిన డబ్బును అందచేయగలిగితే ఆ వివరాలు వెల్లడిస్తానని

చెప్పాడట. వెల్లడించకుండానే హతమారిపోయాడతను... ఆ విషయాన్ని ఇంటర్‌పోల్ ఏజెంట్‌కి తెలియచేయటం తన బాధ్యత. అతని సహాయంతో ఇంకో యాంగిల్‌లో ఇన్వెస్టిగేషన్‌ని కంటిన్యూ చేయటం తన కర్తవ్యం.

"ఎవరది? ఎవరు బడ్డీ కొట్టు దగ్గర తచ్చట్లాడుతున్నది? ఎవరు?" వ్యాన్ విండోలో నుంచి బయటికి తొంగిచూస్తూ బిగ్గరిగా అరిచిన ఒక కానిస్టేబుల్‌ని గమనించి, వేగంగా నీడల్లోకి జరిగాడు షాడో. ఊపిరి బిగపట్టి ఒదిగి నిలుచున్నాడు.

రెండు నిముషాలపాటు పట్టి పట్టి చూసి, వ్యాన్ డ్రయివర్‌కి సైగచేశాడు ఆ కానిస్టేబుల్.

మెయిన్ రోడ్డు రెండో ప్రక్కకు పోయి, వెంటనే వెనక్కి వచ్చింది ఆ వెహికిల్. ఏ హోటల్ దగ్గిరికి వెళ్లాలని షాడో వాంఛిస్తున్నాడో సరిగ్గా ఆ హోటల్ ముందే ఆగిపోయింది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ ఒకరి తరువాత ఒకరుగా క్రిందికి దిగుతున్న కానిస్టేబుల్స్‌ని గమనించి, గాఢంగా నిట్టూర్చాడు షాడో.

రోడ్డుమీద చక్కర్లు కొట్టి కొట్టి విసుగు పుట్టింది కాబోలు - పర్మినెంట్‌గా ఆ హోటల్ ముందు సెటిల్ అయ్యే లక్షణాలు కనిపిస్తున్నాయి ఆ కానిస్టేబుల్స్‌లో... వాళ్ళు అక్కడ వున్నంత వరకూ అడుగు ముందుకు వేయటం అసాధ్యం...

వేగంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేశాడతను, క్రింద కనిపించిన ఒక లావుపాటి గులకరాయిని అందుకుని బలంగా అటుకేసి విసిరాడు.

వ్యాన్ ముందు భాగానికి తగిలిందది... హెడ్‌లైట్స్‌లో ఒకదాన్ని ముక్కలు ముక్కలు చేసేసింది.

పట్టరాని కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ బడ్డీ కేసి చూసిన వ్యాన్ డ్రయివర్ మీదికి విసిరాడు షాడో ఇంకో రాయిని.

"అయ్యబాబోయ్... గెరిల్లాలు... గెరిల్లాలు మన టౌన్‌లోకి వచ్చేశారు..." భయంతో వణికిపోతున్న వాడి మాదిరి బిగ్గరిగా అరిచి, బడ్డీకి సమీపంలో వున్న చిన్న చీకటి సందులోకి పరుగు తీశాడు.

గెరిల్లాల ప్రసక్తి వచ్చేసరికి, తాము ఆ ఏరియాలోకి ఎందుకు ఎంటర్ అయ్యారో మరిచిపోయారు పోలీసులు. వ్యాన్‌లో పెట్టిన ఆయుధాల్ని అందుకుని, బడ్డీ దగ్గిరికి పరిగెత్తుకు వచ్చారు.

చీకటి సందు మొగదలే వున్న ఒక చెత్త కుండీ చాటున మోకరించి కూర్చుని వారి కదలికల్ని జాగ్రత్తగా అబ్జర్వ్ చేశాడు షాడో. బరువైన రైఫిల్స్‌ని వారు రెడీగా పట్టుకుని, ఇంకా కొంచెం ముందుకు పోయిన వెంటనే, హోటల్ వైపు జరిగాడు.

గెరిల్లాలను హతమార్చి సాటిలేని మేటి వీరుడిగా పేరు పొందాలన్న తపన తనకు కూడా వున్నది కాబోలు, వ్యాన్‌తో సహా కానిస్టేబుల్స్‌ని అనుసరించాడు పోలీస్ డ్రయివర్.

ప్రక్కలకు కూడా చూడకుండా హోటల్ ముందుకు పోయి, మూసివున్న తలుపుల్ని చేత్తో మృదువుగా తట్టాడు షాడో.

నాలుగైదు క్షణాలవరకూ రెస్పాన్స్ రాదనీ అనుకున్నాడతను. లోపల ఎక్కడో వుండే ఇంటర్‌పోల్ ఏజెంట్ ముఖ ద్వారం దగ్గరికి వచ్చేసరికి ఎలా లేదన్నా కాస్త సమయం పడుతుందని భావించాడు.

అతని మనసులోని భావనకు విరుద్ధంగా చేతులు పడిన మరుక్షణం కిర్రుమని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి ఆ తలుపులు.

"నువ్వు చెప్పిన ఇన్‌ఫార్మర్ ఖతమైపోయినట్లు నీకు తెలిసి పోయిందా? అందుకే నా కోసం ఎదురు చూస్తున్నావా??" అని అడుగుతూ లోపలికి జంప్ చేసి, తలుపుల్ని మూసేశాడు షాడో.

మూడు అడుగులు ముందుకు వేసి శిలావిగ్రహం మాదిరిగా బిగుసుకుపోయాడు.

పగలంతా విపరీతమైన బిజినెస్ జరిగింది కాబోలు, ఆహార పదార్థాల వాసనతో, ఆల్కహాల్ స్మెల్స్‌తో దద్దరిల్లిపోతున్నది హోటల్ లోపలిభాగం.

ఆ వాసనలతో పాటు అతి నెమ్మదిగా ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంటోంది ఇంకో వాసన... తగిలీ తగలనట్లుగా నాసికారంధ్రాలకు సోకుతున్నది.

తను సాబూ సిటీలో అడుగుపెట్టిన వేళావిశేషం ఏమంత బాగోలేనట్లు వెంటనే అనిపించింది షాడోకి.

ఎదుటికి వచ్చినట్టే వచ్చి చూస్తూ చూస్తూ వుండగానే హతమారిపోయాడు తనకు కావాల్సిన మనిషి జాడల్ని తెలియచెప్పగల ఇన్‌ఫార్మర్.

తనెవరో, ఆ సిటీలోకి ఎందుకు వచ్చాడో, ఎవరిద్వారా వచ్చాడో, తమకు బాగా తెలిసినట్లు అతివేగంగా కదిలారు శత్రువులు, ఇన్‌ఫార్మర్‌కి పట్టిన గతినే ఇంటర్‌పోల్ ఏజెంట్‌కి పట్టించారు.

గెరిల్లాలు సిటీలోకి వచ్చారన్న వార్త చెవుల పడగానే హోటల్‌ని క్లోజ్ చేసి వర్కర్స్ అందర్నీ ఇళ్ళకు పంపించేసి నట్లున్నాడు అతను - ఒంటరిగా వెల్లకిలా పడివున్నాడు క్యాష్ కౌంటర్ వెనకాల.

కనుబొమల మధ్య దిగబడింది రివాల్వర్ బుల్లెట్... సన్న సన్నగా బుగ్గలమీదికి జారుతోంది ఎర్రటి రక్తం.

రెండు అంగల్లో అతన్ని సమీపించి మెడను చేతితో తాకి చూశాడు షాడో... పూర్తిగా చల్లబడలేదు శరీరం.

ఆ దారుణం జరిగి ఎంతోసేపు అయినట్లు అగుపించడం లేదు...

కంటికి కనిపించని గెరిల్లాలకోసం సందు గొందుల్ని గాలించేందుకు వెళ్ళిన పోలీసులు, వట్టి చేతులతో వెనక్కి వచ్చి ఇంకోసారి ఆ హోటల్ ముందు మకాం పెట్టకముందే, అక్కడి నుంచి అవతలకి వెళ్ళిపోవటం ఆరోగ్యానికి చాలా మంచిదని అర్థం అవుతూనే వున్నా, ఆ పని మాత్రం చేయలేదు షాడో.

విగతజీవుడైన ఏజెంట్ ప్రక్కనే మోకరించి కూర్చున్నాడు... అతను ధరించి వున్న పొడుగాటి కిమినో వంటి వస్త్రం మీద చేయి వేయబోతుండగా ఝల్లుమన్నది శరీరం.

చలిగాలి వీచినట్లు జలదరించింది. అనుక్షణం ప్రమాదాలతో తలపట్లు పడుతూ, దినదినగండం, నూరేళ్ళ ఆయుష్షు మాదిరి జీవిస్తూ వుండటం వల్ల, సామాన్య మానవులకు ఎవరికీ అలవడని అతీంద్రియ శక్తి ఒకటి అలవడింది అతనికి.

కంటికి కనిపించని ప్రమాదాలను సైతం ముందుగానే కనిపెట్టి వార్నింగ్స్ పంపే సిక్స్‌త్ సెన్స్ అది.

ప్రమాదం ముంచుకు వస్తోందని హెచ్చరిస్తోంది అది ఇప్పుడు...

రెండో ఆలోచన లేకుండా చటుక్కున లేచి నిలబడ్డాడు షాడో. సిక్స్‌త్ సెన్స్ వార్నింగ్స్‌ని పెడ చెవిని పెడితే జరిగేది ఏమిటో బాగా తెలిసివుండటం

వల్ల, క్షణం కూడా ఆలస్యం చేయకుండా, క్యాష్ కౌంటర్‌కి దూరంగా జరిగాడు.

సందుగొందుల్ని గాలించటానికి వెళ్ళిన పోలీసులు తిరిగి వస్తూ వుండటం వల్లనే తనకు ఆ హెచ్చరికలు అందుతున్నాయని భావించాడతను.

ముఖద్వారం దగ్గిరికి పోయి రోడ్డుమీదికి తొంగిచూస్తే, ఆ ప్రమాదం నుంచి తేలిగ్గా తప్పించుకోవచ్చని అనుకుంటూ, అటు కేసి తిరగబోతుండగా కనిపించిందతనికి ఆ పరికరం.

తీపి తినుబండారాలను ప్యాక్ చేసే అట్టపెట్టెలో పెట్టబడి వున్నది. క్యాష్ కౌంటర్‌కి ఒక ప్రక్కగా ఆనించి వున్నది.

పోలీసుల్ని గురించి మరిచిపోయాడు షాడో... వాళ్ళు తనను గమనించి వెంటబడితే తప్పించుకోవడం కష్టం అవుతుందని ఆలోచించలేదు.

నిలుచున్న వాడు నిలుచున్నట్లుగా గాలిలోకి ఎగిరి ముఖ ద్వారం దగ్గిర నేలను తాకాడు. విసురుగా తలుపుల్ని తెరిచి, అమాంతంగా మెట్లమీదికి పల్టీ కొట్టాడు.

చెవులు చిల్లులు పడే శబ్దంతో బ్రద్దలైంది స్వీట్స్‌ని ప్యాక్ చేసే పెట్టెలో నిక్షిప్తపరిచివున్న టైమ్ బాంబ్...

భూకంపం వచ్చినట్లు తీవ్రంగా కంపించింది హోటల్ భవంతి... ముక్కలు ముక్కలై గాలిలోకి ఎగిరాయి లోపలి భాగంలో వున్న పరికరాలన్నీ.

కనులు మిరుమిట్లు గొలుపుతూ ప్రత్యక్షం అయింది ఎర్రటి వెలుగు. సుడులు తిరుగుతూ గాల్లోకి లేచాయి నల్లటి పొగలు, రాక్షసహస్తం ఏదో గట్టిగా పట్టుకుని బలంగా విసిరేసినట్లు గాలిలో తేలుతూ పోయి రోడ్డు మధ్యలో పడ్డాడు షాడో.

తల రోడ్డుకు పోడుచుకునేసరికి కనులముందు ప్రత్యక్షం అయ్యాయి రంగు రంగుల సీతాకోక చిలుకలు. స్పృహ తప్పబోతున్న సెన్సేషన్ వెంటనే వచ్చి అతన్ని ఆవరించుకున్నది.

ఇటాలియన్ సైంటిస్ట్‌ని ఎవరు మాయం చేశారో, ఎందుకు చేశారో షాడోకి తెలియదు. బరీయల్ గ్రౌండ్‌లో నిలబడిన ఇన్ఫార్మర్‌ని, హోటల్ నడుపుకునే ఇంటర్‌పోల్ ఏజెంట్‌ని ఖతం చేసినవారెవరో అంతకన్నా తెలియదు. ఎంతగా ట్రై చేసినా అంతుబట్టని ఆ విషయాలను గురించి తెలుసుకోవటానికి తల పగలకొట్టుకుంటూ, ముక్కూ ముఖం తెలిసినవారెవరూలేని ఆ అపరిచిత పట్టణంలో అటూ ఇటూ పరుగులు తీయటం కంటే, పోలీసులకు పట్టుబడి హాయిగా లాకప్‌లో మకాం పెట్టటమే మంచిదని అనిపించింది ఆ సమయంలో అతనికి.

ఆ మాట మనసులో మెదిలేసరికి, చెంపమీద ఎవరో చాచి పెట్టి కొట్టినట్లు దూరంగా పారిపోయింది అతన్ని ఆవరించుకున్న మగత.

సామాన్యులు కాదు సాబూ సిటీ పోలీసులు. కటిక మొండి శిఖండి జాతికి చెందినవాడినైనా సరే లాటీలతో మక్కెలు విరగ దీసి, తమకు కావాల్సిన ఇన్‌ఫర్మేషన్‌ని సంపాదించటంలో సాటిలేని మేటి వీరులుగా పేరు పొందినటువంటివారు.

ఇంటర్‌పోల్ ఏజెంట్‌కి చెందిన హోటల్ ముందు అడ్డ దిడ్డంగా పడిపోయిన తనను చూసి జాలితో ద్రవించిపోవు వారి హృదయాలు. తన ముఖాన్ని చూసిన మరుక్షణం బరీయల్ గ్రౌండ్ దగ్గర్నుంచి పారిపోయి వచ్చిన మనిషిగా గుర్తుపడతారు.

గుర్తుపట్టిన వెంటనే వ్యాన్‌లో ఎక్కించి స్టేషన్‌కి తీసుకుపోతారు. ఒంటికి శుభ్రంగా నలుగుపెట్టి అప్పటికప్పుడు తలంటి పోసేస్తారు.

సాబూ సిటీ పోలీసు డిపార్ట్‌మెంట్‌ని గురించి, వారి పట్టుదలను గురించి కులకర్ణి గారు చెప్పిన మాటలు ఢంకా దెబ్బల్లా చెవుల్లో మార్మోగుతుండగా, పళ్ళు బిగపట్టి, శరీరంలోని శక్తి నంతా చేతుల్లోకి తెచ్చుకున్నాడు షాడో. వాటిని రోడ్డుకు ఆనించి ఎంతో ప్రయత్నం మీద పైకి లేచాడు.

హోటల్ దగ్గిర సంభవించిన ప్రేలుడు శబ్దం పోలీసుల దృష్టిలోకి వెళ్ళింది.

రాళ్ళు విసిరి తమను రెచ్చగొట్టిన మనిషి కోసం గాలించే కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని వేగంగా వెనక్కి వచ్చేస్తున్నారు వాళ్ళు.

హోటల్ వున్న ప్రదేశానికి వంద అడుగుల దూరంలోని ఒక చీకటి సందు మీద దృష్టిని కేంద్రీకరించి, అటుగా కదిలాడు షాడో.

ఈదురు గాలిలో చిక్కబడిన అజుగాయ్ వృక్షం మాదిరి అటూ ఇటూ తూలుతూ పది అడుగులు ముందుకు వేశాడు.

పోలీస్ వ్యాన్ హోటల్ సమీపంలోకి రాకముందే తను చీకటి సందులోకి పారిపోవాలన్న అతని కోరిక కోరికగానే వుండిపోయింది.

తన గుట్టు రట్టు అవకుండా చీకట్లలో కలిసిపోవాలన్న ఆశయం మట్టిలో కలిసిపోయింది.

పోలీసుల కంటే ముందుగా రోడ్డుమీదికి పరిగెత్తుకు వచ్చారు ప్రేలుడు అదటుకు అదిరిపోయిన అనేకమంది పౌరులు.

అటూ ఇటూ తూలుతూ చీకటి సందుకేసి కదులుతున్న ఆకారాన్ని గమనించేసరికి కట్టలు తెంచుకున్నది వారి ఆగ్రహం.

చీకటి మాటున సిటీలోకి ఎంటరై, చేయకూడని దారుణాలన్నింటినీ వరసబెట్టి చేసేస్తున్న గెరిల్లాల మనిషే అనుకున్నారతన్ని వాళ్ళు.

“పట్టుకోండి... మక్కెలు విరగగొట్టి పోలీసులకు అప్పగించండి... ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయకుండా బుద్ధిచెప్పండి” అని గావు కేకలు పెడుతూ తోడేళ్ళ మందలా అతన్ని చుట్టుముట్టారు.

మక్కెలు విరగగొట్టించుకునే కోరికగాని, బుద్ధి చెప్పించుకునే ఆలోచనగానీ తనకు లేకపోవటంవల్ల శరీరంలో మిగిలివున్న శక్తినంతా కూడదీసుకుంటూ పిడికిళ్ళు బిగించాడు షాడో.

దగ్గర్లోకి వచ్చిన ఇద్దరి ముఖాలు పగిలిపోయేలా రెండు బలమైన దెబ్బలు వేశాడు... వెనక నుంచి వచ్చి భుజాల్ని గట్టిగా పట్టుకోబోయిన ఇంకో ఇద్దరి గుండెలమీద పొడిచి ప్రక్కకు నెట్టేశాడు.

బాధను భరించటం అసాధ్యమై వారందరూ మొదలు పెట్టిన గావుకేకలకు మిగిలిన వారందరూ నిర్విణ్ణులైపోతున్న సమయంలో అదను చూసుకుని, వింటినించి వెలువడిన బాణంలా సూటిగా చీకటిసందులోకి వెళ్ళిపోయాడు.

చురకత్తుల వంటి కోరలు కనిపించేలా నోళ్లను తెరిచి అమాంతంగా తన తొడల్ని పట్టుకోబోయిన రెండు శునకాలను ఫుట్‌బాల్స్ మాదిరి,

సందులో వున్న ఒక మురికి గుంటలోకి విసురుగా తన్ని, అతి వేగంగా అతను ఆ సందు చివరికి పోతుండగా యధార్థమయింది అతని భయం.

కీసర బాసరగా అరుస్తున్న పౌరుల గోలను విని ఊహించలేనంత వేగంతో రియాక్ట్ అయ్యారు హోటల్ దగ్గిరికి వచ్చిన పోలీసులు.

"వాడెవడోగాని, గుండెలు తీసిన బంటు మాదిరి కనిపిస్తున్నాడు... ఆరునూరైనా సరే వాడిని వదిలిపెట్టకూడదు... మీరందరూ గట్టిగా అరిచి ఈ ఏరియాలోని పౌరులు అందర్నీ ఎలర్ట్ చేయండి..." అని అందరికీ సలహా యిస్తూ, తాము కూడా సందులోకి ఎంటర్ అయ్యారు.

రెండో ఆలోచన లేకుండా గొంతులు చించుకుని అరుపులు మొదలుపెట్టారు పౌరులు అందరూ... ఆ చుట్టుపట్ల నివశించే వారందర్నీ ఇళ్ళల్లోనుంచి బయటికి రప్పించేశారు. క్షణాలు గడిచేకొద్దీ తనను ఛేజ్ చేస్తున్న వారి సంఖ్య అధికం అయిపోతూ వుండటాన్ని భుజంమీది నించి గమనించిన షాడోకి, గొంతు ఎండుకుపోయిన సెన్సేషన్ వెంటనే కలిగింది.

అదే సమయంలో అతని ఎదుట ప్రత్యక్షం అయింది ఒక పెద్ద మురికివాడ. తుప్పుపట్టి పొడుము పొడుమై పోవటానికి సిద్ధంగా వున్న రేకులతోనూ, ఎండకు ఎండి ఏ క్షణంలోనైనా పగిలిపోవటానికి రెడీగా వున్నట్లు కనిపించే చవుకబారు చెక్కల తోనూ కట్టబడి వున్నాయి

గుడిసెల వంటి అక్కడి ఇళ్ళు. కాలు పెట్టటానికి వీలుపడదని అనిపించేంతగా కిక్కిరిసి వున్నాయి.

తరుముకు వస్తున్న పౌరుల అరుపులు అక్కడి జనాభా చెవులకు చేరితే, తప్పించుకుని అవతలికి పోవటం ఇంపాజిబుల్ అని గ్రహించి, ఇంకో మార్గాన్ని వెతుక్కోవటానికి ప్రక్కకు తిరిగాడు షాడో.

వెనకనుంచి వినవస్తున్న అరుపులకు మురికివాడలో ఎటువంటి కదలికా కనిపించలేదు... మురికివాడకు ఎడమ ప్రక్కగా వున్న లొకాలిటీలోని ప్రజలు ఇళ్ళల్లోంచి బయటికి వచ్చారు.

"మురికివాడలోకి పోనియ్యకండి వాడిని... కిక్కిరిసివున్న ఆ గుడిసెల మధ్యలో వాడిని పట్టుకోవటం మనకి చేతకాదు..."

అరచి అరిచి జీరపడిన కంఠంతో ఇంకాస్త బిగ్గరగా అరిచాడు షాడోని వెనుక నుంచి తరుముకువస్తున్న వారిలో ఒక మధ్య వయస్కుడు.

మురికివాడ పౌరులు అలర్ట్ అయి, తన దారికి అడ్డువచ్చినా రాకపోయినా, తనకు మిగిలింది ఆ ఒక్కమార్గమే కాబట్టి, నిస్సంకోచంగా ముందుకే పోయాడు షాడో.

ఆయాసం అధికమై, తనకు తగిలిన దెబ్బ తనకళ్ళను ఇంకోసారి బైర్లు కమ్మించబోతున్న సమయంలో, కుడిచేతికి దగ్గిరలో కనిపించిన కోళ్ళగూడు వంటి చిన్న మట్టి అరుగు చాటుకు జంప్ చేశాడు.

“నువ్వు… నువ్వు ఏం చేశావ్? దొంగతనం చేశావా? పోలీసులకు దొరకకుండా పారిపోయి వస్తున్నావా?” వెంటనే అడిగింది అతన్ని ఒక చిన్న కంఠం.

మట్టి అరుగు ప్రక్కనే చేతికి తగిలిన మూరెడు పొడుగు కట్టెపుల్లను చేతిలోకి తీసుకుని, చర్రున అటుకేసి తిరిగాడు షాడో.

ఆఖరి క్షణంలో, తల పగిలిపోయేటంత బలమైన దెబ్బను డెలివర్ చేయబోతున్న లాస్ట్ మూమెంట్‌లో కనిపించింది అతనికి ఆ పిల్ల.

ఎనిమిది సంవత్సరాలకంటే ఒక్కరోజు కూడా ఎక్కువ వుండదు ఆమె వయస్సు. చినిగి చిల్లులు పడిన చిన్న గౌను వేసుకుని, చేతులు ఊడిపోయిన చిన్న ఆట బొమ్మను గుండెలకు అదుముకుంటూ, మట్టి అరుగును ఆనుకుని ఉన్న రేకుల కట్టడంలో నుంచి బయటికి తొంగి చూస్తోంది.

విల్‌పవర్ నంతా కూడగట్టుకొని, ఆమె తల మీదికి పోతున్న కట్టెపుల్లను వెనక్కి తీసేసుకున్నాడు షాడో. ముఖం మీద ప్రత్యక్షం అయిన స్వేదబిందువుల్ని, షర్టు భుజానికి రుద్దుకుంటూ నవ్వాడు.

“ఇక్కడ వుండేవాళ్ళందరూ పచ్చి దొంగలని అనుకుంటూ వుంటారు పోలీసులు. ఒక్క యింటిని కూడా వదిలి పెట్టకుండా గాలింపచేస్తారు నువ్వు తప్పించుకోలేవు… ఇంకెటైనా పారిపో…”

వెంట్రుకవాసిన తనకు తప్పిపోయిన ప్రమాదాన్ని గమనించలేదు కాబోలు, గబ గబా అంటూ ఇంట్లో నుంచి బయటికి వచ్చిందా పిల్ల.

అటువంటి హెచ్చరికల్ని నిర్లక్ష్యం చేసే అలవాటు షాడోకి లేదు... కానీ, కూర్చున్న చోటినించి తిరిగి లేవటానికి కొంచెంగా కూడా సహకరించలేదు అతని అవయవాలు.

పలుగులు పెట్టి పొడుస్తున్నట్లు తీవ్రమైన బాధను కలిగిస్తున్న తలను ఎడమచేత్తో అదుముకుంటూ, గాఢంగా నిట్టూర్చాడు అతను.

"పారిపోలేవా? పరిగెత్తటానికి వీలుకానంత దెబ్బ ఏదయినా తగిలిందా?" అతని ముఖంలో భావాల్ని వెంటనే గమనించింది కాబోలు, తడుముకోకుండా అడిగిందా పిల్ల.

అవునన్నట్లు తల వూపుదామని అనుకున్నాడు షాడో, ఆ కదలికకు తల మీది బాధ మరింత అధికం అవుతుందన్న భయంతో ఆగిపోయాడు.

మురికివాడ మొగదలకు వచ్చేశారు పోలీసులు, తమను క్లోజ్‌గా అనుసరించి వస్తున్న జనాన్ని జట్లు జట్లుగా విడదీసి, మురికివాడను పూర్తిగా కవర్ చేయటానికి రెడీ అయ్యారు.

"ఒక్క గుడిసెను కూడా వదిలిపెట్టకుండా గట్టిగా గాలించండి. ఎవరైనా ఎదురుతిరిగి తల ఎగరేస్తే ముఖం పగలగొట్టేయండి..."

ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేస్తూ, ముందుకు అడుగు వేశాడు ఒక పోలీస్.

షాడో అభిప్రాయాలతో తనకు నిమిత్తం లేనట్లు అతి వేగంగా కదిలింది మట్టి అరుగు దగ్గిర నిలబడి ఆ అరుపుల్ని ఆలకించిన పిల్ల.

వంట చేసుకోవటానికి ఇంధనంగా వాడుకునేటందుకు తన తల్లిదండ్రులు తెచ్చి మట్టి అరుగుమీద పెట్టిన రెండు ఊక బస్తాల్ని ప్రక్కకు దొర్లించి షాడో నెత్తిమీద కుమ్మరించింది.

గుప్పున గాలిలోకి ఎగిసిన ఆ ఊక వాసనకు పెద్దగా తుమ్మబోయి, అతి బలవంతంగా ఆ సెన్సేషన్‌ని అదుముకున్నాడు షాడో.

"నీ ఋణం తీర్చుకోవటం చాలా కష్టం బేబీ... థేంక్యూ వెరీమచ్" తనలో తను అనుకుంటూ తలను మోకాళ్ళకు ఆనించుకుని ముడుచుకుపోయాడు. రెండు నిముషాలు గడవక ముందే మట్టి అరుగు దగ్గిర ప్రత్యక్షం అయ్యారు నలుగురు పోరులు.

గుమ్మంలో నిలబడివున్న పసిబిడ్డను చూసి వంకర మాటలు మాట్లాడుతూ, దురుసుగా కట్టడంలోకి పోవటం తెలిసివచ్చింది షాడోకి.

పగలంతా కాయకష్టం చేసిచేసి విపరీతంగా అలసిపోయి వుండటం వల్ల గాఢ నిద్రలో వున్నారు ఆ పిల్ల తల్లిదండ్రులు.

మురికివాడలో స్టార్ట్ అయిన గందరగోళాన్ని పట్టించుకోలేదు వాళ్ళు. లోపలికి వచ్చిన పౌరులు రఫ్‌గా తమ భుజాల్ని పట్టుకుని కదిలించిన తర్వాత మెలకువ వచ్చి లేచి కూర్చున్నారు.

''మెయిన్ రోడ్డు మీది హోటల్‌ని బాంబులతో పేల్చి పారేసిన రాస్కెల్ ఒకతను మీ మురికివాడలోకి వచ్చాడు. అతన్ని ఎక్కడ దాచిపెట్టారో చెప్పండి...'' తానో పెద్ద పోలీస్ అధికారి మాదిరి ఫీలైపోతూ కరుకుగా ఆడమనిషిని ప్రశ్నించాడు ఒక పౌరుడు.

ఆ సిచ్యుయేషన్స్‌ని గతంలో చాలాసార్లు ఫేస్ చేసి వున్నారు కాబోలు, చేతులు జోడించి వినయాతి వినయంగా సమాధానం యిచ్చాడు మగ మనిషి.

''మీరు వచ్చిన తర్వాతనే మాకు మెలకువ వచ్చింది. మీరంటున్న మనిషిని మేము చూడలేదు... కాళ్ళు జాపు కోవటానికి చోటులేని మా ఇంట్లో మూడో మనిషిని దాచటం ఎలా సాధ్యమౌతుంది?''

గుడిసెంతా కలియచూసి వెనక్కి వచ్చేయాల్సిన ఆ పౌరులు అలా చేయలేదు. ఆ సమాధానంతో తృప్తి చెందలేదు.

''మీకు తెలియకపోతే మీ పిల్లలకు తప్పకుండా తెలిసి వుంటుంది... మేం వచ్చేసరికి గుమ్మంలోనే నిలబడి వున్నది...'' అంటూ ఆ పిల్ల చేతిని చటుక్కున పట్టుకుని లోపలికి లాగాడు ఒక పౌరుడు.

"చెప్పు... ఇటుగా పారిపోయి వచ్చిన రాస్కెల్ ఎక్కడ దాక్కునాడో నిజం చెప్పు" అంటూ చెంప మీద కొట్టాడు రెండో పౌరుడు.

కెవ్వుమన్నదా పిల్ల ఆ బాధను భరించటం చేత కాక. వెచ్చటి ఆవిరి తన కాలిబొటనవేళ్ళ దగ్గర్నించి స్టార్ట్ అయిన అనుభూతి వెంటనే ఆవరించుకున్నది ఊకగుట్ట క్రింద ముడుచుకు కూర్చున్న షాడోని.

అంతలోనే అతన్ని వెన్నుతట్టి హెచ్చరించింది వివేకం. ఒక్క నిముషం ఓపిక పట్టగలిగితే తప్పిపోతుంది ఆ ప్రమాదం... మహా కొడితే ఇంకో రెండు దెబ్బలు కొడతారు ఆ పిల్లని... వట్టి చేతులతో వేసే దెబ్బలు బాధని కలిగిస్తాయేగాని, పర్మినెంట్‌గా డామేజ్‌ని కలిగించవు... తనను దాచిపెట్టి అందుకు ప్రతిగా దెబ్బలు తిన్నందుకు, ఎంతో కొంత ఆ పిల్ల చేతుల్లో పెడితే, చిటికెలో మర్చిపోతుందా పిల్ల ఆ బాధని.

షాడో ఆలోచనలు పూర్తికాకముందే మరింత బాధగా అరిచిందా పిల్ల. ఇంకా ఇంకా దురుసుగా వినవచ్చింది మొదటి పౌరుడి కంఠం.

"వట్టొట్టి దెబ్బలకు ఈ పిల్ల మన దారికి వచ్చేటట్లు కనిపించటం లేదు. తల పగలగొట్టటమో, ఒక చేతిని విరిచేయటమో చేసేయాలి... అప్పుడు పలుకుతుంది. ఆ రాస్కెల్ ఎక్కడ ఉన్నాడో మనకు చెబుతుంది" పళ్ళు కొరుకుతూ అన్నాడతను.

''అన్నెం పున్నెం ఎరుగని మా బిడ్డను అన్యాయం చేయకండి... మీ కాళ్ళు పట్టుకుంటాం. మీకు నమస్కారం చేస్తాం... అయ్యా... బాబూ...'' అంటూ ఆ పోరుడి చేతులు పట్టుకోబోయిన ఆ పిల్ల తండ్రిని విసురుగా అవతలికి నెట్టాడు మూడో పోరుడు.

తూలుకుంటూ వచ్చి సరిగ్గా ఊకగుట్ట దగ్గిర పడ్డాడతను... మోచేతులు నేలకు పొడుచుకునేసరికి బాధగా శబ్దం చేశాడు.

ఆ శబ్దం తమకు మరింత ఉత్సాహాన్ని కలిగించింది కాబోలు, ఆడపిల్ల ఎడమ చేతిని వెనక్కి విరిచిపట్టుకున్నాడు నాలుగో పోరుడు.

గుండెలు జలదరించేటట్లు ఆర్తనాదం చేసిందామె.

ఆ పైన తనను తాను కంట్రోల్ చేసుకోవటం షాడోకి చేతకాకుండా పోయింది. వయసుకి మించిన తెగువ చూపి తనను దాచిపెట్టిందా చిన్నారి... అందుకు ఫలితాన్ని అనుభవించబోతున్నది.

తను అక్కడే దాచబడినట్లు ఖచ్చితంగా తెలియకపోయినా, తమ గొప్పతనాన్ని ప్రదర్శించేటందుకు ప్రయత్నిస్తున్నారు ఆ పోరులు... ఆ పిల్లకు శాశ్వతంగా అవిటితనాన్ని కలిగించబోతున్నారు.

గుడిసెలో జరుగుతున్నది ఏమిటో ప్రత్యక్షంగా చూడకపోయినా, పసిపిల్లల అరుపులోని దారుణమైన భయాన్ని గుర్తించి, కాల్షియం ఇంజక్షన్స్ తీసుకున్నట్లు సలసల మరగటం మొదలుపెట్టింది అతని

శరీరంలోని రక్తం. తనేం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన మైకంలో మునిగి, అమాంతంగా లేచాడు ఊక గుట్టలో నుంచి.

ఒకే ఒక గంతుతో గుడిసెలోకి పోయాడు.

అదిరిపడి ఆ పిల్లను వదిలేశాడు ఆమె చేతిని ఇంకా ఇంకా వెనక్కి వంచబోతున్న పౌరుడు.

పిడికిలి బిగించి అతని గుండెల మీద కొట్టాడు షాడో. ఎడమచేత్తో ఇంకో పౌరుడి మెడను గట్టిగా పట్టుకుని గుడిసె బయటికి విసిరేశాడు.

ఎదురు చూడని ఆ సంఘటనకు బెదిరిపోయి శిలా విగ్రహాల మాదిరి నిలుచుండిపోయారు మిగిలిన ఇద్దరూ. వాళ్ళ తొడలు విరిగిపోయేటట్లు మోకాళ్ళతో రెండు పోట్లు పొడిచి క్రిందికి నెట్టాడు షాడో. ముందుకు వంగి తలల్ని నేలకేసి అదిమేవాడే - అంతలోనే అతని శిరస్సుమీద పడింది బలమైన దెబ్బ.

గుడిసెలన్నిటినీ గాలించటానికి తమతో వచ్చిన జనాన్ని పంపి, తాపీగా, తీరికగా వస్తున్నారు పోలీసులు. అనుకోని విధంగా తమ కంటపడిన దృశ్యాన్ని చూసి, ఊహించలేనంత వేగంతో రియాక్ట్ అయ్యారు. చేతిలోని లాఠీని విసురుగా గాలిలోకి ఎత్తి షాడో తలమీద మోదాడు వారిలో ఒకతను.

హోటల్ ముందు రోడ్డుమీద పడినప్పుడు తగిలిన దెబ్బ తిరిగి రేగటంతో షాడో కనులముందు ఇంకోసారి ప్రత్యక్షం అయ్యాయి టెక్నికలర్ నక్షత్రాలు. తన తొందరపాటు ఎటువంటి కష్టాన్ని తెచ్చిపెట్టిందో సరిగ్గా అర్థం కాకముందే మూతలు పడిపోయాయి కళ్ళు. మధ్యకు మడతబడ్డాయి మోకాళ్ళు.

మొదలు నరికిన వృక్షంలా నిలుచున్నవాడు నిలుచున్నట్లే విరుచుకుపడిపోయాడతను.

* * * * *

"చల్లండి నీళ్ళు... ముఖంమీద జల్లి కనులు తెరిపించండి" ఖంగుమంటున్న కంఠం ఆజ్ఞ ఇవ్వటం తెలిసింది షాడోకి రెండు గంటల తరువాత.

తనెక్కడ వున్నాడో ఊహించటానికి ప్రయత్నిస్తూ కనులు తెరువబోతుండగా, స్పీడ్‌గా వచ్చి అతని ముఖం మీద పడిందొక నీటిధార.

ఊపిరి తీసుకోవటం చేతకాక ఉక్కిరిబిక్కిరి అవుతూ కనులు తెరిచాడతను.

వెంటనే పడింది ముఖం మీద బలమైన దెబ్బ.

"సాబూ సిటీ పోలీసుల్ని ఏమార్చి పారిపోవటం నీకు సాధ్యపడుతుందని అనుకున్నావా? మమ్మల్ని చేతకాని వాళ్ళ క్రింద

జమకట్టి నవ్వులపాలు చేద్దామని ఆశించావా?'' కరకర లాడుతున్న కంఠంతో అడుగుతూ అతని ముఖంలో ముఖం పెట్టి చూసింది ఒక లావుపాటి పర్సనాలిటీ.

తను సాబూ సిటీ పోలీసులకు చిక్కి పోయినట్లు అర్థం అయ్యేసరికి, మంచుకంటే చల్లగా వున్న చేయి ఒకటి గుండెల్ని గట్టిగా అదిమిన సెన్సేషన్ కలిగింది షాడోకి.

దొరక్క దొరక్క దొరికిన గెరిల్లాల మనిషిని ఊరికే వదిలి పెడతారా వాళ్ళు? తమ కక్ష అంతా తీరిపోయేటట్లు నలుగు పెట్టకుండా ఊరుకుంటారా??

షాడో ఆలోచనలు పూర్తికాకముందే ప్రారంభం అయింది అతను ఊహించిన నలుగు కార్యక్రమం. చేతిలోని లాటీని గిర్రున తిప్పుతూ వీరవిహారం చేశాడు లావుపాటి పోలీస్ ఇన్స్పెక్టర్. ''పోలీసులంటే మీకు ఆషామాషీ ఆటగాళ్ళ మాదిరి కనిపిస్తున్నారా? నిముషానికి ఒకసారి పట్టణం మీదపడి మీ ఇష్టం వచ్చినట్లు రెచ్చిపోతూవుంటే మేము చూస్తూ నిలబడి పోవాలా?'' అంటూ భుజాలు విరగగొట్టినంత పని చేశాడు.

పళ్ళు బిగపట్టి ఆ బాధల్ని భరించాడు షాడో... గొంతు చినిగిపోయేటట్లు గావుకేకలు పెట్టాలని ఎంతగా అనిపించినా, ఆ కేకలు ఇన్స్పెక్టర్ కోపాన్ని అధికం చేసేస్తాయన్న అనుమానంతో మౌనంగానే

వుండిపోయాడు. కొట్టికొట్టి చేతులు నొప్పులు పుట్టాయి కాబోలు విశ్రాంతి కోసం ఒక నిముషం వెనక్కి తగ్గాడు ఆ ఇన్స్పెక్టర్.

"వీడు ఎక్కడినించి వచ్చాడో, వీడు పనిచేసే గెరిల్లా దళం పేరేమిటో, ఆ దళానికి నాయకుడు ఎవరో అడగండి..." జేబులోనుంచి సిగరెట్ ప్యాకెట్ని బయటికి తీసి సిగరెట్ వెలిగించుకుంటూ, ఒక కానిస్టేబిల్కి చెప్పాడు.

తన వీరత్వాన్ని ప్రదర్శించే అవకాశం అంత త్వరగా వస్తుందని అనుకోలేదా కానిస్టేబిల్. విపరీతమైన సంతోషంతో ఉప్పొంగిపోతూ ముందుకొచ్చాడు.

"దాహం... దాహం... గొంతు తడుపుకోవటానికి కాసిని మంచినీళ్ళు ఇవ్వండి... దాహం..." అస్పష్టమైన కంఠంతో వెంటనే అతని ఉత్సాహానికి బ్రేక్ వేశాడు షాడో.

"ముఖం మీద పోయండి రెండు గ్లాసుల్ని... తృప్తిగా తాగనివ్వండి" సిగరెట్ పొగను విలాసంగా గాలిలోకి వదులుతూ ఆర్డర్ ఇచ్చాడు ఇన్స్పెక్టర్.

అంతకుముందు తెలివి తెప్పించటం కోసం తీసుకువచ్చిన మంచినీటి కుండలో నుంచి రెండు గ్లాసుల నీటిని షాడోకి అందించాడు కానిస్టేబిల్.

గొంతు ఎండుకుపోయి వున్నప్పుడు ఒకేసారి కడుపు నింపుకుంటే చాలా ప్రమాదమని తెలుసు షాడోకి... తెలిసి కూడా గటగటాతాగేశాడు. సిగరెట్ కాలుస్తున్న ఇన్స్పెక్టర్ వంక కృతజ్ఞతా పూర్వకంగా చూడబోతున్న సమయంలో తన ఇంటరాగేషన్ని మొదలుపెట్టాడు ఆ కానిస్టేబిల్.

"నీ పేరేమిటి? నీ నాయకుడి పేరేమిటి? నీ దళం పేరేమిటి?" అంటూ లాటీని ఎత్తి ఎడాపెడా వేశాడు రెండు దెబ్బల్ని.

తన్నుకుంటూ పైకి వచ్చేశాయి షాడో తాగిన నీళ్ళు అన్నీ... ఫైరింజన్ పైప్లోనుంచి బయటికి దూసుకువచ్చినట్లు వేగంగా కానిస్టేబిల్ దుస్తుల్ని తడిపేశాయి. అదిరిపడి వెనక్కి జంప్ చేశాడా కానిస్టేబిల్. ఆ హడావుడిలో అతనికి తెలియకుండానే జారి కిందపడిపోయింది అతని చేతిలోని లాటీ కర్ర.

ఇంటరాగేషన్ రూమ్లో నుంచి తప్పించుకోవటం ఎవరికీ చేతకాదన్న ధైర్యంతో షాడో కాళ్ళూ చేతుల్ని విరిచి కట్టలేదు వారెవరూ... కనీసం ఆ గది తలుపుల్ని మూసి గొళ్ళెం కూడా పెట్టలేదు.

తనను కూర్చోబెట్టిన కుర్చీలో నుంచి ఒక్క ఉదుటున పైకి లేచి వింటినుంచి వెలువడిన బాణంలా బయటికి పారిపోతే ఎలా వుంటుందోనన్న ఆలోచన షాడో మనసులో అడుగు పెట్టింది. కుర్చీలో

కూర్చోబెట్టి కాళ్ళూ చేతుల్ని విరగకట్టకపోయినా, ఇంటరాగేషన్ గదికి తాళం వేయకపోయినా, తేలికకాదు అక్కడినించి తప్పించుకోవటం.

సిగరెట్ పొగను విలాసంగా సీలింగ్ మీదికి వదులుతూ, ఏమరుపాటుగా నిలబడి వున్నట్టు కనిపిస్తున్నాడు లావుపాటి పోలీస్ ఇన్స్పెక్టర్. నిజానికి అతను చాలా ఎలర్ట్గా వున్నాడు. ఏమాత్రం అనుమానం కలిగినా, వేగంగా బయటికి దూకేందుకు సిద్ధంగా వున్నది అతని బెల్టుకు బిగించివున్న రివాల్వర్.

బరువైన రైఫిల్ని పట్టుకుని ఇంటరాగేషన్ గది ముందు నిలబడి వున్నాడు ఇంకో కానిస్టేబుల్. నిర్మోహమాటంగా కాల్పులు ప్రారంభిస్తాడతను... కుర్చీలో నుంచి లేచిన రెండో క్షణంలో ఒళ్ళు తూట్లు పడగొట్టి ప్రాణాల్ని బలిపుచ్చుకుంటాడు.

కానిస్టేబుల్ చేతిలోనుంచి జారిపడిన లాటీవంక ఒకసారి చూసి గాఢంగా నిట్టూర్చాడు షాడో... గుండె రాయి చేసుకుని తదుపరి కార్యక్రమాన్ని ఫేస్ చేసేందుకు సిద్ధమయ్యాడు. పదిహేను నిముషాల పాటు అడ్డూ అదుపు లేకుండా నిరాటంకంగా సాగిపోయింది తదుపరి కార్యక్రమం.

తమ ఇన్స్పెక్టర్ చూస్తూవుండగా, తననొక చేతకాని వాడి మాదిరిగా చేసినందుకు విపరీతమైన ఆగ్రహంతో రగులుకు పోతూ, చేతులు

మార్చుకుంటూ లాటీని ప్రయోగించాడు ఆ కానిస్టేబుల్. కొట్టిన చోట కొట్టకుండా షాడో ఒంటిని హూనం చేసేశాడు.

రండోళ్ళు మ్రోగటం మొదలుపెట్టాయి షాడో చెవుల్లో... వందకు పైగా వున్న బాంబర్ విమానాలు ఒకే సారి రన్‌వే మీదినించి గాలిలోకి లేచినట్లు దారుణమయిన శబ్దం అతన్ని వివశుడిని చేసేసింది.

కూర్చున్నవాడు కూర్చున్నట్లే ముందుకు తూలాడు... కుర్చీ మీద నిలబెట్టి బియ్యపు బస్తా క్రింద పడిపోయినట్లు దబ్బున శబ్దం చేస్తూ, నేలను కౌగిలించుకున్నాడు.

నోటికి వచ్చిన దారుణమైన మాటలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిపోస్తూ, అతని జుట్టు పట్టుకుని పైకి లేపాడు కానిస్టేబుల్. తొడ ఎముకలు విరిగిపోయేటట్లు బలంగా తన్ని కుర్చీలోకి నెట్టాడు.

"స్పృహ తప్పినట్లు నటిస్తే వదిలేస్తానని అనుకున్నావా? నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పకపోతే విసుగుపుట్టి వెనక్కి వెళ్ళిపోతానని భ్రమపడ్డావా?" అంటూ మరోసారి లాటీని గాలిలోకి ఎత్తబోతుండగా ముందుకు వచ్చాడు లావుపాటి ఇన్స్‌పెక్టర్.

"అడవుల్లో తిరిగి తిరిగి రాటుదేలి వుంటాయి వారి శరీరాలు. మనం కొట్టే దెబ్బలకు బెదిరి తమంతట తాము నోళ్ళు తెరుస్తారని అనుకోవటం

మన తెలివితక్కువ తనమే అవుతుంది'' అని అంటూ ఆ కానిస్టేబుల్‌ని ఆపేశాడు.

''అయితే ఏం చేద్దాం సార్? కొవ్వొత్తుల్ని వెలిగించి అరికాళ్ళ క్రింద పెట్టమంటారా?'' వెంటనే అడిగాడు ఆ పెద్దమనిషి.

చీమలు, జెర్రులు పాకినట్లు జలదరించింది షాడో శరీరం కొవ్వొత్తుల మాటను వినేసరికి. లాటీ దెబ్బలకంటే భయంకరమైన బాధను కలిగించకపోయినా, అవకాశం దొరికినప్పుడు అవతలికి జంప్ చేయటానికి వీలులేకుండా పాదాల్ని గాయపరుస్తాయని...

కానిస్టేబుల్ సూచనకు ఇన్స్‌పెక్టర్ ఉప్పొంగిపోతే డెఫినిట్‌గా ఇబ్బందుల్లో పడిపోతాడు తను.

ఆ ప్రమాదం ఎట్టఎదుటికి రాకముందే నోటికి వచ్చిన కాకమ్మ కథల్ని వారికి వినిపించి, కొవ్వొత్తుల ఆలోచనను వాయిదా వేయించే మార్గాన్ని వెతకటం చాలా మంచిదేమో!

రంగులరాట్నంలో కూర్చున్నట్లు గిర్రున తిరుగుతున్న సెన్సేషన్స్‌ని అదుపులో వుంచుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ తలెత్తిన షాడో ముఖంలోకి సూటిగా చూసి చిన్నగా నవ్వాడు లావుపాటి పోలీస్ ఇన్స్‌పెక్టర్.

"నీకు మాకు వ్యక్తిగతమైన శత్రుత్వం ఏదీ లేదు. నీకు నచ్చిన ఆశయాల్ని ఆచరణలో పెట్టటానికి నువ్వు ప్రయత్నిస్తున్నట్లే, మా కర్తవ్యానికి సంబంధించిన పనుల్ని మేము చేస్తూ వుంటాం... మనలో మనం తగవులు పడటం, తన్నుకోవటం నాకు ఇష్టం లేదు... మేము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేస్తే నీ ఒంటిమీద చేయి వేయటం జరగదు..." షాడో భుజం మీద చేయివేసి మృదువుగా అదుముతూ అనునయంగా అన్నాడు.

తను నిజంగానే గెరిల్లాలకు సంబంధించిన మనిషే అయివుంటే ఆ ఇన్స్పెక్టర్ అన్న మాటలకు ఎలా ప్రతిస్పందించి వుండేవాడో ఊహించటానికి ప్రయత్నిస్తూ, ఎండుకుపోయిన పెదవుల్ని నాలుకతో తడిచేసుకున్నాడు షాడో.

"మీకు ఏం కావాలో అడగండి... నేను... నేను..." అంటూ అంతకుముందు అనుకున్నట్లు నోటికి వచ్చిన కథల్ని వినిపించటానికి రెడీ అయ్యాడు.

పట్టరాని కోపంతో పళ్ళు కొరుకుతూ లాటీని ఎత్తి వీరంగం వేసినా కనిపించని రిజల్ట్ తన సాఫ్ట్ ఎప్రోచ్‌వలన అగుపించే సరికి అమితంగా సంతోషించాడు ఆ ఇన్స్పెక్టర్.

‘‘మంచి నీళ్ళు ఇస్తే మళ్ళీ మనల్ని ఇబ్బందికి గురిచేస్తాడు... వేడి వేడి టీని తీసుకురండి...’’ అంటూ అప్పటికప్పుడు తన టేబిల్ మీద వున్న ఫ్లాస్కులో నుంచి టీని తెప్పించాడు.

తన సిగరెట్ ప్యాకెట్‌లో నుంచి సిగరెట్‌ని తీసి చేతికి అందించాడు.

వేడి టీని తాగేసరికి తన ఒంటి మీది దెబ్బలన్నీ మటు మాయం అయిపోయినంత హాయి షాడోని ఆవరించుకున్నది.

సిగరెట్ పొగను గుండెలనిండా పీల్చుకునేసరికి, తన చుట్టూ వున్న ప్రపంచం అంతా సుందరంగా అగుపించటం మొదలు పెట్టింది.

ఇన్స్‌పెక్టర్ నోటిలోనుంచి ఒక్క మాట కూడా బయటికి రాకముందే ఎవరో తరుముతున్నట్లు టకటకా చెప్పేశాడతను తన వివరాల్ని.

‘‘తూర్పు దిశలోని చెంగాయ్ గుట్ట వెనకాల వుండే స్థావరానికి చెందినవాడిని నేను, మా నాయకుడు అకీర్యూంగ్. నాలుగు రోజుల క్రితం ఒక అగ్ని ప్రమాదం వల్ల మా దళానికి చెందిన ఆయుధాలన్నీ సర్వనాశనం అయిపోయాయి.

ఈ రోజు చీకటిపడిన తర్వాత బరీయల్ గ్రౌండ్ దగ్గిరికి వస్తే మరికొన్ని ఆయుధాలు దొరికే ఉపాయం చెపుతానన్నాడు ఒక పెద్దమనిషి.

ఆ మాటల్ని నమ్మి వచ్చేసరికి అంతా మోసమని తేలింది... కోపాన్ని అణుచుకోవటం చేతకాక హతమార్చేశాను... పారిపోవాలని అనుకుంటుండగా మీరు వచ్చేశారు...'' అంటూ ముగించాడు.

చైనీయులు, జపనీయులు ఇంకా అనేక రకాల జాతులకు చెందినవారు నివసించే ఆ దేశంలో తను ఉపయోగించిన పేరు ఇన్స్పెక్టర్ సాబ్‌కి అనుమానం కలిగించదనే ఆశించాడు అతను.

కలిగించకూడదని కంటికి కనిపించని దేవతలనందర్నీ ప్రార్థిస్తూ ఊపిరి బిగపట్టాడు.

దేవతలు కరుణించారో లేక అతను గడగడా చెప్పిన పద్ధతిని గమనించి అనుమానించటం అనవసరమని భావించాడో గాని మొత్తానికి లాఠీని ఎత్తి అతని భుజాల్ని ఇంకోసారి విరగగొట్టే ప్రయత్నం చేయలేదు ఆ ఇన్స్పెక్టర్.

''బరీయల్ గ్రౌండ్ దగ్గర్నుంచి మమ్మల్ని ఏమార్చి పారిపోయినవాడివి సరాసరి నీ స్థావరానికి వెళ్ళిపోకుండా ఆ హోటల్ దగ్గిరికి ఎందుకు పోయావ్? దాన్ని నేల మట్టం ఎందుకు చేశావ్?'' క్షణం కూడా ఆలస్యం చేయకుండా సూటిగా అడిగేశాడు.

ఎంతో అనుభవం వుండి కూడా ఆ విషయాన్ని తెలుసుకోలేకపోయినందుకు ఆశ్చర్యపడుతున్నట్లు ముఖం పెట్టాడు షాడో.

"ఆయుధాల వ్యవహారంలో మాకు మధ్యవర్తి ఆ హోటల్ యజమాని... అతని ప్రోద్బలం లేకుండా బరీయల్ గ్రౌండ్‌లోకి వచ్చిన మనిషి మమ్మల్ని మోసం చేయగలడా? మమ్మల్ని మోసం చేయటానికి ప్రయత్నించిన వారందరికీ ఎటువంటి గతి పడుతుందో తెలియచెప్పటం కోసం హోటల్‌ని పేల్చివేశాను..." తడుముకోకుండా మరో బిట్‌ని తన కట్టుకథకి అతికించాడు.

చివరికంటా కాలి, తనంతట తను ఆరిపోయిన సిగిరెట్‌ని కిందికి వదిలి, ఇంకో సిగరెట్ వెలిగించుకుంటూ సాలోచనగా తల ఊపాడు ఇన్స్‌పెక్టర్. అతన్ని అంత తేలికగా కన్విన్స్ చేయగలిగిన తన తెలివితేటల్ని తనకు తనే మెచ్చుకున్నాడు షాడో.

ఆ రోజుకు ఇంటరాగేషన్‌ని ఆపేస్తాడతను... తను చెప్పిన విషయాలు యదార్థమో కాదో తెలుసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తాడు.

తగిలిన దెబ్బల్నించి తేరుకొని, స్టేషన్‌లోనుంచి అవతలికి జంప్ చేసే ఆలోచనలు ప్రారంభిచటానికి కావలసినంత వ్యవధి తనకు లభిస్తుంది.

షాడో ఆలోచనలు పూర్తి కాకముందే ఖంగుమంటూ వినవచ్చింది ఇన్స్‌పెక్టర్ కంఠం.

"నీకు ఖచ్చితంగా ఇంకో నాలుగు గంటలు వ్యవధి ఇస్తున్నాను..." అంటూ.

"ఎందుకు?" అతనివైపు అయోమయంగా చూస్తూ అడిగాడు షాడో.

"ఇప్పుడు నువ్వు నాకు వినిపించిన కథలో ఏవైనా మార్పులు చేర్పులు చేయదలుచుకుంటే ఈ నాలుగు గంటల్లో చేసేసెయ్. నాలుగు గంటలు గడిచిన మరుక్షణం అందుకు అవకాశం నీకు లభించదు..." అంటూ వెనుతిరిగి ఇంటరాగేషన్ గది బయట కానిస్టేబిల్‌కి సైగ చేశాడు.

ఆశ్చర్యంగా చూస్తున్న షాడోకి అగుపించారు రెండు నిముషాల తరువాత, మురికివాడలో అతనికి అగుపించిన భార్యాభర్తలు ఇద్దరూ.

కన్నీటి చారికలతో మలినమైన ముఖాన్ని గౌను అంచుతో తుడుచుకుంటూ వారి వెనుకగా వచ్చిన వారి కూతుర్ని కూడా చూసేసరికి చెమటలు పట్టేశాయి అతని అరిచేతులు.

"పిచ్చి పిచ్చి వేషాలు వేసి, నోటికి వచ్చిన కట్టుకథల్ని మాకు వినిపించకుండా, ముందు జాగ్రత్తకోసం వీళ్ళని స్టేషన్‌కి తీసుకువచ్చాము... పేద ప్రజలకు అండగా నిలవటం, అభాగ్యులకు, అనాథలకు సహాయపడటం మీ గెరిల్లాల పాలసీ... నువ్వు చెప్పిన మాటలు అసత్యాలని తెలిసిన మరుక్షణం నీ ఒంటిమీద పడవలసిన దెబ్బలు వీరి

ఒంటిమీద పడతాయి... బాగా గుర్తు పెట్టుకో...'' అంటూ చటుక్కున ఆ గది బయటికి వెళ్లి పోయాడు ఇన్స్పెక్టర్.

ఒకరి తర్వాత ఒకరుగా అతన్ని అనుసరించిన కానిస్టేబిల్స్ని చూస్తూ, నీరసంగా కుర్చీ వెనక్కి వాలిపోయాడు షాడో.

''నీకు... నీకు మేము ఏమి అపకారం చేశామని మాకు ఈ దుస్థితిని పట్టించావ్?'' గబగబా ముందుకు వచ్చి విసురుగా ప్రశ్నించిన తన భార్య చేతిని పట్టుకుని బలవంతంగా వెనక్కిలాగాడు మురికివాడకు చెందిన ఆ పౌరుడు.

''పోలీసులు కొట్టిన దెబ్బలకు అతని తల గిర్రున తిరుగుతూ వుండివుంటుంది. నువ్వు ఏమైనా మాట్లాడదలుచుకుంటే కాస్సేపు ఆగిన తర్వాత మాట్లాడు...'' అంటూ మందలించాడు.

ముక్కును గట్టిగా ఎగబీలుస్తూ నేలను బలంగా తన్ని అవతలి వైపుకు తిరిగిన ఆ ఆడమనిషి వంకా, బిక్కముఖంతో ఒక గోడ దగ్గర నిలబడ్డ వారి చిన్నారి వంకా నిస్సహాయంగా చూశాడు షాడో.

ఆశ్రయం ఇచ్చిన వారికి ఏదో అన్యాయం జరిగిపోతున్నదన్న తొందరలో, ముందు వెనుకలు ఆలోచించుకోకపోవటం వల్ల కలిగిన ఇబ్బంది అది.

తను చెప్పిన కథలో అసత్యాలు వున్నాయని తెలిసిన మరుక్షణం తన మీది కక్షనంతా వారిమీద చూపించి తీరుతాడు ఆ ఇన్స్‌పెక్టర్.

అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయకుల్ని అతని బారినుంచి కాపాడటం చేతనవుతుందా తనకి?

అంతకుముందు కానిస్టేబిల్ కొట్టిన దెబ్బలకు చెవుల దగ్గిర స్టార్ట్ అయిన వికృత శాబ్దాలు, బాంబర్ విమానాల మ్రోతలు మరోసారి మొదలయిన ఫీలింగ్ వెంటనే ఆవరించుకున్నది షాడోని.

పైకి లేవటానికి నిరాకరిస్తున్న చేతుల్ని బలవంతంగా పైకెత్తి చెవుల్ని అదుముకుంటూండగా తెలిసివచ్చింది అతనికి ఒక విషయం.

కానిస్టేబిల్ తనపై వీరంగం ఆడుతూ కొట్టిన దెబ్బలకు స్టార్ట్ అయిన శబ్దాలు కావు అవి... స్టేషన్‌కి ఆనుకుని వున్న మెయిన్ రోడ్డు మీదినుంచి నిజంగానే వినవస్తున్న కొన్ని తప్పెట్ల మ్రోతలు.

నిరాశ నిస్పృహలు నిండిన ముఖాలతో శిలావిగ్రహాల మాదిరి నిలబడిన మురికివాడ దంపతుల్లో వచ్చిన చలనం వెంటనే ఆకర్షించింది అతని దృష్టిని.

"ఏమిటా శబ్దాలు? ఎక్కడినించి వస్తున్నాయి?" తనతో మాట్లాడటానికి వాళ్ళు అంగీకరించకపోతే ఏం చేయాలో ఆలోచిస్తూ, వెంటనే అడిగాడు.

అతను ఊహించినట్లే విసురుగా తల తిప్పుకున్నది ఆడమనిషి.

పెదవులు బిగించి చూపుల్ని మరలించుకున్నాడు ఆమె భర్త. కక్షలకు, కార్పణ్యాలకు అతీతమైన వయస్సు కావటం వల్ల వారి మాదిరిగా అసహ్యించుకోలేకపోయింది వారి కూతురు.

"బుద్ధ జయంతి వచ్చేసింది... బుద్ధుడి విగ్రహాన్ని స్నానం చేయించటానికి తీసుకుపోతున్నారు..." తనకు తెలిసిన విషయాన్ని చెప్పి, తన తల్లి ఒక్కసారిగా ఉరిమి చూడటంతో తల వంచుకున్నది.

మెయిన్ రోడ్డును ఆనుకుని వున్న గోడ పై భాగంలో అమర్చి వున్నది ఒక వెంటిలేటర్.

అందులోనుంచి షాడోకి కనిపించింది కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు...

వెలుగు మాయం అయిన మరుక్షణం వినవచ్చింది ఆటం బాంబులు బ్రద్దలయినట్లు పెద్దమ్రోత.

సాబూ సిటీ జనాభాలో సగంమందికి పైగా బౌద్ధమతావలంబీకులు అయివుండటంవల్ల జరుపబడతాయి ఆ మతానికి సంబంధించిన పండుగలు.

బాజాలు, భజంత్రీలు, గుండెల్ని జలదరింపచేసే తప్పెట్లు చాలవన్నట్లు ఔట్లను, ఆకాశంలోకి వెళ్ళి దారుణమైన శబ్దంతో బ్రద్దలయ్యే తారాజువ్వల్ని ఉపయోగిస్తున్నారు బుద్ధ విగ్రహాన్ని ఊరేగింపుకు తీసుకువస్తున్న జనం.

ఆ హడావుడిని వీక్షించటానికి స్టేషన్‌లో వున్న కానిస్టేబిల్స్ అందరూ రోడ్డుమీదికి పోయి నిలబడతారన్న మాట మనసులో మెదిలేసరికి, ఆ సమయంలో ఎంతో బాధకు గురి అయింది షాడో అంతరంగం.

అటువంటి డైవర్షన్ ఒకటి అతి దగ్గర్లోనే వున్నదని తెలిసి వుంటే అందుకు సిద్ధంగా వుండి వుండేవాడు తను...

ఏదో ఒక మెలికపెట్టి ఆ అవకాశాన్ని ఉపయోగించుకోవటానికి ప్రయత్నించి వుండేవాడు...

'ఇప్పుడు మాత్రం ఏమయింది షాడో? ఊరేగింపు ఇంకా స్టేషన్ దాటి అవతలకి పోలేదుగాదా'

ఉన్నట్టుండి తన అంతరాత్మ వికృత కంఠంతో హెచ్చరించేసరికి, నిద్రలోనుంచి అప్పుడే లేచిన వాడిలా ఉలిక్కిపడి తల విదిలించాడతను.

నిజమే... ఇప్పుడు మాత్రం ఏమయిందని? ఈ అవకాశాన్ని ఇప్పుడు ఉపయోగించుకోవటానికి అభ్యంతరం ఏముందిట??

తన చర్యలు మురికివాడ దంపతులకు విచిత్రంగా కన్పించి, వాళ్ళు మరింతగా బెదిరిపోయే అవకాశం ఉన్నదని తెలిసికూడా వెనుకంజ వేయలేదు.

"ఎందుకు? ఏమిటి? అనే అనవసరమైన ప్రశ్నలు వేయకుండా, ద్వారానికి అడ్డుగా నిలుచోండి... కమాన్ క్విక్!" అంటూ తన దుస్తుల్ని తడుముకున్నాడు షాడో.

పట్టుబడిన మరుక్షణం ప్యాంటు జేబుల్ని ఖాళీ చేసేశారు పోలీసులు. అగ్గిపెట్టె సిగరెట్ ప్యాకెట్‌తోపాటు, కరెన్సీ నోట్ల పొత్తికలతో నిండివున్న వాలెట్ కూడా వారి చేతుల్లోకి వెళ్లి పోయింది. చీకటి సమయం కావటం వల్ల కుడికాలి బూటుకు అడ్డంగా బిగించి ఉన్న డాగర్ మాత్రం తప్పించుకోగలిగింది వారి సునిశిత దృష్టినుంచి.

కోట గోడల మధ్య వుండే నేలమాళిగ వంటి ఆ ఇంటరాగేషన్ గదిలో నుంచి బయటపడటానికి ఆ చిన్న ఆయుధం ఎందుకూ పనికిరాదని షాడోకి తెలుసు. కనీసం అదైనా మిగిలి వున్నందుకు ఎంతగానో సంతోషిస్తూ కుడికాలి బూటును వూడదీశాడు. పలుచని ఇనుపరేకు తాపడం చేసివున్న దాని మడుమను గట్టిగా పట్టుకుని అడ్డంగా తిప్పాడు.

వెంటనే కదిలింది అది... లావుపాటి సీసాకు బిగించబడిన మూతలా వూడి చేతిలోకి వచ్చింది.

దాని మధ్య భాగంలో వున్న ఖాళీ ప్రదేశంలో నుంచి దోర్లి షాడో చేతిలో పడ్డాయి గాజు గోలీల మాదిరిగా వున్న రెండు మెటల్ బాల్స్.

కనపడీ కనపడనట్లు వాటిమీద అమర్చివున్న చిన్న చిన్న బుడిపెల్ని నొక్కితే దారుణమైన ఆయుధాలుగా మార్పు చెందే వస్తువులు అవి.

కంటికి కనిపించని పాయిజన్ గ్యాస్‌ని వెలువరుస్తుంది ఒక మెటల్ బాల్... ఆ గ్యాస్‌ని పీల్చిన వారందరి ప్రాణాలను క్షణాలమీద బలిపుచ్చుకుంటుంది.

కనులు మిరుమిట్లు గొలిపే వెలుగును, చెవులు చిల్లులు పడే శబ్దాన్ని, గుండెలు జలదరించే ప్రేలుడును సృష్టిస్తుంది రెండో గోలీ... లావుపాటి బండల్ని సైతం ముక్కలు చేసేస్తుంది.

గది తలుపుల దగ్గిర నిలబడి వింతగా చూస్తున్న మురికివాడ దంపతుల వంక ఒకసారి చూసి, ఆ గోలీని ఎడమచేతిలోకి మార్చుకున్నాడు షాడో. రెండో గోలీతో పాటు బూటు మడమను యథాస్థానంలోకి చేర్చుతూ, వెంటిలేటర్ క్రిందికి జరిగాడు.

"ఏం చేస్తున్నావ్? ఇప్పుడేం చేయబోతున్నావ్?" ఆందోళనగా అడుగుతూ రెండు అడుగులు ముందుకు వేశాడు మురికివాడ పౌరుడు.

ఆలస్యం చేస్తే అతని ఆందోళన ఇంటరాగేషన్ గదికి కాపలా కాసే సెంట్రీకి అర్థం అవుతుందని గ్రహించి, మెటల్ బాల్ మీది బుడిపెను బలంగా ప్రెస్ చేశాడు షాడో... బాస్కెట్ బాల్ ప్లేయర్ మాదిరి మోకాళ్లను ప్లయిట్‌గా ముందుకు వంగి, సుతారంగా దాన్ని వెంటిలేటర్ కేసి విసిరాడు.

పిచ్చుక మాదిరి గాలిలోకి లేచి గుండ్రంగా తిరుగుతూ వెంటిలేటర్ కి అడ్డంగా బిగించివున్న ఇనుప పూచల మధ్యలో నుంచి బయటికి వెళ్ళిపోయింది అది.

"ఏమిటది? ఏమిటి నువ్వు విసిరింది?" మరింత ఖంగారుగా అడుగుతూ ఇంకో రెండు అడుగులు ముందుకు వేశాడు మురుకివాడ పౌరుడు.

వెంటిలేటర్‌ని అధిగమించి అవతలి ప్రక్కన పడిన మెటల్ బాల్ బ్రద్దలైన మరుక్షణం, ఇంటరాగేషన్ గది గోడ తునాతునకలైపోతుంది...

రివ్వురివ్వున గాలిలోకి లేస్తాయి గోడ అవశేషాలు... ఎవరు గోడకు దగ్గర్లో వుంటే వారి ముక్కుముఖాల్ని ఏకం చేసేస్తాయి.

"వెనక్కి పో యూ బ్లడీ ఇడియట్... ద్వారం దగ్గిరికి వెళ్ళిపో..." పళ్ళు బిగించి క్రూరంగా చూస్తూ మురికివాడ పౌరుడిని హెచ్చరించాడు షాడో.

ఖంగారుపడి వెనక్కి జంప్ చేయాలా పెద్దమనిషి షాడో అంచనా ప్రకారం. రక్తం లేనట్లు పాలిపోయిన ముఖంతో తలుపుల దగ్గిర నిలబడి బ్లాంక్‌గా చూడాలి. అటువంటి పనులేవీ చేయలేదు సరిగదా - గొంతు చించుకుని గావురు గావురున అరిచాడతను.

"పారిపోతున్నాడు ఈ వ్యక్తి... ఈ గదిలో నుంచి పారిపోయే ప్రయత్నం ఏదో చేస్తున్నాడు" అంటూ గది తలుపుల్ని దబదబ మోగించాడు.

వెంటనే... అతని చేతులు తలుపుల్ని తాకిన వెంటనే బార్లా తెరుచుకున్నాయి అవి. బరువైన రైఫిల్‌ని రెడీగా పట్టుకుని లోపలికి తొంగి చూశాడు అక్కడ సెంట్రీ.

"పట్టుకోండి అతన్ని... వెంటనే పట్టుకోండి" మరింత పెద్ద గొంతుకతో ఇంకా బిగ్గిరిగా అరిచాడు మురికివాడ పౌరుడు.

విషయం ఏమిటో అర్థం కాకపోయినా, వెంటనే లోపలికి వచ్చాడు సెంట్రీ.

"చేతుల్ని గాలిలోకి ఎత్తు, తల వంచుకుని గోడ దగ్గిరికి నడువ్" రైఫిల్ బారెల్ని షాడో గుండెలకేసి గురిపెడుతూ కరుకుగా హెచ్చరించాడతను.

మురికివాడ పౌరుడి జుట్టు పట్టుకుని బలంగా ముందుకు లాగాలనీ, గోడకేసి విసిరి అతని తల బద్దలు కొట్టాలనీ అనుకుంటున్నాడు షాడో. అతని కాళ్ళూ చేతుల్నీ విరిచేసేటంతటి కోపంతో రగులుకు పోతున్నాడు.

"చేతుల్ని గాలిలోకి ఎత్తమంటుంటే వినబడటంలేదా? చెవుడేమైనా వచ్చిందా?" మరింత క్రూరంగా అడుగుతూ, చటుక్కున రైఫిల్‌ని రివర్స్ చేసి, షాడో భుజాల మీద మోదాడు సెంట్రీ.

అంతకు ముందు తగిలిన దెబ్బలమీదనే ఆ దెబ్బ కూడా పడటంతో కళ్ళు బైర్లు కమ్మినంత పని అయింది షాడోకి... ఎంత ప్రయత్నించినా వీలుపడక తుపాను గాలిలో చిక్కుపడిన వృక్షం మాదిరి అటూ ఇటూ ఊగిపోయాడు. గోడను కొట్టుకుని క్రిందికి జారబోతుండగా - బద్ధలైంది వెంటిలేటర్లోనుంచి అవతలి పక్కకు పడిన మెటల్ గోలీ.

పట్టపగలుగా మారిపోయింది సరయిన లైటులేక పోవడం వల్ల మసక చీకటితో నిండివున్న ఇంటరాగేషన్ గది - ఒక క్షణం పాటు.

దారుణమైన ఆ వెలుగుతో పాటు వెంటనే వినవచ్చింది గుండెలు అదిరే శబ్దం.

రోడ్డు రోలర్ ఏదో వచ్చి గుద్దుకున్నట్లు తీవ్రంగా కంపించింది రోడ్డుకు ఆనుకుని వున్న గోడ... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో మధ్యకు విరిగి లోపలి ప్రక్కకు పడిపోయింది. సరిగ్గా అప్పుడే స్టేషన్ ముందుకు

వస్తోంది వూరేగింపు... అనుకోని విధంగా అగుపించిన ఆ దృశ్యాన్ని చూసి బెదిరిపోయారు అందులో పాల్గొంటున్న పౌరులు.

రెండు నిలువుల ఎత్తున్న బుద్ధ విగ్రహాన్ని పల్లకి వంటి వాహనం మీద పెట్టి భక్తి పారవశ్యంలో తలమునకలవుతూ మోసుకువస్తున్నారు పాతికమంది.

క్రింద పడేస్తే అందమైన ఆ విగ్రహం సర్వనాశనం అయిపోతుందని కూడా ఆలోచించకుండా ఒక్కసారిగా వదిలేసి, కేకలు పెడుతూ మిగిలిన వారందరితో పాటు పిక్కబలం చూపించారు.

"గెరిల్లాలు... గెరిల్లాలు వచ్చేశారు... పోలీస్ స్టేషన్‌ని బాంబులతో నేలమట్టం చేసేస్తున్నారు..." అంటూ కేకలు పెట్టారు దూరంలో ఉన్న కొందరు.

ఇంటరాగేషన్ గదిలోకి దూర్లిన ఇటుకరాళ్ళను గమనించి ఆశ్చర్యంతో శిలా విగ్రహంలా బిగుసుకుపోతున్న సెంట్రీ గుండెలకేసి గురిపెట్టి తన కుడిపాదాన్ని విసిరాడు షాడో. కెవ్వున అరవబోయాడతను. అరుపు పెదాల్ని దాటకముందే విసురుగా పోయి గది తలుపుల దగ్గిర పడ్డాడు.

చేతుల్లోనుంచి జారి దూరంగా పడిపోయింది రైఫిల్. తల నేలకు పొడుచుకుని శబ్దం చేసింది.

‘‘ఇక్కడి నుండి పారిపోయి ప్రాణాలు దక్కించుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం మరొకటి మనకు లభించదు... నాతో రండి... త్వరగా’’ అంటూ ఇటుకరాయి మీదినుంచి అవతలికి జంప్ చేయబోతున్న షాడోని అనుసరించలేదు - గది ద్వారం దగ్గిర వున్న మురికివాడ దంపతులు.

కాకలు తీరిన దొంగ ఎవరో తమ ఇంటికి కన్నం వేసినట్లుగా గొంతులు చించుకుంటూ గది బయటకు పరుగెత్తారు. స్టేషన్‌లో వున్న పోలీసులందరూ ఏ క్షణంలోనైనా అక్కడికి వచ్చేస్తారన్న అనుమానంతో వారిని ఆపే ప్రయత్నం గానీ, వారికి నచ్చ చెప్పే ఆలోచనగానీ చేయలేదు షాడో.

మెరుపుకంటే వేగంగా కదిలి, వారి బిడ్డను భుజంమీద వేసుకున్నాడు.

‘‘నా దారికి ఎవరైనా అడ్డు వచ్చినా, నన్ను పట్టుకోవడానికి ప్రయత్నించినా, ఈ పిల్ల ప్రాణాలు తీసేస్తాను... గొంతు నులిమి రోడ్డు ప్రక్కన విసిరి పారేస్తాను’’ అటువంటి పనులు చేయటం తనకు వెన్నతో పెట్టిన విద్య అన్నట్లు భయంకరంగా హెచ్చరిస్తూ, అక్కడినుండి రోడ్డుమీదికి పరిగెత్తాడు.

స్టేషన్లో వున్న వారందర్నీ హెచ్చరించే ఆలోచన విరమించుకున్నారు మురికివాడ దంపతులు.

"మా బిడ్డను కాపాడండి... మా బిడ్డను ఎత్తుకు పోతున్న ఆ రాక్షసుడ్ని పట్టుకోండి" అని గగ్గోలుగా అరుస్తూ, అతని వెనుకే రోడ్డుమీదికి వచ్చారు - పగిలిపోయిన గోడలోనుంచి.

ఆ సరికి పూర్తిగా ఎలర్ట్ అయిపోయారు వూరేగింపును గమనించటం కోసం స్టేషన్ ముందు గుమిగూడిన పోలీసులు.

"ఆగు... అక్కడే ఆగు... అడుగు ముందుకు వేశావంటే హతమారిపోతావ్. ఆగు" ఖంగు ఖంగు మంటున్న కంఠంతో కమాండ్ చేస్తూ, తన రివాల్వర్‌ని బయటికి తీశాడు ఇన్స్‌పెక్టర్.

పోలీస్ స్టేషన్ మీద దాడి చేయటానికి గెరిల్లాలు వచ్చి పడ్డారనే అనుకుంటున్నారు వూరేగింపు జనం.

ఇన్స్‌పెక్టర్ అరుపులు రెట్టింపు చేశాయి వారి భయాన్ని. ఎవరి ప్రాణాల్ని వారు కాపాడుకోవాలన్న తపనతో రోడ్డుకు అడ్డుపడి అటూఇటూ పరుగులు తీయటం మొదలుపెట్టారు.

సేవ్ అయ్యాడు షాడో...

గుడ్డిగా కాల్పులు మొదలుపెడితే అమాయకులు ఆహుతి అయిపోతారన్న భయంతో, పైకి ఎత్తిన రివాల్వర్‌ని క్రిందికి దించేసిన ఇన్స్‌పెక్టర్‌ని భుజం మీది నుంచి గమనించుకుంటూ, అర నిముషంలో ఒక ఫర్లాంగు దూరం పారిపోయాడు.

కుడికాలి బూటు అడుగు భాగంలో దాచబడివున్న మెటల్ బాల్‌ని తీసి వెంటిలేటర్లోంచి రోడ్డుమీదికి విసిరిన క్షణంనుంచీ ఖచ్చితంగా ఎనభై రెండు సెకన్లలో జరిగిపోతుంది అంతా...

* * * * *

రెచ్చిపోయి వీధుల్లోకి వచ్చేశారు సాబూ సిటీలో వున్న పోలీసులందరూ.

ఆర్డనరీ కానిస్టేబిల్స్ మాదిరి ఆయుధాల్ని రెడీగా పట్టుకుని కాలినడకన వీధుల్ని గాలించటం మొదలుపెట్టారు అధికారులు.

''తూర్పు దిక్కు తెల్లబడేలోగా వాడిని, వాడు అపహరించుకుపోయిన ఆ పసిబిడ్డను మనం పట్టుకోవాలి... ఆరు నూరైనా సరే అతను మన చేతులకు చిక్కితీరాలి.'' టాప్ లేని జీప్‌లో నిలబడి, అత్యంత ఆధునికమైన హ్యాండ్ మైక్‌లో హెచ్చరిస్తూ ఆ గాలింపు కార్యక్రమాన్ని పరివేక్షించటం మొదలుపెట్టాడు కమీషనర్ హోదా కలిగిన ఆఫీసర్.

గుండె దిటవు కలిగిన పౌరుల్ని పోగుచేసి సెర్చి పార్టీలను ఏర్పాటు చేశారు పోలీసులు.

టార్చిలైటు సరఫరా కావించి సిటీనంతా జల్లెడలేయటం మొదలుపెట్టారు.

బరీయల్ గ్రౌండ్ దగ్గిరికి పోకముందు తను మకాం పెట్టిన కాకా హోటల్ దగ్గిర చీకటి సందులో నిలబడి ఆ సంరంభాన్నంతా గమనించాడు షాడో.

"నీకు పుణ్యం వుంటుంది... నన్ను మా అమ్మా నాన్నల దగ్గిరికి పోనీయ్... నన్ను వదిలేయ్..." అంటూ బ్రతిమాలుతోంది అతని భుజం మీది బిడ్డ.

అదను చూసుకుని ఆమె కాస్త గట్టిగా అరిస్తే, రోడ్డుమీది జనానికీ, వారిని లీడ్ చేస్తున్న పోలీసులకు వినబడుతుందని తెలుసు షాడోకి.

అవసరం అయితే ఆ పిల్ల నోటిని అదమటానికి చేతిని సిద్ధంగానే వుంచుకుంటూ, వెనక్కి జరిగి, చీకటి సందు రెండో ప్రక్కకు పోయాడు.

అవతల వున్న మెయిన్ రోడ్డుమీద అతనికి అగుపించింది ఇంకో సెర్చి పార్టీ...

టార్చిలైట్లతో పాటు కర్రల్నీ, కత్తుల్నీ పట్టుకున్న జనాన్ని చూసి తనలో తను నవ్వుకుంటూ ఒక పదినిముషాల చీకట్లోనే నిలుచున్నాడు అతను.

పదినిముషాల తరువాత రోడ్డును క్రాస్ చేసి ఇంకో సందులోకి ఎంటర్ అయ్యాడు. పాము తిరిగినట్లు మెలికలు తిరుగుతూ మూడు

ఫర్లాంగుల దూరం విస్తరించి వున్నదా సందు... ఒక పెద్ద మోడ్రన్ బంగ్లా ముందుకు పోయి అంతమైంది.

బంగ్లా గేటుకు ఆనుకుని కునికిపాట్లు పడుతున్న నైట్ వాచ్‌మెన్‌కి తెలియకుండా, నాలుగు అడుగుల ఎత్తు వున్న ప్రహరీ గోడను అధిగమించాడు షాడో. అందమైన పూపొదలను ఆనుకుని వుండే ముఖద్వారాన్ని సమీపించి కాలింగ్‌బెల్‌ని మ్రోగించాడు.

"ఎవరు? ఎవరా ద్వారం దగ్గిర? ఎవరు??" బంగ్లాలోపల మ్రోగిన బెల్లును గమనించి గట్టిగా అరిచాడు గేటు దగ్గిర వాచ్‌మన్. తన లాటీని బిగించి పట్టుకుంటూ పరిగెత్తుకు వచ్చాడు.

అదే సమయంలో ఓపెన్ అయ్యాయి తలుపులు. నిమ్మకాయలు నిలబెట్టటానికి వీలుగా వున్నట్లు అగుపించే పెద్దపెద్ద మీసాల శాల్తీ ఒకటి బయటికి తొంగి చూసి, కనుబొమ్మలు ముడివేసింది.

"ముఖం పగిలిపోకముందే నీ వాచ్‌మన్‌ని వెనక్కి పొమ్మని చెప్పు... అరిచి అల్లరి చేయటానికి ప్రయత్నిస్తే ప్రాణాలు తీసేస్తానని హెచ్చరించు" భుజం మీది బిడ్డను క్రిందికి దించి, అవతలికి పారిపోకుండా చేతిని గట్టిగా పట్టుకుంటూ ఆ మీసాల శాల్తీకి వార్నింగ్ ఇచ్చాడు షాడో.

లాఠీని గాలిలోకి ఎత్తబోతున్న వాచ్‌మన్‌కి సైగచేసిందా శాల్తీ... వెనక్కి వెళ్ళిపొమ్మని సూచించింది.

"పోలీస్ స్టేషన్‌లోనుంచి పారిపోయి వచ్చిన గెరిల్లా వీడే అయివుంటాడు. వీడిని పట్టుకుంటే పోలీసులు సంతోషిస్తారు.." అంటూ తనంతట తనే ఒక నిర్ణయం తీసుకున్నాడు వాచ్‌మన్.

లాటీని క్రిందికి దించకుండా షాడో తల మీద మోదాడు.

కంటికి కనిపించనంత వేగంతో ప్రక్కకు జరిగాడు షాడో...

భుజానికి అర అంగుళం దూరంలో నుంచి క్రిందికి వాలిపోతున్న లాటీని ఖాళీగా వున్న కుడిచేత్తో ఇంకా కొంచెం అవతలికి కొట్టి, అదే ఊపులో వాచ్‌మన్ గుండెలమీద పొడిచాడు.

లావుపాటి కాంక్రీట్ స్తంభం ఏదో వచ్చి తన తలమీద పడినట్లు నోరు తెరిచేశాడు వాచ్‌మన్... ఊపిరి తీసుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ మోకాళ్లమీద కూలబడి పోయాడు.

"ఆఖరి సారిగా చెపుతున్నాను... వెనక్కి పిలువ్ ఇతన్ని..." కనులు చిట్లిస్తూ మీసాల శాస్త్రీని హెచ్చరించాడు షాడో.

గుమ్మంలో నుంచి ఛెంగున ఇవతలికి దూకి, నడుములు విరిగిపోయేటట్లు వాచ్‌మన్ వెన్నుమీద దభీమని బలంగా చరిచాడు మీసాల శాస్త్రీ.

"పో అవతలికి... నోరుమూసుకుని నీ స్థానంలోకి నువ్వెళ్ళి పో..." ఉరుము ఉరిమినట్లు తీవ్రంగా అన్నాడు.

ఛణేల్‌మని శబ్దం చేసిన తన వీపును, పలుగు పెట్టి పొడిచినట్లు విపరీతమైన బాధను కలిగిస్తున్న గుండెల్ని ఒకేసారి తడుముకుంటూ, తల వంచుకుని తన స్థానంలోకి వెళ్ళాడు వాచ్‌మన్.

"మా వాడు అనుమానపడినట్లు నువ్వు పోలీస్ స్టేషన్లో నుంచి పారిపోయి వచ్చిన గెరిల్లావేనా?" షాడో ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు మీసాల మనిషి.

పోలీసులు స్వాధీనం చేసుకున్న తన సిగరెట్ ప్యాకెట్‌ని గుర్తు చేసుకుంటూ తల ఊపాడు షాడో.

వెంటనే ప్రక్కకు జరిగి అతన్ని లోపలికి ఆహ్వానించాడు మీసాల వ్యక్తి. ముందుగదిలో వున్న ఒక సోఫాను చూపిస్తూ, తన దుస్తుల్లో నుంచి ఒక రివాల్వర్‌ని బయటికి తీశాడు.

"నీకు అపకారం చేయటానికి నేను రాలేదు..." తనతో వున్న బిడ్డను సోఫాలో కూర్చోబెడుతూ మృదుస్వరంతో అతనికి చెప్పాడు షాడో.

"నీ వంటి మనిషిని ఇంట్లోకి రానిచ్చినట్లు తెలిస్తే నువ్వు చేయాల్సిన పనిని పోలీసులు చేస్తారు... నన్ను, నా కుటుంబాన్ని

నడివీధిలో నిలబెట్టి రాళ్ళతో కొట్టించి చంపుతారు...'' అతని ముఖంలోకి చూస్తూ అన్నాడా మనిషి.

''నిన్ను నీ వాచ్‌మన్‌ని మాత్రమే చంపుతారు... నీకు అసలు కుటుంబం అంటూ ఏదీ లేదు'' చిన్నగా నవ్వుతూ అన్నాడు షాడో.

ఆ మాటలు విని అప్రయత్నంగా ముడిపడిందా వ్యక్తి నొసలు.

''ఎవరు నువ్వు? నా గురించి నీకేం తెలుసు?'' రివాల్వర్‌ని పైకెత్తి షాడో గుండెలకేసి గురిపెడుతూ కరుకుగా అడిగాడు.

''నీ బంగ్లాలో ఫోన్ వున్నది... ఒకసారి కోస్టల్ సిటీకి ఫోన్ చేసి గంగారాంతో మాట్లాడు... నేను ఎవరైందీ నీకు వెంటనే తెలుస్తుంది'' తను కూడా సోఫాలో కూర్చుంటూ అతనికి చిన్న సలహా ఇచ్చాడు షాడో.

ఒక్కసారిగా బండిచక్రాల అంత అయ్యాయి మీసాల వ్యక్తి కనులు. అతని ప్రమేయం లేకుండానే చేతిలోనుంచి జారి క్రిందపడిపోయింది రివాల్వర్.

''అయ్యబాబోయ్... మీరు... మీరు షాడో...'' అంటూ, ఏదో గుర్తుకువచ్చిన వాడిలా ముఖద్వారం దగ్గిరకి పరిగెత్తి వాచ్‌మన్‌ని పిలిచాడు.

తను ఊహించినట్లే ఏదో ప్రమాదం ముంచుకు వచ్చిందనుకుంటూ, వేగంగా లోపలి వచ్చేశాడా పెద్దమనిషి.

"మెయిన్ బజారుకు పోయి వెంటనే మంచి రమ్ బాటిల్స్ నాలుగు పట్టుకురా... ఇండియాలో తయారయ్యే పనామా సిగరెట్లు ఎక్కడైనా దొరుకుతాయో విచారించి ఎన్ని దొరికితే అన్ని తీసుకువచ్చేయ్... ఇప్పుడు వచ్చింది ఎవరో కాదు - మన గంగారాం సాబ్‌కి అతి ముఖ్యమైన దోస్త్... త్వరగా వెళ్ళు..."

ఊపిరి తీసుకోవటానికి కూడా వ్యవధి ఇవ్వకుండా ఏకబిగిన ఆర్డర్స్ పాస్ చేశాడు మీసాల వ్యక్తి.

గంగారాం సాబ్ పేరు చెవిని పడేసరికి మారిపోయాయి వాచ్‌మన్ ముఖంలోని ఫీలింగ్స్... లాటీని అవతలికి విసిరేసి విమానం మాదిరి బంగ్లా బయటికి పరుగులు తీశాడతను.

పెద్ద చదువులు చదివి కూడా, పరిస్థితుల ప్రాబల్యం వల్ల దొంగగా మారిన షాడోకి అత్యంత ఆప్తుడు గంగారాం.

కష్టాలు, సుఖాలు, మంచీ చెడుల అన్నింటిలోను భాగం పుచ్చుకుంటూ నీడలా షాడోని వెన్నంటి వున్న వ్యక్తి.

దొంగతనాలు మానేసి సి.ఐ.బి.లో చేరిన వెంటనే కోస్గిల్ సిటీలో అతన్ని కుదురుగా కూర్చోబెట్టాడు షాడో...

రకరకాల వ్యాపారాలు చేసి ఎవరూ ఊహించలేనంత గొప్పవాడైపోయాడు గంగారాం. ప్రపంచంలో ఏ దేశం పేరు చెప్పినా, అక్కడ జరిగే వ్యాపారాల్లో అతనికి వాటా వుండి తీరుతుంది. మంటలు రేపే ఇసుక ఎడారుల్లో సైతం అతని అనుచరులు కనిపిస్తారు...

తమ వ్యాపారాలను గురించి తప్ప మిగిలిన విషయాలను గురించి కొంచెం కూడా పట్టించుకోని అటువంటి అనుచరుల్ని సాధారణంగా కంటాక్ట్ చేయడు షాడో... తను పడుతున్న ఇబ్బందుల్లోకి వారిని లాగి, వారి ప్రాణాల మీదికి తీసుకురాడు.

కానీ, కొన్ని కొన్ని పరిస్థితులు ఎదురైనప్పుడు వారిని కలుసుకోవటం, తన ఐడెంటిటీని బయట పెట్టి, వారి ద్వారా చిన్న చిన్న సహాయాలు పొందటం జరుగుతూ వుంటుంది అప్పుడప్పుడూ. భారతదేశం నుంచి టుబాకోని దిగుమతి చేసుకొని, రకరకాల సిగరెట్లు, పొగచుట్టలు తయారు చేయించే సరికొత్త వ్యాపారానికి సాబూ సిటీలో శ్రీకారం చుట్టాడు గంగారాం. తన ప్రతినిధిగా ఆ దేశానికి చెందిన ఇకిసాకోని నియమించాడు.

ఏభై సంవత్సరాల వయసు వచ్చి మీద పడుతున్నా పెళ్ళి పేరంటాల మాట ఎత్తని బ్రహ్మచారి ఆ ఇకిసాకో. వినయ విధేయతలతో, భక్తివిశ్వాసాలతో, గంగారాంని మెప్పించిన మొనగాడు.

"కోన్సిల్ సిటీకి ఫోన్ చేయమంటారా షాడో సాబ్? గంగారాం సాబ్‌తో మాట్లాడతారా??" పోలీసులు కొట్టిన దెబ్బలకు జివ్వు జివ్వుమంటున్న భుజాలను సవరించుకుంటూ సోఫా వెనక్కి వాలి కూర్చున్న షాడోని ప్రశ్నించాడు ఇకిసాకో.

సాబూ సిటీ నుంచి ఫోన్ వచ్చిందని తెలిసిన మరుక్షణం ఎగిరి గంతులేస్తాడు గంగారాం. కుశల ప్రశ్నలు వేయటంతోను, కులాసా మాటలు మాట్లాడటంతోను ఆగిపోడు.... అప్పటి కప్పుడు ప్రయాణం అవుతాడు... తెల్లవారేసరికి ఇకిసాకో బంగ్లా ముందు ప్రత్యక్షం అయి తీరతాడు. సుఖంగా కూర్చుని ఉన్న వాడిని రెచ్చకొట్టి కష్టాలలోకి లాగటం దేనికి??

పెదవులు విప్పి సమాధానం చెప్పకపోయినా, షాడో మనసులో మెదులుతున్న మాటల్ని తేలికగానే అర్థం చేసుకోగలిగాడు ఇకిసాకో.

"మీరు తప్పుగా అనుకోనంటే - ఒక మాట మీతో చెప్పాలని వుంది షాడోసాబ్... మీరు నిలబడి వున్న ప్రదేశానికి రెండు వందల గజాల దూరంలో కూడా నిలబడే అర్హత లేని నేను ఇలా మాట్లాడుతున్నందుకు కోపం తెచ్చుకోకుండా వుంటే ఒక సలహా ఇవ్వాలని వుంది."

కనులెత్తి గట్టిగా చూసిన మరుక్షణం నోటిని అదుముకుని దూరంగా వెళ్ళిపోవటానికి రెడీ అవుతూ చిన్న కంఠంతో అన్నాడతను.

తను ఎవరో అర్థం అయిన దగ్గిర్నించీ అతని కాళ్ళూ చేతులు స్వల్పంగా కంపిస్తూ వుండటాన్ని ఓ కంట గమనిస్తూనే వున్నాడు షాడో.

"నీ గురించి, నీ తెలివితేటల్ని గురించి గంగారాం నాకు చాలా విషయాలు చెప్పాడు... నీ మాటలకు కోపం కలిగించుకోవటం జరగదు... కమౌట్ విత్ యువర్ ఎడ్వయిస్..." సిగరెట్ ప్యాకెట్ కోసం ప్యాంటుజేబులో చేయి పెడుతూ మృదువయిన స్వరంతో అతన్ని ప్రోత్సహించాడు.

అప్పటికప్పుడు ప్రక్కకు జంప్ చేసి, సాబూ సిటీలో దొరికే అతి ఖరీదైన సిగరెట్ ప్యాకెట్ నొకదాన్ని అతని చేతికి అందించాడు ఇకిసాకో. బంగారంతో తయారు చేయబడిన లైటర్‌తో తనే స్వయంగా సిగరెట్‌ని వెలిగించాడు.

గుండెల నిండా పొగను పీల్చుకుని రింగులు రింగులుగా వదులుతూ తృప్తిగా తల వూపాడు షాడో.

సంవత్సరాల తరబడి తపస్సు చేసిన తర్వాత ప్రత్యక్షమైన దేవుడి ముందు భక్తుడు చేతులు కట్టుకుని నిలబడినట్లు వినయంగా నిలబడ్డాడు ఇకిసాకో.

"ఇక్కడ వ్యాపారం ప్రారంభించి నన్ను తన ఏజెంట్‌గా నియమించిన రోజునే మీ గురించి చెప్పాడు గంగారాం సాబ్... ఎప్పుడైనా, ఎక్కడైనా మీరు తటస్థపడటం అంటూ జరిగితే, వ్యాపారాలన్నింటినీ మూత పెట్టి మీ

అవసరాలను గమనించుకోవాల్సి వుంటుందని గట్టి హెచ్చరిక చేశాడు'' ఒక్కొక్క మాటను తూచి తూచి వాడుతూ తను చెప్పదలుచుకున్న విషయాన్ని విన్నవించుకోవటం మొదలు పెట్టాడు.

''అరివీర భయంకరులనీ మీరు - నోరు తెరిచి ఎవరైనా ఆర్తిగా పిలిస్తే అసలు పనిని వదిలేసి కొసరు పనులతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటారనీ నాకు గంగారాం సాబ్ మాటల వల్ల తెలిసింది.

సాబూ సిటీలో మీరు సృష్టించిన గందరగోళాన్ని గురించి నేను ఎటువంటి అభిప్రాయాన్ని ఏర్పరచుకోలేదు కానీ, అన్నెం పున్నెం ఎరుగని ఈ ఆడపిల్లను బలవంతంగా ఎత్తుకురావటం, మీ ప్రాణాల్ని కాపాడుకోవటం కోసం ఈ పిల్లను అడ్డుపెట్టుకోవటం... నాకు ఎంత మాత్రమూ నచ్చలేదు.

గుసగుసలాడుతున్నట్లు క్షణక్షణానికి తగ్గిపోతున్న కంఠంతో ఇకిసాకో వెల్లడించిన అభిప్రాయాన్ని వినగానే నవ్వును ఆపుకోవటం అసాధ్యమైపోయింది షాడోకి. చేతిలోని సిగరెట్‌ని మూడే మూడు పీల్పులతో ఫినిష్ చేసి సోఫా పక్కనే కనిపించిన యాష్‌ట్రేలోకి విసురుతూ తల వూపాడు.

''అవసరం అయినవారికి ఏదో ఒకవిధంగా సహాయపడటమే తప్ప, అసహాయులకు ఇబ్బంది కలిగించని ఆర్తత్రాణ పరాయణుడనని నీ

అభిప్రాయం. ఈ పిల్లను ఎత్తుకురావటం నావంటివాడు చేయాల్సిన పనికాదని నీ ఉద్దేశ్యం - అవునా?'' అని అడిగాడు.

తన మాటలకు ఆగ్రహం తెచ్చుకోకుండా అత్యంత మృదువుగా మాట్లాడటంతో భయం పోయింది కాబోలు, కాస్తంత నిటారుగా నిలుచున్నాడు ఇకిసాకో.

మురికివాడలో అడుగుపెట్టిన తర్వాత జరిగిన సంఘటనలన్నింటినీ అతనికి చెప్పాడు షాడో.

''ముందు వెనుకలు ఆలోచించకుండా ముక్కుకు సూటిగా పోయే మీ పోలీసులకు ఈ పిల్ల తల్లిదండ్రులమీద అనుమానం కలిగింది. నా గురించి తెలుసుకునేటందుకు వీరిని హింసించే ప్రయత్నాలు ప్రారంభించబోతున్నట్లు నాకు అనుమానం కలిగింది.

ఈ పిల్లను ఎత్తుకురావటం ద్వారా మురికివాడ భార్యా భర్తలకు నాకు ఎటువంటి సంబంధం లేదని నిరూపించాను. ఇప్పుడు పోలీసులు ఈ పిల్ల జోలికిగానీ, ఈమె తల్లిదండ్రుల జోలికిగానీ పోరనే భావిస్తున్నాను... యామై రైట్?'' అని అడిగాడు.

షాడో సాబ్‌ని గురించి పూర్తిగా తెలుసునని అనుకున్న తనకు అతని ప్రవర్తన మీద అనుమానం రావటమే క్షమించరాని అపరాధం చేసినట్లు అయిందనే భావం ఇకిసాకో మనసులో అడుగుపెట్టింది. చెంపలు

వేసుకుని కాళ్ళమీద పడేవాడి మాదిరిగా ముందుకు వంగి షాడో చేతులు పట్టుకున్నాడతను.

"నా తప్పును దయచేసి మన్నించండి షాడోసాబ్... మీ ప్రవర్తనలో దోషాలు ఉంటాయని అనుకున్నందుకు క్షమించండి..." అన్నాడు.

"నీ అసిస్టెంట్ రాగానే నువ్వు చేయాల్సిన పని ఒకటి వున్నది" అంటూ తన మనసులోని విషయాన్ని బయటపెట్ట బోయి, ఆఖరి క్షణంలో ఆగాడు షాడో.

అతనికి అనుమానాన్ని కలిగించే చప్పుళ్ళు ఏవైనా వినిపించాయేమోనన్న ఉద్దేశ్యంతో గిరుక్కున తిరిగాడు ఇకిసాకో ముఖద్వారం వైపుకు.

ఖరీదైన రమ్ బాటిల్స్ నాలుగింటిని పెద్ద అట్ట పెట్టెలో పెట్టుకుని, ఎప్పుడో ఎవరో చేతులు ఊరుకోక ఇండియా నుంచి తెప్పించిన పనామా ప్యాకెట్ల దిండును చంకలో ఇరికించుకుని పడుతూ, లేస్తూ ద్వారంలో ప్రత్యక్షం అయ్యాడు అతని వాచ్‌మెన్.

పాతబడిపోయిన ఆ సిగరెట్లను కాల్చటం అంటే చూస్తూ చూస్తూ ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవటమేనని అర్థం అవుతున్నా, ఇకిసాకోని నిరాశపరచటం ఇష్టం లేక ఒక పనామా సిగరెట్‌ని వెలిగించుకుని రమ్ బాటిల్‌ని ఓపెన్ చేసి, అలాగే గొంతులోకి వంపుకున్నాడు షాడో.

"కిచెన్‌లోకి వెళ్లి ఆహారం ఏర్పాట్లు చూడు... వంట చేయటం నీకు చేతకాకపోతే పక్క ఇంటివాళ్ళని ఎవరినైనా పిలువ్" అని అనబోతూ, అలా చేస్తే తన అతిథి రహస్యం బట్టబయలై పోతుందని స్ఫురణకు వచ్చి నోటిని అదుముకున్నాడు ఇకిసాకో.

అతని హడావుడిని గమనించనట్లే నటిస్తూ రమ్ బాటిల్‌లో సగం మందును పుచ్చుకున్నాడు షాడో. నోరంతా పాడు అయిపోతున్నా, నాలుగు పాత సిగరెట్లను కాల్చాడు.

వాచ్‌మెన్‌ని వెంటబెట్టుకుని తనే కిచెన్‌రూమ్‌లోకి వెళ్ళి, అరడజను ఆమ్లెట్లను తయారుచేయించాడు ఇకిసాకో. ఉడికీ ఉడకని బటాణీగింజల్ని, ఇంకా ఏవేవో పదార్థాల్ని తీసుకువచ్చి ఎదుట పెట్టాడు.

"ఈ పిల్ల తల్లిదండ్రులు స్వతంత్రంగా ఏదైనా వ్యాపారం చేసుకునేటందుకు సరిపడే సొమ్మును ఇవ్వాలి..." ఆ పదార్థాల్ని నోట్లో పెట్టుకుని రుచి చూస్తూ అతనికి చెప్పాడు షాడో.

ఎదురు ప్రశ్నలు వేయకుండా లోపలికి పోయి నాలుగు కరెన్సీ కట్టలతో తిరిగివచ్చాడు ఇకిసాకో.

"నేను ఇక్కడినుంచి వెళ్ళిపోయిన తర్వాత గొంతు చించుకుని గోల చేయండి. నన్ను ఆపటానికి ప్రయత్నించినట్లు, ఆ ప్రయత్నంలో గాయపడినట్లు నటించండి. మీరు అడ్డుకోవటం వల్ల నేను ఈ పిల్లను వదిలి

పారిపోయినట్లు ప్రకటించి, పోలీసులకు తెలియకుండా ఈ సొమ్మును ఈమె తల్లిదండ్రుల చేతిలో పెట్టండి'' అంటూ, ఆఖరి సారిగా రెండు గుక్కల రమ్‌ని పుచ్చుకుని సోఫాలోంచి లేచాడు షాడో.

''మీకు... మీకు... ఏమైనా కావాలంటే తీసుకుపోండి సాబ్... ఎంత కావాలన్నా మన దగ్గర దొరుకుతుంది...'' అతనితో పాటు ద్వారం దగ్గిరికి బయలుదేరుతూ అన్నాడు ఇకిసాకో.

తల అడ్డంగా తిప్పి చీకట్లోకి అడుగు పెట్టాడు షాడో.

''ఇక మొదలుపెట్టండి మీ అరుపుల కార్యక్రమాన్ని..'' అని హెచ్చరిస్తూ, పోర్టికోకి సమీపంలో వున్న క్రోటన్స్ చాటుకు పరిగెత్తాడు.

ఎందుకైనా మంచిదని రెండు నిముషాలు వెయిట్ చేశాడు ఇకిసాకో.. గుండెలనిండా ఊపిరి పీల్చుకుంటూ, వాచ్‌మెన్‌కి సైగ చేశాడు.

పోలీస్ సైరన్ మాదిరిగా గోల మొదలుపెట్టాడా పెద్ద మనిషి. ''పట్టుకోండి... లాకప్‌లోంచి పారిపోయి వచ్చిన దొంగరాస్కెల్‌ని వెంటనే పట్టుకోండి...'' అని కేకలు పెడుతూ, తన లాటీవంటి చేతికర్రతో, బంగ్లా మెయిన్ గేటుమీద ఎడా పెడా కొట్టి వికృత శబ్దాల్ని సృష్టించాడు.

పదిక్షణాలు ఆగి తన రివాల్వర్‌ని గాలిలోకి పేల్చాడు ఇకిసాకో... వాచ్‌మెన్‌తో పాటు గుండెలు జలదరించేటట్లు తనుకూడా కేకలు పెట్టాడు.

పది నిముషాలలో వచ్చేసింది షాడో కోరుకున్న ఎఫెక్ట్. అంత వరకూ తమకేమీ పట్టనట్లు తలుపులు గడియలు పెట్టుకుని ఇళ్ళల్లో ముడుచుకుని పడుకున్న ఆ చుట్టుపక్కల పౌరులందరూ పరుగు పరుగున వచ్చేశారు బంగ్లా దగ్గిరికి.

దారుణమైన దెబ్బలు తగలటం వల్ల సొమ్మసిల్లి పడిపోబోతున్న వాడి మాదిరి ఫోజు పెట్టి వారందర్నీ తలా ఒక ప్రక్కకు తరిమాడు వాచ్‌మెన్.

"ఫోన్ చేయండి... పోలీసులకు కూడా ఫోన్ చేయండి." అని తన యజమానికి అందరూ వింటుండగా జ్ఞాపకం చేశాడు.

ఆ సంగతిని మర్చిపోయిన తన మతిమరుపుతనాన్ని నిందించుకుంటూ అతను ఫోన్ దగ్గిరికి పరిగెత్తే అవసరం లేకుండానే సందులో ప్రత్యక్షం అయింది ఒక పోలీస్ వ్యాన్.

"మెయిన్ రోడ్డుమీదికి వినవచ్చాయి మీ అరుపులు..."

తమ ఆగమనానికి కారణాన్ని వెల్లడిస్తూ, గాలింపు చర్యల్లో పాల్గొనబోతున్న ఒక హెడ్ కానిస్టేబిల్‌ని ప్రక్కకు పిలిచి, షాడో వదిలి పెట్టిన పిల్లను అతనికి చూపించాడు ఇకిసాకో.

వెంటనే వ్యాన్‌లో వున్న వైర్‌లెస్ సెట్‌ని యాక్టివేట్ చేశాడు హెడ్‌కానిస్టేబిల్. తమ అధికారులకు ఆ విషయం గురించి వెల్లడించాడు.

పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఎన్నడూ చూడనంతమంది పోలీస్ అధికారులను ఆ చీకటి రాత్రి చూశారు ఆ సందులో నివశించే పౌరులు.

భయంకరమైన బాంబులతో ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసే గెరిల్లాని ఎదిరించి, అతను అపహరించుకుపోతున్న అమాయకురాల్ని రక్షించినందుకు ఆకాశానికి ఎత్తేశారు ఆ అధికారులు ఇకిసాకోని.

"నీ ధైర్యాన్ని మేము ఎప్పటికీ మరచిపోము... నీ గురించి ప్రభుత్వానికి చెప్పి సరైన సన్మానం చేయిస్తాము" అంటూ పోలీస్ ఫోటోగ్రాఫర్స్‌ని పిలిచి ఫోటోలు తీయించారు.

అందరూ చూస్తూ వుండగానే ఆ పిల్లను ఆమె తల్లిదండ్రులకు అప్పగించి, భవిష్యత్‌లో చాలా జాగ్రత్తగా వ్యవహరించమని వార్నింగ్‌లు కూడా ఇచ్చారు.

"మీ అదృష్టం బాగుండి ఆ గెరిల్లా చర్యలు మిమ్మల్ని నిర్దోషులుగా నిర్ణయించాయి. లేకపోతే అతనితో పాటు మిమ్మల్ని కూడా ఉరికంబం ఎక్కించాల్సి వచ్చేది పొండి..." అంటూ అవతలికి పంపేశారు.

రెండో కంటివాడు చూడకుండా, తను సిద్ధం చేసిన నోట్లకట్టల్ని ఆ భార్యాభర్తల చేతిలో పెట్టాడు ఇకిసాకో.

"మీకు ఈ సహాయం చేయమని నాకు ఆజ్ఞ యిచ్చిన ఆ గొప్ప మనిషికి ఎటువంటి ఆపదా రాకూడదని ప్రార్థనలు చేయండి" అని సలహా ఇచ్చాడు.

తలా ఒక ప్రక్కకుపోయిన పౌరులు, పోలీసులు అందరూ ఆ చీకటి సందును వదిలిపెట్టినట్లు ఖచ్చితంగా తెలియగానే, మెల్లిగా పోర్టికో దగ్గర వున్న పొదలలో నుంచి ఇవతలికి వచ్చాడు షాడో.

ఇకిసాకో ఇచ్చిన నోట్లకట్టల్ని తీసుకుని ఆనందంగా అవతలికి వెళ్ళిపోతున్న మురికివాడ దంపతుల్ని చూసి హాయిగా నిట్టూర్చాడు.

గంగారాం ఏజెంట్ ఆ పరిసర ప్రాంతాల్లో వుండబట్టి వారికి హెల్ప్ చేయగలిగాడు తను.... వారిని ఆపదలో నుంచి కాపాడగలిగాడు.

ఇకిసాకో గనుక ఆ చుట్టుపట్ల ఎక్కడా లేకుండా పోయినట్లయితే ఏం చేసేవాడు తను? వారికి ఎలా సహాయపడ గలిగేవాడు?

సమాధానాలు లభించని ఆ ప్రశ్నలు మనసులో మెదిలే సరికి వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది అతని నోరు.

సిటీలో సంచరించడం ఇక తన ఆరోగ్యానికి, తనకు తారసపడే వాళ్ళ ఒంటికీ ఎంతమాత్రము మంచిది కాదని అనుకుంటూ, ఇకిసాకోకి అగుపించకుండా, ప్రహరీగోడ మీదినుంచి అవతలికి దూకి, సిటీ సరిహద్దుల దగ్గిరికి తీసుకుపోయే రోడ్డు నొకదాన్ని చేరుకున్నాడు.

పోలీసుల సందడి తగ్గుముఖం పట్టేదాకా సిటీ బయట కాలక్షేపం చేయాలి.

సందు చూసుకుని ఇంటర్‌పోల్ హెడ్‌క్వార్టర్స్‌ని కంటాక్ట్ చేయాలి.

మొదలు కాకముందే ఆగిపోయిన ఎస్సైన్‌మెంట్‌ని తిరిగి మొదలుపెట్టటానికి సూచనలు ఇంటర్‌పోల్ డైరెక్టర్స్ వద్దనుంచే పొందాలి.

తల వంచుకుని అడుగులు వేస్తూ తన పరిస్థితిని సమీక్షించుకుంటున్న షాడోని, చిన్నగా కేకవేసి పలుకరించాయి మెయిన్ రోడ్డుప్రక్కన నీడలలో నిలబడిన ఆకారాలు కొన్ని.

"సిగరెట్లు, పొగచుట్టలు తయారుచేయించే ఇకిసాకో బంగ్లా దగ్గిర గెరిల్లా కనిపించాడని అందరూ అనుకుంటున్నారు. ఆ విషయం నిజమేనా?" అంటూ లో గొంతుకతోనే అతన్నడిగింది ఓ ఆకారం.

తను ఆ దిశలో నుంచే వస్తూ వుండటంవల్ల, ఆ సంగతి తెలియదని అనటానికి వీలుపడక మూగగా తల ఊపాడు షాడో.

"నువ్వు ఒంటరిగానే వస్తున్నావా? నీ వెంట ఇంకెవరూ లేరా?" అని ప్రశ్నించింది ఇంకో ఆకారం.

ఆ ప్రశ్నలు వేయటానికి కారణాలని ఊహించే ప్రయత్నం చేస్తూ తన వెంట ఎవరూ లేరన్నట్లు తల తిప్పాడు షాడో.

వెంటనే, అతను తల తిప్పిన వెంటనే యాక్షన్‌లోకి దిగిపోయాయా ఆకారాలు.

“మర్యాదగా నీ జేబుల్లో వున్న సొత్తును బయటికి తీయి... అరిచి కేకలు పెట్టటానికి గానీ, పారిపోవటానికి గానీ ప్రయత్నించకు. అలాచేస్తే నిర్దాక్షిణ్యంగా ప్రాణాలు తీసేస్తాం” అంటూ తళతళమని మెరిసే పిడిబాకు నొకదాన్ని అతని గుండెల మీద ఆనించింది మొదటి ఆకారం.

అదిరిపడి కనులు చిట్లించిన షాడోకి, ఆ బాకు తన గుండెల్ని గట్టిగా గుచ్చిన తర్వాత అర్థం అయింది అసలు సంగతి.

బరీయల్ గ్రౌండ్ దగ్గిరికి పోతుండగా దారి కాచిన ఆడదొంగలే వాళ్ళు.

గెరిల్లా మాదిరిగా నటిస్తూ, తను చేసిన గొడవ కారణంగా బిజినెస్ జరగక అలా సందుల్ని గొందుల్ని పట్టుకుని తిరుగాడుతున్నారు.

“మీరు అనవసరమైనటువంటి శ్రమ తీసుకోకండి... నా దగ్గిర సొత్తుకాదు గదా, కనీసం చిల్లిగవ్వకూడా లేదు” అంటూ వాళ్ళు చెప్పకుండానే చేతుల్ని గాలిలోకి ఎత్తాడు.

ఆ మాటల మీద తనకేమాత్రం నమ్మకం లేనట్లు దుస్తులన్నింటినీ గాలించింది ఒక యువతి.

ఖాళీ జేబులతో తిరుగుతున్నందుకు శిక్షగా చెంప మీద కొట్టబోయింది.

ఆమె కంటికి కనిపించనంత వేగంగా రియాక్ట్ అయ్యాడు షాడో. చెంప మీద పడబోతున్న చేతిని విసురుగా ప్రక్కకు నెట్టి, ఎడమచేత్తో వెనక్కి తోశాడు. ఆ చర్యకు బాలెన్స్ నిలుపుకోవటం చేతకాలేదు ఆ యువతికి. ప్రక్కనే వున్న పెద్ద మురుగు గుంటలో వెల్లికిలా పడిపోయింది.

అనుకోకుండా జరిగిన ఆ సంఘటనకు రెండవ యువతి బిత్తరపోతుందని ఆశించాడు. తన గుండెల్ని ఛిన్నాభిన్నం చేయటానికి సిద్ధంగా పట్టుకున్న పిడిబాకును వెనక్కి తీసేసుకుంటుందని అనుకున్నాడు షాడో.

అయితే అటువంటి పనులను ఏవీ చేయకపోగా, పగబట్టిన మిన్నాగు మాదిరి అతని మీదికి లంఘించిందామె. ఆరంగుళాల పొడవున నిట్టనిలువుగా చీరుకుపోయింది షాడో ఎడమ భుజం. ఎర్రటి రక్తం వేగంగా బయటికి వచ్చి షర్టును మలినపరచటం మొదలు పెట్టింది.

''పొడిచేయ్... గింగిరాలు తిరుగుతూ కిందపడిపోయేటట్లు గుండెల మీద పొడిచేయ్'' కచ్చగా అంటూ మురుగు గుంటలో నుంచి పైకి లేవబోయిన యువతిని ఎడమ పాదంతో మరోసారి వెల్లికిలా పడవేసి, కుడి పిడికిలిని వేగంగా ప్రయోగించాడు షాడో.

పిడుగు మాదిరిగా పడిందొక దెబ్బ బాకును పట్టుకున్న యువతి గుండెల మీద. ఊపిరి ఆగిపోయినట్లు పెద్దగా నోటిని తెరిచి సందులో వున్న ఒక గోడకు కొట్టుకున్నది ఆమె.

ఒంటరిగా తారసపడిన పోరుల్ని దోచుకోవటానికి వాళ్ళు అనుసరించే పద్ధతి పూర్తిగా అర్థం అయివుండటం వల్ల, అక్కడే నిలబడి వారిద్దరినీ వెక్కిరించే ప్రయత్నం చేయలేదు షాడో.

సందు మధ్యలో సిద్ధంగా నిలబడి వుంటారు వాళ్ళ గేంగ్ మెంబర్లు... గొంతెత్తి కేక పెట్టిన మరుక్షణం గట్టు తెగిన వరదలా వేగంగా వీధిలోకి వచ్చేస్తారు.

వీళ్ళు కేకలు పెట్టి, వాళ్ళు వచ్చి పడేవరకూ వెయిట్ చేయటమంటే చేజేతులారా ప్రాణాలమీదికి తెచ్చుకోవటం లాంటిదే కదా!

బాకును పట్టుకున్న యువతి వెనక్కి తూలి గోడను ఆనుకున్న వెంటనే వెనుతిరిగి పిక్కబలం చూపించాడతను. రెండు వందల గజాల దూరం పోయిన తర్వాత ఉన్నట్టుండి షార్ప్‌గా ఒక మలుపు తిరిగింది అనుసరిస్తున్న ఆ వీధి.

కావాలని ఎవరో రాళ్ళు విసిరి వీధి దీపాల్ని పగలగొట్టేసినట్లు కటిక చీకటితో నిండిందా ప్రదేశం. పాతిక అడుగులు కూడా పోకముందే వచ్చేసింది అతనికి ఒక అనుమానం.

ఎడమభుజం చీరుకుపోయి వెల్లువలా రక్తం వెలువడుతూండటంవల్ల, కనులు బైర్లు కమ్ముతున్నాయని సరిపెట్టుకోడానికి ప్రయత్నించాడతను. నీరసం అధికమై, అటువంటి అనుమానాలు కలుగుతున్నాయని కూడా అనుకోడానికి ట్రై చేశాడు.

మరో పది అడుగుల దూరం పోయిన తర్వాత మరింతగా బలపడిపోయిందా అనుమానం.

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని ఆ కటికచీకటిలో నిలబడి ఎవరో తనను అబ్జర్వ్ చేస్తున్నట్లు - అవకాశం లభించిన వంటనే మీద పడి ప్రాణాల్ని బలిపుచ్చుకునేటందుకు సిద్ధంగా వున్నట్లు.

వచ్చిన దారినే వెనక్కి పరిగెత్తి, బందిపోటు యువతుల చేతుల్లో మరో రెండు బాకుపోట్లు పొడిపించుకోవటమే ఉత్తమమని వెంటనే అనిపించి, ఎందుకోగాని సడన్‌గా ఆగి పోయాడతను.

ఎడమ భుజం మీది నుంచి మణికట్టువరకూ ధారగా కారుతూ, చేతిని తడిపేస్తున్న రక్తాన్ని ప్యాంటుకేసి తుడుచుకుంటూ వెనుతిరగబోయాడు.

"పట్టుకోండి అతన్ని... వెనక్కి పారిపోకముందే పడగొట్టేయండి" ఖంగు ఖంగు మంటూ వినవచ్చింది గంభీరమైన కంఠం ఒకటి.

చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం. సాబూ సిటీ నుంచి పడమటి సముద్రతీరం వరకూ ఎక్కడా ఆగకుండా పోయే ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ ట్రైన్‌లా కొట్టుకోవటం మొదలు పెట్టాయి గుండెలు.

సాబూ సిటీలో తను అడుగుపెట్టిన వేళావిశేషం ఖచ్చితంగా బాగోలేదు. అడుగుపెట్టిన వెంటనే అడ్డగించారు ఆడబందిపోట్లు... ఆపైన పోలీసులు వెంటబడి తరిమారు... ఇప్పుడు... ఇప్పుడు...

అతని ఆలోచనలు పూర్తికాకముందే బ్రహ్మరాక్షసుల మాదిరి చీకట్లలోనుంచి అతని ఎదుటికి వచ్చారు ఎక్కడో అడవుల్లో, కొండ గుట్టల్లో తలలు దాచుకుని ఉండవలసిన గెరిల్లాలు కొంత మంది.

వారి భుజాలకు వేలాడుతున్న బుల్లెట్ల దండల్ని, వాళ్ళ బెల్టులకు వున్న గ్రనేడ్ సంచుల్ని గమనించిన మరుక్షణం వారెవరో అర్థమై వెనక్కి పరిగెత్తే ఆలోచనను విరమించేసుకున్నాడు షాడో.

"నేను మీకు అపకారిని కాదు... మీరు నా జోలికి రావాల్సిన అవసరం అసలు లేనేలేదు... దయచేసి నా దారిన నన్ను పోనీయండి..." అనబోతూవుండగా అతని మెడ మీద పడింది, అందరిలోకి అతి దృఢంగా అగుపిస్తున్న ఒక గెరిల్లా పిడికిలి. మెడ ఎముకలు విరిగిపోయిన సెన్సేషన్ కలిగింది షాడోకి... ముందుకు తూలి, రోడ్డును కౌగిలించుకోబోతూ, ఆఖరి క్షణంలో నేర్పుగా బాలెన్స్‌ని నిలబెట్టుకున్నాడు.

"వీడు ఎవడో గానీ సామాన్యుడు కాదు... ఆలస్యం చేస్తే ఆడ దొంగల్ని ఏమార్చినట్లు మనల్ని కూడా తల్లక్రిందులు చేసేయగలడు... కొట్టండి గట్టిగా..." గంభీరంగా వినవచ్చింది అంతకు ముందు వినవచ్చిన కంఠం... ఇంకోసారి.

పిడుగు మాదిరిగా మెడమీద పడింది మరో దెబ్బ. నిలుచున్న వాడు నిలుచున్నట్లే క్రిందికి జారిపోయాడతను. నల్లటి సిల్కు పరదాలు ఏవో తన కనులకు అడ్డుగా నిలబెట్టబడినట్లు అనుభూతి పొందుతూ స్పృహ తప్పి తల వాల్చేశాడు.

* * * * *

దట్టమైన అడవిలో నిలబడి సిగరెట్ వెలిగించుకుంటునట్లు కల వచ్చింది షాడోకి, భగభగలాడుతున్న అగ్గిపుల్లను అవతలికి విసిరేసినట్లుగా కూడా కనిపించింది. గాలిలో వుండగానే ఆరిపోవాల్సిన అగ్గిపుల్ల, దట్టంగావున్న ఒక ఎండు పొద మీద పడి ఒక్కసారిగా భగ్గుమన్నట్లు అనిపించింది...

చూస్తూ చూస్తూ వుండగానే పెద్దవై పోయాయి ఆ మంటలు... అతన్ని చుట్టుముట్టి ప్రై చేయటానికి ప్రయత్నించటం మొదలుపెట్టాయి.

అవతలికి పరిగెత్తి ప్రాణాలు దక్కించుకోవటానికి అతను చేసిన ప్రయత్నాలు ఫలించలేదు... నేలకు తాపడం చేసినట్లు వున్నచోటి నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేదు అతని పాదాలు...

క్షణ క్షణానికి దగ్గిరవుతున్న వేడిమిని భరించటం చేతకాక, బిగ్గిరిగా అరవటానికి నోటిని తెరవబోతుండగా వచ్చేసిందతనికి మెలకువ.

తన అజాగ్రత్త మూలకంగా ఏర్పడిన దావానలం ఎదుట అగుపించలేదుగాని, ఎర్రటి నాలుకల్ని విరజుస్తూ రెండు అడుగుల ఎత్తుకు లేస్తున్న చితుకుల మంట ఒకటి వెంటనే అగుపించింది.

కదిలించి చూసుకోవటానికి కూడా వీలులేకుండా బంధించబడివున్న కాళ్ళూ చేతుల వంక ఒకసారి చూసుకున్నాడతను. ఆ మంటకు తనకు వున్న మధ్య దూరాన్ని కనులతోనే అంచనా వేశాడు.

సాటూ కొండలమీద వీచే దారుణమైన చలిగాలిని తట్టుకోవటం కోసం ఆ మంటను వేశారు అతన్ని బంధించిన గెరిల్లాలు. చలినుంచి రక్షణ కల్పించేందుకు నిర్దేశించబడినదే గాని, ఒంటిని మాడ్చి ప్రాణాలు తీయటానికి ఉద్దేశించినది కాదు...

మరి తన శరీరాన్ని ఇబ్బంది పెడుతున్నట్లుగా అనిపించిన వేడి ఎక్కడినుంచి ఉద్భవించింది?

ఆ ప్రశ్న మనసులో మెదులుతూ వుండగానే అర్థం అయిందతనికి అసలు విషయం.

పోలీస్ స్టేషన్లో వుండగానే ఒంటిమీద పడిన దెబ్బలన్నీ వరసబెట్టి బరువు చేసేశాయి.

బందిపోటు యువతి మూలకంగా ఎడమ భుజం మీద ఏర్పడిన గాయం సెప్టిక్ అయిన సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దారుణమైన జ్వరం ఆవరించుకుని వున్నది అతన్ని... తను పడివున్న ప్రదేశానికి దగ్గిరలో వున్న పచ్చటి గడ్డి నల్లగా మాడిపోయేటంతటి వేడి తన శరీరంలో నుంచి వెలువడుతున్న అనుభూతి కలుగుతున్నది.

"దాహం వేస్తోంది... దయచేసి కాసిని మంచినీళ్ళు యిప్పించండి..." అస్పష్టంగా అంటూ లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు అతను.

వెంటనే అతని వెన్ను మీద పడింది బలమైన దెబ్బ.

బందిపోటు యువతి బాకుతో చేసిన గాయం తిరిగి రేగేసరికి, బాధను భరించటం అసాధ్యమై మరోసారి స్పృహను కోల్పోయాడు.

తిరిగి కనులు తెరిచేసరికి పూర్తిగా మారిపోయాయి చుట్టూ వున్న పరిసరాలు, ఎర్రటి నాలుకల్ని విరజాస్తూ రెండు మూడు అడుగుల ఎత్తుకు లేచే నెగడు మటుమాయం అయిపోయింది.

కొండ గుట్టల్లో నడవటానికి అలవాటుపడిన ఒక గార్ధభం మీద పడుకోబెట్టబడి వున్నాడతను. ఇరుకుగా వున్న ఒక కొండ దారిలో అడుగుల్ని ఎత్తి ఎత్తి వేస్తూ నడుస్తోందా వాహనం... అడుగు అడుగుకూ షాడో బాధల్ని రెట్టింపు చేస్తోంది.

"నన్ను... నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నారు?" తన వాహనం వెనుకగా కాలి నడకన వస్తున్న ఒక గెరిల్లాని చూసి వినయ విధేయతలు నిండిన కంఠంతో అడిగాడు షాడో.

"నోరు మూసుకోకపోతే ఎక్కడికీ తీసుకుపోము. ఇక్కడే వదిలేసిపోతాం... మాకోసం ఈ గుట్టలన్నిటినీ గాలించే పోలీసులకో, ఆకలితో అలమటించిపోయే అడివి జంతువులకో ఆహారం అయిపోతావ్..." కరుకు కంఠంతో అతన్ని హెచ్చరించాడు గెరిల్లా.

మాటలతోనే సరిపెట్టినందుకు చాలా సంతోషించాడు షాడో. అంతకుముందులా తన వీపుకు వ్రేలాడే రైఫిల్‌ని తిరగేసి భుజాలమీద మోదనందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

కొండ గుట్టల చాటున వున్న సూర్యుడు నడిమింటికి చేరుకుంటున్న సమయంలో సడన్‌గా ఆగిపోయింది గెరిల్లా ప్రయాణం.

మోకాలి లోతున్న ఒక చిన్న నీటిగుంట దగ్గిర తమ వాహనాలని నిలబెట్టారు వారందరూ... బండరాళ్ళ చాటున పెరిగే ఎండు పొదల్ని

పొగుచేసి పొగ బయటికి కనిపించని పద్ధతిలో మంటను వేశారు... సొట్టలు పడిన సత్తు పాత్రలను ఆ మంటలమీద పెట్టి ఆహారం తయారుచేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

అందరితో పాటు తనకు కూడా ఎంతో కొంత ఆహారం ఇవ్వబడుతుందని ఓపికగా ఎదురుచూసిన షాడోకి నిరాశే ఎదురయింది. ఆహారం కాదుగదా అతనికి మంచి నీళ్ళను కూడా ఇవ్వలేదు వాళ్ళు. అసలు అతనివైపుకు చూడనుకూడా చూడలేదు.

అరిచి కేకలు పెట్టి తనకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించాలనే కోరిక షాడోకి కలిగిన మాట మాత్రం వాస్తవం. ఆఖరి క్షణంలో - తన వెనుక వచ్చిన గెరిల్లా మాటలు గుర్తుకువచ్చి అర్జంటుగా అదిమేసుకున్నాడు ఆ కోరికని.

సిటీలో అడుగు పెట్టినట్లే పెట్టి కొండల్లోకి పారిపోయి వచ్చిన గెరిల్లాల కోసం పోలీసులు ఎవరైనా గాలింపు చర్యల్ని చేపట్టివుంటే - తప్పకుండా వారి చెవులకు చేరితీరతాయి తన అరుపులు.... ఆఘమేఘాల మీద వచ్చిపడతారు వాళ్ళు. గెరిల్లాలతో పాటు తన అంతు కూడా చూసి తీరతారు....

ఎడారిలో ప్రయాణం చేస్తున్నట్లు పూర్తిగా ఎండుకు పోయిన పెదవుల్ని నాలుకతో తడిచేసుకుంటూ, తలను ప్రక్కకు తిప్పేసరికి, తనవంకే చూస్తున్న గెరిల్లా ఒకతను అగుపించాడు.

"గాజు సామానును జాగ్రత్తగా తీసుకువచ్చినట్లు నిన్ను మోసుకురావడం చాలా ఇబ్బందిగా వున్నది. పారిపోయే ప్రయత్నం ఏదైనా చేస్తావేమోనని ఎదురుచూస్తున్నాను.ఒకే ఒక దెబ్బలో నీ ప్రాణాలు తీసి చేతులు దులుపుకోవచ్చని నా ఆశ..." నిర్మోహమాటంగా తన అభిప్రాయాన్ని వెల్లడించి అవతలికి వెళ్ళిపోతున్న ఆ గెరిల్లాను చూసి ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు షాడో.

మగవాడు కాదు గెరిల్లా... పాతిక సంవత్సరాలు కూడా పూర్తిగా నిండని ఆడమనిషి...

దయాదాక్షిణ్యాలతో నిండి ఉండాల్సిన ఆ స్త్రీ హృదయం, అంత కర్కశంగా మారిపోవటానికి కారణం ఏమిటి? ఆమె అంత కటువుగా మాట్లాడవలసిన అవసరం ఏమొచ్చింది ఇప్పుడు??

కొత్తగా హృదయంలోకి ఎంటర్ అయిన ఆ మాటల మూలకంగా, తనను వేధిస్తున్న ఆకలిని దాహాన్ని కొద్దిగా మరిచిపోయాడు షాడో.

ఆహారం తీసుకున్న తర్వాత తిరిగి తమ ప్రయాణాన్ని ప్రారంభించారు గెరిల్లాలు అందరూ.

విశ్రాంతి సమయంలో కూడా తన వెన్ను మీది నుంచి క్రిందికి దిగని బరువు వంక కోరగా చూస్తూ అడుగులు వేయటం మొదలు పెట్టింది షాడోని మోస్తున్న గార్ధభం. ఎత్తుగా వున్న ఒక గుట్టను దాటి, సన్నగా వుండే ఒక లోయలోకి ఎంటర్ అవుతుండగా షాడో దృష్టిని ఆకర్షించాయి కొన్ని పక్షులు.

లోయకు అటూ ఇటూ వున్న కొండలమీద గూళ్ళు కట్టుకుని జీవించే డేగ జాతికి చెందిన మాంసాహారులు అవి. తాము నివశించే ప్రదేశాలలో అడవి జంతువులు ఏవో మాటువేసినట్లు అదే పనిగా చక్కర్లు కొడుతున్నాయి.

"ఒక్కసారి... ఒక్కసారి ఆ పక్షుల వంక చూడండి. వాటి ప్రవర్తనను కాస్తంత గట్టిగా గమనించండి..." యధాప్రకారం తన వెనుక నాలుగు అడుగుల దూరంలో వస్తున్న గెరిల్లాను రిక్వెస్ట్ చేశాడు షాడో.

"నోరు మూసుకోమని మాటలతో చెపితే నీకు అర్ధం కాదని నాకు తెలిసిపోయింది. నీ నోటిని మూయించటానికి బలప్రయోగం చేయాల్సిందే" అగ్గిరాముడై పోతూ అన్నాడా గెరిల్లా.

భుజం మీది రైఫిల్‌ని చేతుల్లోకి తీసుకుంటూ, తలెత్తి పైకి చూశాడు. చూసిన మరుక్షణం అదిరిపడ్డాడతను. కరెంట్ షాక్ కొట్టినట్లు "పోలీసులు... పోలీసులు మనకోసం మాటువేశారు... పోలీసులు..."

గొంతు చినిగిపోయేలా అరుస్తూ దగ్గరలో కనిపించిన ఒక బండరాయి చాటుకు జంప్ చేశాడు. అతని అరుపులు పూర్తవుతూ వుండగానే, గుండెలు జలదరించేలా వినవచ్చాయి కొన్ని శబ్దాలు...

రెండు ఫర్లాంగుల దూరంలో వున్న టార్గెట్ నైనాసరే గురి తప్పకుండా ఛిన్నాభిన్నం చేయగల రైఫిల్స్‌ని పట్టుకుని, కొండలమీది బండల చాటునుంచి లేచి నిలబడ్డారు కొందరు పోలీసులు.

కందిరీగల్లా ఝుమ్మని దూసుకొస్తున్న బుల్లెట్ల దెబ్బకు కన్ను మూసి కన్ను తెరిచేంతలో తల్లక్రిందులై పోయారు నలుగురు గెరిల్లాలు. గావుకేకలు పెడుతూ తలా ఒక ప్రక్కకు పారిపోతున్న వారిని కూడా మట్టుబెట్టేందుకు మరికాస్త ముందుకు వచ్చి, సరైన పొజిషన్స్ తీసుకుంటున్నారు పోలీసులు.

బుల్లెట్లు సృష్టిస్తున్న గందరగోళాన్ని గమనించి ఖంగారుగా చూస్తోంది షాడోని మోస్తున్న గార్దభం. ఉన్నట్లుండి దానికి సమీపంలో వున్న బండరాయిమీద పడి, షార్ప్‌గా రిఫ్లెక్ట్ అయ్యాయి రెండు బుల్లెట్లు... దాని చెవుల్ని ముద్దుపెట్టుకుంటూ గాల్లోకి వెళ్ళిపోయాయి.

పదునైన కత్తితో నీట్‌గా కోసినట్లు చెవుల్ని వెనక్కి ముందుకీ వేగంగా కదిలిస్తూ, రెండు అడుగులు ఎత్తున గాలిలోకి లేచి పందెపు గుర్రంలా పరుగు మొదలుపెట్టింది అది...

"రక్షించండి... రక్షించండి. చచ్చిపోతున్నాను. నేను నాశనం అయిపోతున్నాను" శరీరంలో ఓపికనంతా కూడగట్టుకొని బిగ్గరిగా అరిచాడు షాడో. ఆ గార్ధభం యొక్క భయాన్ని రెట్టింపు చేశాడు.

అడ్డు వచ్చిన బండరాళ్ళను తప్పించుకోవటానికి అతి వేగంగా గిరికీలు కొడుతున్న ఆ వాహనాన్ని, అడ్డదిడ్డంగా దాని మీద పడివున్న ఆకారాన్ని పడగొట్టేందుకు తీవ్రంగా కృషి చేశారు కొండల మీది పోలీసులు. ఏటవాలుగా క్రిందికి కాల్పులు జరపాల్సి రావడం వల్ల విఫలమయ్యాయి వారి ప్రయత్నాలు.

చూస్తూ చూస్తూ వుండగానే లోయను దాటి,దట్టంగా పెరిగివున్న అడవి పొదల్లోకి అడుగుపెట్టింది షాడోని మోస్తున్న గార్ధభం. గుడ్డిగా పరుగులు తీస్తూ రావటం వల్ల, ఒక పొదచాటున వున్న పెద్ద గోతిని గమనించుకోవటం చేతకాక పోవటం వల్ల తల్లక్రిందులుగా పల్టీ కొట్టింది.

ఆ అదుటుకు టప్‌మని శబ్దం చేస్తూ తెగిపోయింది షాడోని దాని వెన్నుమీది జీనుకు కట్టేసివున్న తాడు.

గార్ధభంతో పాటు తను కూడా పల్టీ కొట్టి గోతిలో పడ్డాడు షాడో. ఒంటికి అంటిన మట్టిని దులుపుకుంటూ పైకి వచ్చేసరికి, ఆయాసంతో వగరుస్తూ వచ్చి అతన్ని చుట్టుముట్టారు. పోలీసుల కాల్పుల నుంచి ప్రాణాలతో బయటపడిన గెరిల్లాలు అందరూ.

అంతకుముందులా కోపంతో పళ్ళు కొరకలేదు వారెవరూ.

చిరునవ్వులు చిలకరిస్తూ చేతుల్ని అందించి, గోతి అంచుమీద నిలబెట్టారు. తమ దగ్గర వున్న ఒక వాటర్ బాటిల్‌ని అతను అడగకముందే చేతికి ఇచ్చి తాగమని సైగ చేశారు.

"ఆబకొద్దీ నీ ఇష్టం వచ్చినట్లు తాగేశావంటే ఆ తరువాత చాలా ఇబ్బంది పడాల్సివస్తుంది జాగ్రత్త" అంటూ దూరంలో నుంచి అతన్ని, హెచ్చరించింది ఆడగెరిల్లా.

విపరీతమైన దాహంతో గొంతుక ఎండి వున్న సమయంలో ఒకేసారి కడుపు నింపుకుంటే జరిగేదేమిటో షాడోకి తెలుసు.

అయినా, ఆలస్యం చేస్తే ఆ గెరిల్లాల మనసు మారి పోతుందన్న భయంతో గటగటా త్రాగేశాడు బాటిల్‌లో వున్న వాటర్‌ని.

ఒంటిమీది దెబ్బలు, మంటలు మండిస్తున్న జ్వరం, ఎండుకు పోయివున్న గొంతు అన్నీ కలిపి వెంటనే ప్రకటించాయి యుద్ధం.

ఎంతవేగంగా తాగాడో అంతకు రెట్టింపు వేగంతో బయటికి వచ్చేశాయి ఆ నీళ్ళు...

నీరు నిండిన కళ్ళతో, నిలబడటానికి కూడా ఓపిక లేనట్లు మోకాళ్ళ మీదికి వాలిపోయిన అతనివంక అసహ్యంగా చూసింది ఆడగెరిల్లా.

"కొండల మీది పోలీసులు క్రిందికి దిగి మనల్ని అనుసరించటం, మొదలుపెట్టకముందే అడవిలోకి వెళ్లిపోవాలి... పదండి త్వరగా..." మిగిలిన వారిని హెచ్చరిస్తూ ముందుకు అడుగు వేసింది.

ఆమె చూస్తుండగా షాడోకి చేయి అందిస్తే అనవసరమైన బాధలు కలుగుతాయని భయపడ్డారు కాటోలు, తలలు వంచుకుని ఎవరి మానానవారు అడవి మధ్యలోకి బయలుదేరారు.

"కూర్చున్న చోటినించి వెంటనే లేవకపోతే నష్టం నీకే... మాకు కాదు. ఎందుకు ఏమిటనే ప్రశ్నలు కూడా వేయరు పోలీసులు, కాల్చిపారేస్తారు" లేచి నిలబడే ఓపిక లేనట్లు కూర్చున్న షాడోని భుజం మీదినించి చూస్తూ హెచ్చరించింది ఆడగెరిల్లా.

గుండెలనిండా ఊపిరి పీల్చుకుని మెల్లిగా లేచి నిలబడ్డాడు షాడో. చిన్నపిల్లాడి మాదిరి అడుగుల్ని పట్టిపట్టి వేస్తూ వారిని అనుసరించాడు.

ఉరుకులు పరుగులతో అతివేగంగా ప్రవహిస్తున్న కొండ వాగు ఒకటి ఎదురయింది వారికి రెండు గంటల తరువాత. వాగు ఒడ్డున వున్న రేగు పొదలలో నుంచి పడవల వంటి తెప్పల్ని కొన్నింటిని బయటికి లాగారు గెరిల్లాలు.

అరగంట తరువాత కాలు పెట్టటానికి కూడా వీలుకానట్లు కనిపించే దట్టమైన ఒక చెట్ల తోపును సమీపించి హాయిగా నిట్టూర్చారు.

"ఏమయింది మీరు వెళ్ళినపని? పోలీసులకు పట్టుబడిన గెరిల్లా ఎవరో తెలుసుకోగాలిగారా?" అని అడుగుతూ ఎత్తుగా లావుగా వున్న ఒక చెట్టు చాటునుంచి ఇవతలికి వచ్చాడు వారందరికీ నాయకుడి మాదిరి కనిపిస్తున్న వ్యక్తి ఒకతను.

తన భుజానికి వ్రేలాడుతున్న రైఫిల్‌ని క్రిందపెడుతూ, సిటీలో జరిగింది ఏమిటో సవివరంగా అతనికి చెప్పింది ఆడగెరిల్లా.

అందరికంటే ఆఖర్లో చెట్ల తోపులోకి వచ్చిన షాడోని అతనికి చూపించింది.

ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేయటంవల్ల కలిగిన అలసట కాస్తంత తగ్గేదాకా ఆ పెద్దమనిషి, ఇంటరాగేషన్‌ని మొదలుపెట్టడని అనుకున్న షాడోకి, ఆశాభంగమే ఎదురయింది.

"ఎవరు నువ్వు?" నాలుగు మూరలున్న చెట్టుకొమ్మను లాటీమాదిరి పట్టుకుంటూ వెంటనే ప్రశ్నలు వేయడం మొదలుపెట్టాడు గెరిల్లా లీడర్.

ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు అటువంటి ప్రశ్నలు వేసి తీరతారని, వాళ్లకి పట్టుబడిన క్షణంనుంచీ ఎదురుచూస్తున్నాడు షాడో.

తడుముకోకుండా తను తయారుచేసి వుంచుకున్న సమాధానాల్ని వినిపించేశాడు.

“నా పేరు రాజు మియా... దొంగతనాలు చేయడం నా వృత్తి... కాలం కలిసిరాక సాబూ సిటీ పోలీసుల దృష్టిలో పడటం జరిగింది... లాటీ దెబ్బల్ని తప్పించుకోవటం కోసం గెరిల్లాగా నటించాను... గెరిల్లానని చెపితే భయపడి దూరంగా వుంటారని భావించాను... నేను అనుకున్నట్లే జరిగింది. నా దగ్గర వున్న ఆయుధాలతో పోలీస్ స్టేషన్ గోడను బద్దలుకొట్టి పారిపోయి రావటానికి వీలు కలిగింది” అంటూ తన చరిత్రనంతా అతనికి ఎరుకపరిచాడు.

ఆ కథలో తప్పులు వెతకటం గెరిల్లా నాయకుడికి అసాధ్యం అయింది.

“ఒక మాటకు వంద సమాధానాలు చెపుతున్న ఇతని పద్ధతి నాకు చాలా విచిత్రంగా కనిపిస్తోంది. ఇతన్ని గురించి మనం పూర్తిగా తెలుసుకోవాలి. అంతవరకూ జాగ్రత్తగా బంధించి వుంచండి...” ఉన్నట్లుండి ఆజ్ఞలు జారీచేసి, చెట్లతోపు మధ్యలో వున్న ఒక గుడిశెవంటి కట్టడంలోకి వెళ్ళిపోయాడు.

ఆ కట్టడపు పై భాగంలో కనిపిస్తున్న రకరకాల పరికరాలను బట్టి, అక్కడ అత్యంత శక్తివంతమైన వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్ ఒకటి వున్నట్లు వెంటనే అవగతమైంది షాడోకి.

ఆ సాధనం సహాయంతో సిటీలో నివశించే తన అనుయాయులకో, సానుభూతిపరులకో మెసేజీ పంపి... తనను గురించిన పూర్తి వివరాలను ఇంకా సేకరించటానికి ప్రయత్నిస్తాడు...

గంగారాం అసిస్టెంట్ ఇకిసాకోతో తన పరిచయాన్ని గురించి ఎవరూ కనిపెట్టనంతవరకూ తను కల్పించిన కట్టుకథతో తప్పుల్ని వెతకటం ఎవరికీ సాధ్యం కాదు... వాళ్ళు తప్పుల్ని వెతికేవరకూ అసలు అక్కడ ఆగటం దేనికి?

తనను ఆవరించుకుని వున్న నీరసం కొద్దిగా తగ్గే వరకూ వెయిట్ చేసి, అక్కడినించి మటుమాయం అయిపోవటానికి అభ్యంతరం ఏముందిట?

తనవంక కోరగా చూస్తున్న ఆడగెరిల్లాను కనుచివరల నుంచి చూస్తూ ఒక చెట్టుకింద కూర్చున్నాడు షాడో. అతని శరీరం మీది గాయాలకు ఏదో ఆయింట్‌మెంట్‌ని అద్ది, జ్వరం తగ్గిపోవటానికి టాబ్లెట్స్ యిచ్చారు. తమ ఆయుధాల్ని సిద్ధంగా పట్టుకుని అల్లంత దూరంలో కాపలా కూర్చున్నారు. చీకటి పడే సమయంలో సూప్ వంటి పదార్థం ఏదో అతనికి ఇవ్వబడింది ఒక సత్తుగిన్నెలో.

మంటలు మండించే జ్వరం కొద్దిగా ఉపశమించడంవల్ల, ఆవురావురుమంటూ ఆ గిన్నెను ఖాళీచేసి ఆకలి తీర్చుకున్నాడు షాడో.

సిగరెట్ వెలిగించుకుంటే బాగుంటుదన్న కోరికను మాత్రం బలవంతంగా ఆపుకుంటూ, తన వెనుక వున్న చెట్టు బోదెకు చేరగిలబడిపోతుండగా - అగుపించారు ఆ కొత్త మనుష్యులు.

ఉరుకులు పరుగులతో అతివేగంగా ప్రవహించే కొండ వాగులో ఈదుకుంటూ వచ్చారు కాబోలు పూర్తిగా తడిసి వున్నాయి వారి దుస్తులు.

''స్నేహితులమే మేము... శత్రువులం కాదు... తొందరపడి కాల్పులు జరపబోకండి... కాస్తంత నిదానించండి...'' చెట్లతోపు సమీపంలోకి రాగానే చేతుల్ని గాలిలోకి ఎత్తుతూ అరిచాడు వారిలో ఒకతను.

ట్రిగ్గర్ ప్రెస్ చేసిన మరుక్షణం కన్ను మూసి కన్ను తెరిచేటంతలో వంద బుల్లెట్లను ప్రయోగించే శక్తివంతమైన ఆయుధాన్ని రెడీగా పట్టుకుని వారికి ఎదురుగా పోయాడు ఒక గెరిల్లా.

''మీ నాయకుడితో మాట్లాడటానికి వచ్చాము మేము... మా దగ్గిర ఎటువంటి ఆయుధాలు లేవు...'' పైకి ఎత్తిన చేతుల్ని క్రిందికి దించకుండానే అతనికి వివరించాడు ఆ కొత్తమనిషి.

అనుమానం తీరకపోవడంతో అతన్ని, అతని సహచరుల్ని జాగ్రత్తగా గమనించుకుంటూ చెట్ల మధ్యకు తీసుకువచ్చాడు ఆ గెరిల్లా.

"అనవసరమైన మాటలతో సమయాన్ని వృధా చేయటం మాకు ఇష్టం లేదు. మేము వచ్చిన పనిని సూటిగా చెప్పేస్తాము..." అంటూ వున్నట్లుండి దూరంలో వున్న షాడో వైపు చేయి చూపించాడు నూతన వ్యక్తి.

చెట్లతోపుల్లోని గుడిశెవంటి కట్టడంలో నుంచి బయటికి వచ్చి వారివంక కోరగా చూస్తున్న గెరిల్లా నాయకుడి ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయింది విపరీతమైన ఆశ్చర్యం.

"ఎందుకు ఏమిటి అనే ప్రశ్నలు వేయకుండా ఆ మనిషిని మాకు అప్పగించండి. మీకు ఎంత డబ్బు కావాలన్నా వెంటనే యిస్తాము... డబ్బు కాకుండా ఆయుధాలు అడిగినా మాకు అభ్యంతరం లేదు..." కుండ బద్దలు కొట్టినట్లు సూటిగా తాము వచ్చిన పనిని బయట పెట్టాడు నూతన వ్యక్తి.

ఒక్కసారిగా ఝల్లుమన్నది ఆ వ్యక్తి మాటల్ని వింటున్న షాడో శరీరం... వేపాకులు నమిలినట్లు చేదుగా తయారైంది నోరు.

"ఎందుకూ పనికిరాని ఈ దొంగను తీసుకుపోయి మీరేం చేసుకుంటారు?" తనలో కలిగిన ఆశ్చర్యాన్ని అణుచుకునే ప్రయత్నం చేయకుండా అడిగాడు గెరిల్లా నాయకుడు.

"ఆ విషయాలు మీకు అనవసరం. మీకు డబ్బు కావాలో, ఆయుధాలు కావాలో తేల్చుకోండి అతన్ని మాకు అప్పగించండి..."

ఖచ్చితమైన కంఠంతో ఖరాకండీగా చెప్పి, లావుపాటి సిగార్ నొకదాన్ని వెలిగించుకున్నాడు నూతన వ్యక్తి.

దగ్గిరలో వున్న వారందర్నీ ఇంకా దగ్గిరికి పిలుచుకుని మంతనాలు మొదలుపెట్టిన గెరిల్లా నాయకుడిని చూసిన కొద్దీ కారం రాచినట్లు భగభగలాడసాగింది షాడో శరీరం. పోలీసుల బారినుంచి తప్పించుకుని, సిటీలోని గొడవ కాస్తంత చల్లబడే దాకా కొండల్లో వెయిట్ చేయడం కోసం బయలుదేరాడతను. ఖర్మకాలి ఆ గెరిల్లాలకు దొరికిపోయాడు.

సంతలో పశువును బేరం చేయడానికి వచ్చినట్లు తనను ఖరీదు చేసి తీసుకుపోవటానికి వచ్చిన ఆ ఆగంతకులు ఎవరు? షాడో ఆలోచనలు పూర్తికాలేదు... సహచరులతో మంతనాలను కంప్లీట్ చేశాడు గెరిల్లా నాయకుడు. తనకు, తన అనుచరులకు అవసరమైన ఆయుధాల సంఖ్యను, మందుగుండు సామాగ్రి లెక్కలను ఆ వ్యక్తులకు వినిపించాడు.

కనురెప్పల్ని కదిలించనుకూడా కదిలించాలేదా మనుష్యులు.

"తెల్లవారేసరికి మీరు కోరినవన్నీ మీ ముందుంటాయి. అంతవరకూ అతన్ని జాగ్రత్తగా చూసుకోండి... సామాన్యుడు కాడతను... ఏ మాత్రం అవకాశం దొరికినా మీ కళ్ళల్లో దుమ్ము కొట్టగల సమర్థుడు" అంటూ జాగ్రత్తలు చెప్పి వచ్చిన దారినే చెట్లతోపు బయటికి వెళ్ళిపోయారు.

తమ మాటలు వినబడనంత దూరం వాళ్ళు వెళ్లి పోయారని నిశ్చయం అయిన మరుక్షణం, షాడో ముందుకు చేరుకున్నాడు గెరిల్లా నాయకుడు.

"రెండు వందల రైఫిల్స్‌ని అడిగాము... ఇరవై వేల రౌండ్స్ మందుగుండు సామాగ్రిని కోరుకున్నాము... ఒక్క మాటా ఎదురు చెప్పకుండా వాళ్ళు అందుకు అంగీకరించారంటే - నువ్వు నిజంగా చాలా గొప్పవాడివి అయివుండాలి. ఎవరివి బ్రదర్ నువ్వు?" అతనిముందు మోకాళ్ళ మీద కూర్చుంటూ అడిగాడు.

తన కోసం అంత ఖర్చు పెట్టటానికి సిద్ధపడిన ఆ నూతన వ్యక్తులు ఎవరో తెలుసుకోవాలన్న కోరికను బయటపెట్టాలని అనుకుని కూడా ఆఖరిక్షణంలో ఆగిపోయాడు షాడో.

తెలుసుకుని ఏం చేయగలడు తను? జ్వరం మూలకంగా తనను ఆవరించుకుని వున్న బలహీనత పూర్తిగా తొలగిపోవటానికి ఇంకా కొంచెం వ్యవధి కావాలి, తను ఏదైనా చేయగలిగిన సమయంలో అడగాల్సిన మాటల్ని, ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో వున్నప్పుడు అడగటం దేనికి?

"నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి బ్రదర్... మాటలు మరిచి పోయినట్లు అమాయకంగా ముఖం పెట్టకూడదు..." షాడో షర్టును పట్టుకుని గుంజుతూ అడిగాడు గెరిల్లా నాయకుడు.

"నేనెవరినో చెపితే ఏం చేస్తారు మీరు? బేరం పూర్తయింది గదా?" వద్దు వద్దనుకుంటూనే మాట జారాడు షాడో.

బిగించి పట్టుకున్న అతని షర్టును వదిలిపెడుతూ పెద్దగా నవ్వాడు గెరిల్లా నాయకుడు "బేరం పూర్తి అయిందిగానీ వస్తువుల్ని మార్పిడి చేసుకోలేదు... అనివార్యకారణాలవల్ల ధరలు అనుకోకుండా అధికమై పోయాయని చెపుతాను. ఇంకో రెండువందల రైఫిల్స్‌ని డిమాండ్ చేస్తాను... చెప్పు బ్రదర్... నువ్వెవరివో నాకు తెలియచెప్పు" అంటూ కుతూహలంగా ముందుకు వంగాడు.

ఎటువంటి సమాధానం ఇస్తే అతను తృప్తి చెందుతాడో, తనను చిత్రహింసలపాలు చేయకుండా వదిలేస్తాడో అర్థం కాక అయోమయంగా తల విదిలించాడు షాడో. ఆలోచనలు సజావుగా సాగటానికి సిగరెట్ కాల్చుకోవటం తప్పనిసరి అని అర్థమై, నాయకుడి వెనుకనే నిలబడిన ఒక గెరిల్లాకు తన కోరికను వెల్లడించబోతుండగా గాలివాలున సోకింది అతని నాసికారంధ్రాలకు ఆ వాసన.

కువాయిట్ నుంచి సాబూ సిటీకి పెట్రోల్‌ని రవాణా చేసే ఆయిల్ టాంకర్ ఏదో తల్లక్రిందులై, అందులోని సరుకంతా బయటికి విరజిమ్మబడినట్లు ఘాటుగా వస్తోంది పెట్రోల్ వాసన.

"చెప్పు బ్రదర్... నువ్వెవరివో, నీ ఐడెంటిటీ ఏమిటో ఇప్పుడైనా చెప్పు..." అంటున్న గెరిల్లా నాయకుడి గుండెల మీద చెయ్యివేసి వెనక్కి నెట్టాడు షాడో.

"నన్ను అప్పగిస్తే మీకు ఖరీదయిన ఆయుధాలు ఇస్తామని చెప్పి, మీ అందరినీ మంటల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు ఆ దుర్మార్గులు...

చెట్లతోపు చుట్టూ ఆయిల్ ని కుమ్మరించి మిమ్మల్ని సజీవ దహనం చేయబోతున్నారు... పారిపోండి... పారిపొండి... పోయి మీ ప్రాణాల్ని కాపాడుకోండి..." అని బిగ్గిరిగా అరుస్తూ లేచి నిలబడ్డాడు.

అతని మాటలు పూర్తికాకముందే భగ్గుమంటూ చెట్లతోపు చుట్టూ ప్రత్యక్షం అయ్యాయి మంటలు. ఎర్రటి నాలుకల్ని విరచాస్తూ నల్లటి పొగల్ని వెలువరుస్తూ ఆకలిమీద వున్న పాముల మాదిరి అతివేగంగా లోపలికి రావడం మొదలుపెట్టాయి.

"స్నేహితులమంటూ వచ్చి మనల్ని వెన్నుపోటు పొడిచిన ఆ దుర్మార్గుల అంతు చూడండి... అందుకోండి మీ ఆయుధాల్ని..." పళ్ళు కొరుకుతూ ఆజ్ఞలు జారీ చేశాడు గెరిల్లా నాయకుడు.

చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకులా తలా ఒక ప్రక్కకు పరుగు తీశారు గెరిల్లాలు. తమ ఆయుధాల్ని బిగించిపట్టుకుంటూ చెట్లతోపులో నుంచి బయటపడే ప్రయత్నాలు చేశారు. వాళ్ళు అలా రియాక్ట్ అవుతారని ముందే ఊహించి అందుకు సిద్ధంగానే వున్నారు వాళ్ళని మాటలతో ఏమార్చిన అగంతకులు.

చెవులు చిల్లులు పడే శబ్దాలతో పనిచేయసాగాయి పవర్‌ఫుల్ మిషన్‌గన్స్... కనులు మిరుమిట్లు గొలిపే వెలుగుల్ని క్రియేట్ చేయటం స్టార్ట్ చేశాయి హేండ్ గ్రనేడ్స్. మంటల్లో చిక్కబడి అసువుల్ని కోల్పోయారు కొందరు గెరిల్లాలు... మిషన్ గన్స్‌కి, హేండ్ గ్రనేడ్స్‌కి బలయి పోయారు మరికొందరు.

తప్పించుకోవటానికి అంతకంటే మంచి అదను మరొకటి లభించదని అర్థమై, మోచేతుల మీద నెమ్మదిగా ముందుకు పాకుతున్న షాడో దృష్టి పథకంలోకి వచ్చింది, అతన్ని సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టిన ఆడగెరిల్లా.

మిషన్ గన్ బుల్లెట్ ఒకటి తగిలి వెల్లకిలా పడిపోయిందామె. ఆ అదటుకు అవతలికి ఎగిరిపోయిన తన ఆయుధం కోసం చేతిని జాచబోతుండగా, రాక్షసుడి మాదిరి ఆమెముందు ప్రత్యక్షం అయ్యాడు

ఆగంతకుడు ఒకతను. తన దగ్గిరవున్న రైఫిల్‌ని ఎత్తి ఆమె తలమీద మోదబోతున్నాడు.

తల తిప్పుకుని రెండే రెండు క్షణాలు ఊపిరి బిగపడితే ఆ ఆడగెరిల్లా హతమారిపోతుందని అవగతమయింది షాడోకి. ఆమెను చంపి, అవతలికి వెళ్ళిపోతాడు ఆ ఆగంతకుడు... అతని కంటపడకుండా తను చీకట్లోకి జారుకోవచ్చు...

అతని ఆలోచనలతో తమకు నిమిత్తం లేనట్లు తమంతట తామే కదిలాయి షాడో చేతులు. నేలను తడిమి, క్రికెట్ బాల్ సైజులో వున్న పలుకురాయిని అందుకని ముందుకు విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి ఆ వ్యక్తి ముఖానికి తగిలిందది... గావురుమని అరిచే అవకాశం కూడా లేకుండా నిలుచున్నవాడు నిలుచున్నట్లుగా వెనక్కి విరుచుకుపడిపోయాడతను.

శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకుని ఒక్క ఉదుటున పైకి లేచాడు షాడో. నాలుగు అంగల్లో ఆడగెరిల్లాను సమీపించి భుజాలు పట్టుకున్నాడు. దూరంలో పడిపోయిన తన ఆయుధం కోసం వెతుకులాటను వదిలేసి, చిన్నగా నవ్విందామె.

“నీ గురించి తప్పుగా అర్థం చేసుకున్నాను బ్రదర్... కోపంగా చూసి వెక్కిరింపుగా మాట్లాడితే ఏదో ఒక క్షణంలో నీ అంతట నువ్వే నీ నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంటావని అనుకున్నాను.

నీకు చెడుపు చేయతలపెట్టిన వారికి కూడా మానవత్వంతో సహాయపడటం నీ నైజం అని ఇప్పటికి రెండుసార్లు నిరూపణ అయింది... మమ్మల్ని క్షమించు బ్రదర్...” అంటూ మాటల్ని ఆపేసింది.

సూటి పోటి మాటలు మాట్లాడుతూ వెక్కిరిస్తూ ఉండాల్సిన ఆ ఆడగెరిల్లా నోటి వెంట అటువంటి పలుకులు వినవస్తాయని ఎదురు చూడకపోవటంవల్ల కొద్దిగా సిగ్గు పడ్డాడు షాడో.

“ఇట్సాల్ రైట్ బేబీ...ఇప్పటికయినా నిజం తెలుసుకున్నందుకు సంతోషంగా వున్నది. మనం ఒకరినొకరు పొగుడుకుంటూ ఇక్కడే కూర్చుంటే కొంపలు అంటుకుంటాయి. లెటజ్ మూవ్ ఫ్రమ్ హియర్” అంటూ ఆమెను పైకి లేపబోతుండగా అర్థం అయింది అతనికి అసలు సంగతి.

మాట్లాడుతూ మాట్లాడుతూ ఉండగానే ప్రాణాల్ని వదిలేసిందామె. అతని ముఖం మీదనే చూపుల్ని నిలిపి, పరలోకానికి ప్రయాణమై పోయింది. ఆమెతో తనకు ఎటువంటి అనుబంధమూ లేకపోయినా, ఎందుకనో చెమ్మగిల్లాయి షాడో కనులు.

అడ్డదిడ్డంగా పడివున్న ఆమెను సరిగా పడుకోబెట్టి, దూరంగా పడిపోయిన ఆమె రైఫిల్‌ని తీసుకోవటానికి బయలు దేరబోతుండగా ఒక్కసారిగా ఝల్లుమన్నది అతని శరీరం, రైఫిల్‌ని అందుకునే ఆలోచనను వెంటనే విరమించేసుకుని, వేగంగా ప్రక్కకు దూకాడు అతను. కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

''ఆలస్యం చేశారంటే చీకటిమాటున చేజారిపోతాడు... తల పగిలిపోయేటట్లు కొట్టేయండి ముందర..'' ఖంగు ఖంగుమంటూ వినవచ్చింది ఒక కంఠం. తల ఊడి క్రింద పడిపోయే లెవెల్లో షాడో తలమీద పడింది దారుణమైన దెబ్బ ఒకటి.

కళ్ళముందు పంచరంగుల సీతాకోకచిలుకలు ప్రత్యక్షం అవుతున్నట్లు అనుభూతి పొందుతూ ముందుకు పడిపోయాడతను.

చేతుల్ని క్రింద ఆనించి పైకి లేచే అవకాశం లభించలేదు.

యమభటుల మాదిరి చీకట్లలో నుంచి అతని ఎదుట ప్రత్యక్షం అయ్యారు ఇద్దరు ఆగంతకులు. అంతకుముందు గెరిల్లాలు బంధించినట్లు చేతుల్ని వెనక్కి విరిచి దృఢంగా బిగించేశారు.

''మనం సృష్టించిన ఈ మంటలు అదుపు తప్పి అడవినంతా ఆక్రమించుకోకముందే యిక్కడినుంచి తొందరగా వెళ్ళిపోవాలి. ఈ వెలుగును చూసి పోలీసులు ఎవరైనా ఇటుగా వస్తే అనవసరమైన

ఇబ్బందుల్లో పడతాం...'' పది క్షణాల తరువాత ఒక చిమ్లూ వృక్షం చాటునుంచి ఇవతలికి వస్తూ ఆ యమభటులతో అన్నాడు ఓ ఆగంతకుడు.

గెరిల్లా నాయకుడితో బేరం కుదుర్చుకున్నది అతనేనని వెంటనే అర్థం అయింది షాడోకి.

"నన్ను ఎందుకు బంధించారు? మీకు నాకు శత్రుత్వం ఏముంది?'' యమభటులు కొట్టిన దెబ్బకు తలలో నుంచి ముఖం మీదికి కారుతున్న రక్తాన్ని షర్టు భుజానికి అద్దుకుంటూ అతన్ని ప్రశ్నించాడు.

కనులు చిట్లిస్తూ అతని ముఖంలోకి చూసి పెద్దగా నవ్వేశాడా వ్యక్తి.

"నీకు మాకు శత్రుత్వం ఏముందో త్వరలోనే నీకు తెలుస్తుంది. తొందరపడకు... అంతవరకూ కాస్త ఓపికపట్టు'' అంటూ వెనుతిరిగి కొండవాగు వైపు బయలుదేరాడు ఆ ఆగంతకుడు.

గెరిల్లాల్ని హతమార్చటానికి ఉపయోగించిన మెషీన్‌గన్స్‌ని, రకరకాల గ్రెనేడ్స్ దండల్ని భుజాలమీద వేసుకుని అతన్ని అనుసరించారు అక్కడ వున్న అనుచరులు అందరూ.

తలమీద తగిలిన దెబ్బ తగ్గిపోతున్న జ్వరాన్ని తిరిగి రెచ్చగొడుతున్నట్లుగా ఫీల్ అవుతూ వారందరి మధ్య అడుగులు వేశాడు షాడో.

పదిమంది వున్నారు వారందరూ... అతన్ని పట్టుకోవటం కోసమే అక్కడికి వచ్చినట్లు ఎంతో హాయిగా ఈలలు వేస్తున్నారు.

సాటూ సిటీలో అడుగుపెట్టిన క్షణం నుంచీ తనకు ఎదురైన ప్రతి ఒక్క ముఖాన్ని గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించాడు షాడో...

చీకటి సందుల్లో, ఇళ్ళ అరుగుల చాటున నిలబడే ఆడ బందిపోట్లను, వాళ్ళ అరుపుల్ని ఆలకించిన మరుక్షణం రోడ్డు మీదికి వచ్చిపడే హెల్పింగ్ హేండ్స్‌ని అందర్నీ తలుచుకున్నాడు.

తను చూసినవారిలో ఒక్క మనిషి కూడా ఆ ముఠాలో లేకపోవటం అనేక రకాల ఆలోచనల్ని అతనిలో రేకెత్తించింది.

ఆ ఆలోచనల మూలకంగానే కొండవాగు దగ్గిర తప్పించుకుపోవటానికి దొరికిన చక్కటి ఒక అవకాశాన్ని వదిలేసుకున్నాడతను.

అందరితో పాటు నీటిలోకి దిగిన మరుక్షణం గండుమీను మాదిరి వాగు అడుగు భాగానికి వెళ్లిపోవచ్చు... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో పాతిక అడుగుల దూరం లాక్కుపోతుంది ఆ ప్రవాహం... మరో నాలుగైదు నిముషాలపాటు ఓపిక పట్ట గలిగితే ఎవరికీ కనిపించనంత దూరం వెళ్లిపోవచ్చు...

ఊపిరి బిగపట్టి నాలుగు నిముషాలకు కాస్తంత పైగానే నీటిలో మునిగివుండేందుకు అవసరమైన ట్రెనింగ్ ఇవ్వబడింది అతనికి.

కావాలనే ఆ అవకాశాన్ని ఉపయోగించుకోలేదు షాడో. వడివడిగా ప్రవహిస్తున్న ఆ కొండవాగులోకి దిగటానికి భయపడుతున్న వాడిలా, బెదురు చూపులు చూస్తూ అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు.

అస్పష్టంగా అగుపిస్తున్న కాలిబాట మీదుగా ఒక అర ఫర్లాంగు దూరం పోగానే అగుపించింది అతనికి ముళ్ళ పొదల చాటున దాచబడిన మోటార్ వెహికిల్. భుజం మీది రైఫిల్‌ని ఒక సహచరుడికి అందించి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు ఆగంతకుల నాయకుడు. అందరూ ఎక్కగానే స్టార్ట్ చేసి, కొండగుట్టలకు ఎడమ చేతివైపుగా పోనిచ్చాడు.

తూర్పు దిక్కు తెల్లబడే సమయానికి తనను సాబూ సిటీలోకి తీసుకుపోతారని అనుకున్న షాడో అంచనా తప్పిపోయింది చాలా దారుణంగా.

సాబూ సిటీకి రెండు మైళ్ళ దూరంలో వున్న ఒక మట్టిరోడ్డు మీదుగా ప్రయాణం చేసింది ఆ వెహికిల్... తెల్లవారే సమయానికి, నిర్మానుష్యంగా ఉన్న సముద్ర తీరాన్ని సమీపించింది.

సుశిక్షితులైన సైనికుల మాదిరి కదిలారు వెహికిల్‌లో కూర్చున్న వ్యక్తులు.

ముళ్ళకంపను ఈడ్చినట్లు షాడోని ఆ ఇసుకలో నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకుంటూ తీసుకుపోయి, సముద్రపు ఒడ్డున తమ కోసం వెయిట్ చేస్తున్న మోటార్ బోటులోకి దొర్లించారు.

ఆ బోటు ఎటుగా ప్రయాణం చేస్తుందో, ఎక్కడికి తనను తీసుకుపోతుందో తెలుసుకోవటానికి షాడో చేసిన ప్రయత్నాలు ఒక్కటీ ఫలించలేదు.

చీకటి గుయ్యారం మాదిరిగా ఉన్న ఒక స్టోర్ రూమ్ లోకి అతన్ని నెట్టి, మరోసారి తల చిల్లు పడేట్టు బలమైన దెబ్బ వేశాడు ఒక ఆగంతకుడు.

మొదలు నరికిన చెట్టు మాదిరి విరుచుకుపడిపోయాడు షాడో, శరీరం పూర్తిగా క్రిందికి వాలకముందే తప్పిపోయింది అతనికి స్పృహ.

* * * * *

ఇరవై నాలుగు గంటల పాటు ఎక్కడా ఆగకుండా సముద్రంలో ప్రయాణం చేసి, మళ్ళీ తెల్లవారబోతున్న సమయంలో ఒక బ్రహ్మాండమైన ద్వీపాన్ని చేరుకున్నది మోటార్ బోటు. ఎత్తయిన వృక్షాలతో దట్టమైన పొదలతో కాలుపెట్టటానికి కూడా వీలుకానట్లు కనిపించే అడవితో నిండివున్నది ఆ దీవి.

అడవి ముందుభాగంలో సముద్ర తీరాన్ని ఆనుకుని కట్టబడి వున్నాయి కాటేజీలవంటి కట్టడాలు కొన్ని.

సరైన ఆహారం తీసుకోకపోవడంవల్ల నిస్తేజంగా, నిరుత్సాహంగా తయారైన షాడోని ఆ కట్టడాల ముందుకు తీసుకుపోయారు మోటార్ బోటులో ప్రయాణం చేసిన అగంతకులు.

ఆరడుగుల ఎత్తున్న ఒక మహాకాయుడు వెంటనే ఒక కట్టడంలో నుంచి బయటికి వచ్చాడు.

చేతులు వెనక్కి విరిచి కట్టబడి నీరసంతో వేలాడుతూ వున్న షాడోని చూసేసరికి విపరీతమైన సంతోషంతో బిగ్గిరిగా నవ్వాడు.

నిలుచున్న చోటునే చతికిలబడి హాయిగా నిద్రపోవాలన్నంత బలహీనత ఆ సమయంలో షాడోని ఆవరించుకుని ఉన్నది.

గుండెల్ని జలదరింపచేసేటట్లు వినవచ్చిన ఆ వికట హాసాన్ని గమనించి, మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకి ఎత్తాడు.

వెంటనే కలిగింది అతనికి జివ్వుమని కరెంట్‌షాక్ కొట్టిన అనుభూతి. చేతుల్ని బంధించివుంచిన తాళ్ళను ఏదో ఒకవిధంగా తెంచేసుకుని సముద్రం వైపు పారిపోవాలన్న కోరిక కలిగింది.

నయంతోనో, భయంతోనో లేక బలప్రయోగంతోనో ప్రపంచంలోని దేశాలన్నిటినీ ఆక్రమించుకుని ఒకే పతాకం కిందికి తీసుకురావాలన్న ఏకైక లక్ష్యంతో అహర్నిశలు శ్రమించే కిల్లర్స్ గాంగ్‌లో ఒక ముఖ్యమైన వ్యక్తి అతను.

వందమంది శత్రువులు ఒకేసారి చుట్టుముట్టినా, ఈగల్ని విదిలించినట్లు అవతలికి తరిమివేయగల తెంపరితనం, బలం, తెలివి అతని సొత్తు.

"నీ పేరును వినడమే గానీ, ప్రత్యక్షంగా ఇంతవరకూ నిన్ను చూడలేదు మిస్టర్ షాడో... నీ గురించి నేను విన్న కథలను బట్టి నిన్ను బంధించటం అసాధ్యం అవుతుందని అనుకున్నాను..." ఉరుములు ఉరిమినట్లు భీకరంగా ధ్వనిస్తున్న కంఠంతో అంటూ షాడో సమీపంలోకి వచ్చాడా వ్యక్తి.

"నా పేరు బెల్‌రియా... కిల్లర్స్ గాంగ్‌లో ఒక ముఖ్యమైన మెంబర్ని..." అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు అతను.

మొట్టమొదటిసారిగా ఆ పేరును వింటున్నట్లు నటించటానికి షాడో చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఆ విషయాన్ని పసికట్టేశాడు బెల్‌రియా.

“నువ్వు సాటిలేని మేటి మొనగాడివి, నీ ఎదుటికి వచ్చిన కిల్లర్స్ గాంగ్ మెంబర్స్ ఎవరూ ప్రాణాలతో అవతలికి పోలేరనీ నాకు బోధించబడింది.

నీ వాలకం చూస్తుంటే అవన్నీ అతిశయోక్తులేనని అనిపిస్తోంది. నా అనుచరుల దెబ్బల్నే తట్టుకోలేని నువ్వు నాతో ఎలా తలపట్లు పట్టగలవో అర్థం కావటం లేదు” షాడోని కిందినుండి పైదాకా పట్టిపట్టి చూస్తూ కామెంట్ చేశాడు.

తమ ఆశయసిద్ధి కోసం చేయరాని దారుణ కృత్యాలన్నిటినీ చేసే కిల్లర్స్‌గాంగ్ మెంబర్స్ తనకు తారసపడినప్పుడల్లా రాక్షసుడి మాదిరిగానే ప్రవర్తించాడు షాడో. నిర్మొహమాటంగా వారిని నాశనం చేశాడు.

అతని ధాటికి తట్టుకోలేక అనేక రకాల ఆఫర్స్‌ని అతని ముందు పెట్టింది ఆ గాంగ్.

తమ ఆశయాలు నెరవేరి ప్రపంచ దేశాలన్నింటినీ ఒకే పతాకం క్రిందికి తీసుకువచ్చిన రోజున అతన్ని కోరుకున్న దేశానికి అధిపతిని చేయటం జరుగుతుందని తెలియచేసింది.

కిల్లర్స్ గాంగ్‌ని నడిపే సుప్రీం కమాండ్‌లో అతనికి విశిష్టమైన స్థానం ఇవ్వబడుతుందని కూడా తెలియజేసింది.

రెండో ఆలోచన లేకుండా వారి కోరికను తిరస్కరించాడు షాడో. అవకాశం లభించినప్పుడల్లా వారిని ఎదిరించటాన్ని కంటిన్యూ చేశాడు.

అతన్ని తమ దారినుంచి అడ్డు తొలగించుకోవటం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రైజ్‌మనీని ప్రకటించింది కిల్లర్స్‌గాంగ్... అతన్ని చంపినవారిని అపర కుబేరుల్ని చేయటం జరుగుతుందని ప్రచారం చేసింది.

ఎందరో వస్తాదులు ఎన్నెన్నో ప్రయత్నాలు చేశారు. ఎన్ని రకాలుగానో అతన్ని హతమార్చటానికి ట్రై చేసి విఫలులయ్యారు.

"ఎవరూ చేయలేని పనిని నేను చేశానని తెలిస్తే ఎంతగానో సంబరపడతారు మా సుప్రీమ్ కమాండ్ సభ్యులు... ఈ రోజే వారికి కబురు పంపిస్తాను" అంటూ మోటార్ బోటులో వచ్చిన అగంతకుల వంక చూశాడు బెల్‌రియా.

వినయంగా నిలబడి తాము షాడోని ఎలా పట్టుకువచ్చారో అతనికి వివరించాడు అగంతకుల నాయకుడు.

"కదలటానికి వీలులేకుండా గాయాలతో బాధపడుతూ కూడా తప్పించుకునే అవకాశం కోసం ఎదురుచూస్తూనే వున్నాడు ఇతను... కంటిమీద కునుకు లేకుండా కాపలా కాయవలసి వచ్చింది" అంటూ మాటల్ని ముగించాడు.

“నీడనైనా పట్టుకోవచ్చుగానీ, షాడోని పట్టుకోవటం అసాధ్యమని, ఒకవేళ పట్టుకున్నా ఇరవైనాలుగు గంటల కంటే ఎక్కువ సేపు బంధించి వుంచటం ఇంపాజిబుల్ అనీ పెద్ద పేరు... అవన్నీ వట్టి కట్టుకథలే అనిపిస్తోంది ఇప్పుడు...” అంటూ వెనుతిరిగాడు బెల్‌రియా.

“తీసుకుపోయి మన బందిఖానాలో పడవేయండి... సుప్రీమ్ కమాండ్‌కి కబురు పంపేదాకా జాగ్రత్తగా కాపలా కాయండి...” అని ఆజ్ఞ ఇస్తూ ఒక కట్టడంలోకి వెళ్ళిపోయాడు.

అడవిలోని వృక్షాల్ని నరికి, ఆ కొమ్మలతో కట్టబడి వున్నాయి ఆ కట్టడాలు. వాటిలోనుంచి తాను తప్పించుకోవడం ఏమంత కష్టం కాబోదని అనుకున్న షాడోకి వెంటనే తెలిసి వచ్చింది అసలు విషయం... గట్టిగా ఒక గాలి వీస్తే ఎగిరిపోయేటట్టున్న ఆ కట్టడాల్లోకి తీసుకుపోలేదతన్ని ఆ ఆగంతకులు.

మూడు నిలువుల లోతున్న ఒక పెద్దగోతిలోకి దింపి చేతులు దులుపుకున్నారు. రైఫిల్స్‌ని రెడీగా పట్టుకున్న ఇద్దరు సహచరుల్ని ఆ గోతి వద్ద కాపలా కోసం నిలబెట్టి తమ దారిని తాము వెళ్ళిపోయారు.

పూర్వకాలంలోని వేటగాళ్ళు పొగరుబోతు ఏనుగుల్ని బంధించటానికి ఉపయోగించిన బందిఖానా మాదిరిగా వున్న ఆ గోతిలో కూర్చుని, మోకాళ్ళ మీద తల ఆనించుకున్నాడు షాడో.

గతంలో తమకు ఎదురైనా అనుభవాల్ని దృష్టిలో పెట్టుకుని చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు ఆ బెల్‌రియా. రైఫిల్స్‌ని పట్టుకుని పైన కూర్చున్న అతని అనుచరులకు అగుపించకుండా ఆ గోతిలో నుంచి బయటపడలేదు తను...

ఇటాలియన్ సైంటిస్ట్ కోసం తను సాబూ సిటీలోకి వచ్చినట్లు బెల్‌రియాకి ఎలా తెలిసింది? పాత పగలను తీర్చుకోవటం కోసమే తనను బంధించాడా లేక తను వచ్చిన పనికీ అతనికీ సంబంధం ఏదైనా వున్నదా?

సమాధానం లభించని ఆ ప్రశ్నలతో తల బ్రద్దలు కొట్టుకునే అవకాశం షాడోకి లభించలేదు. గోతిలోకి దింపబడిన అరగంటలో అతని ముందు ప్రత్యక్షమయింది ఒక రమ్ సీసా. అందమైన పింగాణీ ప్లేటులో అతనికి అందించబడ్డాయి రుచికరమైన ఆహారపదార్థాలు.

''హాయిగా ఆరగించి, సుఖంగా మందుపుచ్చుకుని విశ్రాంతి తీసుకో. మా సుప్రీమ్ కమాండ్ దగ్గిరనుంచి కబురు వచ్చిన తర్వాత నిన్ను గోతిలో నుంచి బయటికి తీయటం జరుగుతుంది'' స్వయంగా వచ్చి లోపలికి తొంగి చూస్తూ అన్నాడు బెల్‌రియా.

మారు మాట మాటాడకుండా రమ్ బాటిల్‌ని ఓపెన్ చేసి నాలుగు గుటకలు వేశాడు షాడో... పింగాణీ ప్లేటులోని ఆహారాన్ని ఆరగించాడు.

గోతి అంచున ఉన్న ఆగంతకుడు ఒకతను అందించిన ఆయింట్‌మెంట్‌ని తలమీద గాయానికి, భుజం మీది దెబ్బలకు అప్లయిచేసుకుని, బెల్‌రియా చెప్పినట్లే ఆ గోతిలో ముడుచుకు పడుకున్నాడు షాడో.

చీకటి పడుతున్న సమయంలో వినవచ్చింది ఒక అలికిడి... అదిరిపడి కనులు తెరిచేసరికి ఎదురుగా కనిపించాడు - ఎవరికోసం సాబూ సిటీలోకి వచ్చాడో - ఆ ఇటాలియన్ సైంటిస్ట్.

* * * * *

"నీ ఆరోగ్యం సరిగ్గాలేదు. నువ్వు జ్వరంతో బాధపడుతున్నావ్..." పలుగులు పెట్టి పొడుస్తున్నట్లు పోటెత్తి పోతున్న తలను, భుజాల్ని సవరించుకుంటూ లేచిన షాడోతో అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఎప్పుడు వచ్చారు మీరు? ఇప్పటిదాకా ఎక్కడ వున్నారు?" తన ఐడెంటిటీని బయట పెట్టాలో వద్దో తేల్చుకోలేక, ఏదో ఒకటి మాట్లాడాలి గనుక మర్యాద పూర్వకంగా అడిగాడు షాడో.

గాఢంగా నిట్టూర్చి కాళ్ళు ఆరజాచుకున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఎక్కడో న్యూయార్క్ నగరంలోనో, వాషింగ్టన్ పట్టణంలోనో, అమెరికన్ అధికారులతో హాయిగా కబుర్లు చెపుతూ వుండాల్సిన నేను, అడవి జంతువు మాదిరి గోతులలో కాలక్షేపం చేస్తానని కలలో కూడా

ఊహించలేదు. ఇటువంటి బాధలు పడాల్సివస్తుందని ఏమాత్రం అనుమానం వచ్చినా నా పరిశోధనల్ని మధ్యలోనే ఆపేసి వుండే వాడిని...'' గాఢంగా నిట్టూరుస్తూ తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు.

అతనెవరో, అతని పరిశోధన ఏమిటో తనకు తెలియనట్లే ముఖం పెట్టాడు షాడో.

''రెండే రెండు క్షణాల్లో ఎటువంటి మనిషినైనా ఇట్టే వశపరుచుకోగల వశీకరణ యంత్రాన్ని కనిపెట్టాను నేను... ప్రపంచ దేశాలన్నీ నా తెలివితేటల్ని మెచ్చుకుంటుంటే పొంగి పోవాలని అనుకున్నాను... నేను చేసిన పరిశోధనే నాకు ఈ ఇబ్బందిని తెచ్చిపెట్టింది...'' తన పద్ధతిలో తను చెప్పుకుంటూ పోయాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అతను ఎవరో అప్పుడు తనకు అవగతమైనట్లు ముఖం పెట్టి సర్దుకు కూర్చున్నాడు షాడో.

''మీరు తయారుచేసిన ఫొటోటైప్ మీ ప్రభుత్వం దగ్గిరే వున్నది. అదిలేకుండా మిమ్మల్ని పట్టుకువచ్చినందువల్ల వీళ్ళకు కలిగే ప్రయోజనం ఏముంటుంది?'' అని అడిగాడు.

ఏదో చెప్పటానికన్నట్లు నోటిని తెరిచి వెంటనే ఆగి పోయాడు ఇటాలియన్ సైంటిస్ట్.

తల వంచుకుని కాలివేళ్ళను, చేతి గోళ్ళను పరిశీలించుకోవటం మొదలుపెట్టాడు.

ఇటాలియన్ సైంటిస్ట్ ఆ గోతిలో కనిపించిన క్షణం నుంచీ పెరిగి పెద్దది అవుతోంది షాడో మనసులో ఒక అనుమానం. అతని ప్రవర్తనను చూసేసరికి మరింతగా బలపడిపోయింది అది.

"మీ వద్ద వున్న వశీకరణ యంత్రపు డిజైన్స్ ఆధారంగా ఇంకో మెషిన్‌ని తయారు చేయిస్తున్నాడు బెల్‌రియా... తయారుచేసి ఇవ్వకపోతే మిమ్మల్ని చిత్రహింసలు పెట్టి చంపటం జరుగుతుందని బెదిరించాడు. యామై రైట్?" సూటిగా అడిగేశాడు.

ఈ సారి ఆశ్చర్యంగా చూడలేదు ఇటాలియన్ సైంటిస్ట్... చిన్నపిల్లవాడి మాదిరి నీరు నిండిన కనులతో జాలిగా అతనివంక చూశాడు.

"నన్ను హింసపెట్టడం జరుగుతుందని అతను అని ఉన్నట్లయితే అందుకు సంతోషంగా అంగీకరించి వుండే వాడిని... మంచి మాటలు చెపితే చెవిన పెట్టని దుర్మార్గుల్ని, దుష్టుల్ని సన్మార్గంలోకి తీసుకురాగల అపూర్వ యంత్రాన్ని తయారుచేశానని గర్వపడ్డాను గాని, అది దుర్మార్గుల చేతుల్లో చిక్కి దుష్టకార్యాలకు వినియోగింపబడవచ్చని అనుకోలేదు.

తను చెప్పినట్లు చేయకపోతే నా కుటుంబాన్ని సర్వ నాశనం చేస్తానని బెదిరించాడు. నా కనులముందే నా కుటుంబసభ్యుల్ని సజీవదహనం చేస్తానని హెచ్చరించాడు'' తలొంచుకుంటూ చెప్పాడు.

చీమలు పాకినట్లు జలదరించింది షాడో శరీరం.

''అతను ఆ విధంగా బెదిరించేసరికి మీరు విధిలేని పరిస్థితుల్లో అతనికి ఆ యంత్రాన్ని తయారుచేసి ఇస్తానని మాట ఇచ్చారు అవునా?''

గాఢంగా నిట్టూర్చి, తడికనుల్ని అరచేతులతో అద్దుకున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

''మాట మాత్రమే ఇచ్చివుంటే ఇప్పుడు ఇంతగా బాధపడే వాడిని కాదు మై ఫ్రెండ్... ఇందాక ఒక అరగంట క్రితం ఆ మెషీన్‌ని తయారుచేసి అతనికి అప్పగించటం కూడా పూర్తి అయింది'' అస్పష్టమైన కంఠంతో అన్నాడు.

వశీకరణ యంత్రాన్ని హడావుడిగా తయారుచేయడం, బెల్‌రియాకి అప్పగించటం కూడా పూర్తి అయిందనే మాటను వినాల్సి వస్తుందని అనుకోలేదు షాడో. మూడు మూరల పొడుగుండే పొడల పాము హఠాత్తుగా వచ్చి ఒళ్లో పడినట్లు అదిరిపడ్డాడతను.

''మై గాడ్! ఉయార్ ఫినిష్డ్!!'' ఉన్నట్లుండి అప్రయత్నంగా వెలువడ్డాయి మాటలు అతని నోటినుంచి.

తను చేస్తున్న పనులకు కిల్లర్స్ గాంగ్ అండ ఉన్నదనే ధైర్యంతో మహా రాష్‌గా మాట్లాడుతున్నాడు బెల్‌రియా... తన దారికి ఎవరు అడ్డువచ్చినా వట్టిచేతులతోనే పిండి చేయబోతున్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు.

ఇప్పుడు ఇటాలియన్ సైంటిస్ట్ చేసి యిచ్చిన వశీకరణ యంత్రం మరింత అధికం చేసేస్తుంది అతని ఆత్మవిశ్వాసాన్ని... ఆ మాటలు మనసులో మెదులుతూ వున్న సమయంలోనే హృదయంలోకి ఎంటర్ అయింది ఇంకో డౌట్.

"మీరు తయారు చేసిన యంత్రాన్ని తను ఎందుకు వుపయోగించబోతున్నాడో బెల్‌రియా చెప్పటం జరిగిందా? ఆ మెషీన్ మూలకంగా తను పొందబోయే ప్రయోజనాన్ని వివరించాడా?" సైంటిస్ట్ భుజం మీద చేయివేస్తూ మృదువుగా అడిగాడు.

ముఖం మీద ప్రత్యక్షమవుతున్న స్వేదబిందువుల్ని అరిచేత్తో అద్దుకుంటూ తల అడ్డం తిప్పాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"నన్ను పట్టుకువచ్చిన క్షణం నుంచీ ఆ మెషీన్‌ని తయారుచేయమని ఒత్తిడి చేయటం, వారి మాటలు వినకపోతే చిత్రహింసలు పెడతానని బెదిరించటం తప్ప మరొక్క మాట కూడా వీళ్ళ నోటినుంచి వెలువడలేదు." పాలిష్ చేసినట్లు నునుపుగా వున్న గోతిగోడకు ఆనుకుంటూ అన్నాడు.

దాంతో మరింతగా వికలమైపోయింది షాడో అంతరంగం... బెల్‌రియాను అడ్డుకోగల ధైర్యం ఇంకెవరికీ వుండదు... ఏ ఉపయోగాన్ని ఆశించి ఆ యంత్రాన్ని తయారుచేయించాడో, ఆ ఉపయోగాన్ని పొందేవరకూ ఇక నిద్రపోడు అతను.

అంతలోనే షాడోకి కలిగింది మరో అనుమానం. 'మెషీన్‌ని టెస్ట్ చేసే నెపం మీద అతను దాన్ని తన మీదనే ప్రయోగించదలుచుకుంటే?'

ఇంటర్‌పోల్ హెడ్‌క్వార్టర్స్‌లో వున్న ప్రోటోటైప్‌ని ఎదుర్కోవటానికి అందులోనుంచి వెలువడే వశీకరణ కిరణాల్ని తిప్పి కొట్టటానికి చాలా ఇబ్బంది పడవలసి వచ్చింది తను. ఆ సమయంలో అలసిపోవటం, అనారోగ్యానికి గురియై వుండటం లాంటి ఇబ్బందులేవీ తనకు లేవు గనుక ఆ పని చేయగలిగాడు.

మరి ఇప్పుడు?సాబూ సిటీ పోలీసులు కొట్టిన దెబ్బలకు హూనమై పోయివున్నది ఒళ్ళు. ఆడ బందిపోటు పొడిచిన కత్తి పోటు తీవ్రమైన బాధను కలుగచేస్తున్నది.

బెల్‌రియా గనుక ఆ మెషీన్‌ని తనమీద ప్రయోగించి చూడాలని అనుకుంటే మాత్రం కొంపలు మునగటం ఖాయం... అందులో నుంచి వెలువడే శక్తివంతమైన వశీకరణ కిరణాల్ని ఎదుర్కొనే శారీరక శక్తి

ఇప్పుడు తనకు లేదు. అడవిజంతువు మాదిరి ఒక గోతిలో బంధింపబడి వున్నందువల్ల మానసికంగా కూడా బలహీనుడై వుండి వుండవచ్చు.

అంతవరకే సాగాయి షాడో ఆలోచనలు... తన కర్తవ్యం ఏమిటో అతను నిర్ణయించుకోకముందే నిటారుగా లేచి నిలుచున్నారు గోతి అంచుకు దగ్గర్లో కూర్చునివున్న బెల్‌రియా అనుచరులు. స్టిఫ్‌గా నిలబడి స్మార్ట్‌గా శాల్యూట్స్ చేశారు ఎవరికో.

ఆ అలికిడిని ఆలకించి తలను పైకెత్తిన షాడోకి వెంటనే అగుపించాడు బెల్‌రియా.

"నీ గురించి మా సుప్రీమ్ కమాండ్‌కి కబురుపంపడం జరిగింది మిస్టర్ షాడో... సంతోషంగా పరవశించిపోయారు మా సుప్రీమ్ కమాండ్ సభ్యులు... నిన్ను బంధించి వుంచానని చెప్పిన వెంటనే నాకు ఎటువంటి ఆర్డర్స్ ఇవ్వబడ్డాయో ఊహించగలవా?" వెదురుగడల నిచ్చెనను గోతిలోకి జార్చి, షాడోని పైకి రమ్మని సైగ చేస్తూ అన్నాడతను.

"ఎక్కడ వున్నవాడిని అక్కడే హతమార్చమని చెప్పివుంటారు నీ బాస్‌లు... ఆలస్యం చేయవద్దని హెచ్చరించివుంటారు..." నిచ్చెన మీదుగా పైకి వస్తూ అతని ప్రశ్నకు సమాధానం యిచ్చాడు షాడో.

"నీ వంటి శక్తివంతుడిని చటుక్కున చంపమని బుద్ధి జ్ఞానం వున్న మనిషి ఎవరూ చెప్పడు... ఎటువంటి మొండి మనిషినైనా అతి తేలికగా

లొంగదీసుకోగల వశీకరణ యంత్రం మా చేతుల్లో వున్నప్పుడు అసలు ఆ ఆలోచన చేయవలసిన అవసరం లేదు...'' అంటూ, షాడోతో పాటు ఇటాలియన్ సైంటిస్ట్‌ని కూడా ఒక కొమ్మల కట్టడంలోకి తీసుకురమ్మని తన అనుచరులకు సైగచేశాడు బెల్‌రియా.

తను భయపడినట్లుగానే బెల్‌రియా వశీకరణ యంత్రం తనమీద ప్రయోగించబోతున్నాడని అర్థం అయ్యేసరికి వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది షాడో నోరు.

రైఫిల్స్ పట్టుకుని వున్న బెల్‌రియా అనుచరుల్ని అవతలికి నెట్టి అటునుంచి అటే అడవిలోకి పారిపోదామనే కోరిక అతన్ని ఒక ఊపు వూపింది. పది అడుగులు కూడా వేయకముందే వచ్చి పడతారు మిగిలినవారు. తమ ఆయుధాల్ని భుజాలకు ఆనించుకుని నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరుపుతారు.

మాయమైన ఇటాలియన్ సైంటిస్ట్‌ని వెతికి, క్షేమంగా వెనక్కి తీసుకువెళ్ళవలసిన తను, అతని కనులముందే హతమారి పోవాల్సి వస్తుంది.

ఎటువంటి ఎమర్జెన్సీనైనా ఎదుర్కోనేటందుకు సిద్ధంగా వున్నట్లు గంభీరమైన ముఖాలతో తనవంకే చూస్తున్న గార్డుల్ని గమనించి

అర్జంటుగా ఆ ఆలోచనను విరమించుకున్నాడు షాడో. ఇటాలియన్ సైంటిస్ట్ చేయిపట్టుకుని బెల్‌రియా ప్రవేశించిన కట్టడంలోకి అడుగుపెట్టాడు.

వశీకరణయంత్రాన్ని అక్కడే తయారుచేయటం జరిగింది కాబోలు. చిన్నసైజు మెకానిక్ షెడ్ మాదిరిగా అగుపిస్తోంది ఆ కట్టడం.

"కమాన్ మిస్టర్ షాడో... ఉయ్ డోంట్ హేవ్ ఇనఫ్ టైమ్... ఈ మెషీన్‌ని గురించి, ఇది నీ మీద చూపించే ప్రభావాన్ని గురించి నేను మా సుప్రీమ్ కమాండ్‌కి రిపోర్ట్ పంపించాలి. కమాన్..." అంటూ షాడో చేతిని పట్టుకుని కట్టడానికి ఒక చివరగా వున్న చెక్కబల్ల మీదికి నెట్టాడు బెల్‌రియా. రెండో చివర నిలబెట్టి వున్న మెషీన్ దగ్గిరికి సైంటిస్ట్‌ని పంపించాడు.

"స్టార్ట్ ది ఎక్స్‌పరిమెంట్... స్టార్ట్ ఎట్ వన్స్..." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ యిచ్చాడు.

మెషీన్ మీద వున్న రకరకాల డయల్స్‌ని అటూ ఇటూ తిప్పాడు ఇటాలియన్ సైంటిస్ట్... రంగు రంగుల బటన్స్‌ని ప్రెస్ చేశాడు.

"పది క్షణాల్లో నీ మనసు నీ వశం తప్పుతుంది... ఈ మెషీన్‌లో నుంచి వెలువడే అదృశ్య కిరణాలు నిన్ను బెల్‌రియాకి బానిసగా మార్చివేస్తాయి. ఇకనుంచీ అతని కంఠానికి దాసుడివి నువ్వు... అతను

ఏం చెపితే ఆ పనిని నిర్వర్తించే హ్యూమన్ మెషీన్‌వి...'' అంటూ మెషీన్ పై భాగంలో వున్న ఒక పెద్ద బటన్‌ని పుష్ చేశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

మూవీ కెమరా మాదిరి పైకి క్రిందికి కదిలి, షాడో తల దగ్గర్నుంచి పాదాలదాకా పూర్తిగా కవర్ చేసి చూస్తూ వుండగానే చటుక్కున ఆగిపోయింది వశీకరణ యంత్రం.

''వాటీస్ దిస్? వాట్ హేపెండ్??'' కనులు ఎర్రచేసి కాలయముడి మాదిరి సైంటిస్ట్ మీద విరుచుకుపడ్డాడు బెల్ రియా.

''పని పూర్తి అయిపోయింది... హీ ఈజ్ ఫినిష్డ్...'' షాడో కేసి తల ఊపుతూ కామ్‌గా ఎనౌన్స్ చేశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

తన చెవుల్ని తనే నమ్మలేనట్లు అతనివంకా, షాడో వంకా మార్చి మార్చి చూశాడు బెల్‌రియా.

''ఆశ్చర్యంగా చూడాల్సిన అవసరం లేదు... పని జరిగిందీ లేనిదీ పరీక్షించి చూసుకో... నీ కంఠస్వరం వినిపించిన వెంటనే రియాక్ట్ అవుతాడు అతను'' నమ్మకంగా చెపుతూ మెషీన్ దగ్గర్నుంచి ఇవతలికి వచ్చాడు ఇటాలియన్ సైంటిస్ట్.

''కాచ్ హిమ్ మిస్టర్ షాడో... కాచ్‌హిమ్...'' ఉన్నట్లుండి షాడోని హెచ్చరించాడు బెల్‌రియా... అతని చూపుడు వేలు సైంటిస్ట్‌ని చూపిస్తోంది.

కంటికి కనిపించనంత వేగంతో బెంచి మీది నుంచి లేచాడు షాడో... గుండెలనిండా గాలిని పీల్చుకుని ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి సైంటిస్ట్‌కి రెండు అడుగుల దూరంలో నేలను తాకాడు.

కుంగ్‌ఫూ పోరాట విద్యల్ని సాధన చేసి చేసి ఇనుపముక్కల మాదిరి తయారై వున్న చేతుల్ని జాచి అతన్ని ఒడిసి పట్టుకున్నాడు.

ఆ చేతుల్లోని కరుకుదనాన్ని భరింపలేక బాధగా శబ్దాలు చేశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"వదిలేయ్... నన్ను వదిలేయ్..." అని బ్రతిమాలుతూ, వదిలించుకోవటానికి ప్రయత్నించాడు.

వదిలిపెట్టలేదు షాడో... తలతిప్పి ప్రశ్నార్థకంగా చూశాడు బెల్‌రియా వంక.

విపరీతమైన ఆశ్చర్యం కాస్తా అపరిమితమైన సంతోషంగా మారుతుండగా, కట్టడం అదిరిపోయేటట్లు తొడ చరిచి తెరలు తెరలుగా నవ్వాడు ఆ కిల్లర్స్ గాంగ్ మెంబర్.

"ఈ ప్రపంచంలో ఎవరూచేయలేని పనిని నేను చేశాను. మా గాంగ్‌కి బద్ధ శత్రువైన షాడోని బంధించటమే కాదు, చెప్పిన పనిని చెప్పినట్లు చేసే బానిసగా మార్చి వేశాను... ఇక నాకు ఎదురన్నదే

లేదు...'' అంటూ ముందుకు వచ్చి ఇటాలియన్ సైంటిస్ట్ భుజం మీద బలంగా చరిచాడు.

సంతోషాన్ని ప్రకటించే దెబ్బ అది. అయినా తీవ్రమైన బాధకు గురి అయ్యాడా అమాయకుడు.

''నువ్వు చెప్పినట్లు చేస్తే నన్ను వదిలేస్తానని మాట ఇచ్చావు... నన్ను మా దేశం పంపించేస్తానని వాగ్దానం చేశావు...'' షాడో చేతుల్ని వదిలించుకునే ప్రయత్నాన్ని విరమించకుండా జాలిగొలిపే కంఠంతో అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

మాయమైపోయింది బెల్‌రియా ముఖం మీది నవ్వు.

''ఏ ఘనకార్యాన్ని నిర్వర్తించటం కోసం నేను ఈ ద్వీపం మీదికి వచ్చానో ఆ కార్యం పూర్తి అయ్యేదాకా నీ సహాయం నాకు అవసరం అవుతూనే వుంటుంది. ఆ మెషీన్ శక్తియుక్తులేమిటో నాకు పూర్తిగా అర్థం అయ్యేంతవరకూ నువ్వు కూడా మాతో పాటు ఇక్కడే వుండాలి... ఈ విషయంలో ఇక చర్చలు అనవసరం...'' అంటూ షాడోకి సైగ చేశాడు.

''వదిలేయ్ మిస్టర్ షాడో... మన సైంటిస్ట్‌ని వదిలేసి క్షమాపణలు చెప్పుకో...'' అని ఆజ్ఞ ఇచ్చాడు.

ఒక్క అంగుళం కూడా అవతలికి కదలటానికి వీలు లేకుండా బిగించి పట్టుకుని వున్నాడు షాడో ఇటాలియన్ సైంటిస్ట్‌ని.

వెంటనే వదిలిపెట్టి వెనక్కి జరిగాడు.

''ఐయామ్ సారీ సర్... మీకు కలిగించిన అసౌకర్యానికి చాలా విచారిస్తున్నాను...'' అస్పష్టమైన కంఠంతో మన్నింపు కోరుకున్నాడు.

అతను పట్టుకున్న చోట ఎర్రగా కందిపోయిన భుజాన్ని, చేతుల్ని సవరించుకుంటూ, కట్టడంలోనుంచి బయటికి బయలుదేరాడు సైంటిస్ట్.

''గోతి దగ్గరికి తీసుకుపో మిస్టర్ షాడో... తిరిగి నేను పిలిచేవరకూ మీరు ఇద్దరూ ఈ గోతిలోనే కూర్చోండి'' కట్టడం ద్వారం దగ్గరికి వస్తూ షాడోని హెచ్చరించాడు బెల్‌రియా...

మిలటరీ సైనికుడి మాదిరి స్టిఫ్‌గా అడుగులు వేస్తూ సైంటిస్ట్ ప్రక్కనే అడుగులు వేయటం మొదలుపెట్టాడు షాడో.

రెండు క్షణాలు అతని వంకే చూసి, తన అనుచరుల్లో ఒక వ్యక్తికి ఏదో సైగ చేశాడు బెల్‌రియా.

నిశ్శబ్దంగా ఏ మాత్రం సవ్వడి లేకుండా ముందుకు వచ్చాడా వ్యక్తి. తన చేతుల్లోని రైఫిల్‌ని గాలిలోకి ఎత్తి బలంగా మోదాడు షాడో తలమీద.

ఆఖరి క్షణంలో, ఆ దెబ్బ తన తలను ముక్కలు ముక్కలు చేయబోతున్న మూమెంట్‌లో, చటుక్కున ప్రక్కకు జరిగి అతి తేలికగా

తప్పించుకున్నాడు షాడో... అదే వూపులో తన ఎడమ పాదాన్ని వేగంగా పైకి ఎత్తి ఆ వ్యక్తి తొడలమీద తన్నాడు.

తొడలు విరిగిపోయినట్లు వెర్రిగా అరిచి వెనక్కి దొర్లాడు ఆ వ్యక్తి...

అతని చేతుల్లోనుంచి జారిపోయిన రైఫిల్‌ని తీసుకుని అతని గుండెల కేసి గురిపెట్టబోతున్న షాడోని అర్జంటుగా ఆపేశాడు బెల్‌రియా...

"స్టాప్ దట్ నాన్సెన్స్... స్టాపిట్ ఎట్ వన్స్... స్టాప్..." అని గుండెలు జలదరించేటట్లు అరిచాడు.

అదే పరిస్థితి అంతకుముందు ఒక అరగంటక్రితం ఎదురయివుంటే, నిర్మొహమాటంగా తన చేతుల్లోని రైఫిల్‌ని అతని గుండెలకేసి తిప్పేవాడు. జల్లెడ మాదిరి అతని శరీరాన్ని తూట్లు పడేసేవాడు.

కదలికల్లోని వేగం మందగించకపోయినా, అతని ఆలోచనల్లోని సునిశితత్వం అధికంగా లోపించినట్లు అనిపిస్తోంది ఇప్పుడు.

మరమనిషి మాదిరి బెల్‌రియా కేసి చూసి, రైఫిల్‌ని క్రిందికి దించేశాడు.

"యూకెన్ గో నౌ మిస్టర్ షాడో... గోతిలోకి పోయి విశ్రాంతి తీసుకోవటానికి అనుజ్ఞ ఇస్తున్నాను. యూ కెన్ గో..." తృప్తికరంగా తలవూపుతూ ముందుకు వచ్చి ఆనందంగా అన్నాడు బెల్‌రియా.

చేతిలోని రైఫిల్‌ని అతనికి ఇచ్చేశాడు షాడో. శిలా విగ్రహంలా నిలబడిపోయిన సైంటిస్ట్ చేయి పట్టుకుని గోతి దగ్గరికి తీసుకుపోయాడు.

అంతకుముందు పైకి రావటానికి ఉపయోగించిన నిచ్చెననే తిరిగి లోపలికి దించారు బెల్‌రియా అనుచరులు. బంధితులిద్దరూ అడుగు భాగంలో సెటిల్ అవగానే దాన్ని పైకి లాగి దూరంగా విసిరేశారు.

అసహ్యకరమైన వాసనలు వెదజల్లే సిగరెట్లను వెలిగించుకుని వాళ్ళు ఏవేవో కబుర్లు చెప్పుకోవటం మొదలుపెట్టేవరకూ ఆగి, మెల్లగా షాడో దగ్గరికి జరిగాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఎలా వున్నది మై ఫ్రెండ్? నేను తయారుచేసిన మెషీన్ ప్రభావం నీ మీద ఎలా పనిచేసింది" రహస్యం చెపుతున్నట్లు లోగొంతుకతో మాట్లాడాడు.

కనుచివరలనుంచి గోతిపై నున్న బెల్‌రియా అనుచరుల్నే గమనించుకుంటూ చిన్నగా నవ్వేశాడు షాడో.

"మెషీన్ ఆన్ చేశానుగానీ అదృశ్యకిరణాల్ని వెలువరించే బటన్‌ని ప్రెస్ చేయలేదు... నేను చేసిన పని ఆ దుర్మార్గుడికి అర్థం ఐతే, మనకు ప్రమాదం తప్పదు" గోడకు ఆనుకు కూర్చుంటూ బరువైన కంఠంతో అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

“ఏదో ఘనకార్యాన్ని పూర్తి చేయటం కోసం తను ఈ ద్వీపంలోకి వచ్చినట్లుగా మాట్లాడుతున్నాడు ఆ బెల్‌రియా... అదేమిటో మీకు తెలుసా?” సైంటిస్ట్ మాదిరిగానే లోగొంతుకతో అడిగాడు షాడో.

“నా మెషీన్‌తో నిన్ను వశపరుచుకుని తద్వారా పెద్ద పేరు తెచ్చుకోవచ్చనీ మాత్రం కాదు... ఈ కట్టడాలు, ఈ హంగు ఆర్భాటం ఇవన్నీ చూస్తుంటే చాలా పెద్ద ఎత్తుమీదే వున్నట్లు నాకు అనిపిస్తోంది...మనల్ని పట్టివుంచిన ఈ గోయివంటివి ఇంకా నాలుగైదు తవ్వించాడు.”

సాలోచనగా సమాధానం ఇచ్చాడు ఇటాలియన్ సైంటిస్ట్.

వశీకరణ యంత్రం నిజంగానే తన మనసును నిర్వీర్యపరిచినట్లు అనుభూతిని పొందాడు షాడో.

అడవి జంతువుల్ని పట్టుకోవటానికి అన్నట్లు కనిపించినా, డెఫినిట్‌గా ఆ పని చేయటానికి ఉద్దేశింపబడినవి మాత్రం కాదు ఆ గోతులు... ఎందుకు ఉద్దేశింపబడినవో ఎలా తెలుస్తుంది తనకు? తెలుసుకోవటానికి తగిన సమయం తనకు ఉన్నదా?

“ఏదో ఒకటి చేసి మనం ఇక్కడినుంచి తప్పించుకోగలిగితే బాగుంటుంది మై ఫ్రెండ్... చేతుల్లో వున్న పని కాబట్టి వశీకరణ యంత్రపు ప్రభావాన్ని నీమీద పడకుండా చేయగలిగాను...

ఏదైనా అనుమానం అంటూ వస్తే తనే స్వయంగా మిషన్‌ని ఆపరేట్ చేస్తాడు ఆ దుర్మార్గుడు...

ఆప్పుడు నీ పరిస్థితి అగమ్యగోచరమైపోతుంది. నా బ్రతుకు సర్వనాశనమైపోతుంది..." తనలో తను అనుకుంటున్నట్లు అస్పష్టమైన కంఠంతో పైకి అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అనటం అయితే అన్నాడు గానీ, వేలుపెడితే జర్రుమని జారిపోయేటంత నునుపుగా వున్న ఆ గోతిలో నుంచి పైకి పోవటం ఎలాగో అర్థం కాలేదు అతనికి... ఒకవేళ పోగలిగినా, యమభటులు మాదిరి కాపలావున్న బెల్‌రియా అనుచరుల్ని ఎలా తప్పించుకోవాలో అంతుబట్టలేదు.

నిరాశా నిస్పృహలు నిండిన ముఖాన్ని మోకాళ్ళ మీద ఆనించుకుని చలనం లేకుండా కూర్చున్న ఆ సైంటిస్ట్‌ని చూసి జాలితో ద్రవించిపోయింది షాడో హృదయం.

"పారిపోయే ప్రయత్నం చేసేముందు ఒక ప్రశ్న అడగదలచుకున్నాను. సూటిగా సమాధానం ఇవ్వాలి" ముందుకు వంగుతూ ప్రశ్నించాడు.

తల ఎత్తి అతని ముఖంలోకి చూశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"మనం ఇక్కడి నుంచి పారిపోయిన వెంటనే ఆగ్రహావేశాలతో రగులుకుపోతూ కక్ష సాధించే పనులు మొదలుపెడతాడు బెల్‌రియా...

మనల్ని పట్టుకోవటం కుదరని పక్షంలో మీ కుటుంబ సభ్యుల మీదికి దృష్టిని సారించవచ్చు...

మీ మూలకంగా వారికి కష్టాలు సంప్రాప్తించవచ్చు... అప్పుడు మీ పరిస్థితి ఎలా వుంటుంది?"

సూటిగా స్ట్రెయిట్‌గా అసలు విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు బయట పెట్టాడు షాడో.

అతని మాటలు విని ఆలోచనలో పడ్డాడు ఇటాలియన్ సైంటిస్ట్.

తన కుటుంబ సభ్యులను తలచుకుంటూ గోతి గోడకు అనుకుని కూర్చున్నాడు.

తొందర పెట్టలేదు షాడో - ఇటాలియన్ సైంటిస్ట్‌ని. తన ప్రశ్నకు సమాధానం ఇవ్వమని బలవంతం చేయలేదు. సిగరెట్ కాల్చుకుంటే బాగుంటుందన్న కోరికను అణుచుకుంటూ వెనక్కివాలి కూర్చున్నాడు.

తల ఎత్తి చూస్తే సమాధానం ఇవ్వాల్సి వస్తుందన్న భయంతో కాబోలు, వంచిన తల ఎత్తకుండా వుండి పోయాడు సైంటిస్ట్.

అందుకు ఆగ్రహించలేదు షాడో... అతన్ని వెక్కిరించలేదు. తన కుటుంబ సభ్యులు హాయిగా జీవించటం కోసం బెల్‌రియా బలవంతానికి తల ఒగ్గాడతను. వశీకరణ యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు.

తను అక్కడినుంచి అవతలికి జంప్ చేస్తే, బెల్‌రియా దృష్టి తన కుటుంబం మీదికి మరలుతుందనే మాట అతన్ని అయోమయావస్థలోకి నెట్టిందనే విషయం కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వున్నది.

రాతి గోడల గోయి బాగా లోతుగా ఉండటంవల్ల గాలి లోపలికి రావటం లేదు. ముఖాల మీది స్వేదబిందువులు ఆరిపోవటంలేదు.

స్నానం చేసినట్లు తడిసిపోయింది షాడో ధరించివున్న షర్టు... వెన్ను మీది నుంచి చుక్కలు చుక్కలుగా క్రిందికి జారుతోంది స్వేదం. వీపుకు అతుక్కున్నట్లు తయారైన షర్టును ఎడమచేత్తో సరిచేసుకోబోతూ, ఎందుకనో ఉలిక్కిపడ్డాడు షాడో.

దుస్తులు తడిసిపోయేటంత చెమట పోస్తున్న మాట వాస్తవమే అయినా, రాతినేలమీద మడుగు కట్టేటంత దారుణం మాత్రం కాదు.

అతను కూర్చున్న ప్రదేశంలో ప్రత్యక్షం అయివుంది చిన్న నీటి మడుగు. ఎక్కడినుంచి వచ్చింది నీరు? తన శరీరం నుంచేనా?

వంచిన తలను పైకి ఎత్తకుండా అలాగే బొమ్మలా కూర్చున్న సైంటిస్ట్ గురించి మర్చిపోయాడు షాడో. తాను కూర్చున్న ప్రదేశంలో నుంచి

ఇవతలికి జరిగి తను ఆనుకొని వున్న రాతి గోడను పరిశీలనగా చూశాడు. సముద్రానికి చాలా దగ్గర్లో వుండటం వల్ల, ఆ ప్రదేశంలోకి పోడుచుకువచ్చింది సముద్రపు నీరు, రాతి గోడను బద్దలు కొట్టుకుని బయటికి వచ్చేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది.

షాడో భుజాల రాపిడికి రాతిగోడలోని కొన్ని ఇసుకరేణువులు రాలిపోవటంవల్ల అవుట్ లెట్ దొరికిందన్న సంతోషంతో అతినెమ్మదిగా చెమరుస్తున్నది. పట్టరాని సంతోషంతో బిగ్గరిగా అరవాలన్న కోరిక ఒక ఊపు వూపి వదిలింది షాడోని.

షాడో అంతటివాడిని పట్టుకోగలిగానన్న సంతోషంలో అతని దుస్తుల్ని పరీక్ష చేయించలేదు బెల్రియా, యధాతధంగా పాదాలను అంటిపెట్టుకునే వున్నాయి బూట్లు... కుడి బూటుకు అడ్డంగా బిగించి వున్న డాగర్ కూడా సురక్షితంగానే వున్నది.

గురిచూసి విసిరితే యాభై అడుగుల దూరంలో వున్న టార్గెట్నైనా సరే రెండుగా చీల్చగల ఆ ఆయుధాన్ని బయటికి తీసి, చెమర్చుతున్న గోడకు వెంటనే రంధ్రం వేయాలన్న కోరికను అతికష్టం మీద అదుముకున్నాడు అతను.

విపరీతమైన ఎగ్జయిట్మెంట్తో వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టిన గుండెల్ని చిక్కబట్టుకుంటూ సైంటిస్ట్ వైపు చూశాడు.

రెండు నిముషాల తరువాత ఒక నిర్ణయానికి వచ్చినట్లు గాఢంగా నిట్టూర్చి తలను పైకి ఎత్తాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్ మై ఫ్రెండ్... ముందు ఇక్కడినుంచి తప్పించుకోవాలి. ప్రాణాలతో క్షేమంగా అవతలికి పోగలిగిన తర్వాత ఆలోచిస్తాను నా కుటుంబాన్ని గురించి..." అంటూ జీవం లేని నవ్వొకటి నవ్వాడు.

గుండెల్ని పిండివేసే బాధను దిగమ్రింగుకుని అతనలా నవ్వగలగటం అబ్బురమనిపించింది షాడోకి. చీకటిపడే దాకా కదలకుండా కూర్చుని ఒక్కసారిగా యాక్షన్‌లోకి దిగిపోయాడు.

"పదినిముషాలు శబ్దం చేయకుండా కూర్చోండి... ఏ పరిస్థితి ఎదురైనా కంగారు పడకండి..." అంటూ బూటుకు బిగించి వున్న డాగర్‌ని తీసి, రాతిగోడ మీద ప్రయోగించడం మొదలుపెట్టాడు.

"ఈ రాయి చాలా బలంగా వుంటుంది మై ఫ్రెండ్... ఈ ప్రదేశంలో ఏదైనా సొరంగం తవ్వే ఆలోచన నీకు వుంటే వెంటనే విరమించుకోవడం చాలా మంచిది... జానెడు పొడుగు కూడా లేని నీ ఆయుధం క్షణాల మీద నిరుపయోగం అయిపోతుంది" అతనేం చేయదలుచుకున్నాడో అర్థంకాకపోయినా, అతని భుజంమీది నుంచి ముందుకు తొంగి చూస్తూ కామెంట్ చేశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

సమాధానం యివ్వలేదు షాడో... తను చేపట్టిన కార్యక్రమాన్ని ఆపలేదు.

పదినిముషాలు గడిచేసరికి మెల్లిగా ప్రత్యక్షం అయింది చిటికెనవేలంత లావున్న జలధార... మరో పదినిముషాల్లో అది నాలుగింతలయింది.

షాడో కుడి మోకాలిమీద పడి, శివుడి తలమీద నుంచి జారే ఆకాశగంగ మాదిరి అతి నిశ్శబ్దంగా ఆ గోతిని నింపుతున్న జలధారను గమనించేసరికి వెడల్పు అయ్యాయి సైంటిస్ట్ కనులు...

"దిసీజ్ అన్ బిలీవబుల్... దిసీజ్ సింప్లీ ఫెంటాస్టిక్... నిన్ను చూసిన మరుక్షణం నన్ను రక్షించగల మొనగాడు వచ్చాడని చెప్పింది నా ఇన్‌స్టింక్ట్. నాతో పాటు నా ఫ్యామిలీని కూడా నువ్వు రక్షించగలవని ఇప్పుడు అర్థం అవుతున్నది నాకు... నీ సహాయంతో ఇక్కడి నుంచి తప్పించుకోవాలని నేను తీసుకున్న నిర్ణయం నాకు పూర్తి సంతోషాన్ని కలిగిస్తోంది యిప్పుడు. ఐయామ్ హేపీ మై ఫ్రెండ్... వెరీ హాపీ..." ఆనందంగా అంటున్న అతని నోటిని గబుక్కున గట్టిగా అదిమాడు షాడో.

"పైన వున్న రాక్షసులు మన ఘనకార్యాన్ని గమనిస్తే కథ మళ్ళీ మొదటికి వచ్చేస్తుంది. ఈ సారి వట్టిగా కూర్చోబెట్టడు బెల్‌రియా కాళ్ళూ

చేతుల్ని గట్టిగా బంధించి నోటిలో గుడ్డల్ని కూడా కుక్కుతాడు...'' లోగొంతుకతో అంటూ తను ప్రారంభించిన పనిమీద దృష్టిని కేంద్రీకరించాడు.

క్షణాలు గడిచిన కొద్దీ పెద్దది అయిపోయింది జలధార... నాలుగే నాలుగు నిముషాల్లో షాడో భుజాల్ని దాటి పొంగులు పెడుతూ ఆ గోతిని నింపటం మొదలుపెట్టింది నీరు, అప్పుడు... అతివేగంగా ఆ నీరు తమ శరీరాల్ని చుట్టుముట్టి పైపైకి లేస్తున్నప్పుడు గుర్తుకు వచ్చింది షాడోకి ఒక ముఖ్యమైన ప్రశ్న.

''మీకు... మీకు ఈత వచ్చా?'' ముందుగానే ఆ అనుమానాన్ని బహిర్గతం చేయనందుకు నొచ్చుకుంటూ మెల్లిగా అడిగాడు.

తెల్లటి పల్వరున తళుక్కుమనేటట్లు నవ్వి తల వూపాడు ఇటాలియన్ సైంటిస్ట్.

''అవసరమయితే మన చుట్టూ వున్న సముద్రాన్ని కూడా ఈదగలను మై ఫ్రెండ్... నా గురించి ఆలోచించటం మానేయ్... గోతిపైకి చేరుకున్న తర్వాత చేయవలసిన పనుల్ని గురించి యోచించు....'' అంటూ షాడోని ఎంకరేజ్ చేశాడు.

కుడిచేతిలో వున్న డాగర్‌ని ఎడమచేతిలోకి మార్చుకుంటూ రాతిగోడకు ఆనుకుని నిలబడ్డాడు షాడో...

భుజాల్ని దాటిన నీరు శరీరాన్ని పైకి లేపగానే, గోడవారగా పైకి తేలాడు.

బయటికి దుమికే మార్గం కనిపించిన వెంటనే రెచ్చి పోయింది ఆ భూగర్భ జలధార... క్షణక్షణానికీ వేగాన్ని హెచ్చించుకుని ఇరవై నిముషాల వ్యవధిలో గోతిని పూర్తిగా ఆక్రమించుకున్నది.

తన తల గోతి అంచునే సమీపించిన మరుక్షణం, పది అడుగుల దూరంలో కాపలా కూర్చుని వున్న బెల్‌రియా అనుచరులను చూశాడు షాడో. ఎడమచేతిలోని డాగర్‌ని ముందుకు విసురుతూ, ఒక్క ఉదుటున గోతిలోనుంచి బయటికి దొర్లాడు.

సముద్రం మీది నుంచి వీస్తున్న చల్లటి గాలి తమ ముఖాలను బాధించకుండా తలలు మోకాళ్ళ వరకు వంచుకుని కూర్చున్నారు వాళ్ళు. చీకటి మాటున తమను చుట్టు ముట్టబోతున్న ప్రమాదాన్ని గమనించటం చేతకాలేదు వారికి.

గోతిని నింపటంతో తృప్తిపడలేదు భూగర్భజలధార... అంచుల మీది నుంచి పొర్లి, ఖాళీ ప్రదేశంలోకి పరుగులు మొదలుపెట్టింది.

అప్పుడు క్రియేట్ అయిన శబ్దాన్ని ఆలకించి, చివ్వున తలలు తిప్పారు. కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

కంటికి కనిపించనంత వేగంతో పోయి ఒక వ్యక్తి గొంతులో దిగబడింది షాడో విసిరిన డాగర్.

బిగ్గరిగా అరవటానికి నోరు తెరిచాడతను. అరుపు పెదవుల్ని దాటి బయటికి రాకముందే ప్రాణాలను కోల్పోయి ముందుకు పడ్డాడు.

అదిరిపడి అతన్ని పట్టుకోబోతున్న రెండో మనిషి మీదికి కాలభైరవుడి మాదిరి ఎగబడ్డాడు షాడో.

కుడిచేత్తో అతని మెడను బలంగా చుట్టి, ఎడమ పిడికిలితో తలమీద కొట్టాడు.

ఆరు పౌండ్ల బరువుండే ఐరన్ హేమర్‌తో కొట్టినట్లు టప్‌మని శబ్దం చేస్తూ రెండుగా విచ్చింది ఆ మనిషి తల, ఎర్రటి రక్తపు ధారలు జలజలా భుజాల మీదికి జారుతుండగా ఎలా వున్నవాడు అలాగే స్పృహను కోల్పోయాడు. శబ్దం కాకుండా అతని శరీరాన్ని నేలమీదికి వాల్చి, అతని దగ్గిరవున్న రైఫిల్‌ని తను తీసుకున్నాడు షాడో. మొదటి వ్యక్తి గొంతులో దిగబడిన డాగర్‌ని తీసి ప్యాంటు బెల్టులో దోపాడు.

ఆ సరికి గోతిలోనుంచి బయటికి రాగలిగాడు సైంటిస్ట్. సముద్రం మీదినుంచి వస్తున్న చలిగాలికి వణుకుతూ షాడో ముఖంలోకి చూశాడు.

''నన్ను ఇక్కడికి తీసుకువచ్చిన మోటార్ బోట్ వంటివి ఇంకా కొన్ని తీరంలో వుండి వుంటాయి. వాటిని చేరుకోగలిగితే మనం తప్పించుకున్నట్లే లెక్క కమాన్'' అంటూ కదిలాడు షాడో.

అతని మాదిరి నిశ్శబ్దంగా అడుగులు వేయటానికి విశ్వయత్నం చేస్తూ అనుసరించాడు ఇటాలియన్ సైంటిస్ట్. పాతిక గజాల దూరం పోయిన తర్వాత ఉన్నట్లుండి ఆగిపోయాడు ఒక బండరాయి దగ్గిర. అతను ఎందుకు ఆగి పోయాడో అడగలేదు షాడో... అప్పటికే అతని దృష్టి పథంలోకి వచ్చారు ఆ బండరాయికి అల్లంత దూరంలో నిలుచునివున్న బెల్'రియా అనుచరులు నలుగురు.

''ఎందుకైనా మంచిదని వాళ్ళని మోటార్ బోట్లకు కాపలా కోసం పెట్టి వుంటాడు ఆ దుర్మార్గుడు... వాళ్ళకు అగుపించకుండా అవతలికి పోవడం కొంచెం కష్టం అయ్యేటట్లు కనిపిస్తోంది'' అంటూ, చేతిలోవున్న రైఫిల్'ని క్రింద పెట్టి, ప్యాంటు బెల్టులో దోపుకున్న డాగర్'ని బయటికి తీశాడు.

''బెల్'రియా కట్టించిన కట్టడాలు చాలా పల్లపు ప్రదేశంలో వున్నాయి. మనల్ని గోతిలోనుంచి బయటపడేసిన జలధార అటు తిరిగి, ఇటు తిరిగి ఆ కట్టడాల దగ్గిరికి పోతే మనకు ఇబ్బంది ఎదురవుతుందా?''

పాములా నేలమీదికి వాలి ముందుకు పాకబోతున్న షాడో చెవిలో రహస్యంగా అడిగాడు ఇటాలియన్ సైంటిస్ట్.

ఆ విషయాన్ని ముందుగానే గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోనందుకు తనను తనే నిందించుకుంటూ, బండరాయి చాటున మోకరించి కూర్చున్నాడు షాడో, పల్లపు ప్రదేశంలో వున్న కట్టడాల దగ్గిరికి వచ్చేస్తున్న నీటిని బెల్‌రియా గమనించే లోపుగా తాము మోటార్ బోట్స్ దగ్గిరికి చేరుకోవడం సాధ్యపడుతుందా?

సాధ్యపడే పని కాదని తెలిసిరావటానికి ఏంతో సమయం అవసరం లేకపోయింది, ఆ మాట అతని మనసులో మెదులుతూ వుండగానే, చెవులు చిల్లులు పడేలా వినవచ్చాయి అరుపులు.

"ఎలర్ట్‌గా వుండండి... ఎటువంటి ఎమర్జెన్సీనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుండండి... గోతిలో వున్న బందీలు ఏమైపోయారో చూడండి... కమాన్... మూవ్?" ఖంగుమంటూ బెల్‌రియా కంఠం, ఆ అరుపుల్ని అనుసరించి వినవచ్చింది.

జాగ్రత్తలన్నిటినీ గాలికి వదిలేసి, క్రింద పెట్టిన రైఫిల్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు షాడో, బ్రహ్మ రాక్షసుడి మాదిరి బండరాయి చాటునుంచి లేచి నిర్దాక్షిణ్యంగా కాల్పులు మొదలుపెట్టాడు.

ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపుగానే విరుచుకుపడిపోయారు అతని దారికి అడ్డుగా వున్న వ్యక్తులు నలుగురూ.

సైంటిస్ట్ చేతిని గట్టిగా పట్టుకుని, నీటి ఒడ్డుకు పరుగుతీశాడు షాడో... మోకాలి లోతున్న సముద్రపు నీటిలో ఎగిరెగిరి అడుగులువేస్తూ, దగ్గర్లో అగుపించిన ఒక బోటును చేరుకున్నారు.

రైఫిల్ మ్రోతలు ఎటునుంచి వినవచ్చాయో అర్థం చేసుకుని మిడతల దండు మాదిరి బెల్‌రియా అనుచరులందరూ అక్కడికి రాకముందే సముద్ర మధ్యంలోకి పారిపోవాలని అతని ఉద్దేశ్యం..

బోటును వేగంగా ముందుకు దూకించే మోటార్ మీద చేయి వేసిన మరుక్షణం ఆ పని అసాధ్యమని తెలిసివచ్చింది అతనికి.

బోటులోని మోటార్ పని చేయటానికి కావాల్సిన కొన్ని ముఖ్యమైన భాగాలను ఊడతీయించాడు బెల్‌రియా. తన అనుమతి లేకుండా ఎవరూ సముద్రం మీదికి పోవటానికి వీలులేకుండా తగినటువంటి జాగ్రత్తలు తీసుకున్నాడు.

"బెల్‌రియా శక్తిని నేను చాలా తక్కువగా అంచనా వేశాను. నా బూటుకాలికి వున్న ఆయుధాన్ని అతను కనిపెట్టలేకపోయే సరికి నాకు ఆత్మవిశ్వాసం అధికమైపోయింది." అంత చలి వాతావరణంలోను, ముఖం

మీద ప్రత్యక్షం అయిన చెమట బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ అన్నాడు షాడో.

"ఇప్పుడు ఏం చేద్దాం మై ఫ్రెండ్? నీటిలోకి దూకి ఈదుకుంటూ వెళ్ళిపోదామా?" అంతకుముందు అతను అడిగిన ప్రశ్నను గుర్తుకు తెచ్చుకుంటూ ఆత్రుతగా అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

భూగర్భ జలధారలో పూర్తిగా మునగటంవల్ల మరోసారి చిమచిమలాడటం మొదలుపెట్టిన తన శరీరం మీది గాయాల వంక చూసుకుంటూ గాఢంగా నిట్టూర్చాడు షాడో.

ఎంత దూరంలో ఉన్నదో తెలియని అవతలి ఒడ్డును వెతుక్కుంటూ నీటిలోకి దుమికితే అన్యాయం అయిపోతాడు తను. అతిగా కదిలితే తిరిగి యధాప్రకారం రేగుతాయి తన గాయాలు, రక్తపు దారల్ని వెలువరిస్తాయి. ఆ వాసనను పసిగట్టిన సముద్ర చరాలు ఏవైనా తమను ఎటాక్ చేస్తే అక్కడితో ఫినిష్ అయిపోతుంది తమ కథ.

"ఏం చేయాలో త్వరగా నిర్ణయించుకో మై ఫ్రెండ్, బెల్‌రియా అనుచరులు మనకోసం వచ్చేస్తున్నారు..." ఉన్నట్టుండి సైంటిస్ట్ కీచుకంఠంతో అరిచేసరికి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు అతను.

ఇటాలియన్ సైంటిస్ట్ సూచించినట్లు సముద్రంలోకి దూకే అవకాశం కూడా చేజారిపోయినట్లు అర్థం అయ్యేసరికి చీమలు పాకినట్లు జలదరించింది షాడో శరీరం...

"మోటార్ బోట్స్ దగ్గిరికి ఎవరూ పోకండి. మన దగ్గిర వున్న మర ఫిరంగులతో వాటిని నాశనం చేయిస్తున్నాను... దూరంగా నిలబడి, బందీలు అడవిలోకి పారిపోకుండా చూసుకోండి" లౌడ్ స్పీకర్‌లో నుంచి వినబడినట్లు బిగ్గిరిగా వినవచ్చింది బెల్‌రియా కంఠం.

అదే సమయంలో గుండెలు జలదరించే శబ్దంతో అగ్నిగోళాల్ని విసరటం మొదలుపెట్టింది కట్టడాల దగ్గిర్నుంచి ఒక మరఫిరంగి.

చూస్తూ చూస్తూ వుండగానే ముక్కలు ముక్కలై గాలిలోకి ఎగురుతున్న మోటార్ బోట్స్‌ని గమనించిన మరుక్షణం, తిరిగి నీటిలోకి దూకేశాడు షాడో...

"కమాన్... కమాన్..." అని సైంటిస్ట్‌ని త్వరపెడుతూ ఒడ్డున చేరుకున్నాడు.

సరిగ్గా అప్పుడే వారు వదిలి పెట్టిన బోటుమీద పడింది ఒక అగ్ని గోళం, కన్నుమూసి కన్ను తెరిచేంతలో సర్వనాశనం అయిపోయిందా బోటు.

"తన వాహనాలన్నింటినీ నాశనం చేసుకుంటే తిరిగి తను అవతలికి ఎలా వెళ్ళగలడు ఈ రాస్కెల్?" అంత ఖంగారులోను, తన మనసులో మెదిలిన సందేహాన్ని బయటపెట్టకుండా ఉండలేకపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అవసరం అయితే సుప్రీమ్ కమాండ్‌కి కబురుపంపి, నాశనం అయిపోయిన పడవలకంటే అధునాతనమైన బోట్లను తెప్పించుకోగల శక్తి బెల్‌రియాకి వున్నదని షాడోకి తెలుసు.

ఎంతటి శక్తి వున్నా, ఎమర్జెన్సీ కోసం ఒక్క పడవను కూడా మిగుల్చుకోకుండా అన్నింటినీ నాశనం చేయటమే అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఎవరికీ అనుమానం రాని ఆ నిర్జన ప్రదేశంలో ఇటాలియన్ సైంటిస్ట్‌ని కూర్చోబెట్టి వశీకరణ యంత్రాన్ని తయారుచేయించడం కోసం ఆ ఒంటరి ద్వీపాన్ని ఎంచుకోవడం జరిగిందనే అనుకుంటున్నాడు అతను. ఒక దాని తర్వాత ఒకటిగా ముక్కలైపోయిన మోటార్ బోట్స్‌ని చూసేసరికి షాడో మనసులో మెదలటం మొదలైంది మరో అనుమానం.

ఇటాలియన్ సైంటిస్ట్‌ని బంధించి వశీకరణ యంత్రాన్ని తయారుచేయించటం కోసమే ఎన్నుకోబడలేదు ఈ ద్వీపం, ఇంకేదో కారణం

వుండే వుంటుంది... అందుకే తమను అడవిలోకి పోకుండా అడ్డుకోమని అనుచరులకు ఉద్బోధిస్తున్నాడు.

"అరుగరుగో బందీలు, నీటి ఒడ్డున నిలబడి దిక్కులు చూస్తున్నారు పట్టుకోండి" అంటున్న కంఠం ఒకటి వినవచ్చే సరికి, ఉలిక్కి పడి తన ఆలోచనల్లో నుంచి బయటపడ్డాడు షాడో.

కట్టడం దగ్గిరవున్న మరఫిరంగి మౌనం వహించింది. దాని స్థానంలో టకటకమంటూ వెలగటం మొదలుపెట్టాయి పవర్‌ఫుల్ ఫ్లడ్ లైట్లు.

రెండో ఆలోచన లేకుండా కుడికాలి బూటును ఊడదీసి, మడమలో దాచిన రెండో మెటల్ బాల్‌ని ముందుకు విసిరేశాడు షాడో.

వెనకాముందూ చూడకుండా ఉరుకులు పరుగులమీద వచ్చేస్తున్న బెల్‌రియా అనుచరుల మధ్యలో పడిందది... ఆకాశం బ్రద్ధలైనట్లు, భయంకరమైన శబ్దాన్ని వెలువరిస్తూ ప్రేలిపోయింది.

అంతే! గావుకేకలు పెడుతూ గాలిలోకి లేచారు బెల్‌రియా అనుచరులు. కనురెప్పపాటు కాలంలో అంతా నాశనం అయిపోయారు.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేతంత నిశ్శబ్దం ఆవరించుకున్నది సముద్రతీరంలో ఏర్పాటు చేయబడివున్న ఆ కిల్లర్స్ గాంగ్ స్థావరంలో... చూస్తూ చూస్తూ వుండగానే జరిగిన ఆ దారుణాన్ని గమనించి స్థాణువులయ్యారు ప్రాణాలతో వున్న బెల్‌రియా అనుచరులు.

షాడో విసిరిన మెటల్ బాల్ బ్రద్దలైనప్పుడు ఉత్పన్నమైన ప్రచండ శక్తి మనుష్యులనే కాకుండా, దగ్గర్లో వున్న రెండు మూడు కట్టడాలను కూడా కూల్చివేసింది. స్థావరం చుట్టూ ఏర్పాటు చేయబడి వున్న ఫ్లడ్ లైట్స్‌కు ఎలక్ట్రిసిటీని సరఫరా చేసే జనరేటర్ ఆ కట్టడాల్లోనే వున్నది కాబోలు - ఒక్కసారిగా పనిచేయటం మానుకున్నది అది.

అప్పటివరకూ కనులు మిరుమిట్లు గొలిపే వెలుగును ఉత్పత్తి చేస్తున్న ఆ లైట్లు వెలగటం మానుకోగానే స్థావరాన్ని చుట్టుముట్టింది కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కారు చీకటి.

బెల్‌రియా ఉపయోగించిన మరఫిరంగుల దెబ్బకు సముద్రంలో వున్న మోటార్ బోట్స్ అన్నీ ముక్కలు ముక్కలై పోవటం వల్ల, స్థావరం వెనుక భాగంలో వున్న అడవికేసి మరలింది షాడో దృష్టి.

పాడయిపోయిన జనరేటర్‌ని బాగుచేసి, మరోసారి ఫ్లడ్‌లైట్‌లను బెల్‌రియా వెలిగించకముందే ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టటానికి అంతకంటే మార్గం మరొకటి ఎంత ఆలోచించినా అగుపించలేదతనికి.

''ఈ అరణ్యాన్ని గురించి నీకు పూర్తిగా తెలిసినట్లు లేదు మై ఫ్రెండ్... ఇందులోకి పోయిన వాళ్ళు ఎవరూ తిరిగి ప్రాణాలతో బయటికి రాలేదుట...'' చీకటి మాటున స్థావరం వెనుక భాగంలోకి పరిగెత్తటం

మొదలుపెట్టిన షాడో చేయిపట్టుకుంటూ ఆందోళనగా అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

“ఆ విషయం నీకు ఎలా తెలిసింది?” పరుగు ఆపకుండానే అతన్ని ప్రశ్నించాడు షాడో.

“నువ్వు ఇక్కడికి రాకముందు బెల్‌రియా అనుచరులు మాట్లాడుకుంటుంటే నేను విన్నాను, పాములు, తేళ్ళు, క్రూరమృగాలు వాటన్నిటినీ మించి కందిరీగలంత వుండే దారుణమైన దోమలు మనల్ని పీక్కుతింటాయిట...” వేగంగా పరిగెత్తటం అలవాటు లేకపోవడం వల్ల, అప్పటికప్పుడు ఆయాసపడిపోతూ అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అడవి అన్న తర్వాత అతను చెప్పే క్షుద్రజీవులన్నీ ఎక్కడో ఒకచోట తారసపడి తీరతాయని షాడోకి తెలుసు. వాటిని గురించి పర్టిక్యులర్‌గా ముచ్చటించుకోవాల్సిన అవసరం లేదు.

ప్రాణాలు పోగొట్టుకోవటానికి ఆ సైంటిస్ట్ చెప్పిన పాములు, దోమలే అవసరం లేదు, పాముల కోరల్లో వుండే విషం కంటే వందరెట్లు పవర్‌ఫుల్ పాయిజన్‌ని కలిగివుండే ముళ్ళ పొదలు, విషవృక్షాలు నెలకొని వుంటాయి ఆ అడవుల్లో. వాటిమీదనుంచి వీచే గాలిని పీల్చినా, వాటి మూలకంగా ఒంటిమీద గాయాలు అయినా, క్షణాల మీద అనంత విశ్వంలోకి ఎగిరిపోతాయి ప్రాణవాయువులు.

ఒకే ఒక్క క్షణం పాటు మనసులో మెదిలిన ఆ మాటలన్నిటినీ ఇటాలియన్ సైంటిస్ట్‌కి చెప్పలేదు షాడో. అతని వివశుడ్ని చేస్తున్న ఆయాసాన్ని అసలెంత మాత్రమూ గమనించనట్లు అతివేగంగా పొదల మధ్యకు తీసుకుపోయాడు.

షాడో భయపడినట్లే ఖచ్చితంగా పదినిముషాల తరువాత పెద్ద శబ్దంతో పనిచేయటం మొదలుపెట్టింది కూలిపోయిన కట్టడాల్లోని జనరేటర్.

ఒకదాని తర్వాత ఒకటిగా వెలగటం ప్రారభించాయి ఫ్లడ్‌లైట్లు. ఆ వెలుగులో స్థావరాన్నంతా కలియచూశాడు బెల్‌రియా...

మెటల్ బాల్ దెబ్బకు ప్రాణాలు పోగొట్టుకోకుండా మిగిలిన అనుచరులందర్నీ తన దగ్గిరికి రప్పించుకున్నాడు.

"మన చేతికి చిక్కగానే ఆ షాడోని హతమార్చి వుండాల్సింది. అతని శక్తిసామర్థ్యాలను గురించి ఎన్నో విషయాలు తెలిసి కూడా ఏమరిపాటున వుండటం వల్ల ఈ అనర్థం సంభవించిది. పొదల్లోకి పారిపోయిన కుందేలును, అడవిలోకి అడుగు పెట్టిన షాడోని పట్టుకోవడం అసాధ్యం అని నాకు తెలియచేయబడింది. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?" అందరి ముఖాలవంకా చూస్తూ అడిగాడు.

అంతకు ముందు వరకూ ఆజ్ఞలు జారీ చేయటమే గానీ, అభిప్రాయాల్ని అడగటం అలవాటులేని ఆ పెద్దమనిషి ఆ విధంగా మాట్లాడేసరికి అవాక్కయిపోయారు అతని అనుచరులు.

“మీ ఉద్దేశ్యాలు ఏమిటో చెప్పమని అంటుంటే చెవిటి వాళ్ళ మాదిరి అలా నోళ్ళు తెరుచుకు చూస్తారేమిటి...? మాట్లాడండి వెంటనే...” అసహనంగా అంటున్న బెల్‌రియా వంక బెదురుగా చూస్తూ గొంతు సవరించుకున్నాడు ఒక అనుచరుడు.

“సరయిన ఏర్పాట్లు లేకుండా ఈ అడవిలోకి పోవటమెంత ప్రమాదమో మనకు లోగడ చాలా బాగా తెలిసిన విషయం. షాడో ఎంతటివాడయినా ఒంటరిగా ఇక్కడ నెగ్గుకురాగలడని నేను అనుకోవటంలేదు. ఈ రాత్రి గడిచేదాకా ఆగుదాం. తెల్లవారగానే అతన్ని తరుముకుంటూ పోదాం...

అడవి జంతువులకు ఆహారం కాగా మిగిలిన అతని శారీరమో, లేక తలను కోల్పోయిన అతని మొండెమో మనకు తప్పకుండా కనిపించి తీరుతుంది” ఒక్కొక్క మాటను ఆచితూచి ఉపయోగిస్తూ తన మనసులోని ఉద్దేశ్యాన్ని బహిర్గతం చేశాడు.

దట్టంగా వున్న కనుబొమ్మల్లోనుంచి సీరియస్‌గా చూస్తున్న బెల్‌రియా ముఖం మీద వెంటనే ప్రత్యక్షం అయిందొక చిరు దరహాసం.

"ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురయినా నేర్పుగా అవతలికి జంప్ చేసే తెలివితేటలు షాడోకి వున్నాయని నాకు నూరిపోయబడింది. కలలో కూడా ఊహించలేని విచిత్రమైన పరిస్థితులు ఇప్పుడు అతనికి ఎదురవబోతున్నాయి... వాటిని అతను ఎలా ఎదుర్కోగలడో కనులారా చూసే అవకాశం లభించబోతున్నందుకు సంతోషిస్తున్నాను." అంటూ మెటల్‌బాల్ దెబ్బకు హతమారిపోయిన వారందరినీ ఒకచోట చేర్పించే ప్రయత్నాలు ప్రారంభించాడు బెల్‌రియా.

ఆ భీభత్సాన్ని పసికట్టి ఆవురావురుమంటూ అడవిలోని జంతువులన్నీ అక్కడికి వచ్చేయకముందే, చెల్లాచెదురైపోయిన తమ సహచరుల అవశేషాలన్నిటినీ ఒక గోతిలోకి దొర్లించి మట్టితో కప్పి పెట్టేశారు అతని అనుచరులు. సమాధుల మాదిరి పెద్దపెద్ద బండ రాళ్ళను చేర్చారు ఆ మట్టిమీద.

"తూర్పు దిక్కు తెల్లబడే వరకూ విశ్రాంతి తీసుకోండి. వెలుగు రాగానే మనం ప్రయాణం కావాలి..." ఆఖరి ఆజ్ఞలను అతి ఖచ్చితంగా వారికి వినిపించి తన కట్టడంలోకి వెళ్ళి పోయాడు బెల్‌రియా...

సినీ కెమెరా మాదిరి నిలబెట్టివున్న వశీకరణ యంత్రం అతని బెడ్‌కి సమీపంలోనే వుంది.

అరచేతులతో దాన్ని ఆప్యాయంగా తడిమి, అందులో బిగించి వున్న కంప్యూటర్ వంక ఒకసారి చూసుకున్నాడు బెల్‌రియా...

"అరణ్యంలో ప్రాణాలు వదలకుండా అవతలికి పోగలిగే అవకాశం నీకు లేదు షాడో, ఈసారి నువ్వు నా ఎదుటికి వచ్చిన మరుక్షణం నీ పని ఖతం అయిపోతుంది. ఎందుకూ పనికిరాని మరమనిషిగా నిన్ను మార్చేయకపోతే మారుపేరు పెట్టుకుంటాను నేను" అనుకుంటూ బెడ్ మీద మేనువాల్చాడు.

కనులు మూసుకోబోతుండగా గుండెలు జలదరించేటట్లు వినవచ్చింది ఒక శబ్దం. అదిరిపడి లేచి కూర్చోబోయిన అతన్ని ఆ కట్టడ ద్వారం దగ్గిర్నించి అనునయించాడు ఒక అనుచరుడు.

"ఆకలికి అలమటించిపోతున్న నల్లచిరుత అరుపు అది. రక్తపు వాసనను పసిగట్టి మనం తవ్విన గోతుల దగ్గిరికి వచ్చింది. మనవాళ్ళ అవశేషాల మీద బండరాళ్ళు పేర్చటం వల్ల వాటిని చెల్లాచెదరుచేయలేక వెనక్కి వెళ్ళిపోతోంది" ఎందుకైనా మంచిదని, తనచేతిలో వున్న రైఫిల్‌ని గట్టిగా బిగించి పట్టుకుంటూ తెలియజేశాడతను.

బిగపట్టిన ఊపిరిని తేలికగా బయటికి వదులుతూ తిరిగి బెడ్ మీదికి వాలిపోయాడు బెల్‌రియా.

అప్పుడు బయటికి వచ్చింది అంతకుముందు ఎంతోసేపటి నుంచి అతని హృదయంలో ఒక మూల కొట్టుమిట్టాడుతున్న సందేహం ఒకటి.

వశీకరణ యంత్రపు ప్రభావంలో పడిపోయి తనకు పూర్తిగా దాసుడైపోయిన షాడోకి హఠాత్తుగా వున్నట్లుండి ఎలా వచ్చింది అక్కడినుంచి పారిపోయేందుకు అవసరమైన తెంపరితనం?

వశీకరణ యంత్రంలో లోపం వున్నదా?

ముంచుకు రాబోతున్న నిద్ర చిటికెలో దూరమైపోయింది బెల్‌రియాకి ఆ మాట అనుకున్న మరుక్షణంలోనే. నల్లచిరుత అరుపును విని లేచి కూర్చున్నప్పటికంటే రెండు రెట్లు అధిక వేగంతో బెడ్ మీదనుంచి దిగాడతను.

''నువ్వు వెంటనే వెళ్లి ఆ క్రూరజంతువును ఎదిరించు... దాన్ని చంపి నాకు చూపించు'' తను లేచిన అలికిడిని ఆలకించి లోపలికి తొంగిచూసిన అనుచరుడికి ఆజ్ఞ ఇచ్చాడు.

బెంగాల్ టైగర్ మాదిరి భారీ శరీరాన్ని కలిగివుండక పోయినా, బెంగాల్ టైగర్‌కి నాలుగురెట్లు రోషాన్ని ప్రదర్శించే ఆ నల్ల చిరుతను తలుచుకునేసరికి కాళ్ళూ, చేతులు వణకసాగాయా అనుచరుడికి.

తడబడుతున్న కంఠంతో తన అశక్తతను తెలియపరచ బోతుండగా చటుక్కున అతనికేసి తిప్పాడు బెల్‌రియా తన బెడ్‌కి దగ్గర్లో వున్న

వశీకరణ యంత్రాన్ని. "వెళ్ళు... వెళ్లి వెంటనే ఆ చిరుతను చంపి నా దగ్గిరికి తీసుకురా..." ఖంగుమంటూ ప్రతిధ్వనించింది అతని కంఠం.

మంత్రం వేసినట్లు మాయమైపోయింది అతని అనుచరుడి ముఖంలో తాండవిస్తున్న భయం. సుశిక్షితుడైన సైనికుడి మాదిరి రైఫిల్‌ని భుజం మీద పెట్టుకుని, నల్లచిరుత గాండ్రింపులు వినబడ్డ ప్రదేశం వైపు పరుగెత్తాడతను. బెడ్ క్రిందినుంచి హైపవర్ రైఫిల్ నొకదాన్ని అందుకుని, తాపీగా అడుగులు వేస్తూ అతన్ని అనుసరించాడు బెల్‌రియా.

ప్రక్కలకు కూడా చూడకుండా సూటిగా పోయి, గోతులు తవ్విన ప్రదేశానికి దగ్గర్లో వున్న చెట్ల గుంపును సమీపించాడు అతని అనుచరుడు.

సమీపించిన మరుక్షణం అతని కంటపడింది, పొడుగాటి తోకను నేలకేసి తాటిస్తూ ఒకచెట్టు మొదట్లో కూర్చుని ఉన్న నల్ల చిరుత.

అనుకోనివిధంగా ఎదుటికి వచ్చిన మనిషిని చూడగానే, చురకత్తుల వంటి కోరలు బయటికి కనపడేలా నోటిని తెరిచి ఒక్కసారిగా గాలిలోకి ఎగిరింది.

భుజం మీది రైఫిల్‌ని ముందుకు జాచి ఎయిమ్ తీసుకోవటానికి ప్రయత్నించాడు బెల్‌రియా అనుచరుడు. అతని ప్రయత్నం ఫలించకముందే మృత్యుదూతలా వచ్చి అతని మీద పడనే పడింది ఆ

క్రూరజంతువు. పంజాతో అతని రైఫిల్‌ని గాలిలోకి ఎగరగొట్టి, అతని మెడను కొరికేయటానికి ట్రై చేసింది.

అప్పటికీ వెనుకంజ వేయని తన అనుచరుడిని గమనించే సరికి పటాపంచలు అయిపోయాయి వెనుకగా వచ్చిన బెల్‌రియా అనుమానాలన్నీ.

"వశీకరణ యంత్రంలోని లోపంవల్ల తప్పించుకోలేదు షాడో... ఇటాలియన్ సైంటిస్ట్‌తో కలిసి ఏదో నాటకం ఆడి నన్ను మోసగించాడు. అందుకు తగిన శాస్తి చేసి తీరాలి..." అనుకుంటూ తన దగ్గిర వున్న ఆయుధాన్ని ఎత్తి ట్రిగ్గర్‌ని ప్రెస్ చేశాడు.

ఆకాశం బ్రద్దలైపోయినట్లు వేలువడిందొక దారుణ శబ్దం. అతని అనుచరుడి మెడను కొరికేయబోతున్న నల్ల చిరుత, రాక్షసహస్తం ఏదో ఎత్తి అవతలకి విసిరేసినట్లు గింగిరాలు తిరుగుతూ గాలిలోకి లేచింది. స్థావరంలోని కట్టడాల్లోకి చేరుకున్న అనుచరులు అందరూ బయటికి పరిగెత్తుకు వచ్చేసరికి దెబ్బతిన్నది బెల్‌రియా కాన్‌సన్‌ట్రేషన్.

అల్లంత దూరంలో క్రిందపడిన నల్లచిరుతను శాశ్వతంగా సమాధి చేయవలసిన రెండో బుల్లెట్ నిరపాయకరంగా దాని తలమీదినుంచి అవతలికి దూసుకుపోయింది.

మొదటి బుల్లెట్ దెబ్బకు తీవ్రంగా గాయపడిన వెనుక పాదాన్ని ఎత్తి ఎత్తి వేస్తూ, అతివేగంగా అడవిలోకి పారిపోయింది నల్లచిరుత.

అరక్షణంలో ఆ చుట్టుపట్ల ఎక్కడా అగుపించకుండా మాయం అయింది.

దాని పంజా విసురుకు క్రింద పడిపోయిన రైఫిల్‌ని అందుకుంటున్న తన అనుచరుడి భుజం తట్టి సగర్వంగా నవ్వాడు బెల్‌రియా.

"నువ్వు మిగిలినవారి దగ్గరికి పోయి విశ్రాంతి తీసుకో... నా కట్టడం దగ్గిర కాపలా వుండాల్సిన అవసరం లేదు... అడవి జంతువులే కాదు, ఈ సారి ఆ షాడోనే స్వయంగా వచ్చినా నాకు ఎటువంటి ఆపదా రాదు వెళ్ళు..." అంటూ అతన్ని అవతలికి పంపించి తన కట్టడం దగ్గిరికి తిరిగివచ్చాడు.

బెడ్ దగ్గిరి వశీకరణ యంత్రం వంక ఇంకోసారి మోజుగా చూసుకుని నిద్రకుపక్రమించాడు.

* * * * *

ముఖంమీదికి వచ్చిన లావుపాటి రెండు దోమల్ని కసిగా అవతలికి తోలుతూ అమాంతంగా లేచి కూర్చున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్. కందిరీగలంత వున్న ఆ అడవి దోమలు పిచ్చివాడిని చేసేశాయి అతన్ని.

తను ఎక్కడ వున్నాడో, ఎందుకు వున్నాడో మరిచి పోయే పరిస్థితిని క్రియేట్ చేశాయి.

ఉన్నపళాన లేవటంవల్ల తప్పిపోయింది బ్యాలెన్స్... ఆఖరి క్షణంలో చేతుల్ని జాచి ప్రక్కనే వున్న కొమ్మల్ని గట్టిగా పట్టుకోవటానికి ప్రయత్నించాడు. చేతికి అందినట్లే అంది జారి పోయాయా కొమ్మలు. ఇసుక మూట పడినట్లు తను ఎక్కి వున్న చెట్టుమీది నుంచి ధబేలున క్రిందపడ్డాడతను.

చీకటి సమయంలో అటువంటి పని జరిగితే, తలలు పగిలిపోయి ప్రాణాలు పోగొట్టుకోవడం తప్పనిసరి అని షాడోకి బాగా తెలుసు.

చెట్టుమీద విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్న వెంటనే అతను చేసిన మొట్టమొదటి పని - ఆ చెట్టుచుట్టూ చెల్లాచెదరుగా పడివున్న ఎండుటాకుల్ని పెద్దగుట్టగా పోగుచేయటం.

తల్లక్రిందులుగా రెండు పల్టీలు కొట్టి ఆ ఆకుల గుట్ట మీద పడ్డాడు ఇటాలియన్ సైంటిస్ట్. తల పగలకపోయినా, పగిలినంత బాధ నరాల్ని జివ్వుమనిపిస్తుండగా లేచి కూర్చున్నాడు.

"అనవసరమైన ఆలోచనలతో టైమ్‌ని వేస్ట్ చేయకు త్వరగా పైకి వచ్చేయ్" చిన్న కంఠంతో ఇటాలియన్ సైంటిస్ట్‌ని హెచ్చరించాడు ఇంకో కొమ్మను కౌగిలించుకొని వున్న షాడో.

తనకు అటువంటి గతిని పట్టించిన దోమల్ని నోటికి వచ్చిన పదాలతో లోలోపల తిట్టుకుంటూ అతికష్టం మీద మళ్ళీ తన కొమ్మను చేరుకున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"లేబరేటరీల్లోను, మెకానికల్ వర్క్‌షాపుల్లోనూ, ఎ.సి గదుల్లోను కాలం గడిపిన వ్యక్తిని నేను. అడవి మనిషి మాదిరి ఈ చెట్లు పుట్టల వెంట ఎలా తిరగగలనని అనుకున్నావ్. ఈ దరిద్రపు కొమ్మల్లో కోతుల మాదిరి వ్రేలాడటంకంటే, శుభ్రంగా నేలమీదే కూర్చోవచ్చునుకదా..!" షాడో కూర్చుని వున్న కొమ్మకేసి చూస్తూ కోపంగా అన్నాడు.

శబ్దం కాకుండా అతని కొమ్మమీదికి జరిగాడు షాడో. నెమ్మదిగా భుజం తడుతూ, చూపుడు వ్రేలితో ఆ చెట్టుకు పాతిక గజాల దూరంలో వున్న చిన్న ఖాళీ స్థలం వైపు చూపించాడు.

మిలమిలా మెరుస్తున్న రెండు మిణుగురు పురుగులు అగుపించాయి ఇటాలియన్ సైంటిస్ట్‌కి.

గాలిలో ఎగురుతూ వుండాల్సిన ఆ జీవులు అటూ ఇటూ కదలకుండా స్థిరంగా ఒకే చోట వుండటం ఆశ్చర్యం కలిగించింది అతనికి.

ఎగిరి గంతులు వేసినా ఎక్కడికీ జారిపోకుండా జాగ్రత్తగా దుస్తుల్లో దాచుకున్న కళ్ళజోడును తీసి ఇంకాస్త పరీక్షగా చూశాడతను.

చూసిన వెంటనే ఎండుకుపోయింది ఇటాలియన్ సైంటిస్ట్ గొంతు... జ్వరం వచ్చినట్లు కంపించటం మొదలుపెట్టాయి కరచరణాలు.

మెరుస్తున్న మిణుగురు పురుగులు కాదు అతనికి అగుపించినవి... జ్యోతుల మాదిరి మెరుస్తున్న ఒక నల్లచిరుత కనులు, ఖాళీ స్థలం మొదట్లో కూర్చుని, తన వెనుక పాదాన్నొకదాన్ని నాలుకతో శుభ్రం చేసుకుంటున్నది అది... మధ్య మధ్యలో తల ఎత్తి ఆ చెట్టువంక చూస్తున్నది.

"ఆహారం కోసం బయలుదేరి ఎక్కడో చావుదెబ్బ తినివచ్చింది అది. అందువల్ల వెంటనే రియాక్ట్ కాలేకపోయింది. కొమ్మల్ని వదిలి మనం చెట్టుక్రిందికి చేరుకుంటే ఖచ్చితంగా వచ్చి మీదపడుతుంది..." సైంటిస్ట్‌కి మాత్రమే వినిపించేటట్లు అతని చెవిదగ్గిర నోరుపెట్టి అన్నాడు షాడో.

అతనిమీదా, తనమీదా వాలబోయిన ఇంకోరెండు దోమల్ని చేత్తో విసురుతూ అతికష్టం మీద చూపుల్ని మరల్చుకున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఈ అడవిలోకి వచ్చినవాళ్ళు తిరిగి ప్రాణాలతో బయటికి పోలేరని బెల్‌రియా అనుచరులు ఈ అడవి చిరుతను చూసే అనుకుని వుంటారు... సందేహం లేదు" అంటూ కొమ్మను మరింత గట్టిగా కౌగిలించుకొని కనులు మూసుకున్నాడు.

వెనుక పాదాన్ని క్లీన్ చేసుకుంటున్న ఆ చిరుత అవసరం అయితే అతి తేలికగా చెట్లు ఎక్కగలదనే మాటను అతనికి తెలియచేయలేదు షాడో. బూటుకాలికి అడ్డంగా బిగించుకున్న డాగర్‌ని తీసి ఎడమ చేతిలో పెట్టుకుని ఎలర్ట్‌గా కూర్చున్నాడు.

అదేపనిగా పరిగెత్తుకు రావటంవల్ల పూర్తిగా అలసిపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్.

లావుపాటి దోమలు ముఖంమీదా, చేతులమీదా వాలి జలగల మాదిరి రక్తాన్ని పీలుస్తున్నా లెక్కచేయకుండా నిద్రలోకి జారిపోయాడు.

కనురెప్పలు కదిలించకుండా నల్లచిరుత వంకే చూస్తూ కూర్చున్నాడు షాడో. అది చెట్టుమీదికి చేరుకునే ప్రయత్నం చేసిన వెంటనే ప్రతిఘటించటానికి సిద్ధంగా వున్నాడు.

అరగంట తరువాత ఖాళీ స్థలాన్ని వదిలి ముందుకు వచ్చిందా క్రూరమృగం. చెట్టుచుట్టూ రెండు రౌండ్స్ కొట్టింది.

షాడో పోగుచేసిన ఆకులగుట్టను వాసన చూసి, మెల్లిగా పొదల్లోనికి వెళ్ళిపోయింది.

పోయినట్లే పోయి గిరుక్కున వెనుతిరుగుతుందన్న అనుమానంతో ఇంకా ఎలర్ట్‌గా కూర్చున్నాడు షాడో. నిశ్శబ్దంగా తన పాదాలను

చుట్టుకోబోయిన ఒక కొండచిలువను డాగర్ మొనతో స్వల్పంగా గాయపరిచి చెట్టు క్రిందికి నెట్టేశాడు.

చెట్టు క్రింద వున్న ఎండుటాకుల గుట్టమీద పడి బుస కొట్టింది కొండచిలువ, ఊపిరి వదిలినా పెద్దగా వినిపించేలా వున్న ఆ వాతావరణంలో బిగ్గరిగా ప్రతిధ్వనించింది ఆ శబ్దం.

వెనక్కి వచ్చే ఆలోచన నల్లచిరుతకు వుండి వుంటే ఛెంగు ఛెంగున గంతులు వేస్తూ చెట్టు దగ్గిరకు వచ్చేస్తుందని షాడోకి తెలుసు.

పదినిముషాలు గడిచినా ఆ క్రూరజంతువు కనిపించకపోవడంతో ఒకింత నెమ్మదించింది అతని హృదయంలోని ఆత్రుత.

చూస్తూ చూస్తూ ఉండగానే గడిచిపోయింది సమయం...

ఉన్నట్లుండి నిద్రలేచాయి ఆ చుట్టుపట్ల చెట్ల మీద నిద్రపోతున్న పక్షులు.

తమ అరుపులతో మరుసటిరోజు ఉదయానికి స్వాగతం పలకటం మొదలుపెట్టాయి.

గండ్ర ఇసుక పడినట్లు మంటలు పెడుతున్న కనుల్ని షర్టు భుజానికేసి అద్దుకుంటూ, ఇటాలియన్ సైంటిస్ట్ దగ్గిరికి జరిగాడు షాడో... డాగర్‌ని అడ్డంగా తిప్పి అతని తొడల్ని అలవోకగా మీటాడు.

అదిరిపడి కనులు తెరిచాడతను. ఎడమచేతిని చటుక్కున జాచి షాడో గనుక గట్టిగా పట్టుకోకపోయినట్లయితే తల్లక్రిందులుగా ఇంకోసారి ఎండుటాకుల గుట్టమీద పడిపోయి వుండేవాడే!

"గుడ్ మార్నింగ్ మై ఫ్రెండ్... ఇటువంటి లగ్జూరియస్ వాతావరణంలో ఒక రాత్రి ఒళ్ళు తెలియకుండా నిద్రపోతానని వారం పదిరోజుల క్రితం ఎవరైనా అనివుంటే, వాళ్లకి పిచ్చెక్కినట్లుగా భావించి వుండేవాడిని..." అలవాటులేని భంగిమలో పడుకోవటంవల్ల విరిగినట్లు నెప్పులు పెడుతున్న చేతుల్ని, కాళ్ళని సవరించుకుంటూ సంతోషంగా అన్నాడు.

తన్ను చుట్టుముట్టిన ప్రమాదాన్ని తలుచుకుని అతను డిప్రెస్ అయిపోతాడేమోనని అనుమానిస్తున్న షాడోకి లభించింది గొప్ప రిలీఫ్.

"వెలుగు పూర్తిగా ఈ అడవిని చుట్టుముట్టకముందే మనం మరికొంచెం దూరం వెళ్ళిపోవటం మన ఆరోగ్యాలకు మంచిది. వశీకరణ యంత్రాన్ని భుజం మీద వేసుకుని బెల్‌రియా మనముందు ప్రత్యక్షం అయితే కొంపలు అంటుకుంటాయి." అంటూ చెట్టుమీద నించి క్రిందికి దిగాడతను.

అతనిలా ఆ పనిచేయాలనుకుని, ఆఖరి క్షణంలో కాలుజారి ఎండుటాకుల గుట్ట మీద దబ్బున పడ్డాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఎదుటివారి మనస్తత్వాల కనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవటం నీకు బాగా అలవాటు అయినట్లు నాకు అర్థమయింది మై ఫ్రెండ్...

నిన్ను చూసిన వెంటనే బెల్‌రియా పెద్ద పెద్ద డైలాగుల్ని వల్లించటం వెనుకవున్న రహస్యం ఇప్పుడు పూర్తిగా బోధపడింది..." ఎండుటాకుల్ని గుట్టగా పోగు చేయాలనే ఆలోచన షాడోకి రాకపోయినట్లయితే, తన పరిస్థితి ఎలా వుండేదో ఊహించుకుంటూ మెచ్చుకోలుగా అన్నాడు.

భయంతో బెంబేలెత్తిపోతూ శిలావిగ్రహంలా బిగుసుకు పోవాల్సిన ఆ పెద్దమనిషి నోటి వెంట పొగడ్తలు వెలువడటాన్ని గమనించి అనీజీగా ఫీలవుతూ తల విదిలించాడు షాడో.

"లెటజ్ మూవ్ ఫ్రమ్ హియర్..." ముక్తసరిగా అంటూ అతని చేతిని పట్టుకుని లాగాడు.

అడుగు పెట్టటానికి వీలుకానంత దట్టంగా అల్లుకుని వున్న పొదల మధ్యలో నుంచి ప్రయాణం చేయటం చాలా కష్టం అనిపించినా, ఒక్కమాట కూడా మాట్లాడకుండా అతన్ని అనుసరించాడు ఇటాలియన్ సైంటిస్ట్. వెలుగు రేకలు అడవిని పూర్తిగా ఆక్రమించుకున్న తరువాత, తన ఇబ్బందిని బహిర్గతం చేశాడు.

"ఆకలి వేస్తోంది మై ఫ్రెండ్... దాహంతో గొంతు ఎండుకు పోతోంది. పొట్టలో ఏదైనా పడకపోతే మైకం ముంచుకు వచ్చేటట్లుంది" అంటూ ఒక చిన్న ఖాళీస్థలం మధ్యలో కనిపించిన బండరాయిమీద బాసిపట్టు వేసుకు కూర్చోబోయాడు.

ఉన్నట్లుండి ముందుకు దూకి అతని జబ్బ పట్టుకున్నాడు షాడో. ముళ్ళచెట్టును ఈడ్చినట్లు బరబరా ఈడ్చి అవతలకు నెట్టేశాడు.

ఆ విసురుకు బోర్లాపడి, అయోమయంగా చూశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఇంతకు ముందువరకూ బాగానే వున్నవాడివి నీకు అంతలోనే ఏమయింది మై ఫ్రెండ్?" అని అడుగుతూ లేచి కూర్చోబోతుండగా అగుపించాయి అతనికి, అరచేతి వెడల్పున వున్న మండ్రగబ్బలు.

అతను కూర్చోబోయిన బండరాయి క్రిందినించి లుకలుక లాడుతూ ఇవతలికి వచ్చేశాయవి. కొండేల్ని రెడీగా ఎత్తి పట్టుకుని కోరగా చూస్తున్నాయి ఆ నరమానవుల వంక.

"ఆ దరిద్రపుగొట్టు జీవాలు ఆ బండక్రింద వున్నట్లు నీకు ఎలా తెలిసింది?" ఆశ్చర్యంగా అడుగుతూ షాడో వెనక్కి చేరాడు ఇటాలియన్ సైంటిస్ట్.

ఆ మాటలు తనకు వినబడనట్లు ముందుకు కదిలి, ఖాళీస్థలాన్ని అధిగమించాడు షాడో, వందగజాలు పోయిన తర్వాత, ఉన్నట్లుండి ఒక ప్రక్కకు మరలి, సైంటిస్ట్‌ని అక్కడే నిలబడమని సైగ చేశాడు.

మండ్రగబ్బల వంటి ప్రమాదకర జీవాలు ఇంకేవైనా అతనికి అగుపించాయేమోనన్న అనుమానంతో ఎక్కడివాడక్కడ నిలబడిపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్. దట్టంగా వున్న పొదను చేతులతో ప్రక్కకు నెడుతూ ఎటో వెళ్ళిపోయాడు షాడో. పది నిముషాల తరువాత సైంటిస్ట్ నాసికారంధ్రాలకు సోకింది పండిన సపోటాపళ్ళ వాసన.

టక్‌చేసి వున్న షర్టును బయటికి లాగి పెద్ద కాన్వాస్‌సంచిలా తయారుచేశాడు షాడో.

మిగలపండిన సపోటాల్ని నిండుగా పోసుకుని సైంటిస్ట్ ముందు ప్రత్యక్షం అయ్యాడు.

"ఇవి... ఇవి ఈ చుట్టుపట్ల లభిస్తాయని నీకు ఎలా తెలిసింది?" ఆత్రంగా అందుకుని ఆ పళ్ళను నోటిలో కుక్కుకుంటూ అడిగాడతను.

ఆ మాటలకు కూడా సమాధానం ఇవ్వలేదు షాడో.

అతనితో పాటు తను కూడా కొన్ని పళ్ళను ఆరగించి, గుజ్జుతో మలినమైన చేతుల్ని షర్టుకే తుడుచుకున్నాడు అనాగరికుడిలా. అలా

దుస్తుల్ని మలినపరుచుకోవటం అలవాటు లేక ప్రక్కనే వున్న పొదలకేసి చేతులు జాచబోయాడు సైంటిస్ట్.

"కందిరీగలు కుడితే ఆ బాధ తగ్గటానికి మందు ఏదైనా మీ దగ్గర ఉన్నదా?" యధాలాపంగా అడిగినట్లు అడిగాడు షాడో.

ముందుకు జాచబోతున్న చేతుల్ని మధ్యలోనే ఆపుకుని అతని వంక ఆశ్చర్యంగా చూశాడు ఇటాలియన్ సైంటిస్ట్. కనులతోనే చూపించాడు షాడో అతను పట్టుకోబోయిన పొదని.

అటుకేసి పరీక్షగా చూసిన సైంటిస్ట్ నుదుటిమీద ప్రత్యక్షం అయ్యాయి స్వేదబిందువులు.

అంగుళం పొడవున వున్నాయి ఆ పొదను ఆక్రమించుకుని వున్న కందిరీగలు, చెట్ల బెరళ్ళనుండి అదో రకమైన జిగురు సేకరించి, చిన్న చిన్న గూళ్ళను కట్టుకుని హాయిగా నివసిస్తున్నాయి.

చేతులు శుభ్రం చేసుకోవటానికి తను ఆ పొదను పట్టుకుని వుంటే ఆ కదలికకు డిస్టర్బ్ అయి, ఒక్కసారిగా అవన్నీ తనమీదికి వచ్చిపడేవని అర్థం అయ్యేసరికి మతిపోయినంత పనయింది అతనికి.

"అడవులంటే ఏవో పెద్ద పెద్ద క్రూరమృగాలు వుంటాయని అనుకున్నాను గానీ, వాటికంటే ప్రమాదకరమైన పరిస్థితులు వేనకువేలు

వుంటాయని ఊహించలేదు. ఇకనుంచీ నీ డైరెక్షన్ లేకుండా ఒక్క అడుగు కూడా ప్రక్కకు వేయను...'' అంటూ ఆ పొదకు దూరంగా జరిగాడు.

అతని తెలియనితనాన్ని గురించి కామెంట్ చేయకుండా ముందుకు దారితీశాడు షాడో. మరో అరగంట తరువాత ఎదురైన ఒక చిన్న జల ప్రవాహం దగ్గిర ఆగి దాహం తీర్చుకోమని సైగ చేశాడు.

చుట్టుపట్ల వుండే పరిసరాల్ని అతి జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ, ప్రాణాల్ని తీసే ప్రమాదాల్ని ఆ పని జరుగక ముందే గమనించుకుంటూ, ముందుకు కదులుతున్న షాడో సునిశిత పరిశీలనా శక్తి వున్నట్లుండి దెబ్బతిని పోయింది ఆ ప్రవాహం దగ్గిర.

గలగలలాడుతూ ప్రవహిస్తున్న ఆ నీటిలోకి దిగి దోసిటితో అందుకోబోతూ, అదిరిపడి వెర్రిగా అరిచాడు సైంటిస్ట్. కరెంట్ షాక్ కొట్టినవాడిలా వణికిపోతూ ఒడ్డుకు పరిగెత్తుకు వచ్చాడు.

కొంపలు అంటుకుపోయే ప్రమాదం ఏదో ముంచుకురాగానే వచ్చిందనుకుంటూ, కుడిచేతిలోని డాగర్‌ని ఎడమచేతిలోకి మార్చుకున్నాడు షాడో... కనులకు కనిపించని వేగంతో బలంగా ముందుకు విసరటానికి రెడీ అయ్యాడు.

''పైకి చూడు మై ఫ్రెండ్... పైకి చూడు...'' ఒకే ఒక క్షణంలో తనను తాను కాస్తంత కంట్రోల్ చేసుకుని, వణుకుతున్న చేత్తో వాగు పై భాగంలోకి చూపించాడు ఇటాలియన్ సైంటిస్ట్.

వాగు అవతలి ఒడ్డును నిశితంగా పరిశీలిస్తున్నాడు షాడో. కనుల్ని పైకెత్తి అతను చూపించిన వైపుకు చూశాడు. చూసిన వెంటనే అతనికి కలిగిన మొట్టమొదటి ఆలోచన - అక్కడినుంచి అతివేగంగా అవతలికి పారిపోవాలని.

శుభకార్యాలు జరిగే ప్రదేశంలో పచ్చటి మామిడి ఆకుల తోరణాలు కట్టినట్లు వాగు ఇవతలివైపు నుంచి అవతలి ఒడ్డు వరకూ బలమైన అడవితీగెల త్రాడుకు గుచ్చబడివున్నాయి మానవకపాలాలు. ఒకటి కాదు... రెండుకాదు... దగ్గిర దగ్గిరగా వందకుపైనే వున్నాయి. గుంటకనులతో, దంతాలు ఊడిపోయిన నోళ్ళతో తమ సమీపంలోకి వచ్చిన అభాగ్యుల్ని వెక్కిరిస్తున్నట్లు అటూ ఇటూ ఊగుతున్నాయి.

కనులు తిరిగి క్రింద పడిపోవటం జరుగుతుందేమోనన్న అనుమానం కలిగింది షాడోకి. చెమటలతో తడిసిపోయిన కుడి అరచేతిని ప్యాంటుకేసి రుద్దుకుంటూ సైంటిస్ట్ కేసి చూశాడు.

''మన మాదిరిగా ఈ అడవిలోకి వచ్చినవాళ్ళ కపాలాలేనా అవి?'' కంపిస్తున్న కంఠంతో అడిగాడు ఇటాలియన్ సైంటిస్ట్.

గుండెల నిండా గాలి పీల్చుకుని తన మనసును చుట్టు ముట్టిన ఆందోళనను బలవంతంగా అదుముకున్నాడు షాడో. డాగర్‌ని గట్టిగా పట్టుకుంటూ, వాగులోకి దిగి ఆవలి ఒడ్డును చేరుకున్నాడు.

"వెనక్కి వెళ్లి బెల్‌రియాకి పట్టుబడటమే మంచిది మై ఫ్రెండ్... ముందుకు పోయి ఆ కపాల దండకు గుచ్చబడటం నాకు ఇష్టం లేదు." అంటూ అతన్ని క్లోజ్‌గా ఫాలో అయ్యాడు సైంటిస్ట్. అడుగులో అడుగువేస్తూ వందగజాల దూరం పోయి ఒక పెద్ద ఖాళీ స్థలాన్ని చేరుకున్నాడు షాడో.

"మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. మనం వెనక్కి పోయి బెల్‌రియాకి పట్టుబడటమే మంచిది..." తన వెనకే వచ్చిన ఇటాలియన్ సైంటిస్ట్‌తో అంటూ దగ్గర్లో వున్న ఒక కొండరాయి మీద కూర్చుండి పోయాడు.

ఉబుసుపోకకు తను వెలువర్చిన అభిప్రాయాన్ని అతను బలపరచటాన్ని గమనించి ఆశ్చర్యపోతూ ఖాళీస్థలం మధ్యలోకి దృష్టిని సారించిన ఇటాలియన్ సైంటిస్ట్ గొంతుకకు ఏదో కొండరాయి అడ్డుపడిన సెన్సేషన్ కలిగింది.

చిల్లర దేవతలకు కట్టబడే గుడి వంటి కట్టడం ఒకటి ఆ ప్రదేశంలో ఉన్నది. నేర్పరియైన శిల్పి తన గొప్పతనాన్ని చాటుకునేటందుకు చెక్కిన

శిల్పాల మాదిరి ఆ కట్టడంపై భాగంలో నీట్‌గా అమర్చి వున్నాయి మరికొన్ని కపాలాలు.

కట్టడం ముందు, వెనుక, ప్రక్కభాగాల్లో ఎక్కడ చూసినా అవే దర్శనం ఇస్తున్నాయి. తమ సమీపంలోకి వచ్చిన ఆ ఇద్దర్నీ తమతో కలుపుకునేటందుకు సిద్ధంగా వున్నట్లు వారివంకే చూస్తున్నాయి.

* * * * *

‘‘...మలేసియాకు మూడువందల కిలోమీటర్ల దూరంలో అగ్ని పర్వతపు ప్రేలుళ్ళ మూలకంగా ఏర్పడిన టారుంగ్ దీవులు ఉన్నాయి...’’

కపాల దేవాలయాన్ని చూసిన షాక్ ఉపశమించిన తర్వాత మెల్లిగా తనకు తెలిసిన విషయాల్ని ఇటాలియన్ సైంటిస్ట్‌కి చెప్పాడు షాడో.

‘‘దట్టమైన అడవులతో, దారుణమైన అడవి జంతువులతో నిండివుండే ఆ దీవుల్లో అతి పెద్దది డైనా టారుంగ్ దీవి... క్రూరమృగాలతో పాటు పరాయి జాతివారిని చూస్తే పగబట్టిన పాముల మాదిరి మీదపడి తలలు నరికే అడవిజాతి మనుష్యులు ఆ దీవిలో నివసిస్తూ వుంటారు... చదువు సంధ్యలు నేర్పి వారిని నాగరిక జనజీవన స్రవంతిలో తీసుకురావాలని ప్రయత్నించారు అనేకమంది.

అడవి జాతి వాళ్లకు తెలివితేటలు మృగ్యమని వారి సరసన చేరి తమ స్వప్రయోజనాల్ని సాధించుకోవటానికి ప్రయత్నించారు ఇంకా

అనేకమంది... వాగు ఒడ్డున వ్రేలాడగట్టబడిన కపాలమాలలోను, ఇప్పుడు మన ఎదురుగా వున్న ఈ ఆలయపు గోడల మీదను అలంకారాలుగా మిగిలిపోయారు వారందరూ...

ఆఫ్రికా ఖండంలో వుండేవారని అందరూ అనుకునే నరమాంస భక్షకుల కంటే వెయ్యిరెట్లు ప్రమాదకారులైన టారుంగ్ జాతి ఆటవికుల మధ్యకు వచ్చేశాం మనం... వెంటనే వెనుతిరగకపోతే తలల్ని కోల్పోయి అనాథలుగా మట్టిలో కలిసి పోతాం...''

బెల్‌రియాకి పట్టుబడిన తర్వాత మొట్టమొదటి సారిగా తాము ఏ ప్రదేశంలో వున్నారో గ్రహించి లోగొంతుకతో వివరించాడు షాడో.

అతను కూర్చున్న కొండరాయి దగ్గిర మండ్రగబ్బలు ఏమీ లేవని నిశ్చయం చేసుకున్న తర్వాత, తను కూడా అతని సరసన కూర్చుంటూ గాఢంగా నిట్టూర్చాడు ఇటాలియన్ సైంటిస్ట్.

''ఇప్పుడు ఏం చేద్దాం మై ఫ్రెండ్? ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్లుగా తయారైన మన పరిస్థితిని తలుచుకుని బాధపడినందువల్ల ప్రయోజనం ఏదీ వుండదు గదా?'' అంటూ అనునయించాడు.

ఎదురైన ప్రమాదాల్ని చూసి మొదట వెర్రిగా అరిచినా, వెనువెంటనే తనను తాను కంట్రోల్ చేసుకోగల అతని శక్తియుక్తుల్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు షాడో.

"నాకు తెలిసినంతవరకూ ఇప్పుడు మనం వున్న ఈ ప్రదేశం నుంచి మూడు రోజుల పాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేయగలిగితే, బెల్‌రియా స్థావరానికి ఆపోజిట్ దిశలో సముద్రతీరాన్ని చేరుకోగలుగుతాం... అడవిలో ప్రయాణం ఎలా వుంటుందో మీకు అర్థమైంది కాబట్టి, ఆ పనిలో వుండే బాధల్ని గురించి ఎక్కువగా మాట్లాడటం ఇష్టం లేదు..." అంటూ అతని ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

అంతకు ముందువరకూ తనను ఇబ్బంది పెట్టిన దాహాన్ని మరిచిపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్. క్రిందికి జారిపోతున్న ప్యాంటును పైకిలాక్కుని బెల్టును మరింత గట్టిగా బిగించుకున్నాడు.

"ఎక్కువగా మాట్లాడుకోవడం వల్ల మన శక్తి వృధా అవటం తప్ప మరో ప్రయోజనం వుండదు మై ఫ్రెండ్... నీ అడుగు జాడల్లో నడవాలనే నా నిర్ణయంలో కొంచెంగా కూడా మార్పు రాలేదు.

టైమ్‌ని వేస్ట్ చేసి ఆ టారుంగ్ భూతాల దృష్టిలో పడకముందే ఈ ప్రదేశాన్ని వదిలి దూరంగా పారిపోదాం... కమాన్... దారి చూపించు" అంటూ చేయిపట్టుకుని షాడోని బండరాయి మీదినించి లేపాడు.

అతని భుజం తట్టి మెచ్చుకోవాలనే కోరికను బలవంతంగా అదుముకుంటూ, కపాల కట్టడం ప్రక్కగా ముందుకు అడుగు వేశాడు షాడో.

కనబడీ కనబడనట్లున్న ఒక కాలిబాటను వదిలి, దట్టమైన పొదల గుండా రెండు గంటలపాటు నడిపించాడు అతన్ని.

"పది నిముషాల పాటు విశ్రాంతి తీసుకుందాం... ఇంకో రెండు గంటల తర్వాత ఆహారాన్ని గురించి ఆలోచిద్దాం" అంటూ, నిట్టనిలువునా ఎదిగి వున్న ఒక వృక్షం దగ్గర ఆగిపోబోతుండగా -

చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం... సూదుల మాదిరి నిఠారుగా లేచి నిలుచున్నాయి అతని మెడమీది వెంట్రుకలు, ఎందుకు అటువంటి అనుభూతి కలిగిందోనని ఆలోచించలేదు షాడో. అందుకు కారణాన్ని అన్వేషించలేదు.

"గెట్ బేక్... గెట్ బేక్ ఇమ్మీడియట్లీ." అని హెచ్చరిస్తూ, తన ప్రక్కకు వచ్చిన సైంటిస్ట్‌ని బలంగా వెనక్కి నెట్టాడు.

అదే సమయంలో ఈల వేసినట్లు వికృత శబ్దాన్ని చేస్తూ దూసుకువచ్చింది మూరెడు పొడుగున్న బాణం ఒకటి. ఠప్‌మని సౌండ్‌ని వెలువరిస్తూ అతని ఎదుట వున్న చెట్టు బోదెలో దిగబడింది.

ఎడమ చేతిలోని డాగర్‌ని, మణికట్టుకు సమాంతరంగా వంచి పట్టుకుంటూ, ఎడమ మోకాలిమీద క్రిందికి వాలి పోయాడు షాడో.

బాణం దూసుకువచ్చిన దిశలో అల్లల్లాడుతూ అగుపించింది అతనికి ఒక ముళ్ళపొద.

ఊపిరి బిగపట్టి, అండర్‌హేండ్ త్రోలో తన ఆయుధాన్ని అటుకేసి విసిరాడు అతను. అదే ఊపులో పైకిలేచి ఆ పొదవైపు పరిగెత్తాడు.

బరువునంతా ఎదమపాదం మీద మోపి, ఇంకో బాణాన్ని తన వింటికి సంధిస్తూ అగుపించాడు ఆరు అడుగులకు ఒక అంగుళం తక్కువగా వున్న టారుంగ్ జాతి అడవిమనిషి.

కందిరీగ మాదిరి ఝుంకారం చేస్తూ పోయి, వింటిని బిగించి పట్టుకున్న అతని ఎడమ పిడికిలికి తగిలింది షాడో విసిరిన డాగర్.

బాధా సూచకమైన శబ్దం చేస్తూ, వింటిని వదిలేశాడతను, బాణం వున్న చేత్తో, తన నడుముకు వ్రేలాడే రాతి గొడ్డలిని అందుకోబోయాడు.

అత్యంత ఆధునికమైన ఆయుధాలను ఉపయోగించటమే కాకుండా, గ్రహాంతరాళానికి మనుష్యుల్ని పంపించే తెలివిని సంపాదించుకున్న నాగరిక ప్రపంచంలో నివసిస్తూ కూడా, ఇంకా రాతి ఆయుధాల్ని, ఎముకలతో చేయబడిన బాణాల్ని పట్టుకు తిరుగుతున్న ఆ అడవిమనిషి వెల్లికిలా పడిపోయాడు. పైకి లేచే అవకాశం ఇస్తే తన పని పదిక్షణాల్లో ఫినిష్ అయిపోతుందన్న అనుమానం కలిగింది షాడోకి.

జేగురు రంగు కొండరాతిలో మలిచిన అద్భుత శిల్పం మాదిరిగా వున్నాడు ఆ అనాగరిక యువకుడు. కండలు తిరిగిన శరీరంతో, చూడముచ్చటైన ముఖంతో చాలా అందంగా కనిపిస్తున్నాడు.

అతని శరీరంలోని ప్రతి కదలికలోను కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది అమోఘమైన బలం. వట్టి చేతులతోనే ఎటువంటి శత్రువునైనా పిండి చేయగలననే విశ్వాసం అతని కన్నుల్లో ప్రతిఫలిస్తోంది.

తెల్లటి పల్వరున కోరల మాదిరి బయటికి కనిపించేలా నోటిని తెరిచి భీకరమైన సింహనాదాన్ని వెలువరించాడు ఆ ఆటవికుడు.

అరచేతుల్ని నేలకు ఆనించి మడిచి పెట్టిన ఇనుప స్ప్రింగు మాదిరి అమాంతం గాలిలోకి ఎగిరాడు.

సాబూ సిటీలో గెరిల్లాలకు పట్టుబడిన క్షణం నుంచీ వేళకు సరియన ఆహారం, సరైన విశ్రాంతి లభించకపోవటం వల్ల నెమ్మది నెమ్మదిగా షాడోని ఆవరించుకుంటోంది ఒకరకమైన బలహీనత.

ఒంటిమీది గాయాలు కూడా అతన్ని నిర్వీర్యుడిని చేసేందుకే చూస్తున్నాయి. బెల్‌రియాని గురించిన ఆలోచనలు అతని కదలికల్లోని వేగాన్ని కొంతవరకూ మందగింపచేస్తున్నాయి. అనుకోని విధంగా పైకి లేచిన ఆ ఆటవికుడి ఎటాక్‌ని తట్టుకోవటం కొంచెం కష్టమే అనిపించింది షాడోకి.

ఆ విషయం అర్థం అయినట్లు అడవి జంతువులా తలను పైకెత్తి గుండెలు జలదరించేటట్లు ఇంకో సింహనాదాన్ని వెలువరించాడా మనిషి.

"అరిచి అరిచి తన జాతి జనాలనందర్ని యిక్కడికి రప్పించేందుకు చూస్తున్నాడు. ఏదో ఒకటి చేసి వాడిని చంపేయకపోతే మనం ఇబ్బందుల్లో చిక్కుకుపోతాం" దూరంలో నుంచి వెంటనే షాడోని హెచ్చరించాడు ఇటాలియన్ సైంటిస్ట్.

ఆ మాట అతనితో చెప్పించుకోవల్సిన అవసరం షాడోకి లేదు... నిముషానికి ఒకసారి ఆ పెద్దమనిషి గావురు గావురుమని నోటిని తెరవటాన్ని గమనించగానే అవగతం అయిపోయిందతనికి... ఆ ఆటవికుడు అలా అరవటంలోని పరమరహస్యం.

ఇనుప ముక్కల మాదిరి మీదికి వస్తున్న ఆ మనిషి బాహువులు తన భుజం మీది గాయాలకు తగలకుండా జాగ్రత్త తీసుకుంటూ, సడెన్‌గా ఛట్‌మని ఎడమపాదాన్ని ముందుకు విసిరాడు.

అనాగరికులు కావటంవల్ల కరాటే, కుంగ్‌ఫూ మొదలైన పోరాట విద్యల్ని గురించి తెలియదు ఆ అడవి మనిషికి. కంటికి కనిపించనంత వేగంతో పైకి వచ్చిన పాదాన్ని అడ్డుకోవడం చేతకాక, వెనక్కి దూకబోయాడతను.

సూటిగా పోయి అతని పొత్తికడుపుకు మూడు అంగుళాల పైన కనెక్ట్ అయింది షాడో పాదం.

బాధను భరించటం చేతకాక బిగ్గరిగా వికృతశబ్దాలు చేస్తూ గాలిలోకి లేచాడా అడవిమనిషి.

రాక్షసహస్తం ఏదో గట్టిగా పట్టుకుని విసిరేసినట్లుగా పోయి, ఆరడుగుల దూరంలో వున్న ఒక చెట్టుబోదెకు కొట్టుకున్నాడు.

అంతకుముందు అతని మణికట్టుకు తగిలి క్రిందికి జారిపోయిన డాగర్ కోసం ఒక్కక్షణం పాటు చుట్టూ చూశాడు షాడో.

ఆ ఒక్క క్షణంలోనే జరిగిపోయింది అతను ఎదురుచూడని దారుణం ఒకటి.

ఎంతసేపటినుంచి ఆ చుట్టుపట్ల మాటువేసి కూర్చున్నదో గాని, ఉన్నట్లుండి విసురుగా ఒక పొద చాటునుంచి ఇవతలికి వచ్చింది రెండు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల పొడవున్న నల్లచిరుత.

మూడు మూరల పొడవుండే పొడవాటి తోకను కొరడా మాదిరి ఝుళిపిస్తూ అమాంతం ఎగిరి అడవి మనిషి మీదికి దూకింది.

క్రిందినుంచి లేచి దూరంగా పారిపోయే అవకాశం గాని, నడుముకే వ్రేలాడుతున్న రాతి గొడ్డలిని అందుకుని ఆత్మరక్షణ చేసుకోవటానికి వ్యవధిగాని అతనికి లభించలేదు.

చెవులు చిల్లులు పడిపోయేలా గర్జిస్తూ వెనుక పాదాలతో అతని గుండెల్ని అదిమి గంగాళం మాదిరి నోటిని తెరిచింది నల్లచిరుత.

అతని తలను పొడవాటి కోరలమధ్య ఇరికించుకుని కసుక్కున కొరికే ప్రయత్నం చేసింది.

"పారిపోవటానికి మనకు ఇంతకంటే మంచి అవకాశం మరొకటి లభించదు. కమాన్ మై ఫ్రండ్... కమాన్" అంటూ గబుక్కున ముందుకు వచ్చి షాడో చేతిని పట్టుకోబోయాడు సైంటిస్ట్.

తనేం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన మైకంలో మునిగిపోయాడు షాడో. అతని చేతిని విదిలించి కొట్టాడు. గుండెలనిండా గాలిని పీల్చుకుంటూ ఎగిరి అడవి మనిషి దగ్గిర నేలను తాకాడు. ఒక్కక్షణం... ఒకే ఒక్క క్షణం పాటు తలతిప్పి అతని ముఖంలోకి చూసింది ఆ నల్లచిరుత.

ఎడమపాదాన్ని నేలకేసి అదిమి, అడవిమనిషి మాదిరి ఆ చుట్టుపట్ల వున్న చెట్లు చేమలు దద్దరిల్లిపోయేటట్లు పెట్టాడు అతను - ఒక పొలికేక.

అప్పటికీ అడవిమనిషిని వదిలిపెట్టే ఆలోచన చేయలేదా క్రూరజంతువు. అతని తలను నోటిలో ఇరికించుకునే ప్రయత్నాన్ని మానలేదు.

వట్టిచేతులతో ఆ అడవి జంతువును ఎదిరించటంగాని, గాయపరచటంగాని సాధ్యపడే పని కాదని తెలుస్తూనే వున్నా, వెనుకంజ వేయకుండా, దాని నడుమును వాటేసుకుని వెనక్కి దొర్లాడు షాడో.

వెనుక పాదాలకున్న గోళ్ళతో అడవిమనిషి శరీరాన్ని ఇంకోసారి తీవ్రంగా గాయపరుస్తూ, అతని చేతుల్లోకి వచ్చేసిందా క్రూరజంతువు.

కుడిపంజాతో అతని భుజాన్ని బలంగా కొట్టి ఛెంగున గాలిలోకి ఎగిరింది.

మానటానికి సిద్ధంగా వున్న పాతగాయాలు తిరిగి రేగే సరికి విపరీతమైన బాధతో బైర్లు కమ్మాయి షాడో కనులు. పళ్ళబిగువున తీవ్రమైన బాధను భరిస్తూ, గాలిలోకి ఎగిరిన జంతువు వెనుకపాదాన్నొకదాన్ని పట్టుకున్నాడు అతను.

అలా పట్టుకుంటున్న సమయంలో అగుపించింది అతనికి ఆ గాయం.

అడవిమనిషి మూలకంగా ఏర్పడినది కాదు అది... ముళ్ళపొదల మీదినించి దూకటం వల్లనో, చెట్లమీదినించి పడటం వల్లనో ఏర్పడింది అంతకన్నా కాదు. శక్తివంతమైన రైఫిల్‌తో ఎవరో ప్రాణాలు తీయటానికి ప్రయత్నించగా తగిలిన బుల్లెట్ దెబ్బ.

అతన్ని, అడవిమనిషిని, గట్టిగా మాట్లాడితే అల్లంత దూరంలో నిలబడి వున్న ఇటాలియన్ సైంటిస్ట్‌ని - ముగ్గుర్ని కలిపి అప్పడం మాదిరి చప్పరించగల శక్తి ఆ నల్లచిరుతకు వున్నది.

అటువంటి శక్తి వుండికూడా బుల్లెట్ గాయంమీద వత్తిడి కలిగేసరికి విపరీతమైన బాధతో మతి పోగొట్టుకున్నది అది. గావురు మని అరుస్తూ ఎడ పెడా పంజాల్ని విసిరి షాడో గుండెల్ని రక్తసిక్తం చేసేసింది. అయినా సరే తన పట్టును వదలలేదు షాడో... బుల్లెట్ గాయాన్ని గట్టిగా నొక్కటాన్ని మానుకోలేదు.

క్షణక్షణానికి అధికం అయిపోతున్న బాధను భరించటం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చి, విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు అడివి జంతువులన్నీ ఏం చేస్తాయో ఆ పనే చేసేసింది నల్లచిరుత.

ఆఖరిసారిగా అతని ముఖంమీద పెద్దగాటు పెట్టి, శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుంటూ ఎగిరి అవతలికి దూకింది. దొరక్క దొరక్క తనకు దొరికిన ఆ మానవుడ్ని హతమారుద్దామనే కోరిక నశించి పోవటంవల్ల, వెనుతిరిగి పొదల్లోకి పారిపోయింది.

నల్లచిరుతతో షాడో పడుతున్న కుస్తీపట్లను గమనించి విపరీతమైన భయంతో బిగుసుకుపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్. అంతలోనే తెలివి తెచ్చుకుని తన భయాన్ని బలవంతంగా అణుచుకున్నాడు. బాణాన్ని

ప్రయోగించబోతున్న ఆటవికుడి మీదికి షాడో విసిరిన డాగర్ కనిపించేసరికి, రెండో ఆలోచన లేకుండా చేతుల్లోకి తీసుకున్నాడు.

దాని సహాయంతో షాడోకి హెల్ప్ చేద్దామని అనుకున్నాడతను. కానీ పాదాల మధ్యలో నుంచి పొడవాటి ఒక పాము జరజరమని పాకుతూ అవతలికి పోయేసరికి అదిరిపడి డాగర్‌ని వదిలేశాడు.

అదే సమయంలో క్రిందినించి లేచాడు షాడో... పారిపోయిన నల్లచిరుత వెనక్కి వచ్చే అవకాశాలు లేవని నిర్ధారణ అవగానే, వెల్లికిలా పడివున్న ఆటవికుడి దగ్గిరికి జంప్ చేశాడు.

పదునైన కోరలు తగిలి ఆటవికుడి తల కూడా నెత్తురు మడుగు క్రింద మారిపోయివున్నది. బరువుగా కదులుతున్న అతని ఛాతీ... ఏ క్షణంలోనైనా ప్రాణాలు పోగొట్టుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

"మనమీద జాలిపడిన అరణ్య దేవతలు సరైన సమయంలో ఆ చిరుతను పంపి ఎంతగానో సహాయపడ్డారు. ఈ దుర్మార్గుడి బంధువులో, స్నేహితులో ఎవరో ఒకరు ఇతన్ని వెదుకుతూ ఇక్కడికి రాకముందే మనం ఈ ప్రదేశాన్ని వదిలిపెట్టటం చాలా మంచిది..." షాడో ఆలోచనలు ఏమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

స్పృహలేదు ఆటవికుడికి...

ఉండి ఉండి ఏదో భూతాన్ని చూసినట్లు ఉలిక్కి ఉలిక్కిపడుతున్నాడు... అస్పష్టమైన శబ్దాలు ఏవో వెలువడుతున్నాయి అతని నోటినుంచి.

"రక్తం అధికంగా నష్టపోవటంవల్ల కనిపించే లక్షణాలు అవి. తాగటానికి కాసిని నీళ్ళు ఇచ్చి ఆ గాయాలకు వైద్యం చేయకపోతే పైలోకానికి ప్రయాణం కట్టేస్తాడు" ఆ లక్షణాలను గమనించి తనకు తెలిసిన విషయాలను చెప్పాడు సైంటిస్ట్.

ముఖంమీది గాయాల మూలకంగా క్రిందికి జారుతున్న రక్తాన్ని షర్టు భుజానికి అద్దుకుంటూ ఆలోచనలో పడ్డాడు షాడో.

ఆటవికుడి దాహం తీర్చాలంటే వచ్చిన దారినే వెనక్కి పోయి కపాలాల కట్టడాన్ని దాటాలి... కపాలతోరణం దగ్గిర కొండవాగును చేరుకోవాలి...

అంత దూరం వెళ్ళి, అక్కడినుంచి నీళ్ళను తీసుకురావటానికి సరైన పాత్ర లేదు. పోనీ స్పృహలేని ఆటవికుడినే అక్కడికి తీసుకుపోదామంటే ఆ కదలికను భరించే ఓపిక అతని శరీరంలో మిగిలివున్న లక్షణాలు కనిపించటం లేదు... రక్తస్రావం అధికమై క్షణాల మీద ప్రాణాలు కోల్పోవచ్చు.

రెండు క్షణాలు ఆలోచించి వున్నట్టుండి మోకాళ్ళ మీద కూర్చున్నాడు షాడో. ఎడమచెవిని నేలకు ఆనించి అతి శ్రద్ధగా ఆలకించాడు.

"ఏం చేస్తున్నావ్ మైఫ్రెండ్? అడవి దేవతల నెవరినైనా ప్రార్థిస్తున్నావా?" వెక్కిరింపుగా అనబోతూ, అతని ఉద్దేశ్యం ఏమిటో అర్థమై ఆ మాటల్ని నోటిలోనే అదిమేసుకున్నాడు సైంటిస్ట్.

ఆ చుట్టుపట్ల ఎక్కడైనా జలప్రవాహం వుండివుంటే, నేలను ఆనుకుని వున్న షాడో చెవికి తప్పకుండా వినిపించి తీరుతుంది నీటి ఉరవడివల్ల ఉత్పన్నమయ్యే శబ్దం.

సైంటిస్ట్ ఆలోచనలు పూర్తికాకముందే ఛెంగున పైకి లేచి, అచేతనంగా పడివున్న ఆటవికుడిని అతి నెమ్మదిగా చేతుల్లోకి ఎత్తుకున్నాడు షాడో.

''కమాన్ సర్... కమ్ విత్ మీ'' అని ఇటాలియన్ సైంటిస్ట్‌ని హెచ్చరిస్తూ, ఒక పొద పక్క నుంచి వందగజాలదూరం తీసుకుపోయాడు.

ఎత్తుగా ఎదిగివున్న తుంగదుబ్బుల వంటి గడ్డి మొక్కల సమూహాలు రెండింటిని అధిగమించిన మరుక్షణం వారి ఎదుట ప్రత్యక్షం అయింది ఉరుకులు పరుగులు తీస్తూ ప్రవహిస్తున్న చిన్నవాగు.

ఆటవికుడి ఒంటి మీది గాయాల్ని ఆ నీటితో శుభ్రం చేశాడు షాడో... దోసిటితో ఎత్తి అతని పెదవుల మీద పోశాడు... వాగు ఒడ్డునే పెరిగివున్న కొన్ని చిన్న చిన్న మొక్కల్ని త్రుంచి, వాటి ఆకుల్ని అతని గాయాలకు అంటించాడు.

మంత్రం వేసినట్లు వెంటనే నిలిచిపోయింది రక్తస్రావం... విపరీతమైన బాధను అనుభవిస్తున్నట్లు ముడతలు పడివున్న ఆటవికుడి నుదురు మామూలుగా మారిపోయింది.

ముందుకు వంగి అతని పరిస్థితిని చాలా క్లోజ్‌గా అబ్జర్వ్ చేస్తున్న ఇటాలియన్ సైంటిస్ట్ వదనంలో వెంటనే ప్రత్యక్షం అయింది ఆశ్చర్యం.

“నువ్వు బెల్‌రియా వంటి సంఘవిద్రోహుల్ని వేటాడడం మానేసి, వైద్య శాస్త్రాన్ని అభ్యసించటం చాలా మంచిది మై ఫ్రెండ్. నీ చేతుల్లో ఏదో అపూర్వ శక్తి వున్నది... గోలీకాయలవంటి బాంబుల్ని విసిరి దారుణమైన ప్రేలుళ్ళు సృష్టించటం కంటె, ఆపదలో వున్న వారికి సహాయ పడటంలోనే ఎక్కువ తెలివిని చూపిస్తాయి నీ చేతులు” మెచ్చుకోలుగా చూస్తూ తన మనసు లోని మాటల్ని నిస్సంకోచంగా బయట పెట్టాడు.

ఆ మాటలు తనకు వినబడనట్లు నటిస్తూ, ఆటవికుడి తలక్రింద కట్ట కట్టిన రెండు తుంగదుబ్బుల్ని పెట్టి తలగడలా అరేంజి చేశాడు షాడో.

అంతకుముందు పది క్షణాల క్రిందటి వరకూ అటో ఇటో అన్నట్లున్న ఆ వ్యక్తి పరిస్థితి చాలా ఇంప్రూవ్ అయిన విషయం స్పష్టంగా గోచరించిన తర్వాత మెల్లగా లేచి తన ఒంటి మీది గాయాల్ని గురించి పట్టించుకోవటం మొదలు పెట్టాడు.

స్వచ్ఛంగా వున్న వాగు నీటిలో దిగి, ముఖం మీది రక్తపు చారికల్ని శుభ్రం చేసుకుంటూ వుండగా వచ్చింది అతనికి ఒక అనుమానం.

వాగు నీటిలో ఏదో పెద్ద భూతం కనిపించినట్లు అదిరిపడి, రెండే రెండు అంగల్లో ఒడ్డుకు చేరుకున్నాడు. కదలిక లేకుండా పడుకుని వున్న ఆటవికుడి దగ్గర్నించి రాతి గొడ్డల్ని తీసుకోబోతుండగా -

నిశ్శబ్దంగా వచ్చి అతన్ని, సైంటిస్ట్‌ని చుట్టుముట్టారు మరో పాతికమంది ఆటవికులు.

జేగురురంగు కొండరాతితో చెక్కిన శిల్పాలవంటి వారి శరీరాల్ని, ఏమాత్రం కదిలినా రివ్వుమంటూ దూసుకువచ్చి ప్రాణాల్ని బలిపుచ్చుకోవటానికి సిద్ధంగా వున్న వారి చేతుల్లోని బాణాల్ని గమనించి, ఆటవికుడి దగ్గర్నించి తీసుకున్న రాతిగొడ్డలిని క్రిందికి వదిలేశాడు షాడో.

"తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరమనే మాటకు అర్థం ఇదే మై ఫ్రెండ్... అవకాశం వున్నప్పుడే అవతలికి పారిపోవల్సింది... కపాల తోరణానికి మన తలలు వ్రేలాడాలని మన ముఖాలమీద వ్రాసి

వున్నప్పుడు, మంచి మంచి ఆలోచనలు మనకు ఎలా కలుగుతాయి?" నిర్వేదంగా అంటూ నిలబడిన చోటునే కూలబడిపోయాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అపార్థం చేసుకున్నారు ఆటవికులు అతని కదలికల్ని. క్రిందికి జారినట్టే జారి ప్రక్కనే వున్న వాగులోకి దూకే ప్రయత్నం చేయబోతున్నాడన్న అనుమానంతో, తమ దగ్గిర వున్న రాతిగొడ్డళ్ళను గాలిలోకి ఎత్తి ముందుకు దూకారు వారిలో ఇద్దరు.

"మైగాడ్! ఆగండి, దయచేసి కాస్తంత నిదానించండి... ఆగండి..." అంటూ ఆందోళన నిండిన కంఠంతో బిగ్గిరిగా అరుస్తూ వారిని వారించటానికి ప్రయత్నించాడు షాడో.

ఆ మాటలు అర్థం కాలేదు ఆ ఆటవికులకు పెద్దపులిలా పోయి ఇటాలియన్ సైంటిస్ట్ జుట్టును గట్టిగా పట్టుకున్నాడు ఒకతను.

రాతి గొడ్డల్ని ఏటవాలుగా గాలిలోకి ఎత్తి అతని మెడకేసి గురిపెట్టాడు రెండో పెద్దమనిషి.

ఆలస్యం చేస్తే సైంటిస్ట్ తల మెడమీదనించి ఎగిరి నేలమీద పడిపోతుందని అర్థమయ్యేసరికి తనను తాను మరిచిపోయాడు షాడో.

బ్రహ్మరాక్షసుల వంటి ఆటవికులు అనేకమంది తన చుట్టూ నిలబడివున్నారన్న మాట కూడా మరుపుకు వచ్చేసింది అతనికి.

ఎడమపాదాన్ని నేలకు బలంగా తాటించి అరణ్యం అదిరిపోయేటట్లు పొలికేక ఒకటి పెట్టాడతను. పున్న పాళంగా గాలిలోకి ఎగిరి పల్టీలు కొడుతూ సైంటిస్ట్ సమీపంలోనే నేలను తాకాడు.

కంటికి కనిపించనంత వేగంతో పైకి లేచింది అతని కుడిపాదం... పది టన్నుల కాంక్రీట్ దిమ్మ మాదిరి పోయి రాతిగొడ్డలిని ప్రయోగించబోతున్న ఆటవికుడి గుండెలకి కనెక్ట్ అయింది.

ఊపిరి తీసుకోవటం చాలా కష్టమైపోయిందా వ్యక్తికి. గావురుమని అరుస్తూ గాలిలోకి లేచి నాలుగు అడుగుల దూరంలో పడిపోయాడు.

అతని గుండెలకి కనెక్ట్ అయిన కుడిపాదం తిరిగి నేలను చేరుకున్న మరుక్షణం ఛట్‌మని శబ్దం చేస్తూ పైకి లేచింది షాడో ఎడమపాదం.

కుంగ్‌ఫూ పోరాటవిద్యలో అత్యంత ప్రమాదకారిగా పేర్కొనబడిన డబుల్‌కిక్ రెండో ఆటవికుడి కుడిభుజానికి తగిలింది.

ఆ వ్యక్తి ఇటాలియన్ సైంటిస్ట్ జుట్టును పట్టుకున్న మూడే మూడు క్షణాల్లో పూర్తి అయిపోయింది ఆ పోరాటం... ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపుగా అతను కూడా గాలిలోకి లేచి తన సహచరుడి సమీపంలో వెల్లికిలా పడిపోయాడు.

''ప్రమాదం చుట్టుముట్టినప్పుడు నిశ్చలంగా నిలబడటం నేర్చుకోవాలి... పరిస్థితి అర్థం అయ్యేదాకా అనవసరమైన ఆవేశాన్ని

ప్రదర్శించకూడదు'' అంటూ ముందుకు వంగి, నేలమీద కూలబడిన ఇటాలియన్ సైంటిస్ట్ భుజాల్ని పట్టుకున్నాడు షాడో. మృదువుగా మాట్లాడుతూ అతన్ని పైకి లేపాలని అతని వుద్దేశ్యం. కానీ ఆ పని చేయలేకపోయాడతను.

గెరిల్లాలకు పట్టుబడిన దగ్గర్నించీ సరైన ఆహారం తీసుకోకుండా, పూర్తి విశ్రాంతిని పొందకుండా అదేపనిగా చిందులు తొక్కినందుకు పెనాల్టీని సరిగ్గా అప్పుడే పే చేయవలసివచ్చింది.

కనులముందు నలుపురంగు సిల్కు పరదాలు వ్రేలాడకట్టబడినట్లు అనుభూతిని పొందుతూ అలాగే ముందుకు పడిపోయాడు.

చీకట్లు చుట్టుముట్టడానికి మరో రెండు గంటలు వ్యవధి వున్నదనగా కనులు తెరిచి చుట్టూ చూశాడు షాడో.

కపాల తోరణానికో, కపాలదేవత ఆలయ ప్రాకారానికో తగిలించి వుండవలసిన తన తల - ఇంకా తన దగ్గిరే వున్నందుకు కాస్తంత ఆశ్చర్యం అతనికి కలిగిన మాట మాత్రం వాస్తవం.

తుంగదుబ్బుల దగ్గిర గలగలలాడుతూ ప్రవహించే కొండ వాగు కనిపించలేదు అతని కనులకు... అడవి ఆకులతో చాలా అందంగా కట్టబడి ఉన్న చిన్న గుడిసె అగుపించింది. అడవి జంతువుల చర్మాలతో తయారు చేయబడిన పడకమీద పరుండబెట్టి వున్నాడు అతను.

ఒంటిమీద వున్న గాయాలన్నిటికీ ఏదో పసరు పూయ బడింది. ఎడమవైపు భుజం మీది గాయాలకు గట్టి బేండేజ్ వేయబడింది.

"నన్ను బాధిస్తున్న శారీరక రుగ్మతలను నయం చేసి కొవ్వు పట్టేదాకా తిండి తినిపిస్తారు. ఆ తరువాత తీరికగా తీసుకుపోయి తలల్ని నరుకుతారు. ఈ సౌకర్యాల వెనుక వున్న అర్థం అదే... సందేహం లేదు" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అంటూ పక్కమీదలేచి కూర్చున్నాడు.

గుడిసెవంటి ఆ కట్టడంలో ఇంకో మూల హాయిగా పడుకుని ఆదమరిచి నిద్రిస్తున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్. అదిరిపడి మెలకువ తెచ్చుకున్నాడు షాడో అన్న ఆ మాటల్ని విని.

"వాగు దగ్గర్నించి ఇసుక మూటను మోసుకొచ్చినట్లు తీసుకువచ్చి ఇక్కడ పడేశారు నన్ను. నిన్ను జాగ్రత్తగా ఎత్తుకొచ్చారు వీళ్ళు... వయసుకు మర్యాద ఇవ్వటం తెలియని డండర్ హెడ్స్..." కోపాన్ని నటిస్తూ అన్నాడతను. మాటలైతే మహా వేగంగా వున్నాయి గానీ, వాటి వెనుక చెప్పరానంత రిలీఫ్ దాగుకుని వున్నట్లు వెంటనే అవగతమైంది షాడోకి.

అతను తరిచి తరిచి ప్రశ్నించాల్సిన అవసరం లేకుండా, తనంతట తనే జరిగిందంతా అతనికి తెలియజేశాడు సైంటిస్ట్.

"నల్ల చిరుత బారినుంచి ఆ ఆటవికుడిని కాపాడటానికి నువ్వు చేసిన ప్రయత్నమే మన తలలు ఎగిరిపోకుండా అడ్డుకున్నది..." అంటూ ముగించాడు.

సాలోచనగా తల వూపుతూ లేచాడు షాడో... బిగుసుకు పోయినట్లు వున్న చేతుల్ని కదిలించి చూసుకుంటూ గుడిసె ముఖద్వారం వైపు అడుగులు వేయబోతుండగా, లోపలికి వచ్చాడు నల్లచిరుత బారినుండి అతను కాపాడిన ఆటవికుడు.

ప్రాణాలు పోతాయనుకున్న ఆ మనిషి అంతలోనే హాయిగా లేచి తిరుగుతూ వుండటాన్ని గమనించగానే కొంచెం రిలీఫ్‌గా ఫీలయ్యాడు షాడో.

"నీ స్టామినా చాలా గొప్పది మై ఫ్రెండ్... నిన్ను చూసి ఈర్ష్య పడుతున్నాను" అని మెచ్చుకున్నాడు.

ఆ మాటలు అర్థం కానట్లు ముఖం పెట్టాడా ఆటవికుడు. తను తీసుకువచ్చిన రాతి పాత్రలు రెండింటిని అతనికి, సైంటిస్ట్‌కి ఇచ్చాడు.

ఎర్రటి నిప్పులమీద దోరగా కాల్చిన మాంసపు ముక్కలున్నాయి ఆ పాత్రల్లో... ఏవో అడవి ఆకులతో చేసిన కూరవంటి పదార్థం ఏదో ఉన్నది.

"పాములు, తేళ్ళను పచ్చడి చేసి మనచేత తినిపిస్తున్నారేమో తెలియదు. ఫైవ్‌స్టార్ హోటళ్ళలో తప్ప ఇంకెక్కడా భోజనం చేయని

మనిషిని నేను... బిచ్చగాడి మాదిరి ఎదుటికి వచ్చిన పదార్థాలన్నిటినీ ఆరగించాల్సిన ఖర్మ పట్టింది ఇప్పుడు.'' తనలో తను అనుకుంటూ రెండే రెండు నిముషాల్లో పాత్రను ఖాళీ చేసేశాడు ఇటాలియన్ సైంటిస్ట్.

''నీకు ఎటువంటి అభ్యంతరం లేకపోతే ఒకసారి మా కుల పెద్దల ఎదుటికి రాగలవా?'' షాడో కూడా ఆరగించి, రాతి పాత్రను అవతల పెట్టేదాకా ఆగి, మెల్లిగా అడిగాడు ఆ ఆటవికుడు.

తన మాటలు అతనికి అర్థం కావని ముందుగానే గ్రహించినట్లు, చేతుల్ని, చేతివేళ్ళను కదిలించాడతను. చక్కటి సైగలు చేశాడు.

పూర్తిగా కాకపోయినా మూడొంతులు అవగతమై, ఎదురు చెప్పకుండా లేచి నిలుచున్నాడు షాడో. తాము ఎటువంటి ప్రదేశంలోకి తీసుకురాబడ్డారో తెలుసుకోవటం చాలా అవసరం... సందు దొరికిన మరుక్షణం అవతలికి జంప్‌చేసే అవకాశాల్ని గురించి, ముందుగానే ఒక అవగాహనకు రావటం అతి ముఖ్యం!

ఇంటర్‌పోల్ అప్పగించిన పనుల మీద ప్రపంచంలోని అరణ్యాలన్నింటిలోనూ తిరిగాడు షాడో... వాటిలో నివసించే అనాగరికుల్ని, ఆటవికుల్ని చూసివున్నాడు.

నివశించేది అడవిలోనే అయినా, చూడముచ్చటగా నివాసాల్ని నిర్మించుకునే జాతిని ఫేస్ చేయటం అదే మొదటిసారి అయింది అతనికి.

పద్ధతి ప్రకారం కట్టబడి వున్నాయి ఆ గూడెంలోని ఇళ్ళు... హాయిగా జీవించటానికి అవసరం అయిన వసతులన్నీ అక్కడ అగుపిస్తున్నాయి.

రచ్చబండ వంటి పెద్దరాతి అరుగుమీద కూర్చుని అతన్ని ఆహ్వానించారు ఆ గూడెపు పెద్దలు.

"మమ్మల్ని సర్వనాశనం చేసేందుకు ప్రయత్నించే జాతి నీది... నల్ల చిరుతను ఎదిరించి మా మనిషికి ప్రాణదానం చేయటానికి కారణం తెలుసుకోవాలని వున్నది" అనవసరమైన సైగలతో సమయాన్ని వృధా చేయకుండా, చేతుల్ని వూపాడు అందరిలోకి అతి వృద్ధుడైన ఆటవికుడు ఒకతను.

సమాధానం ఇవ్వటానికి క్షణకాలం కూడా తడుముకోలేదు షాడో, "మన జాతులు, మన ఆచారాలు వేరువేరైనా మనం అందరం మనుష్యులం. మన మధ్య వున్న తగాదాలను మాటలతోనో, చేతలతోనో మనమే తేల్చుకోవాలి... మన పగల్ని ఒక అడవి జంతువు ద్వారా తీర్చుకోవాలని అనుకోవటం తప్పు" మనసులోని మాటల్ని జాగ్రత్తగా సైగల రూపంలో వారికి తెలియజేశాడు.

ఆటవికుల మాటలే కాదు, సైగలూ అంతుబట్టలేదు సైంటిస్ట్‌కి. షాడో ఇచ్చిన సమాధానాన్ని చూసి, వృద్ధ ఆటవికుడు తనలో తను నవ్వుకోవటం మాత్రం అర్థం అయింది అతనికి.

''ఈ ముసలి బాస్టర్డ్ మనతో ఆటలు ఆడుతున్నాడు... మనం ఊహించని మాటలు ఏవో ఇతని నోటినుంచి వినబోతున్నాం... రెడీగా వుండు మై ఫ్రెండ్...'' షాడో చెవి దగ్గిర గుసగుసలాడాడు.

ఎంతో సమయం పట్టలేదు అతని మాటలు యదార్థం కావటానికి.

''మా జాతికి చెందనివారిని చూడగానే నరికి పోగులు పెట్టడం మా నియమం. వారి తలల్ని మా దేవతకు అర్పించటం మా విధాయకం. నీ ఒంటిమీది దెబ్బలు నయం కాగానే ఆ పని చేస్తాం'' సీరియస్‌గా తన నిర్ణయాన్ని తెలియచేశాడు.

రెట్టింపు సీరియస్‌గా చూశాడు షాడో ఆ సైగల్ని.

''నా శరీరంమీది గాయాలు మానగానే పారిపోయి ప్రాణాలు కాపాడుకోవటానికే ప్రయత్నిస్తాను నేను... అది నా నియమం'' అని తెలుపుతూ అంతవరకూ కూర్చున్న బల్లమీదినించి లేచాడు.

తమ నిర్ణయాన్ని అర్థం చేసుకున్న మరుక్షణం అతని ముఖంలో రంగులు మారతాయనీ, కరచరణాలు కంపించటం మొదలుపెడతాయనీ

అనుకున్నారు కాబోలు, అతని సమాధానాన్ని చూడగానే చిరునవ్వులు వెలయించారు అక్కడి వారందరూ - నాయకుడితో సహా.

“ప్రాణాలకు తెగించి మాకు సహాయపడినవారు మా మనుష్యులే అవుతారు తప్ప, పరాయి మనుషులు కారు. నీ సాహసం, నీ ధైర్యం మాకు నచ్చాయి. నీ శరీరం మీది గాయాలు నయం అవటానికి తగినంత సహాయం చేస్తాం...” అంటూ సైగల్ని ఆపి, చప్పట్లు చరిచాడు నాయకుడు.

వెంటనే - చప్పట్ల మోత చెవుల పడిన మరుక్షణం, అందంగా నిర్మింపబడివున్న అక్కడి గుడిసెలలో నుంచి బయటికి వచ్చేశారు ఆ గూడేనికి చెందిన ఆడవాళ్ళు అందరూ.

అంతకు ముందురోజు జన్మించిన పసిగుడ్డుల దగ్గర్నించీ, ఆరోజో లేక ఆ మరునాడో మరణించబోయే వృద్ధురాళ్ళ వరకూ ఉన్నారు వారిలో.

రచ్చబండ వంటి రాతి కట్టడం దగ్గిర వలయాకారంలో నిలబడిన ఆ ఆడవారందర్నీ చూసేసరికి ఊపిరి ఆగినంత పని అయింది షాడోకి.

అసలు అందం అనే మాట ఆ టారుంగ్ జాతిలోని ఆడవారిని చూసిన తర్వాతే సృష్టించబడిందేమో అనిపించింది అతనికి.

కోట్లకొలదీ గులాబీపువ్వుల్నీ, ఎర్రటి మందారాల్నీ, సుకుమారమైన సంపెగల్ని కలబోసి మూసచేసి, ఆ టారుంగ్ స్త్రీలను తయారు చేసి వుంటాడు భగవంతుడు.

ఆ తరువాత ఆ మూసను పాడుచేసి అవతల పారేసి, ఇతర జాతుల తయారీకి పూనుకొని వుంటాడు.

ఒకసారి చూస్తే జీవితాంతం అలాగే చూస్తూ వుండి పోవాలని అనిపించేటంత రమణీయంగా వున్న ఆ స్త్రీ మూర్తులకు మర్యాదపూర్వకంగా అభివాదం చేశాడు షాడో...

''చంపవచ్చిన శత్రువును అడవి చిరుత బారినుంచి కాపాడటమే కాకుండా, అడవి మొక్కలతో వైద్యం చేసి ప్రాణాల్ని నిలిపిన నీ నిండు హృదయానికి మేము ఇచ్చే కానుక ఇది. వయసు వచ్చిన వారిలో నుంచి నీకు కావల్సినంత మందిని కోరుకో... మా వద్ద వున్నంతకాలం నీ దగ్గిరే వుంచుకో...'' రచ్చబండ మీది నుంచి లేచి, ఆడవారివైపు చేయి ఊపుతూ సూచించాడు గూడెపు నాయకుడు.

''రొట్టె విరిగి నేతిలో పడటం అనే మాటకు అర్థం ఇదే మై ఫ్రెండ్... నువ్వు నిజంగా అదృష్టవంతుడివి'' పూర్తిగా కాకపోయినా, నాయకుడి ఆంతర్యం ఒక మోస్తరుగా అవగతమై, ఆశ్చర్యం నిండిన కంఠంతో కామెంట్ చేశాడు సైంటిస్ట్.

చిరునవ్వులు చిందిస్తూ తనవంక తదేకంగా చూస్తున్న స్త్రీ మూర్తులందరికీ మరోసారి తలవంచి అభివాదం చేశాడు షాడో.

''కోరుకో... నీకు నచ్చిన వారిని ఎంపిక చేసుకో...'' ఆలస్యాన్ని ఏ మాత్రం భరించలేనట్లు అసహనంగా చేయి ఊపాడు వారి నాయకుడు.

నిరారుగా నిలబడి తల అడ్డంగా ఊపాడు షాడో.

''అద్భుతమైన అందాల్ని కనులతో చూసి సంతోషించటమే నాకు అలవాటు... చేయివేసి మలినపరచటం నాకు చేతగాదు. మీరు నా ఎడల చూపిన దయకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను...'' అని సైగచేస్తూ, అక్కడి నుంచి తమకు కేటాయించిన గుడిసె దగ్గరికి బయలుదేరాడు.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

శిలా విగ్రహాల్లా మౌనంగా నిలబడి అతనివంకే చూడసాగారు అక్కడి ఆడ, మగ అందరూ.

షాడో చేయి కదిపినా, కాలు కదిపినా ఏదో ఒక కామెంట్ చేసి కాలక్షేపాన్ని వెతుక్కునే ఇటాలియన్ సైంటిస్ట్ కూడా నిర్విణ్ణుడైపోయాడు... అతనిలోని రియాక్షన్‌ని గమనించి.

''నీతో గడిపిన ప్రతిక్షణం ఒక ఎడ్యుకేషన్ వంటిది మై ఫ్రెండ్... బాంబులు విసిరి మనిషి ప్రాణాలను హరించటం దగ్గర్నించి, మానవజాతికి అవసరమైన నీతి నియమాలను ఆచరణలో పెట్టటం వరకూ ఎన్నో

విషయాలను తెలుసుకోగలుగు తున్నాను. బెల్‌రియా ఆట కట్టించగలవాడివి నువ్వు ఒక్కడివే అని నాకు ఇప్పుడు పూర్తి నమ్మకం చిక్కుతోంది...'' తమ గుడిసెను సమీపిస్తుండగా అన్నాడతను.

బెల్‌రియా ప్రసక్తి వచ్చేసరికి అల్లకల్లోలమై పోయింది షాడో అంతరంగం. ఇటాలియన్ సైంటిస్ట్‌ని రక్షించటం తన ప్రైమరీ ఎస్సైన్‌మెంట్. అతను తయారు చేసిన వశీకరణ యంత్రాన్ని బెల్‌రియా దగ్గర్నించి తప్పించటం సెకండరీ...

ఆ రాత్రికి అక్కడే గడిపి తెల్లవారగానే టారుంగ్ జాతి సహాయంతో అరణ్యాన్ని అధిగమించి, సముద్రపు ఒడ్డును చేరుకోవాలి... ఏదో ఒక విధంగా సైంటిస్ట్‌ని మెయిన్ లాండ్‌కి రవాణా చేసి, ఆ తరువాత బెల్‌రియాని గురించి ఆలోచించాలి.

తూర్పుదిక్కు తెల్లబడకముందే ప్రయాణం ప్రారంభించటం సముచితమనే నిర్ణయానికి రాగానే అణిగిపోయింది షాడో అంతరంగంలోని అల్లకల్లోలం. జంతుచర్మాల పడకమీద పడుకుని పసిపిల్లాడి మాదిరి నిద్రపోయాడు అతను.

ఎనిమిది గంటల తరువాత ఇటాలియన్ సైంటిస్ట్ ఆందోళన నిండిన కంఠంతో తనను పిలిచేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

* * * * *

“జరగరాని దారుణం ఏదో జరిగినట్లు గూడెం అంతా అల్లకల్లోలమై పోతోంది. ఏడుపులు, పెడబొబ్బలు వినబడుతున్నాయి. కారణం ఏమిటో అర్థం కావటం లేదు...” షాడో భుజాల్ని పట్టుకుని గట్టిగా కుదుపుతూ అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

నిద్రమత్తు పూర్తిగా వదలని కనుల్ని అరిచేతులతో అద్దుకుంటూ పడక మీదినుంచి లేచి గుడిసె బయటికి వచ్చాడు షాడో.

కాగడాల వంటి పరికరాలతో పట్టపగలుగా వున్నది గూడెం మధ్యభాగంలో వున్న రచ్చబండ.

ఆడ, మగ, స్త్రీ, బాల వృద్ధులందరూ గుమికూడి ఉన్నారు అక్కడ... రాతి అరుగుమీద నిలబడి తమలో తాము మాట్లాడుకుంటున్న నాయకుల వంక దీక్షగా చూస్తున్నారు.

అడుగులో అడుగువేస్తూ వచ్చిన షాడోని గురించి పట్టించుకోలేదు ఎవరూ. పట్టించుకున్న వారు కూడా పెదవులు విప్పి పలుకరించలేదు.

“వీళ్ళ భాష మనకు రాకపోవటం రానురాను చాలా ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ఇప్పుడు ఏం ముంచుకు వచ్చిందని వీళ్ళందరూ ఇక్కడ గుమికూడారో మనకు ఎలా తెలుస్తుంది?”

లోగొంతుకతో అంటున్న సైంటిస్ట్‌ని కాసేపు మౌనంగా వుండమని సైగచేస్తూ రచ్చబండకేసి పరిశీలనగా చూశాడు షాడో.

అంతకుముందు అక్కడ అగుపించని కొత్తముఖాలు కొన్ని వెంటనే అగుపించాయి అతనికి. ఎంతో దూరం నుంచి ఆదరాబాదరాగా పడి వచ్చినట్లు అలసటతో నిండివున్నాయి అవి...

క్షణక్షణానికి సస్పెన్స్ అధిక అవటం భరించలేక ప్రక్కనే వున్న మధ్య వయస్కురాలిని భుజం తట్టి పలుకరించాడు.

"ఏమైందమ్మా? ఏమిటి విశేషం?" ప్రశ్నార్ధకంగా చూస్తూ పిడికిలిని గాలిలో పైకి క్రిందికి ఆడించాడు.

అతను పలకరించనంత వరకూ బాగానే వున్నది ఆ స్త్రీ... పలుకరించిన మరుక్షణం నోటికి చేతిని అడ్డుపెట్టుకుని బావురుమన్నది ఒక్కసారిగా.

ఆ శబ్దాన్ని విని తలలు వెనక్కి తిప్పారు అక్కడి వారందరూ... రచ్చబండమీది నాయకులు కూడా అటుకేసి చూశారు.

కాగడాల వెలుగులో షాడోని, సైంటిస్ట్‌ని గమనించిన మరుక్షణం పట్టరాని కోపంతో కందగడ్డల మాదిరి ఎర్రబడి పోయాయి కొత్తగా వచ్చిన వారి వదనాలు.

గొంతులు చినిగిపోయేలా వెర్రి కేకలు పెడుతూ ఛెంగున దూకారు రచ్చబండ మీదినించి. గాలిలో తేలుతున్నట్లు అతివేగంగా వచ్చి, అమాంతంగా అతనిమీదా, సైంటిస్ట్ మీదా కలబడ్డారు.

"అయ్యబాబోయ్... ఏమిటిది? ఏమిటి ఈ దౌర్జన్యం?" ఆందోళనగా అంటున్న సైంటిస్ట్‌ని బలవంతంగా ప్రక్కకు నెట్టి, కొత్తగా వచ్చినవారి బారినుంచి కాపాడాడు షాడో.

పిడికిళ్ళతో అతన్ని పడగొట్టటం అసాధ్యం అని గ్రహించి, నడుములకున్న రాతి గొడ్డళ్ళను అందుకున్నారు ఆ వ్యక్తులు.

ఒకే ఒక దెబ్బతో అతని తలను గాలిలోకి ఎగురవేసే ప్రయత్నాలు ప్రారంభించారు.

వారెవరో, ఎందుకలా విరుచుకుపడుతున్నారో తెలుసుకునే లోపల, తన ప్రాణాలు పోవటమో, పది రోజులపాటు పడకవేసే గాయాలు ఒంటిమీద ప్రత్యక్షం కావటమో జరిగి తీరుతుందని గ్రహించి, యాక్షన్‌లోకి దిగిపోయాడు షాడో.

ఒకటి రెండు... ఒకటి రెండు అని లెక్కబెడుతూ రెండు అడుగులు ప్రక్కకు వేసి, ఫెడీమని ఒక సైడ్‌కిక్‌ని డెలివర్ చేశాడు... అదే ఊపులో పిడికిళ్ళను విసిరి ఇద్దరి ముఖాలను గాయపరిచాడు.

సైడ్ కిక్ తగిలిన వ్యక్తి అరిచిన దారుణమైన అరుపుకు అక్కడి వారందర్నీ ఆవరించుకున్న ఆశ్చర్యం అదిరిపడి దూరంగా పారిపోయింది.

ముఖాలు పగిలిపోయిన వారి మూలుగులు అందర్నీ ముందుకు దూకేటట్లు చేశాయి...

అర్ధరాత్రి సమయంలో వెచ్చటి చోటుకోసం కొట్లాడే కణుజు మృగాల మాదిరి కీసర బాసరగా అరుస్తూ కదిలారు ఆడవారందరూ.

దెబ్బలు తగిలిన వారిని, దెబ్బలు తినటానికి సిద్ధంగా వున్న వారిని అందరినీ వెనుకనుంచి పట్టుకుని రచ్చబండ కేసి లాక్కుపోయారు. రెండు క్షణాల్లో ఎంత హఠాత్తుగా ప్రారంభమయిందో, అంతే హఠాత్తుగా అంతం అయిపోయింది ఆ సందడి.

ఊపిరి బరువుగా పీలుస్తూ, చిమచిమ లాడుతున్నటువంటి పిడికిళ్ళను ప్యాంటుకేసి రాసుకుంటున్న షాడో భుజం మీద చేయి వేసి, అదో మాదిరిగా నవ్వాడు గూడెం నాయకుడు.

‘‘మీ గురించి తెలియకపోవటం వల్ల, మీరు మాకు అతిథులని అర్థం కాకపోవడం వల్ల ఆ రకంగా తొందర పడ్డారు మా బంధువులు... అందుకు క్షమించాలి’’ అనే అర్థం వచ్చేటట్లు సైగలు చేస్తూ అతన్ని కూడా రచ్చబండ దగ్గిరికి తీసుకుపోయాడు.

దెబ్బలు తినికూడా గుర్రుగా చూస్తూ, పెద్ద కంఠంతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న ఒక మనిషిని గద్దించి షాడో ముఖంలోకి చూడమన్నాడు. దూరంగా వున్న కాగడా నొకదాన్ని దగ్గిరికి తెప్పించి అతని చేతికి ఇచ్చాడు.

పది క్షణాల పాటు పట్టి పట్టి చూసి, బిక్క ముఖం పెట్టాడు ఆ వ్యక్తి. తల విదిలిస్తూ మిగిలిన వారిని కూడా దగ్గిరికి పిలిచాడు.

"మిమ్మల్ని చూసి శత్రువులుగా భావించటం వల్ల, ఈ పొరబాటు జరిగింది. అందుకు వీరి తరఫున నేను క్షమాపణలు కోరుకుంటున్నాను"

మృదువైన కంఠంతో మరోసారి తమ బంధువుల తొందరపాటు చర్యకు మన్నింపు కోరుకున్నాడు గూడెం నాయకుడు.

తనను శత్రువుగా భావించి తొందరపడినందుకు తప్పుగా భావించటం లేదని అందరికీ అర్థం అయ్యే విధంగా సైగలు చేసి చెప్పాడు షాడో.

ముక్కులు పగిలిన వారిని, సైడ్‌కిక్ ధాటికి కళ్ళు తేల వేసిన ఆటవికుడిని పరామర్శించాడు. వారి భుజాలపై చేయివేసి చిరునవ్వు నవ్వాడు.

"ఈరోజు సాయంత్రం మా బంధువులు నివసించే గూడెం మీద నాగరికులు కొందరు దాడి చేశారట... అడ్డుపడిన వారిని భయంకరమైన ఆయుధాలతో చెల్లా చెదరు చేసి ఆడవాళ్ళను అపహరించుకుపోయారట... వాళ్ళు ఉపయోగించిన ఒక బ్రహ్మాండమైన మంత్రాల పెట్టె వంక చూసిన ప్రతి ఆడమనిషి, ఎదురు చెప్పకుండా పెంపుడు జంతువు మాదిరి వారి వెంట వెళ్ళిపోయిందిట"

షాడో ఒక్కడికే కాదు - ఇటాలియన్ సైంటిస్ట్‌కి కూడా అర్థం అయ్యాయవి.

"ఇది బెల్‌రియా పనే - సందేహం లేదు. వీళ్ళు చెపుతున్న మంత్రాల పెట్టె మన వశీకరణ యంత్రమే అయివుంటుంది" ఆందోళన నిండిన కంఠంతో తన అభిప్రాయాన్ని వెల్లడించాడతను.

అతన్ని సురక్షితంగా అవతలికి పంపాక బెల్‌రియాని గురించి ఆలోచిద్దామనుకుంటున్న షాడో వెంటనే తన మనస్సును మార్చుకున్నాడు.

* * * * *

"తెల్లవారటానికి కొంచెం వ్యవధి వున్నదనగా మనం ఆ నాగరికుల స్థావరం దగ్గిరికి పోవాలి... వాళ్ళ సంగతి, వాళ్ళ మంత్రాల పెట్టె సంగతి నేను చూసుకుంటాను... మీరు ఆందోళన చెందవద్దు..."

ఖంగుమంటున్న కంఠంతో తన నిర్ణయాన్ని అందరికీ వినిపించాడు. ఆ మాటలు విని ఆనందంతో పరవశించాల్సింది పోయి వాళ్ళందరూ అయోమయంగా చూసిన తర్వాతగానీ అర్థం కాలేదతనికి - తను చేసిన తప్పు ఏమిటో.

అడ్డు వచ్చిన ఒక పెద్ద గోతి మీదినుంచి అవతలి వైపుకు దూకబోయి, మధ్యలోనే వేగం తగ్గిపోవడంతో, బోర్లా పడిపోయిన

ఇటాలియన్ సైంటిస్ట్ భుజాన్ని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకున్నాడు ఒక ఆటవికుడు.

"శత్రువుల స్థావరం దగ్గర్లోకి వచ్చేశాం... చప్పుడు చేస్తే మన గుట్టు రట్టు అవుతుంది" కోపంగా అంటూ నిలబెట్టాడు.

"సైగలు చేయటం నెమ్మదిగా మానేస్తున్నారు వీళ్ళు... వీళ్ళ భాష మనకు వచ్చేసిందని అనుకుంటున్నారు కాబోలు..." అతని మాటలు అర్థం కాక, అందరికంటె ముందు నడుస్తున్న షాడో దగ్గిరికి పోయి, లో గొంతుకతో తన బాధను వెల్లడించుకున్నాడు సైంటిస్ట్.

శబ్దం చేయవద్దని కనులతోనే సూచించాడు షాడో... అడుగులో అడుగు వేసుకుంటూ ఒక పెద్ద పొద దగ్గరికి పోయి తొంగిచూశాడు.

ఫ్లడ్‌లైట్ల వెలుగులో పట్టపగలుగా మారివున్నది బెల్‌రియా స్థావరం.

అతను ఊహించినట్లు నిద్రలు పోవటం లేదు అక్కడివారు... ఎక్కడికో ప్రయాణం అవుతున్నట్లు ఆయుధాల్ని సరిచూసుకుంటున్నారు.

ఎముకలతో చేసిన బాణాల్ని పట్టుకుని చిత్తరువుల్లా నిలబడిన ఆటవికుల వంకా, అత్యంత శక్తివంతమైన ఆ అధునాతన పరికరాల వంకా ఒకసారి చూసి, గాఢంగా నిట్టూర్చాడు షాడో.

తల ఊపి సైగ చేసిన మరుక్షణం బ్రహ్మరాక్షసుల మాదిరి ముందుకు దూకటానికి సిద్ధంగా నిలబడివున్నారు ఆటవికులందరూ. బెల్‌రియా దగ్గర వున్న అత్యాధునిక సూపర్ షాట్ రైఫిల్స్ ముందు వాళ్ళు ప్రాణాలతో ఎంతసేపు నిలబడగలరు? వారిలో ఒక్కరిని కూడా పోగొట్టుకోకుండా బెల్‌రియా ఆటకట్టించడం తనకు సాధ్యపడుతుందా?

కుడికాలి బూటు మడమలో వుండవలసిన మెటల్ బాల్స్ రెండింటినీ ముందుగానే ఖర్చు పెట్టేసిన తన అవివేకాన్ని తనలో తనే నిందించుకుంటూ సైంటిస్ట్ ముఖంలోకి చూశాడు షాడో.

''ఈ దుష్ట దుర్మార్గుడి రొటీన్‌ని నేను జాగ్రత్తగా అబ్జర్వ్ చేశాను. తూర్పు దిక్కు తెలతెలబడుతుండగా తన కట్టడంలోనుంచి బయటకు వస్తాడు. ఆ రోజు ఎవరెవరు ఏమేమి పనులు చేయాలో అందరికీ వివరంగా చెపుతాడు.

ఆ మాటలు పూర్తిగా విన్న తర్వాత మనం చేయాల్సిన పనిని గురించి నిర్ణయించుకుందాం. అంతవరకూ మన ఫ్రెండ్స్‌ని తొందరపడవద్దని హెచ్చరించు'' లోగొంతుకతో తన అభిప్రాయాన్ని వెల్లడించాడతను.

అతని మాటల్ని సైగల రూపంలో అందరికీ అర్థమయ్యేలా తెలియచేశాడు షాడో... బెల్‌రియా మకాం పెట్టిన కట్టడానికి దగ్గర్లో వున్న ఒక పొదను ఎంచుకుని, అక్కడ మోకరించి కూర్చున్నాడు.

ఇటాలియన్ సైంటిస్ట్ అబ్జర్వేషన్ సెంట్‌పర్సెంట్ కరక్టేనని మరో నాలుగు నిమిషాల తర్వాత తేలిపోయింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ తన కేంప్‌లో నుంచి బయటికి వచ్చాడు బెల్‌రియా... తన వారందర్నీ దగ్గిరికి పిలిచాడు.

నిట్టనిలువుగా లోతుకు తవ్వి వున్న గోతుల దగ్గిర నిలుచున్నవారు తప్ప, మిగిలిన వారందరూ అతని ముందుకు రావటం షాడోకి అనుమానం కలిగించింది. రాతిగొడ్డలిని పట్టుకుని మాటు వేసిన అడవి జంతువు మాదిరి ముంగాళ్ళమీద కూర్చుని వున్న ఒక ఆటవికుడికి సైగ చేశాడు.

''ఆ గోతుల్ని పరిశీలించు బ్రదర్... వాటిలో ఎవరైనా బంధించబడి వున్నారేమో గమనించు...''

ఎట్టఎదుట స్పష్టంగా అగుపిస్తున్న శత్రువు మీదికి సూటిగా ఎగబడకుండా, పిల్లుల మాదిరి పొదల చాటున నక్కి నక్కి కూర్చోవటం చాలా ఇబ్బందికరంగా కనిపిస్తోంది ఆ ఆటవికుడికి.

షాడో సైగ అవగతం కాగానే నీడమాదిరి నిశ్శబ్దంగా లేచాడతను. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో మటుమాయం అయిపోయాడు.

అనుచరుల్ని తన చుట్టూ నిలబెట్టుకుని పెద్ద కంఠంతో బెల్‌రియా ఇస్తున్న ఉపన్యాసం మీదకి తన దృష్టిని మరల్చాడు షాడో.

''వశీకరణ యంత్రాన్ని వెంటబెట్టుకుని వేటకు బయలు దేరిన మొట్ట మొదటి రోజునే మనకు బ్రహ్మాండమైన రిజల్ట్ కనిపించటం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ రోజు ఇంకో మూలకు పోదాం. మరిన్ని బహుమతులతో తిరిగి వద్దాం... ప్రయాణానికి సిద్ధంకండి...'' అంటున్నాడు అతను.

చిరునవ్వులు తమ ముఖాల్ని ప్రకాశవంతం చేస్తుండగా, వెను తిరిగి మిగిలిన కట్టడాల దగ్గిరికి పరుగుతీశారు అతని అనుచరులు. పదే పది నిముషాల్లో ప్రయాణానికి రెడీ అయ్యారు.

వశీకరణ యంత్రంతో వేటకు బయలుదేరటమనే మాట సరిగ్గా అర్ధంకాక అయోమయంగా ఇటాలియన్ సైంటిస్ట్ వైపు చూశాడు షాడో.

''అపురూప సౌందర్యవంతులైన ఈ అడవిజాతి స్త్రీలను బంధించి తీసుకురావటం కోసమే పట్టుబట్టి నాచేత వశీకరణ యంత్రాన్ని తయారుచేయించాడు ఈ దుర్మార్గుడు... ఈ రోజు ఇంకో గూడెం మీదికి దండు వెడలుతున్నాడు.

అన్నెం పున్నెం ఎరుగని అమాయకుల మీద ప్రయోగించటానికి నా మెషీన్‌ని తీసుకుపోతున్నాడు... వీడిని ఏం చేసినా పాపంలేదు... నిలబెట్టి నరికితే ఆ దేవుడు తప్పకుండా సంతోషిస్తాడు...'' పళ్ళు బిగించి కోపంగా కామెంట్ చేశాడు సైంటిస్ట్.

ప్రపంచంలోని రాజ్యాలన్నింటినీ జయించి ఒకే పతాకం క్రిందికి తీసుకురావటం కోసం ఎన్నెన్నో కుయుక్తులు పన్నుతూ వుంటారు కిల్లర్స్ గాంగ్ సుప్రీమ్ కమాండ్ సభ్యులు.

నేరాలు చేయగల శక్తి సంపన్నులు ఎక్కడ తారసపడినా, వారిని చేరదీసి ఆదరించటం వారి సిద్ధాంతాల్లో ఒక భాగం. ఆ నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును తమ ఆశయ సాధనకు వినియోగించుకోవటం వారికి అలవాటు. దోపిడీలు, కిడ్‌నాప్‌లు, బ్లాక్ మెయిలింగ్‌లు, విద్రోహచర్యలతో పాటు బానిస వ్యవస్థను ప్రోత్సహించటం కూడా వారికి చాలా ఇష్టం.

టారుంగ్ జాతి స్త్రీలను చూస్తే సంభ్రమాశ్చర్యాలకు గురి అవుతుంది నాగరిక ప్రపంచం... వారిని తమ ఆటవస్తువులుగా ఉపయోగించుకోవటానికి ఉత్సాహపడుతుంది. కోరినంత సొమ్మును ఆ విధంగా సంపాదించుకోవటం కోసమే టారుంగ్ దీవుల్లో మకాంపెట్టి వుంటాడు బెల్‌రియా... సైంటిస్ట్ తయారు చేసిన మెషీన్‌ను తన స్వార్థానికి ఉపయోగించుకునే పథకాలు వేసి, ఆచరణలో పెడుతున్నాడు.

అప్పటికప్పుడు పొదచాటునుంచి లేచి ఆ దుర్మార్గుడి మీదికి జంప్ చేయాలన్నంత పిచ్చి ఆవేశంతో రగులుకుపోయాడు షాడో.

అతని ముఖంలోని భావాలని ఓరకంట గమనిస్తూనే వున్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ఈజీ మై ఫ్రెండ్... టేకిట్ ఈజీ... అందరికీ సలహాలు ఇచ్చి సరైన మార్గంలో నడిపించవలసిన నువ్వే అనవసరమైన కోపానికి గురి అయితే, ఆ ఆటవికుల పరిస్థితి ఎలా వుంటుందో కాస్తంత ఆలోచించు..." అంటూ అతని భుజంమీద చేయి వేసి గట్టిగా అదిమాడు సైంటిస్ట్.

దూరంలో వున్న టార్గెట్‌ని చిటికెలో ఛిన్నాభిన్నం చేయగల రైఫిల్స్‌తో పాటు, హేండ్‌గ్రెనేడ్స్‌ని, రాకెట్స్‌ని ప్రయోగించగల లాంచర్స్‌ని పట్టుకుని, నిలబడ్డారు బెల్‌రియా అనుచరులు.

అరణ్య ప్రయాణానికి అనుగుణ్యమైన దుస్తుల్ని ధరించి వారిని లీడ్ చేశాడు బెల్‌రియా... స్థావరాన్ని వదిలి అడవిలోకి దారితీశాడు.

అదే సమయంలో గోతుల్ని అబ్జర్వ్ చేయటానికి వెళ్ళిన ఆటవికుడు విపరీతమైన ఎగ్జయిట్‌మెంట్‌తో వణికిపోతూ వచ్చి పడ్డాడు షాడో దగ్గిరికి.

"మా ఆడవాళ్ళు అక్కడ బంధింపబడి వున్నారు" అంటూ షాడో అనుమతి తీసుకోకుండానే మిగిలిన ఆటవికులకు సైగ చేయబోయాడు.

లాగిపెట్టి అతని చేతిమీద కొట్టి, కనులు ఎర్రచేశాడు షాడో. అడవి జంతువుల మాదిరి గోతుల్లో బంధింపబడి వున్న వారికోసం ఎటాక్ ప్రారంభిస్తే ఆ సందడి బెల్‌రియా చెవులకు చేరుతుంది.

అఘుమేఘాల మీద వచ్చిపడిపోతాడు అతను... ఒకే ఒక రాకెట్‌తో ఆటవికుల్ని యమలోకానికి పంపేస్తాడు. స్థావరంలోని గడబిడ తనకు వినబడనంత దూరం అతన్ని పోనివ్వాలి... అంత వరకూ ఎగ్జయిట్‌మెంట్‌ని అణచుకోవాలి.

అంతకుమించి మరొక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు షాడో ఆలోచనలు.

ప్రక్కనే వున్న సైంటిస్ట్ మరోసారి తన భుజం తట్టే సరికి తలతిప్పి చూశాడు.

"వశీకరణ యంత్రానికి లోబడినవారు, పైకి మామూలు గానే కనిపిస్తారు... అవకాశం లభించిన మరుక్షణం అంతకుముందు ఆ మెషీన్ ద్వారా బెల్‌రియా ఇచ్చిన ఆజ్ఞల్ని తూచా తప్పకుండా ఆచరణలో పెడతారు... గోతుల్లో వున్న వారికి మనల్ని చూడగానే చిరుతపులుల్లా మీదికి దుమకమని ఆర్డర్స్ ఇచ్చివుంటే, జరిగేది ఏమిటో ఆలోచించావా?"

చన్నీళ్ళ కుండను తెచ్చి నెత్తిమీద కుమ్మరించిన అనుభూతి కలిగింది షాడోకి ఆ మాటల్ని వినేసరికి.

నిజమే! స్థావరంలో మిగిలివున్న బెల్‌రియా అనుచరుల్ని మట్టుబెట్టిన తర్వాత, సైంటిస్ట్ చెప్పిన పరిణామం ఎదురైతే ఏంచేయాలి?

ఆ సందేహానికి కూడా సిద్ధంగా వున్నది ఇటాలియన్ సైంటిస్ట్ సాబ్ దగ్గిర సమాధానం.

"ముందు బెల్‌రియా ఆట కట్టించాలి... అతని దగ్గరి యంత్రాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఆ యంత్రాన్ని పనిచేయించే కంప్యూటర్‌ని ధ్వంసం చేయాలి... అంతవరకూ బందీల జోలికి పోవటం ప్రమాదకరం..."

గోతుల దగ్గిరికి పోయివచ్చిన ఆటవికుడికి సైగలు చేసి ఆ మాటల్ని మిగిలిన వారందరికి తెలియచేయమని పంపించాడు షాడో.

వందగజాల దూరంలో వున్న తమవారిని బంధ విముక్తుల్ని చేయకుండా, చేతగానివాళ్ళలా చూస్తూండటం వారెవరికీ ఇష్టం లేకపోయింది. దగ్గర్లోకి వచ్చిన ఓ ఆటవికుడి దగ్గిర్నించి రాతిగొడ్డలిని లాక్కుని బ్రహ్మరాక్షసుడి మాదిరి అడ్డు నిలబడిన షాడోని చూసిన తర్వాత కూడా శాంతించలేదు వారి ఆగ్రహం.

"ఇక్కడ వున్న బందీలను మనం విడిపించేలోపుగా, ఇంకా కొంతమందిని బంధించి తీసుకువస్తాడు ఆ దుర్మార్గుడు. అతని దగ్గిర వున్న మంత్రాల పెట్టె సామాన్యమైంది కాదు. దాన్ని ఉపయోగించి మిమ్మల్ని తనకు బానిసలుగా మార్చేస్తాడు. బాగా ఆలోచించి అడుగువెయ్యండి..." అంటూ సైగలు చేశాడు. అరగంటకు పైగా పట్టింది ఆటవికులకు అతని సైగల్లోని అర్థాన్ని అవగాహన చేసుకోవటానికి.

మరో అరగంట తరువాత నెమ్మదిగా అణిగి పోయింది వారి ఆగ్రహం.

"ఏం చేయాలో నువ్వే చెప్పు... చేతకానివాళ్ళ మాదిరి చేతులు ముడుచుకు కూర్చోవటం మాకు చాలా బాధను కలిగిస్తోంది..." అందరి తరపున తమ అభిప్రాయాన్ని వెల్లడించాడు ఒక మధ్యవయస్కుడు.

"అడవిలోకి వెళ్ళిన ఆ దుర్మార్గుడి దగ్గిర భయంకరమైన ఆయుధాలున్నాయి. వాటి గురికి అందకుండా అతని మంత్రాల పెట్టె నాశనం చేద్దాం... పదండి... వెనక్కి..." షాడో మాటలు పూర్తి అయిన మరుక్షణం నిశ్శబ్దంగా వెనుతిరిగారు ఆటవికులు.

పగబట్టిన పాముల మాదిరి బెల్‌రియా అనుసరించిన మార్గంలో ప్రయాణం మొదలు పెట్టారు.

* * * * *

మూడు గంటలపాటు ఎక్కడా ఆగకుండా అడుగులు వేసిన తర్వాత అనుచరులందరికీ పదినిముషాలు విశ్రాంతి ఇచ్చాడు బెల్‌రియా.

"వశీకరణ యంత్రాన్ని తీసుకుని మనం టారుంగ్ గూడేల మీద దాడి చేయబోతున్నట్లు ఈ పాటికి ఆటవికులకి తెలిసి పోయి వుంటుంది. చుట్టూ వున్న పొదల్ని గమనించుకుంటూ వుండండి... చెట్ల చాటు నుంచి ఆ రాక్షసులు దొంగదెబ్బ తీయకుండా చూసుకోండి..." అని హెచ్చరించాడు.

మూవీ కెమెరావంటి వశీకరణ యంత్రాన్ని అతను తన చేతులకు అందుబాటులోనే వుంచుకోవటాన్ని గమనించి తల విదిలించాడు షాడో.

పాతిక గజాల దూరంలోని ఒక చెట్టు చాటున నిలబడి వున్నాడు అతను... అవకాశం దొరికితే ఎటాక్ చేయమని ఆటవికులకు సైగ చేయబోతున్నాడు.

బెల్‌రియా మాటలు చన్నీళ్ళు చిలుకరించాయి అతని ఉత్సాహం మీద.

"ఎదురుపడి అటో ఇటో తేల్చుకోవటం గానీ, చాటు మాటున మనమే ఇతని ఆటకట్టించే ప్రయత్నంగానీ చేయటం ప్రమాదకరం..." అంటూ ఆలోచన మొదలుపెట్టాడు. అంతలోనే అతని దగ్గిరికి వచ్చాడు ఆటవికుడు... నల్లచిరుత బారినుండి రక్షింపబడిన వ్యక్తే అతను.

"నన్ను కబళించబోయిన చిరుత ఇక్కడే వున్నది... బండరాళ్ళ మధ్యన పడుకుని నిద్రబోతున్నది..." చేతుల్ని అటూ ఇటూ తిప్పుతూ తన భావాల్ని సైగల రూపంలో తెలియచేశాడు.

నల్లచిరుత కంటే ప్రమాదకరమైన శత్రువుల్ని వదిలి, ఆ అడవిజంతువును గురించి ఆలోచించటం అనవసరమని అనిపించింది షాడోకి...

దాన్ని గురించి పట్టించుకోవద్దని సైగ చేయబోతుండగా ఫ్లాష్ అయింది అతని మనసులో ఒక ఆలోచన.

ఎదురుపడి యుద్ధం చేయలేని తాము, ఏదో ఒక విధంగా బెల్‌రియాని బెదరగొట్టి, అతనిలోని ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తే ఎలా వుంటుంది?

ఆ నిర్ణయం తీసుకున్న వెంటనే అందుకు కావాల్సిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాడతను.

దగ్గిర వుండే పొడవాటి అడవి తీగెల్ని ఉచ్చుల మాదిరిగా తయారు చేయించాడు. ఆటవికుడు చెప్పినట్లే రెండు పెద్ద పెద్ద బండరాళ్ళ మధ్య చేరి హాయిగా గురకలు తీస్తోంది నల్లచిరుత.

అడవి తీగెల ఉచ్చుల్ని పట్టుకుని, అడుగులో అడుగువేస్తూ ఆ క్రూరజంతువును కమ్ముకున్నారు ఆటవికులు. తమ అలికిడిని ఆలకించి అది గర్జిస్తూ పైకి లేచిన మరుక్షణం అడవి పందిని బంధించినట్లు ఉచ్చులలో బంధించారు.

అలసట తీర్చుకోవటానికి తను అనుమతించిన పది నిముషాలు పూర్తి అయిపోగానే ప్రయాణం చేయటానికి సిద్ధం అవుతున్నాడు బెల్‌రియా. గాలివాలున తెరలు తెరలుగా వినవచ్చిన చిరుత అరుపుల్ని ఆలకించి కనుబొమలు ముడివేశాడు.

పొడుగాటి బరిశెతో చిరుత శరీరాన్ని వాతలు తేలేటట్లు కొట్టించాడు షాడో.

బాధను భరించలేక గావురు గావురుమంటున్న ఆ క్రూర మృగాన్ని బెల్‌రియా నిలబడివున్న చెట్టుకేసి తిప్పి ఉచ్చులను తొలగింపచేశాడు.

చురకత్తుల వంటి కోరలు కనిపించేలా నోటిని గంగాళంలా తెరిచి ఛెంగున ముందుకు దూకిందది... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో ఉచ్చులనుండి బయటపడి పలాయన మంత్రం పఠించింది.

ఆటవికులలానే నిలబడి వున్న బెల్‌రియా అనుచరులు అనుకోని విధంగా ఎదురు పడేసరికి ఏం చేయాలో తోచని పరిస్థితిలో చిక్కబడింది.

"కాల్చండి... దాన్ని కాల్చి చంపేయండి..." ఖంగు మంటున్న కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడు బెల్‌రియా.

రైఫిల్స్‌ని భుజాలకు ఆనించుకుంటున్న అతని అనుచరుల్ని చూసేసరికి ఒళ్ళు కంపరమెత్తింది చిరుతకు. అంతకు ముందు ఆ ఆయుధాల వలన తన వెనుక పాదం గాయపడిన విషయాన్ని మరిచిపోలేదది.

గుండెలు జలదరించేలా శబ్దాలు చేస్తూ ఛెంగున ఎగిరి దగ్గర్లో వున్న ఇద్దరు మనుష్యుల్ని తీవ్రంగా గాయపరిచింది. చెవులు చిల్లులు పడేటట్లు

రైఫిల్స్ గర్జించటం మొదలు పెట్టేసరికి, ప్రక్కకు తిరిగి పొదల్లోకి పారిపోయింది.

గాయపడిన అనుచరుల్ని పరామర్శించేందుకు ప్రయాణాన్ని కొద్దిసేపు వాయిదా వేసుకుంటున్న బెల్‌రియా వంక చూస్తూ నవ్వుకున్నాడు షాడో.

నల్లచిరుత సృష్టించిన కొద్దిపాటి అలజడిని మరింత అధికం చేసే ఉపాయాన్ని ఆలోచిస్తూ ముందుకు కదిలాడు అతను.

నీడల మాదిరి వెంట రాబోయిన ఆటవికుల్ని బెల్‌రియాకి వెనుక భాగంలోనే ఎలర్ట్‌గా వుండమని సైగచేస్తూ, అతివేగంగా పరుగుతీశాడు.

ఆకాశాన్ని అంటుకునేంత ఎత్తుగా వున్న చెట్ల మధ్యలో నుంచి వస్తున్నాడు బెల్‌రియా.

చెట్లు అంతమైపోయి పొదలు దట్టంగా కనిపించే ప్రదేశాన్ని ఎంపిక చేసి అతనికి తన శక్తిని మరోసారి రుచి చూపించాలని అతని కోరిక.

ఒక గంటపాటు ఎక్కడా ఆగకుండా పరుగులు తీసిన తర్వాత ఉన్నట్లుండి బాధగా అరిచి ఒక పల్లపు ప్రదేశంలో కూలబడిపోయాడు అతన్ని ఫాలో అవుతున్న ఇటాలియన్ సైంటిస్ట్.

"యువకుడిని కాదు నేను... వయస్సు అయిపోవస్తున్న వృద్ధుడిని. నీతో పాటు పరుగులు ఎలా పెట్టగలనని అనుకున్నావ్?" వెనుతిరిగి సీరియస్‌గా చూస్తున్న షాడోతో కోపంగా అన్నాడు.

"మిమ్మల్ని నాతో పాటు ఎవరు రమ్మన్నారు?" దగ్గిరికి వచ్చి చేతిని అందిస్తూ అడిగాడు షాడో.

"నీలాగా సైగలు చేసి ఆ అడవి జంతువులతో మాట్లాడే నేర్పు నాకు లేదు. నువ్వులేని సమయంలో నా తలను నరికి కపాల తోరణానికి వ్రేలాడగడితే నా గతేమిటి?" మెలికపడిన పాదాన్ని చేతులతో నొక్కుకుంటూ ప్రశ్నించాడు సైంటిస్ట్.

తామిద్దరినీ తమ మనుష్యులుగానే భావించటం మొదలు పెట్టిన ఆటవికులు తను చెపుతున్న దారుణాన్ని పొరపాటున కూడా చేయరని తెలుసు అతనికి.

షాడో కోపాన్ని తగ్గించటం కోసం ఉపయోగించాడు ఆ మాటల్ని... ఉపయోగించిన వెంటనే వచ్చేసింది అతను కోరుకున్న ఎఫెక్ట్.

"ఆల్‌రైట్... ఐదు నిముషాలు టైమ్ ఇస్తున్నాను. అలుపు తీర్చుకుని రెడీ అవ్వాలి..." అంటూ అతని ప్రక్కనే చతికిలపడి కూర్చుంటున్న షాడో నాసికారంధ్రాలకు సోకింది ఒక వెగటు వాసన.

"మళ్ళీ ఏమొచ్చింది మై ఫ్రెండ్... నీ ఆటవిక బుర్రకు ఏ అనుమానం తగిలింది...?" ఆశ్చర్యంగా అంటున్న సైంటిస్ట్‌ని అక్కడే వదిలి, ఆ వాసన వస్తున్న దిశగా అడుగులు వేశాడతను.

తన అలసటను మరిచిపోయి, అతన్ని అనుసరించాడు ఇటాలియన్ సైంటిస్ట్. వందగజాల దూరం పోయిన తరువాత అతను ఉన్నట్టుండి వెనక్కి దూకటంతో, ఉలిక్కిపడి వెల్లకిలా పడిపోయాడు. చటుక్కున చేతుల్ని జాచి అతను పూర్తిగా నేలను తాకకముందే పట్టుకున్నాడు షాడో. శబ్దం చేయనీయకుండా నోటిని అదిమి, పాతిక అడుగుల దూరం ఇవతలికి తీసుకు వచ్చేశాడు.

"ఏమైంది మై ఫ్రెండ్? మళ్ళీ నల్లచిరుత వంటి ప్రమాదం ఏదైనా అక్కడ మాటువేసి వున్నదా?" అతను తన నోటిమీది చేతిని తొలగించగానే లోగొంతుకతో అడిగాడు ఇటాలియన్ సైంటిస్ట్.

అతని గుండె వేగం మామూలు స్థితికి చేరేదాకా ఆగి, మరోసారి మెల్లిగా ముందుకు నడిపించాడు షాడో. అంతకు ముందు అతను వెల్లకిలా పడిన ప్రదేశంలో నిలబెట్టి, ముందుకు చూడమని సైగచేశాడు.

విశాలమైన చెరువు వంటి పెద్ద పల్లపు ప్రదేశం ఉన్నది అక్కడ... కాశ్మీర్ తివాచీలు పరిచినట్లు ఆ ప్రదేశాన్నంతా ఆవరించుకుని వున్నాయి బ్రౌన్ కలర్‌లో వున్న చీమలు. వందలు వేలు కాదు... లక్షలు కోట్లు...

వందల కోట్ల సంఖ్యలో వున్నాయి అవి. బఠానీ గింజల సైజులో వున్న తలల్ని ఎత్తి, చుట్టూ చూస్తున్నాయి.

"ఉష్ణమండలపు అరణ్యాల్లో తప్ప ఇంకెక్కడా అగుపించని భయంకరమైన చీమలు అవి... తేలికగా అర్థం కావాలంటే వీటిని సిపాయి చీమలు అంటారు..." వెనక్కి వస్తూ సైంటిస్ట్‌తో అన్నాడు షాడో.

"సిపాయి చీమలైనా, స్పానిష్ చీమలైనా అవి పట్టిచీమలే కదా! వాటిని చూసి భయపడటం దేనికిట?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సైంటిస్ట్.

"వాటికి ఎందుకు భయపడాలో మీకు ప్రాక్టికల్‌గా చూపిస్తాను. బెల్‌రియా నడుములు విరచటానికి సరైన ఆయుధం మనకు లభించింది."

- అంటూ లావుపాటి కొండరాళ్ళను రెండింటిని వెతికి, చీమలు విశ్రాంతి తీసుకుంటున్న పల్లపు ప్రదేశంలోకి విసిరాడు షాడో.

ఆ రాళ్ళు క్రిందపడిన శబ్దం సైంటిస్ట్‌కి వినిపించలేదు. దగ్గర్లో ఏదో బ్రహ్మాండమైన కొండవాగు అతి వేగంగా ప్రవహిస్తున్నట్లు మోత వినవచ్చింది.

"ప్రాణాల మీద ఆశ వుంటే ఇక్కడి నుంచి పారిపోవాలి. ఆలస్యం చేస్తే చూసుకోవటానికి ఎముకలు కూడా మిగలవు -" అంటూ ఒక్కసారిగా పరుగు మొదలు పెట్టాడు షాడో.

పది నిముషాల పాటు పరిగెత్తి భుజం మీది నుంచి వెనక్కి చూశాడు ఇటాలియన్ సైంటిస్ట్. అంతకుముందు వరకూ ఎంతో పచ్చగా కనిపించాయి అతను దాటివచ్చిన పొదలు. బ్రౌన్‌కలర్‌కి తిరిగిపోయాయవి యిప్పుడు. వాటిలో నివసించే చిన్న చిన్న ప్రాణుల్ని సజీవంగా నమిలి మింగేస్తూ, వూహించరాని వేగంతో వచ్చేస్తున్నాయి చీమలు...

“ఈ అడవిలో వీటికి ఎదురులేదు... వీటిని చూసి భయపడని ప్రాణి అంటూ ఏదీ వుండదు. మనల్ని వెంటాడి మన ప్రాణాలు తీసేదాకా ఇక విశ్రమించవు ఇవి...” అంటూ ఎందుకైనా మంచిదని అతని చేతిని పట్టుకున్నాడు షాడో.

ఆయాసాన్ని అణుచుకోలేక అంతకుముందు మాదిరి క్రిందపడిపోతే జరిగేది ఏమిటో ఊహించుకునే సరికి, శీతలం కమ్మినట్లయింది సైంటిస్ట్‌కి.

“పెద్ద చదువులు చదువుకున్నానన్న గర్వంతో నోటికి వచ్చినట్లు మాట్లాడాను. మొదటి పొరపాటు క్రింద క్షమించి వదిలేయవచ్చు గదా! ఇలా ఎంతదూరం పరిగెత్తిస్తావ్?” వణుకుతున్న కంఠంతో కోపంగా అన్నాడు ఇటాలియన్ సైంటిస్ట్.

ఆ మాటలకు సమాధానం ఇవ్వలేదు షాడో... అడ్డువచ్చిన పొదలమీది నుంచి ఎగిరెగిరి దూకుతూ, మధ్య మధ్యలో అడవి గూబ మాదిరి ఈలలు వేస్తూ ముందుకు తీసుకుపోయాడతన్ని.

అరగంట తరువాత అతను వేస్తున్న ఈలలకు వచ్చింది సమాధానం. తమ సహచర పక్షి ఏదో ప్రమాదంలో చిక్కబడినట్లు భావించి, తాము కూడా ఈలలు వేశాయి చెట్లమీద నిద్రించే అడవి గూబలు.

వెంటనే ప్రక్కకు తిరిగి, నిరారుగా వున్న ఒక మహా వృక్షం మీదికి ఎగబ్రాకాడు షాడో... దాని మొదల్ని గజిబిజిగా చుట్టుకుని వున్న అడవి తీగెల్ని కదిలించి సైంటిస్ట్‌కి అందించాడు.

చలిజ్వరం వచ్చినట్లు వణుకుతున్న చేతులతో ఆ తీగెల్ని పట్టుకుని పైకి ప్రాకాడు సైంటిస్ట్... షాడో కూర్చున్న కొమ్మ మీదికి చేరుకుని అలసటతో అతని భుజం మీదికి వాలిపోయాడు.

ఆ చెట్టు క్రిందినించి ప్రవహించింది చీమలబారు. విస్ఫారిత నేత్రాలతో చూస్తున్న సైంటిస్ట్ కనుల ముందే సర్వనాశనమయ్యాయి నాలుగు కొండచిలువలు... పరిగెత్తి పారిపోయేందుకు వ్యవధి లేకపోవటంతో నిలుచున్న పళాన ఎముకల గుట్టలుగా మారిపోయాయి రెండు అడవి దున్నలు...

పావుగంటకు పైగా పట్టింది ఆఖరి వరుసలో వున్న చీమలు సైంటిస్ట్ వున్న చెట్టును దాటి అవతలకు పోవటానికి.

"ఇక మనం చెట్టు దిగి ఇంకో ప్రక్కకు పారిపోదాం - ఆ భూతాలు వెనక్కి వచ్చే లోపల ఈ అడవిని వదిలి వెళ్ళిపోదాం" అనబోతూ అదిరిపడి మాటల్ని మ్రింగేశాడతను.

అందుకు కారణం ఆ భూతాలు వెనక్కి రావటం కాదు, ఆకాశం బ్రద్దలైపోయే శృతిలో బెల్‌రియా అనుచరులు ఆర్తనాదాలు చేయటమే!

* * * * *

ఉష్ణమండల ప్రాంతాలలో అగుపించే సిపాయి చీమల గురించి తెలుసు బెల్‌రియాకి.

అయితే అవి ఆ టారుంగ్ ద్వీపంలో అగుపిస్తాయని మాత్రం అనుకోలేదు అతను. సమయం చూసి తమ మీద దాడి చేస్తాయని వూహించలేదు.

"మైగాడ్! గ్రెనేడ్స్‌ని విసరండి... రాకెట్లను ప్రయోగించండి. కమాన్ క్విక్..." అని గొంతు చినిగిపోయేలా బిగ్గరిగా అరుస్తూ, మూవీ కెమెరా వంటి వశీకరణ యంత్రాన్ని పట్టుకుని వెనక్కి పరుగుతీశాడు అతను.

అప్పటికే ఎముకల పోగులుగా మారిపోయారు అతని అనుచరుల్లో పదిమంది. ఆయుధాలను వదిలి తలా ఒక దారి చూసుకోబోతూ, అతని మాటల్ని విని గ్రెనేడ్స్‌ని విసిరారు మిగిలినవారు.

మందపాటి తివాచీలు ముక్కలు ముక్కలైపోయినట్లు గాలిలోకి లేచాయి చీమల తెట్టు... గ్రెనేడ్స్ మూలకంగా ఉద్భవించిన మంటల్లో మాడి మసి అయిపోసాగాయి మరికొన్ని.

నిప్పు వాసన సోకిన వెంటనే మందగించింది చీమల వేగం... ముందుకు పోవటాన్ని మాని ప్రక్కలకు తిరగసాగాయి అవన్నీ.

ఆ దృశ్యాన్ని చూసి మరింత బిగ్గరిగా అరిచాడు బెల్‌రియా... "మంటలు... మంటల్ని చూస్తే అవి పారిపోతాయి.. మంటలు..." అంటూ తన దగ్గిర వున్న రాకెట్లని కూడా చీమల మీదికి పంపించారు అతని అనుచరులు.

కొండలు పిండి అవుతున్నట్లు ప్రారంభం అయిన దారుణ శబ్దాలతో దద్దరిల్లిపోయింది అడవి... ఆ ప్రేలుళ్ళ మూలకంగా ఉత్పన్నమైన మంటలు - ఆ చుట్టుపట్ల వున్న చెట్లను, పొదల్ని, వాటితో పాటు సిపాయి చీమల్ని ఆకలిగా ఆరగించటం మొదలు పెట్టాయి. ప్రణాలు దక్కించుకోవటానికి పారిపోతూ కూడా, మరో ఆరుగుర్ని అస్థిపంజరాలుగా మార్చివేశాయి ఆ చీమలు...

ఎనిమిదిమందే మిగిలారు బెల్‌రియాతో కలిపి... ఆ కొద్దిమందినీ వెంటబెట్టుకుని ఆటవిక గూడేలమీదికి పోవటం ప్రమాదకర మనిపించింది కాబోలు - తన స్థావరం వైపు బయలుదేరాడు ఆ పెద్దమనిషి.

మంటలు పెద్దవి కాకముందే చెట్టుమీది నుంచి క్రిందికి దూకి, మరో మార్గాన్ని వెతుక్కుంటూ అతన్ని గమనించాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"ధైర్యం వుంటే అతన్ని అణగదొక్కేయటానికి ఇదే సరైన అదను అని నాకు అనిపిస్తోంది. అందుకు మామూలు ధైర్యం చాలదు... అపరిమితమైన సాహసం కావాలి" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు సైంటిస్ట్.

బెల్‌రియా వెనుకభాగంలో వుండమని తను వదిలేసిన ఆటవికుల కోసం వెతుక్కుంటున్నాడు షాడో. ఆ మాటల్ని విని ఆశ్చర్యంగా చూశాడు అతని వంక.

"ఈ మంటల్ని, ఈ చీమల్ని, ఆ బెల్‌రియా అనుచరుల భయాన్ని చూసి నోటికి వచ్చిన మాటల్ని వుపయోగించాను మై ఫ్రెండ్... వాటిని ఏ మాత్రం పట్టించుకోకు" గబగబా సర్దుకోవటానికి ప్రయత్నించాడు ఇటాలియన్ సైంటిస్ట్.

ఆటవికుల కోసం వెతికే మాటను మరిచిపోయాడు షాడో. అతని షర్టును రఫ్‌గా పట్టుకుని తన ముందుకు లాగాడు "కమ్ అవుట్ విత్ ది ఫ్యాక్ట్... అనవసరమైన మాట మీ నోటివెంట వెలువడదని నాకు బాగా తెలుసు... ఏం చెప్పదలుచుకున్నారో నిర్భయంగా వెంటనే చెప్పండి" అని డిమాండ్ చేశాడు.

"చీమలమీద ప్రయోగించటంవల్ల బెల్‌రియా దగ్గరవున్న గ్రెనేడ్లు, రాకెట్లు ఖాళీ అయిపోయాయి. మంటల వేడిమికి అతని రైఫిల్స్ కూడా ఖచ్చితంగా దెబ్బతిని వుంటాయి... మూడొంతుల మంది అనుచరులు పరలోకానికి ప్రయాణం కట్టేశారు... అతన్ని ఎదిరించటానికి సమయం ఇదే..." అనీజీగా చూస్తూ అన్నాడు సైంటిస్ట్.

తప్పని తెలిసి కూడా అతని షర్టును మరోసారి గట్టిగా గుంజాడు షాడో.

"చెప్పదలుచుకున్నదేదో సూటిగా చెప్పమని అడుగుతున్నాను... ఇంకోసారి అడగను. మంటల్లో పడగా మిగిలిన చీమల దగ్గిరికి తీసుకుపోయి పారేస్తాను" ఎడమచేతి చూపుడువేలును అతని ముఖం ముందు ఊపుతూ హెచ్చరించాడు.

గాఢంగా నిట్టూర్చి ముఖం మీది చెమటను షర్టు భుజానికి అద్దుకున్నాడు సైంటిస్ట్. "వశీకరణ యంత్రాన్ని తయారు చేస్తున్న సమయంలో దాని శక్తిని నిరోధించగలిగే ఫార్ములా కోసం ప్రయత్నం చేశాను నేను. నాలుగు రకాల టార్గెట్స్ మీద అది అప్రతిహతంగా పనిచేస్తుందని నిరూపించబడింది" అన్నాడు.

అతని షర్టును వదిలిపెట్టి ఆసక్తిగా ముందుకు వంగాడు షాడో.

"నీటిలో నుంచి, నిప్పులో నుంచి, మైకా వంటి పారదర్శక పదార్థాలలో నుంచి, నూలు, పట్టు సింథటిక్ వస్త్రాలలో నుంచి సూటిగా ప్రయాణం చేయగలవు నా మెషీన్‌లో నుంచి వెలువడే కిరణాలు. ఫిఫ్త్ టార్గెట్‌లో నుంచి మాత్రం అవి అనుకున్నంత వేగంగా ముందుకు పోలేకపోతున్నాయని అనిపించింది..."

ఝల్లుమన్నది ఆ మాటల్ని వింటున్న షాడో శరీరం. "ఏమిటా టార్గెట్? ఏ పదార్థంతో తయారు చేయబడింది?" గబగబా అడిగాడు.

"ఏ పదార్థంతోను చేయబడదు ఆ ఫిఫ్త్ టార్గెట్... ఇప్పుడు మనచుట్టూ ఆవరించుకున్నది అదే..." అంటూ భగభగ లాడుతున్న చెట్ల మీదినించి, పొదల మీదినించి సుడులు తిరుగుతూ గాలిలోకి లేస్తున్న ధూమ వలయాన్ని చూపించాడు.

వశీకరణ యంత్రాన్ని కొద్దిసేపు అయినా నిరోధించగల టార్గెట్ ఫైవ్ ఆ పొగేనని అర్థం అయ్యేసరికి, రెండు సీసాల రమ్‌ని తాగినంత మత్తు షాడోని ఆవరించుకున్నది. అతనిలో వచ్చిన మార్పును గమనించి విపరీతంగా భయపడ్డాడు ఇటాలియన్ సైంటిస్ట్.

"టార్గెట్ ఫైవ్ నా వశీకరణ యంత్రాన్ని నిరోధిస్తుందని ఖచ్చితంగా చెప్పలేను నేను... ఆ విషయం మీద నా పరిశోధన పూర్తికాలేదు. నేను

చెప్పిన మాటను పట్టుకుని రిస్క్ తీసుకోవద్దు నువ్వు'' అంటు అతన్ని ఆపటానికి ప్రయత్నించాడు.

పెరిగిపోతున్న ఆవేశాన్ని అణుచుకోవటం షాడోకి అసాధ్యమైంది.

కుడికాలిని నేలకు అదిమి గుండెలు చెదిరే శృతిలో గొంతెత్తి పొలికేక ఒకటి పెట్టాడతను. మంత్రం వేసినట్లు ప్రత్యక్షం అయ్యారు అంత వరకూ దూర దూరంగా నిలబడివున్న ఆటవికులు.

''శత్రువును హతమార్చటానికి పోతున్నాను నేను... దూరంలోనే వుండి మీరు చేయగలిగే సహాయం చేయండి'' అని సూచనలిచ్చి వింటినించి వెలువడిన బాణంలా బెల్‌రియా వైపు పరుగుతీశాడు.

''పొగలు వేయండి... కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని విధంగా పొగ పెట్టి మీ కపాలదేవతను ప్రార్థించండి... ఆ మంత్రాల పెట్టెను నిరోధించగల శక్తిని టార్గెట్ ఫైవ్‌కి ఇవ్వవలసిందిగా అర్థించండి'' కంగారుగా ఆటవికులను హెచ్చరిస్తూ, ఇంకా కొంచెం పచ్చిగా వున్న పొదల్ని విరగతీసి మంటల మీదికి విసరటం మొదలు పెట్టాడు సైంటిస్ట్.

అతని మాటలు అర్థం కాకపోయినా, అతని చేతలు అవగతమై, బాణాలను ప్రయోగించటానికి బదులుగా పొగల్ని ముమ్మరం చేసే పనుల్లో బిజీ అయిపోయారు ఆటవికులు. షాడో పెట్టిన పొలికేక ఆటవికులకేకాదు, బెల్‌రియాకి కూడా వినిపించింది. అది తన అనుచరులు చేసిన శబ్దం

కాదని వెంటనే గ్రహించి, వశీకరణ యంత్రాన్ని రెడీగా పట్టుకున్నాడు అతను.

ధూమవలయాల మధ్యలో నుంచి సూటిగా అతని ఎదుటికి పోయాడు షాడో. ఆ సరికి అతను సముద్రాన్ని దాటి మెయిన్ లాండ్‌కి చేరుకుని వుండటమో, అడవి జంతువులకు ఆహారమయి వుండటమో జరిగి వుంటుందని విశ్వసిస్తున్నాడు బెల్‌రియా... అనుకోని విధంగా ఎదుటికి వచ్చేసరికి పళ్ళు పటపటమని కొరుకుతూ వశీకరణ యంత్రపు మీటను నొక్కాడు.

"నువ్వు నా బానిసవి... నేను చెప్పినట్లు చేసే యంత్రానివి... వెనక్కి తిరుగు... వెంటనే వెనక్కి తిరిగి నా శత్రువుల్ని వధించు... వెనక్కి తిరుగు..." యంత్రానికి ప్రక్కభాగంలో వున్న స్పీకర్లలో నుంచి ఖంగున వినవచ్చింది అతని కంఠం.

తన అవయవాలకు ఎవరో దారాలు కట్టి వెనక్కి లాగుతున్న సెన్సేషన్ కలిగింది షాడోకి.

ఇటాలియన్ సైంటిస్ట్ అనుమానపడినట్లు ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంటున్న పొగ వశీకరణ యంత్రాన్ని పూర్తిగా నిరోధించలేక పోతున్నదని అర్థం అయింది అతనికి. అలాగే దాని ఎదుట మరికొద్దిసేపు

నిలబడితే, టార్గెట్ ‌పైప్ శక్తిని వమ్ముచేసి అది పూర్తి రిజల్ట్‌ని చూపిస్తుందని కూడా అనిపించింది.

అసలు అంతవరకూ తెచ్చుకోవటం దేనికి?

"ఆగు... అక్కడే ఆగు... నువ్వు నా బానిసవి..." అంటున్న బెల్‌రియా మీద దృష్టిని కేంద్రీకరించి అమాంతం గాలిలోకి ఎగిరాడతను.

ఆజ్ఞల్ని జారీ చేయటాన్ని ఆపి, తన ఆయుధాన్ని అతనికేసి గురిపెట్టాడు బెల్‌రియా. గుండెలు జలదరించే శబ్దంతో ప్రేలింది అది.

నిప్పుకణం భుజంలో దిగబడిన అనుభూతి కలిగింది షాడోకి. అయినా ఆగలేదతను. రెండు పల్టీలు కొట్టి మెషిన్ దగ్గిర నేలను తాకాడు. నాభి దగ్గిర ఉదర కండరాల్ని బిగదీస్తూ, అతని నోటిలోనుంచి వెలువడింది భయంకరమైన కుంగ్ ఫూ షౌట్ ఒకటి.

కంటికి అసలు కనిపించనంత వేగంతో పైకి లేచి వశీకరణ యంత్రానికి కనెక్ట్ అయింది అతని ఎడమ పాదం. ఫట్‌మని శబ్దం చేస్తూ పగిలిపోయి, ముక్కలు ముక్కలై గాలిలోకి ఎగిరింది.

తను కోరి కోరి తయారు చేయించిన అపూర్వ సాధనం అలా నాశనమైపోయేసరికి పిచ్చివాడైపోయాడు బెల్‌రియా. పళ్ళు పటపటమని కొరుకుతూ, రైఫిల్‌ని తిరిగేసి షాడో తలమీద మోదాడు.

తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు షాడో... తల పగిలి నెత్తురు ధారలుగా కారుతున్నా లక్ష్యపెట్టకుండా ఛట్‌మని కుడికాలిని విసిరాడు. నాలుగు అడుగుల ఎత్తున గాలిలోకి లేచి అల్లంత దూరంలో పడిపోయాడు బెల్‌రియా...

అతన్ని పూర్తిగా నాశనం చేయకపోతే లాభం లేదను కుంటూ రెండు అడుగులు వేశాడు షాడో. మూడో అడుగు వేయబోతూ విరుచుకుపడిపోయాడు.

* * * * *

లావుపాటి బండరాయితో ఎవరో తలమీద మోదుతున్నట్లు బాధపడుతూ కనులు తెరిచిన షాడోకి - బెల్‌రియా అగుపించలేదు. "నేనెక్కడ వున్నాను?" అని అడగబోతున్న అతని ముందు వెంటనే ప్రత్యక్షం అయ్యాడు సైంటిస్ట్.

"సముద్రతీరం దగ్గిర స్థావరంమీద దాడిచేసి అక్కడి వారందర్నీ తీసుకు వచ్చేశాం మై ఫ్రెండ్... బెల్‌రియా అనుచరులందరూ కపాలతోరణానికి వ్రేలాడుతున్నారు. వశీకరణ యంత్రం నాశనం అయిపోవటంతో ఈ అడవికి పట్టిన పీడ వదిలిపోయింది."

బెల్‌రియా గురించి అతను మాట్లాడక పోవటం షాడోకి అనుమానాన్ని కలిగించింది.

"తప్పించుకున్నాడు మై ఫ్రెండ్... నువ్వు కొట్టిన దెబ్బకి ముక్కు మొగం ఏకమై ప్రాణాలు వదిలాడని అనుకున్నాం... అదను చూసుకుని అడవిలోకి పారిపోయాడు. అడవి జంతువులకు ఆహారం అయిపోవాలని కపాలదేవతలను ప్రార్థిస్తున్నాను నేను" అంటూ వెనక్కి చూశాడు సైంటిస్ట్.

తమ అతిథికి స్పృహ వచ్చిందని తెలిసింది కాబోలు, రాతి పాత్రల నిండా రకరకాల పదార్థాలను నింపుకుని ఒకరి తర్వాత ఒకరుగా లోపలికి వచ్చేశారు అరడజను మంది అతిలోక సుందరీమణులు.

"అయ్యయ్యో! అతని పరిస్థితి గమనించకుండా ఇలా గుంపుగా వచ్చేస్తే ఎలా...? మీరు బయటికి వెళ్ళిపొండి..." కంగారుగా అనబోతున్న సైంటిస్ట్‌ని అందరూ కలిసి బయటికి నెట్టారు.

"నీ అంతట నువ్వుగా ఎవరినీ కోరుకోవని మాకు అర్థం అయింది... తమంతట తాముగా నీ దగ్గరికి వచ్చిన వీరిని ఎలా వదిలించుకుంటావో నీ ఇష్టం... మేము చేయగలిగింది ఏమీ లేదు" కర్టెన్ల చాటునుంచి క్షణం పాటు ప్రత్యక్షమై, అర్జంటుగా సైగలు చేశాడు గూడెం నాయకుడు... షాడో పెదవులు విప్పకముందే మాయం అయిపోయాడు.

చేతుల్లో వున్న ఆహారపదార్థాల పాత్రలను కింద పెట్టి ఒక్కసారిగా షాడో దగ్గిరికి వచ్చారు యువతీమణులు... బెల్‌రియా చేయించిన

వశీకరణయంత్రాన్ని అనవసరంగా పాడుచేయటం జరిగిందేమోనని అనిపించింది షాడోకి.

అతని ఆలోచనలు తమకు అర్థం అయినట్లు అరడజను వశీకరణ యంత్రాల మాదిరి అతన్ని చుట్టుముట్టారు టారుంగ్ జాతి సుందరీమణులు... ఆలోచనలు చేసే తీరిక అతనికి లేకుండా చేసేశారు. అతని ఒంటిమీది గాయాల్ని కూడా లక్ష్యపెట్టలేదు.

-: అయిపోయింది :-